# అల్లాహ్‌ను ప్రేమించండి
# స్వర్గాన్ని చేరుకోండి



కూర్పు
జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ

Name of The Book : Allah nu premin chandi Swarganni cheru koondi

Composition By :Zafarullah khan Nadvi

All Rights Reserved

First Edition : 2012

Price :

Copies : 5000

Published by:

**A.W.Trust -Tirupati**
Chitoor (dist) Andhrapradesh
**Mob:**9966 914 137- 9290 962 190
www.zafarnadvi95@yahoo.com

Typeset By :Zafarullah khan Nadvi

بسم الله الرحمن الرحيم

**الحمد لله والصلاة والسلام على سيدنا وحبيبنا ونبينا محمد رسول الله صلى الله عليه وسلم، وعلى آله وصحبه أجمعين...امابعد:**

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**''ఎవరైతే అల్లాహ్‌ను తమ ప్రభువుగా, ఇస్లాంను తమ ధర్మంగా,మరియు ముహమ్మద్**(సల్లల్లాహు అలైహి వసల్లం)**ను తమ ప్రవక్తగా హృదయ పూర్వకంగా అంగీకరిస్తారో వారికి తప్పకుండా స్వర్గం లభిస్తుంది...''**

**(ముస్లిం3496).**

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు:

**ఈ మూడు లక్షణాలున్న వ్యక్తి విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు.**

**1-అల్లాహ్ మరియు దైవప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) **తనకు అందరికన్నా ప్రియతములై ఉండాలి.**

**2-కేవలం దైవప్రసన్నత కోసమే తోటి వ్యక్తిని ప్రేమించాలి.**

**3-అల్లాహ్ తనను అవిశ్వాస స్థితి నుండి రక్షించిన తరువాత తిరిగి దానివైపుకు మరలిపోవటాన్ని తను అగ్నిలో పడటాన్ని ఎంతగా అసహ్యించుకుంటాడో అంతగా అసహ్యించుకోవాలి.**

**(బుఖారీ:15, ముస్లిం:61).**

# సంక్షిప్తమైన విషయ సూచిక

1) అల్లాహ్ ప్రేమ పొందుటకు మౌలిక అంశాలు
2) భయభక్తులతో అల్లాహ్ వైపుకు మరలండి
3) ఇస్లామీయ విధులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు
4) నఫిల్ ఆరాధనలు పాటించువారిని అల్లాహ్ ప్రేమిస్తాడు
5) అల్లాహ్ ప్రేమ పొందుటకై ముఖ్యమైన మార్గాలు
6) అల్లాహ్ ప్రీతిని పొందుటకు అతి గొప్ప సమయాలు
7) ప్రత్యేకమైన సందర్భాల్లో చేసే ప్రార్థనలను అల్లాహ్ తప్పక ఆలకిస్తాడు
8) అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన స్థలాలు
9) ధర్మాన్ని నేర్చుకోవటం మరియు దాన్ని విస్తరింపజేయటం
10) సుగుణవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు
11) తోటి మనిషిని ప్రేమిస్తే అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు
12) అల్లాహ్ ప్రియతముల పరలోక ప్రయాణం
13) ప్రియమైన దాసులకు అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు

# అంకితం

**''నా తల్లి పేరున ఈ పుస్తకాన్ని సమర్పిస్తున్నాను''**

'నా తల్లి నా మొదటి గురువు'

**ఓ అల్లాహ్!** నీ అనుగ్రహం తర్వాత నా తల్లిగారి కఠినమైన కృషి, పెంపకం మరియు ఆమె ప్రార్థనలు ఈ అల్పుడిని అనేక ధర్మ గ్రంథాలు రచించే మరియు కూర్పు చేసే యోగ్యునిగా చేసాయి.

నా జీవితంలో అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) తరువాత అందరికంటే గొప్పగా నా తల్లికి నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఎందుకంటే? ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: **''ప్రజలకు కృతజ్ఞతలు తెలుపలేనివారు, అల్లాహ్‌కు కూడా కృతజ్ఞతలు తెలుపలేరు''** (తిర్మిజీ:1955).

ప్రతి తల్లి తన బిడ్డలను మాతృ గర్భంలో నవమాసాలు మోసి, కష్టనష్టాలనోర్చి జన్మనిస్తుంది. తన రక్తాన్ని తీయని పాలుగా మార్చి అందిస్తుంది. తన పిల్లల సౌఖ్యం కోసం సర్వ ప్రయత్నాలు చేస్తుంది.

కాని కొంత మంది తల్లులు అలా చేస్తూ, దైవ మార్గంలో నడుచు కుంటూ, తమ పిల్లలను కూడా దైవ మార్గంలో పెంచి పోషిస్తుంది. మరియు ప్రేమతో, అల్లాహ్ ప్రేమాభిమానాలు కూడా తమ పిల్లలకు ప్రాప్తమయ్యేలా చూస్తుంది.

నా తల్లిగారు నన్ను మరియు నా అన్నదమ్ములను, నా అక్కలను దైవమార్గంలో పెంచి, ఖుర్ఆన్ గ్రంథాన్ని మరియు ఆరాధన విధానాలు నేర్పించి, సుగుణవంతులుగా తీర్చి దిద్దినది. అట్టి తల్లులలో ధార్మికురాలైన

తల్లి విశిష్ఠ ఏమిటంటే? ఆమె ఈ మహోపకార్యంలో తన శక్తివంచన లేకుండా కృషి చేసింది. అంతే కాదు, తన మనవళ్ళను, మనవరాళ్ళను సహితం తన అమూల్యమైన ప్రేమను, కనికరాన్ని కురిపించి పెంచి పోషించింది. మరియు వారికి కూడా ఖుర్‌ఆన్ గ్రంథాన్ని, ఆరాధన విధానాలను నేర్పించి, సుగుణవంతులుగా తీర్చి దిద్దినది.

కనుక మా తల్లిగారు **''సఫియా బిన్తె షేక్ అలీ''**ధర్మ జ్ఞానం కలిగిన భక్తురాలు. మరియు నిత్యం ఆరాధనలు పాటించి, అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించే పుణ్యాత్మురాలు. మరియు తమ పిల్లల సుఖ సంతోషాల కొరకు నిత్యం అల్లాహ్‌తో దుఆలు చేసే పరమ విధేయురాలు.

కాని మన సమాజంలో చాలా మంది పిల్లలు తల్లిదండ్రుల సేవలను ఏ విధంగా గుర్తించాలో ఆ విధంగా గుర్తించలేక పోతున్నారు. కనీసం వారి పెంపకానికి కృతజ్ఞతలు చెల్లించుకోవాలన్న కనీస విజ్ఞాన వారికి లేదు. తల్లిదండ్రులతో కనీసం వారి మనసుకు నొప్పి కలగకుండా మసులుకుంటే ఎంత బాగుండేది!

**ఓ అల్లాహ్!** నాకు, మా అన్నదమ్ములకు, మా తల్లిదండ్రులను గొప్పగా ప్రేమించే సద్బుద్ధిని ప్రసాదించు. మరియు వారి మేళ్ళను గుర్తించుకొని, కృతజ్ఞతలు చెల్లించుకొనే మహా భాగ్యాన్ని మాకు ప్రసాదించు. మా తల్లిగారి దీవెనలు మాపై దీర్ఘకాలం ఉండేలా దీవించు. ఆమెకు కలకాలం సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించు. మా తల్లిదండ్రుల వల్ల జరిగిన పొరపాట్లను నీవు దయతో క్షమించు. వారి పుణ్యాలను స్వీకరించు. **''ఓ అల్లాహ్! బాల్యంలో వీరు నన్ను (ప్రేమానురాగాలతో) పోషించినట్లుగానే నీవు వీరిపై దయజూపు.''**

**ఓ అల్లాహ్!** నీ కరుణకటాక్షాలతో నా తండ్రి గారిని కనికరించు, ఆయనకు స్వర్గాన్ని ప్రసాదించు, నీవు గొప్ప క్షమాశీలివి.

**ఓ అల్లాహ్!** నీవు నన్ను నా భార్య బిడ్డలను నీ ప్రియమైన దాసులలో చేర్చు. నా తల్లిదండ్రులను, నా అన్నదమ్ములను, వారి భార్యాబిడ్డలను, నా అక్కలను మరియు వారి కుటింబీకులకు నీవు ఇష్టపడే మార్గాన్ని ప్రసాదించు. దానిపై నడుచుకునే సద్బుద్ధిని ప్రసాదించు. మా అందరి పాపాలను క్షమించు. నీ కారుణ్యంతో మాకు స్వర్గాన్ని ప్రసాదించు.

**ఓ అల్లాహ్!** మా గురువులను మరియు నాకు సహాయ సహకారం అందజేసిన వారందరికీ, మా ఆప్త మిత్రులకు, స్నేహితులకు నీ కరుణా మృతాల్ని ప్రసాదించు. వారి పాపాలను కూడా దయతో క్షమించు. మరియు వారందరికీ నీ కరుణ కటాక్షాలతో స్వర్గాన్ని ప్రసాదించు.

మా తాత ముత్తాతలలో ఇస్లాం ధర్మంపై మరణించిన వారందరి పాపాలను క్షమించు, కరుణించు మరియు వారికి స్వర్గాన్ని ప్రసాదించు. ఆమీన్.

**ఓ అల్లాహ్!** ఈ పుణ్యకార్యం వలన నా తల్లిదండ్రులకు నిరంతరం పుణ్యాలు ప్రాప్తిస్తూ ఉండాలని నిన్ను వినయ వినమ్రతలతో వేడుకుంటున్నాను.

**సేవకుడు:**

జఫరుల్లాహ్ బషీర్ ఖాన్ నద్వీ

తిరుపతి

2/2/1433 హిజ్రి శకం

بسم الله الرحمن الرحيم

# తొలి పలుకులు

అల్లాహ్‌కు మాత్రమే సర్వ ప్రశంసలు, సర్వ పొగడ్తలు శోభనీయం. ఆయన అపార కరుణామయుడు పరమకృపాశీలుడు, దయామయుడు, అపారంగా క్షమించేవాడు. తన దాసులందరిని అమితంగా ప్రేమించేవాడు. అల్లాహ్ కారుణ్యం ప్రతి ఒక్కరిని ఆవరించి ఉంది. మార్గభ్రష్టులను రుజుమార్గాన్ని ప్రసాదించేవాడు, పాపాత్ములను క్షమించేవాడు ఆ మహా ప్రభువు ఒక్కడే. ఆయనే నిజమైన ఆరాధ్యుడు, ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌కు ప్రియమైన దాసుడు, ఆయన పంపగ వచ్చిన చిట్టచివరి ప్రవక్త. ఆయనపై మరియు ప్రవక్తలందరిపై, వారి అనుచరులపై, వారి కటుంబీకులపై మరియు పుణ్యాత్ములైన సత్య మూర్తులపై దైవ కారుణ్యం మరియు శాంతి వర్షించుగాక!.

**అమ్మాబాదు!...**

అల్లాహ్ పట్ల ప్రేమాభిమానాలు కలిగిఉన్న దాసులకు ఇహపర లోకాలలో ఆయన లెక్కలేనంత అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. కనుక అల్లాహ్ ఇహలోకంలో మానవులకు ఇస్లాం ధర్మాన్ని అనుగ్రహించి, సన్మార్గాన్ని ప్రసాదించాడు. మరియు మిథ్యా దైవాల దాస్యం నుండి విముక్తినిచ్చి ఒకేఒక్క నిజమైన, పరిశుద్ధమైన, మహోన్నతమైన ఏకేశ్వరోపాసన

మహా భాగ్యాన్ని ప్రజలకు కల్పించాడు. మూఢ విశ్వాసాల, మూఢ నమ్మకాల చీకట్ల నుండి వెలికితీసి, జ్ఞానవంతమైన, ప్రకాశవంతమైన, సత్యవంతమైన విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రసాదించాడు.

మానవ మార్పిడికి అతీతమైన దివ్య గ్రంథం ఖుర్‌ఆన్‌ను అల్లాహ్ ప్రసాదించి, మానవ మార్పిడికి గురైన గ్రంథాలను ఆయన తొలగించాడు. ప్రళయం వరకూ తిరుగులేని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గాన్ని ప్రసాదించి, అసత్య అన్య మార్గాలను తొలగించాడు. సులభమైన, సమంజసమైన ఆరాధన విధానాలను విధించి, కఠోరమైన, కఠినమైన ఆరాధన విధానాలను తొలగించాడు. కొద్దిపాటి ఆరాధనకు కొండంత పుణ్యాలను ప్రసాదించాడు. కొండంత పాపాలను ఒక్క క్షమాభిక్షతో మన్నించి తన ప్రియమైన దాసులను పునీతులుగా చేశాడు. ఓ అల్లాహ్! గొప్ప క్షమాశీలివి నీవే.

**ఓ అల్లాహ్!** నీవు సుగుణవంతులను ప్రేమిస్తావు, గొప్పగా సన్మానిస్తావు. మానవులు పరస్పరం ప్రేమాభిమానాలతో మసులుకుంటే, నీవు వారిని ప్రేమిస్తావు. తల్లిదండ్రుల సేవ చేసేవారిని నీవు కనికరిస్తావు. ఆడపిల్లలను పెంచి పోషిస్తే స్వర్గాన్ని ప్రసాదిస్తావు. అక్కాచెల్లెళ్ళను, అన్నదమ్ములను ఆదుకునేవారిని అనుగ్రహిస్తావు. రక్తసంబంధీకులను మరియు అతిదగ్గరి బంధువులను ప్రేమిస్తే, ఉపాధిలో వృద్ధిని ప్రసాదిస్తావు. పేదలను అగత్యపరులను, దరిద్రులను, ఇరుగుపొరుగువారిని సహాయ సహకారాలు అందజేసేవారి సహాయంలో నీవు ఉంటావు. పీడితులను, రోగులను పరామర్శిస్తే పుణ్యాలను ప్రసాదిస్తావు, పాపాలను క్షమిస్తావు.

**ఓ అల్లాహ్!** నీవు అగత్యపరుల, అబలల పక్షానివి. నీవే గొప్ప సహాయకుడివి. ప్రేమామయుడివి.

**ఓ అల్లాహ్!** నిన్ను విశ్వసించి నీ మార్గంపై నడుచుకున్న దాసులను ప్రత్యేకంగా కరుణిస్తావు. మరణానంతరం వారిని తన సింహాసనం నీడలో ఆశ్రయమిస్తావు. ప్రత్యేకమైన **కౌసర్** (దివ్య జలం, సరోవరం) నీటిని త్రాపిస్తావు. అది త్రాగినవారికి దాహం అంటూ ఉండదు. ప్రళయదినాన భయంకరమైన కారుచీకటిలో తన ప్రియమైన దాసులకు జ్యోతిని ప్రసాదిస్తావు.

అలా తన ప్రియమైన దాసులను స్వర్గాన్ని ప్రసాదించి సన్మానిస్తావు. స్వర్గవాసులు ఆ రోజు స్వర్గంలో తమ ప్రేమామయుడైన అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూసుకుంటారు. తరువాత అల్లాహ్ స్వర్గవాసులతో: **''నేను మీకు నా ప్రసన్నత మహాభాగ్యాన్ని ప్రసాదించాను, ఇక మీదట ఎన్నడూ మీ పట్ల కోపగించుకోనూ!''** అని అంటాడు.

**ఓ అల్లాహ్!** నీవే ప్రేమామయుడివి, గొప్ప కనికరం కలిగినవాడివి. నీవు తప్ప మరో సత్యమైన ఆరాధ్యుడు లేడు, నీవే సర్వలోకాలకు ప్రభువు.

**''అల్లాహ్‌ను ప్రేమించండి స్వర్గాన్ని చేరుకోండి''** అనే పేరుతో ఈ పుస్తకాన్ని దివ్య ఖుర్ఆన్ మరియు హదీసు గ్రంథాల, తెలుగు అనువాదాల వెలుగులో మరియు అనేక అరబీ గ్రంథాల నుండి ప్రామాణికమైన హదీసులను సేకరించి వాటిని తెలుగులో అనువాదం చేసి, చక్కని క్రమబద్ధంగా కూర్పు చేసాను. దీని ద్వారా ప్రతి మానవుడు విశ్వాసపరంగా, విధేయత పరంగా, ఆరాధన పరంగా అల్లాహ్ ప్రేమకు

కారణమయ్యే విధి విధానాలను, ఆచారాలను, గుణాలను తెలుసుకొని, ఆచరించి అల్లాహ్ చిత్తంతో స్వర్గానికి చేరుకోగలడు.

**జమ్ఇయతూ ఎహ్యాఉత్తురాస్ అల్ ఇస్లామీ– మర్కజుల్ హిదాయా లిత్తౌయియతిల్ జాలియాత్** (ఇస్లాం పరిచయ సమితి కువైట్) సంస్థ ఖుర్ఆన్ మరియు సహీహ్ హదీసుల వెలుగులో ఇస్లాం పరిచయ కార్యక్రమాన్ని చేపట్టింది. తెలుగు భాషలో కూడా ఈ సంస్థ ద్వారా అనేక పుస్తకాలు మరియు కరపత్రాలు ప్రచురించబడ్డాయి. వారి సేవలను అల్లాహ్ స్వీకరించుగాక.

జఫరుల్లాహ్ బషీర్ ఖాన్ నద్వీ
2/2/1433 / హిజ్రీ శకం
28/12/2011

# నిష్కల్మషమైన హృదయం

నిష్కల్మషమైన హృదయం అంటే? మనిషి తన మనస్సాక్షిగా అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించుటకై మనసును లగ్నం చేసుకోవడం. మరియు మనసును ప్రతి విధమైన బహుదైవరాధనకు, అధర్మ కార్యాలకు దూరంగా ఉంచడాన్ని నిష్కల్మషమైన మనుసు అంటారు.

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆ రోజు సిరిసంపదలుగానీ, సంతానంగానీ దేనికీ పనికిరావు. నిష్కల్మషమైన మనసుతో అల్లాహ్ సన్నిధిలోకి వచ్చినవాడు మాత్రమే (ఆనాడు మోక్షం పొందుతాడు).[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు:''వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని, వారికి అదేశించడం జరిగింది....''[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ మీ శరీరాలను, మీ ముఖాలను చూడడు. ఆయన మీ హృదయాలను, ఆచరణలను మాత్రమే చూస్తాడు.'' [3]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''జాగ్రత్త! మానవ శరీరంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది బాగుంటే మొత్తం శరీరం బాగుంటుంది. ఒకవేళ అది పాడయితే మొత్తం మానవ శరీరమే పాడయిపోతుంది. బాగా గుర్తుంచుకోండి! ఆ మాంసపు ముద్దే మానవ హృదయం'' (బుఖారీ:50, ముస్లిం: 2996).

---

[1] (సూరతుష్ షుఅరా:88-89).
[2] (సూరతుల్ బయ్యినహ్:5).
[3] (ముస్లిం:4651).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ఆచరణలు సంకల్పాలపై ఆధారపడి ఉంటాయి. ప్రతి ఒక్కరికీ అతని మనసులోని ఉద్దేశ్యానికి అనుగుణంగా ప్రతిఫలం దొరుకుతుంది.

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం వలస పోయిన వ్యక్తి ప్రస్థానం నిజంగానే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం చేసిన ప్రస్థానంగా పరిగణించబడుతుంది.

ఎవడైతే ప్రాపంచిక ప్రయోజనం పొందాలనే ఉద్ధేశంతో లేక ఏ స్త్రీనైన వివాహమాడాలనే సంకల్పంతో వలసపోతారో అతడు కోరుకున్నవాటి కోసం వలసపోయినట్లుగా భావించడం జరుగుతుంది.'' [1]

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఇలా ప్రశ్నించడం జరిగింది:

**ఒకడు,** శక్తిసామర్థ్యాలను ప్రదర్శింటానికి పోరాడుతున్నాడు.

**మరొకడు,** వంశప్రతిష్టను చాటుకోవడానికి పోరాడుతున్నాడు.

**ఇంకొకడు,** పరుల మెప్పు పొందడానికి పోరాడుతున్నాడు.

అయితే ఈ ముగ్గురిలో ఎవరు దైవమార్గంలో పోరాడుతున్నట్లు? అని అడిగారు.

అందుకాయన: ''దైవవాక్కు (దైవధర్మం) ఉన్నతి కోసం పోరాడినవాడు అల్లాహ్ మార్గంలో పోరాడినట్లు'' అని సమాధానమిచ్చారు. [2]

హజ్రత్ అబూబకర్ బిన్ హారిస్ సఖఫి (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఇద్దరు ముస్లిములు

---

[1] (బుఖారీ:1, ముస్లిం:3530).

[2] (బుఖారీ, 6904, ముస్లిం: 3525).

తమతమ ఖడ్గాలతో పరస్పరం దాడికి దిగితే హంతకుడు, హతుడు ఇద్దరూ నరకానికి పోతారు'' అని చెప్పారు.

**నేను: దైవ ప్రవక్తా!** ''హంతకుని మాట సరేగానీ హతుడేం పాపం చేసాడని నరకానికి వెళతాడు'' అని సందేహపడ్డాను. **అందుకాయన:** ''అతనూ తన ప్రత్యర్థిని చంపాలన్న కసితోనే ఉన్నాడు కదా!'' అని బదులిచ్చారు.[1]

**సయీద్ బిన్ ఇస్మాయీల్** (రహ్మతుల్లాహి అలైహి) గారు ఇలా తెలియజేశారు: నాలుగు గుణాలు కలిగి ఉన్న వ్యక్తి మనసు కుదుట పడినట్లు.

**ఒకటి;** అల్లాహ్ ముందు అణిగి ఉండాలి.

**రెండు;** అల్లాహ్ ముందు తన అశక్తతను వ్యక్తపరచాలి.

**మూడు;** అల్లాహ్‌కే భయపడాలి.

**నాలుగు;** అల్లాహ్‌పై ఆశలు ఉంచుకోవాలి.[2]

**షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్ను తైమియా** (రహ్మతుల్లాహి అలైహి) గారు ఇలా తెలియజేశారు: ''వినండి! హృదయానికి అల్లాహ్ కోసం మూడు కదలికలు (గుణాలు) ఉన్నాయి: ప్రేమ, భయం మరియు ఆశలు. **దానిలో మెరుగైనది ప్రేమ.**

ఎందుకంటే? ఆ గుణమే మనకు కావలసినది. ఆ ప్రేమనే మనం ఇహలోకంలోను మరియు పరలోకంలోను అల్లాహ్‌తో కోరుకుంటాము.

కాని భయం అలా కాదు. ఎందుకంటే? అది పరలోకంలో ఉండదు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వినండి! అల్లాహ్ స్నేహితులకు

---

[1] (బుఖారీ: 6367, ముస్లిం:5139).

[2] (హుల్‌యతుల్ అవలియా: 10/244).

భయముగాని, దుఃఖంగానీ ఉండదు–వారు విశ్వసించినవారై (చెడుల విషయంలో) అల్లాహ్‌కు భయపడేవారై ఉంటారు. – ప్రాపంచిక జీవితంలోనూ, పరలోకంలోనూ వారికి శుభవార్త కలదు. అల్లాహ్ వాక్కుల్లో మార్పు ఉండదు ఇదే గొప్ప విజయం.''[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కరుణామయుణ్ణి చూడకుండానే అతనికి భయపడుతూ (అల్లాహ్ వైపు) మరలే హృదయాన్ని తీసుకువచ్చినవారికి ఇది ప్రత్యేకించబడింది. – మీరు ఈ స్వర్గంలో ప్రశాంతంగా, సురక్షితంగా, ప్రవేశించండి. ఇది నిత్యం నిలిచి ఉండే దినం. అక్కడ వారు కోరుకున్నదల్లా లభిస్తుంది. (పైగా) మా దగ్గర మరెంతో ఉన్నది.'' [2]

---

[1] (సూరతు యూనుస్:62–64).

[2] (సూరతుల్ ఖాఫ్: 33–35).

# మానవ హృదయాలు

మనిషి ప్రతి హృదయం ప్రకృతి పరంగా మూడు గుణాలు కలిగి ఉంటుంది. అవి 1, నఫ్సే అమ్మారా (తమో గుణం) 2, నఫ్సే లవ్వామా (రజో గుణం) 3, నఫ్సే ముత్మయిన్నహ్ (సత్వగుణం).

**1, నఫ్సే అమ్మారా (తమో గుణం):** ఆంతర్యంలో జనించే దుష్ప్రేరణలు, చెడు తలంపులు మరియు రాక్షసత్వం వంటి గుణాలు కలిగిన హృదయం.

**2, నఫ్సే లవ్వామా (రజో గుణం):** అంతర్మధనం చెందే మనసు, ఆత్మ విమర్శ చేసుకొనే మనసు, లోలోపలే పశ్చాత్తాపం చెందే మనసు. అంటే మంచీ-చెడు రెండిటిపై కూడా మనసు ఆరాటం చెందుతుంది.

**3, నఫ్సే ముత్మయిన్నహ్ (సత్వగుణం):** తృప్తిపొందిన ఆంతర్యం. దైవత్వ దాస్యంలో సంతృప్తిచెందిన మనసు. అంటే నఫ్సే అమ్మారా గుణానికి వ్యతిరేకమైనది.

ఆ మూడు గుణాల గురించి అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆత్మ సాక్షిగా! దాన్ని తీర్చిదిద్దిన వాని సాక్షిగా! మరి (ఆయన) దానికి చెడునూ, చెడునుంచి తప్పించుకుని మసలుకునే ప్రేరణను ఇచ్చాడు. దానిని (అంతరాత్మను, మనసును) పరిశుద్ధ పరుచుకున్నవాడు సాఫల్యం పొందాడు. దాన్ని అణచి పెట్టినవాడు నష్టపోయాడు.''[1]

మరియు ఒక దుఆ ఇలా ఉంది: ''అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక నఫ్సన్ ముత్‌మయిన్నతన్ తూమిను బిలిఖాయిక వతర్జా బిఖజాయిక వ తఖ్‌నవు బి అతాయిక''

---

[1] (సూరతుష్ షమ్స్: 7-10).

(ఓ అల్లాహ్ నీ పట్ల సంతృప్తి చెందే, నిన్ను కలవటాన్ని విశ్వసించే, నీ తీర్పులను అంగీకరించే, నీ ప్రసాదాలతో సంతృప్తి చెందే మనసును నాకు ప్రసాదించమని నేను నిన్ను ప్రార్థిస్తున్నాను.)[1]

## 1, నఫ్‌సే అమ్మారా (తమో గుణం):

హజ్రత్ జునైద్ (రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలియజేశారు: చెడు తలంపులకు కారణం **'నఫ్‌సే అమ్మారా':** అది మానవ వినాశానికి, శత్రువుల సహాయానికి, మనోవాంఛల విధేయతకు మరియు ప్రతి చెడు కార్యానికి కార్యం అవుతుంది. [2]

**'నఫ్‌సే అమ్మారా'** గుణం కారణంగా మనిషి చెడు తలంపులకు గురికాబడతాడు. కనుక ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: ''నేను నా మనసు పవిత్రతను గురించి చాటుకోవటం లేదు. నిశ్చయంగా మనసైతే చెడువైపుకు ఎలాగూ పురికొల్పుతుంది. అయితే నా ప్రభువు దయదలిచిన వారి విషయంలో మటుకు అలా జరగదు. నిస్సందేహంగా నా ప్రభువు అపారంగా క్షమించేవాడు, అమితంగా దయదలిచేవాడు.''[3]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరి హృదయాన్ని మేము మా ధ్యానం పట్ల నిర్లక్ష్యానికి లోను చేసామో, ఎవడు తన మనోవాంఛల వెనుక పరుగులు తీస్తున్నాడో, ఎవరి పని మితిమీరి పోయిందో అతనికి విధేయత చూపకు.'' [4]

---

[1] (ఇబ్ను కసీర్, మరియు కొన్ని తఫ్సీర్ గ్రంథాలలో ఈ హదీసును ప్రచరించారు. కానీ ఈ హదీసు బలహీనమైనది. సిల్‌సిలతుజ్ జయీఫా: 4060).

[2] (అర్రిసాలా అల్ ఖుషీరియ్యా:1/73).

[3] (యూసుఫ్:53).

[4] (సూరతుల్ కహఫ్: 28).

''నిశ్చయంగా హృదయానికి వంద మరణాలున్నాయి. చివరి మరణం అల్లాహ్‌తో తెగతెంపులకు గురి అవుతుంది. అలాగే హృదయానికి వంద ప్రాణాలున్నాయి. చివరి ప్రాణం అల్లాహ్‌ను కలుసుకోవడం. నిశ్చయంగా ప్రతి ఒక్క పాపం వలన మనసుకు చావు ఉంది. మరియు ప్రతి పుణ్యం కారణంగా మనసుకు జీవం ఉంది.'' [1]

## 2, నఫ్‌సే లవ్వామా (రజో గుణం):

నఫ్‌సే అమ్మారా, మరియు నఫ్‌సే ముత్మయిన్నహ్‌కు మధ్య ఉన్న గుణం. లేక ఆ రెండిటికి చెందిన గుణం. ఎందుకంటే **'నఫ్‌సే లవ్వామా'** మంచీ-చెడు రెండిటిపై కూడా మనసు ఆరాటం చెందుతుంది.

మరియు కొంత మంది ధర్మ గురువుల అభిప్రాయం ప్రకారం: ''ఈ ఆత్మ నింద లేక అంతర్మథనం మంచీ-చెడు రెండిటిపై కూడా జరుగుతుంది.

**మంచి విషయంలో** 'ఇంకా ఎందుకు చేసుకోలేదు?' అని మనసు బాధ పడుతుంది.

**చెడు విషయంలో** 'అయ్యో ఈ చెడుకు ఎందుకు పాల్పడ్డానో!? దాని జోలికి పోకుండా ఉంటే బాగుండేదే!' అని మధనపడుతుంది.''

హజ్రత్ వాబిసా బిన్ మాబద్ (రజియల్లాహు అన్హు) కథనం: నేనొకసారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వెళ్ళాను. అప్పుడు (నేనేమీ చెప్పకముందే) ఆయన, ''నువ్వు సత్కార్యం గురించి అడగటానికొచ్చావు కదూ!'' అన్నారు.

నేను ఔనన్నాను. దానికాయన, నీ మనసునడుగు (చెబుతుంది).

---

[1] (తఫ్‌సీర్ తస్‌తరీ: 1/303).

నువ్వు చేస్తున్న పని పట్ల మనస్సు నిమ్మళంగా ఉండి, హృదయంలో ఎలాంటి అలజడి లేక పోతే అదే సత్కార్యం. కాని నీ మదిని తొలిచేది, నీ హృదయంలో సంశయాలు సృష్టించేదే పాపకార్యం. ప్రజలు నీతో ఆ పని సమ్మతమేనని చెప్పినా సరే; సమ్మతమేనని చెప్పినా సరే.[1]

హ్జ్రత్ అగర్ర్ ముజనీ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు:
''నిశ్చయంగా (కొన్నిసార్లు) నా హృదయం మీద కూడా ఒక తెర లాంటిది కమ్ముకుంటూ ఉంటుంది. అయితే నేను రోజుకి వందసార్లు అల్లాహ్‌ను క్షమాభిక్ష కోసం వేడుకుంటూ ఉంటాను.''[2]

హ్జ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) ఇలా తెలియజేశారు: ''నిశ్చయంగా మంచి కార్యం వలన మనసు కాంతితో నిండిపోతుంది, ముఖం మెరుస్తుంది, శరీరంలో బలం వస్తుంది, ఉపాధిలో వృద్ధి అవుతుంది, ప్రజల హృదయల్లో ప్రేమ జనిస్తుంది.
మరియు చెడు కార్యం వలన మనసు కాంతి హీనమవుతుంది, ముఖం మసిబారు పోతుంది, శరీరం బలహీనమవుతుంది, ఉపాధిలో సమృద్ధి లభిస్తుంది. ప్రజల హృదయల్లో ద్వేషం రగులుకుంటుంది.''[3]

షేఖుల్ ఇస్లామ్ ఇమామ్ ఇబ్ను తైమియా (రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలియజేశారు: ''మనిషి కార్యాల కారణంగా మేలుగాని, కీడుగాని, మంచి మార్పుగాని మొట్టమొదట ప్రభావితమయ్యేది ఆంతర్యం.

---

[1] (అహ్మద్: 17313, సునన్‌దారమీ:2588, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1734).
[2] (ముస్లిం:4870).
[3] (మజ్మూఅతుల్ ఫతావా ఇబ్ను తైమియా: 2/424).

ఆ తరువాతనే దాని ప్రభావం మనిషి శరీరంపై ఉంటుంది. మనస్సును మంచిగా ఉంచుకుంటే దానికి న్యాయం చేసినవారవుతాము.

మరియు దానిని చేడు (కోరికల)కై వదిలేస్తే మనుస్సుకు అన్యాయం చేసినవారవుతాము. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''ఎవరైనా సత్కార్యం చేస్తే తన మేలుకోసమే చేసుకుంటాడు. మరెవర యినా దుష్కర్యానికి ఒడిగడితే దాని దుష్ఫలితం అతని మీదే పడుతుంది. నీ ప్రభువు మాత్రం (తన) దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవడయినా సత్కార్యం చేస్తే తన స్వయం కోసమే చేసుకుంటాడు. మరియు ఎవరయినా దుష్కార్యానికి ఒడిగడితే దాని పాపఫలం స్వయంగా అతని మేదే పడుతుంది....'' [2]

## 3, నఫ్‌సే ముత్మయిన్నహ్ (సత్వగుణం):

అల్లాహ్ ఆజ్ఞకు కట్టుబడి మంచి పనులు చెయ్యుటకై తపించే హృదయాన్ని మరియు దైవత్వ దాస్యానికి ముందుండే మనసును **'ముత్మయిన్నహ్'** అని చెప్పడం జరుగుతుంది. ఈ మనుసున్నవారే అల్లాహ్ ప్రియతములుగా పేర్కొనబడతారు. మరియు వారికి స్వర్గం కూడా లభిస్తుంది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ ప్రశాంత మనసా! నీ ప్రభువు వైపునకు పద! నువ్వు ఆయన పట్ల సంతోషించావు. ఆయన నీ పట్ల సంతోషించాడు. కాబట్టి (సత్కరించబడిన) నా దాసులలో చేరిపో. నా స్వర్గంలో చేరిపో (అని విధేయులతో అనబడుతుంది). [3]

---

[1] (హామీమ్ అస్సజ్దా: 46).

[2] (సూరతుల్ జాసియ: 15).

[3] (సూరతెల్ ఫజ్ర్: 27-30).

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ఎవరయితే అల్లాహ్‌ను కలుసుకోవాలని కోరుకుంటారో అల్లాహ్ అతన్ని కలుసుకోవాలిని కోరుకుంటాడు.

ఎవడైతే అల్లాహ్‌ను కలుసుకోవటాన్ని ఇష్టపడడో అల్లాహ్ అతన్ని కలుసుకోవటాన్ని ఇష్టపడడు.

(హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అ న్హా) చెబుతున్నారు): ఆ మాట విని నేను, ''దైవ ప్రవక్తా! ఇష్టపడకపోవటమంటే మరణాన్ని ఇష్టపడక పోవటమా? అలాగయితే మాలో అందరూ మరణాన్ని అసహ్యించుకునే వాళ్ళే'' అని అన్నాను.

అందుకాయన ఇలా చెప్పారు: ''దానర్థం అదికాదు. (మరణ సమయంలో) విశ్వాసికి దేవుని కారుణ్యం ఆయన ప్రసన్నత మరియు స్వర్గ శుభవార్తలు అందజేసినప్పుడు అతను అల్లాహ్‌ను కలుసుకోవటానికి ఇష్టపడతాడు. అల్లాహ్ కూడా అతన్ని కలుసుకోవటానికి ఇష్టపడ్తాడు.

దీనికి భిన్నంగా అవిశ్వాసికి (మరణ సమయంలో) దైవశిక్ష, దైవ దూతలు, అప్రసన్నతల 'దుర్వార్తలు' అందజేసినప్పుడు. అతను అల్లాహ్‌ను కలుసుకోవటానికి అయిష్టపడత్తాడు. అల్లాహ్ కూడా అతన్ని కలుసుకోవటాన్ని అసహ్యించుకుంటాడు.'' [1]

ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యూమ్ (రహ) ఇలా తెలియజేశారు: ''హృదయానికి ఈమాన్(విశ్వాసం) మరియు పుణ్యకార్యాలు ఆహారం లాంటివి, అవి లేకుండా హృదయం జీవించడం కష్టం. అవే హృదయానికి శక్తినిస్తాయి.''[2]

---

[1] (బుఖారీ: 6026, ముస్లిం: 4844).

[2] (అల్ జవాబుల్ కాఫీ, పేజి: 167).

విశ్వాసి వద్దకు మరణ దూతలు వచ్చి: ''ఓ పరిశుద్ధమైన మనసా! ఓ ప్రశాంత మనసా! అల్లాహ్ నుండి క్షమాపణ పొందుటకై, ప్రేమ పొందుటకై పదా''...అని అంటారు. మరియు స్వర్గం యొక్క శుభవార్తను కూడా ఇస్తారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా అల్లాహ్ దూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు. 'భయపడకండీ, బాధపడకండీ! మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి.'' [1]

ఇలా నిష్కల్మషమైన హృదయాలు, నఫ్సే ముత్మయిన్నహ్ (ప్రశాంతత చెందిన మనసులు) కలిగినవారు మరణిస్తే వారి ఆత్మలు ఎంతో సంతోషంగా అల్లాహ్ ప్రేమ పొందుటకై ఆరాటం కలిగి ఉంటాయి. మరియు అల్లాహ్ కూడా వారిని కలుసుకొనుటకై ఇష్టపడుతాడు. ఇదే విజయవంతమైన ప్రేమ.

[1] (41,హామీమ్ అస్సజ్దా: 30).

# అల్లాహ్
# అద్వితీయుడైన దయాసాగరుడు

సర్వ ప్రశంసలు, సర్వ పొగడ్తలు అల్లాహ్‌కు మాత్రమే శోభనీయం. ఆయన అపార కరుణామయుడు పరమకృపాశీలుడు, దయామయుడు. అల్లాహ్ కారుణ్యం ప్రతి ఒక్కరిని ఆవరించి ఉంది. ఆ మహా ప్రభువు ఒక్కడే, ఆయనే నిజమైన ఆరాధ్యుడు, ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసుడు మరియు చిట్టచివరి ప్రవక్త. ఆయన సర్వ మానవాళిని గొప్పగా ప్రేమించేవారు, ప్రపంచానికి పవిత్రమైన ప్రేమానురాగాలను నేర్పిన మహోపకారి. ప్రాణ శత్రువులను సహితం క్షమించిన గొప్ప గుణవంతుడు. దైవభీతితో నడుచుకున్న మహా భక్తుడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పరలోకంలోనూ ప్రజల కొరకు అల్లాహ్ దగ్గర మహా సిఫారసు చేసే గొప్ప భాగ్యాన్ని పొందినవారు. తన సముదాయంలోని ప్రజల పెద్ద పెద్ద పాపాలను క్షమించవలసిందిగా అల్లాహ్‌ను వేడుకునేవారు. అల్లాహ్ పట్ల రవ్వంత విశ్వాసం గల ప్రజలను నరకం నుండి వెలికితీసి స్వర్గానికి చేరవేసే బాధ్యతను తీసుకున్న మహోపకారి మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం).

అల్లాహ్ మరియు ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ప్రేమానురాగాలను ప్రజలు పొందాలంటే! నిశ్చయంగా వారు ఇష్టపడిన మార్గన్నే ఎన్నుకోవాలి. మరియు వారు చెయ్యమన్న కార్యాలనే సక్రమంగా చెయ్యాలి. వారు ఇష్టపడిన గుణగణాలను తెలుసుకొని వాటికి

అనుగుణంగా నడుచుకోవాలి. మరియు వారు ఇష్టపడే మాటలనే మాట్లాడాలి. వారు ఇష్టపడే ఆరాధన విధానాలనే పాటించాలి. వారి కొరకై ప్రతి కార్యంలోనూ పూర్తి చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. చివరికి వారి ప్రేమాభిమానంతో మన హృదయాలు నిండిపోవాలి.

ఎందుకంటే? అల్లాహ్‌యే సర్వలోక సృష్టికర్త. ఆయనే తల్లి గర్భంలో పిండం పడినప్పటి నుండి జన్మించే వరకు ఆ పసికందుల్ని పరిరక్షించినవాడు, ఆయనే స్త్రీ గర్భంలో అందమైన ఆకారాన్ని తీర్చిదిద్దినవాడు, వారు పుట్టిన తరువాత తల్లి చనులలో పాలును నింపినవాడు, ఆ పిల్లలకై తల్లి మనసులో అపారమైన ప్రేమను నింపినవాడు. ఆ అల్లాహ్‌యే ప్రతి ఒక్కరికి సుఖసంతోషాలను ప్రసాదించేవాడు, కష్టాలలో ఆదుకునేవాడు, రోగులను బాగు చేసేవాడు. పాపాత్ములను కనికరించి క్షమించేవాడు, నరకాగ్ని నుండి రక్షించేవాడు. మరియు విశ్వాసులందరినీ తన కృపా కటాక్షాల ఛాయలో తీసుకొని స్వర్గాన్ని ప్రసాదించేవాడు ఆ అల్లాహ్‌యే!.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆయనే తాను కోరిన విధంగా మాతృ గర్భాల్లో మీ రూపురేఖలను మలుస్తాడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన శక్తి సంపన్నుడు, వివేక సంపన్నుడు కూడాను.''[1]
మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''తాను కోరిన వారికి ఆడ పిల్లల్ని ఇస్తాడు, తాను కోరిన వారికి మగ పిల్లన్ని ఇస్తాడు. – లేదా వారికి మగ పిల్లలను, ఆడ పిల్లలను కలిపి ఇస్తాడు. మరి తాను కోరిన వారిని సంతాన హీనులుగా చేస్తాడు. ఆయన మహా జ్ఞాని, సంపూర్ణ అధికారం కలవాడు''[2]

---

[1] (సూరతు ఆల ఇమ్రాన్: 6).
[2] (సూరతుష్ షూరా:49–50).

కనుక అల్లాహ్‌ను హృదయ పూర్వకంగా ప్రేమించాలన్నదే మానవ జీవిత లక్ష్యం. ఆయన ఇష్టాయిష్టాలను తెలుసుకొని చివరి శ్వాస వరకు ఆయన పట్ల కృతజ్ఞతా భావంతో జీవించడమే ధన్యం.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కపెట్టదలచినా, మీరు వాటిని (లెక్కింపలేరు)లెక్క పెట్టలేరు. నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణప్రదాత.''[1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరి ఆయనే మీరు అడిగిన దానినెల్లా మీకు ఇచ్చి ఉన్నాడు. మీరు అల్లాహ్ చేసిన మేళ్లను లెక్కించదలిచినా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు. మేలును మరిచేవాడు.''[2]

అంటే; మీరు అర్థించిన మీ జీవితావసరాలన్నింటినీ ఆయన మీకు సమకూర్చాడు. అంతే కాదు – మీరు అడిగిన దాన్నీ ఆయన ఇస్తున్నాడు. మీరు అడగని దాన్ని కూడా ఇస్తున్నాడు. ఎందుకంటే? మీకు ఏ ఏ వస్తువులు అవసరం ఉందో, అవి లేకపోవటం వల్ల మీ మనుగడకు ఎలా ముప్పు వాటిల్లుతుందో ఆయనకు తెలుసు. ఒక్క మాటలో చెప్పాలంటే భూమండలంపై మీ జీవన వ్యవస్థకు సంబంధించిన సకల వస్తుసామగ్రిని ఆయన మీకు ప్రసాదిస్తున్నాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఇది అల్లాహ్ అనుగ్రహం. ఆయన తాను కోరిన వారికి దీనిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలిగినవాడు.''[3]

---

[1] (సూరతున్ నహ్ల్:18).

[2] (సూరతు ఇబ్రాహీం:34).

[3] (సూరతుల్ జుముఅహ్:4).

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ అనుగ్రహము, ఆయన దయా దాక్షిణ్యాలే గనక మీపై లేకుండా పోతే (మీరు కష్టాల పాలయ్యేవారు) అల్లాహ్ పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు, వివేకవంతుడు.''[1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ దయానుగ్రహాలే గనుక మీపై లేకపోయినట్లయితే (మీ నిర్వాకానికి గాను ఇప్పటికే శిక్ష అవతరించేది) అల్లాహ్ ప్రేమామయుడు, కనికరం కలవాడు.''[2]

మరియు ఒక హదీసులో ఇలా ఉంది; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

అల్లాహ్ తన దాసులలో ఎవరినయినా ప్రియతమునిగా చేసుకున్నప్పుడు, **జిబ్రయీల్ (అలైహిస్సలామ్)ను పిలిచి:** ''నిశ్చయంగా నేను ఫలాన దాసుణ్ణి ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా అతన్ని ప్రేమించు'' అని అంటాడు.

**తరువాత జిబ్రయీల్:** ఎంతో జాగ్రత్తగా ఆ విషయాన్ని అల్లాహ్ సింహాసనం మోసే దూతలకు తెలుపుతాడు. అల్లాహ్ సింహాసనాన్ని మోసే దూతలు ఆ విషయం గురించి చర్చించుచుండగా ఆకాశంలో ఉన్న దూతలందరూ వింటారు. అంతే! ఏడవ ఆకాశంలో ఉన్నవారంతా ఆ వ్యక్తిని ప్రేమించసాగుతారు.

అలాగే ఒకొక్క ఆకాశంలో ఉన్నవారంతా ఆ వ్యక్తిని ప్రియతమునిగా ప్రేమిస్తారు. మరియు భూమ్యాకాశాలకు ఆ విషయం చేరవేయబడతుంది. అలా భూమిపై ఉన్నవారి వద్దకు (అతని కీర్తి ప్రతిష్ఠలు) చేరవేయబడతాయి.

---

[1] (సూరతున్ నూర్:10).

[2] (సూరతున్ నూర్:20).

చివరికి భూ మండలంలో ఉన్నవారంతా ఆ వ్యక్తిని ప్రియతమునిగా చేసుకుంటారు..'' [1]

అల్లాహ్ సర్వ మానవుల పట్ల దయా దాక్షిణ్యాలు కలిగిన ఏకైక ప్రేమామయుడు. ఆయనే మా పొరపాట్లను క్షమించేవాడు. మరియు గొప్ప అనుగ్రహాలు కలిగినవాడు. ఆ అనుగ్రహాలు పొందుటకై ప్రజలను అల్లాహ్ ఇలా పిలుపునిచ్చాడు:

''రండి! మీ ప్రభువు క్షమాభిక్ష వైపు పరుగెత్తండి. ఇంకా భూమ్యాకాశాలంత వెడల్పు గల స్వర్గం వైపు పరుగిడండి. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను విశ్వసించే వారికోసం అది తయారు చేయబడింది. ఇది అల్లాహ్ అనుగ్రహం! ఆయన దీనిని తాను కోరిన వారికి ఇస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.'' [2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సత్యంగా! అల్లాహ్ ఎవరినైతే ఇష్టపడుతాడో వారిని నరకంలో వేయడు.'' [3]

---

[1] (బుఖారీ:5580, సహీహ్ లిల్ అల్బానీ–ముఖ్తసర్ అల్ ఉలువ్: 1/75).

[2] (సూరతుల్ అల్‌హదీద్: 21).

[3] (హాకిమ్:4/177, 7347, సిల్‌సిలతుస్ సహీహా లిల్ అల్బానీ: 5/531, 2407).

# అధ్యాయం – 1

## 31–62

## 1–అల్లాహ్ ప్రేమ పొందుటకు మౌలిక అంశాలు

- అల్లాహ్ ప్రీతి పొందుటకై తొలి అంశం.
- అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే మౌలిక విశ్వాసాలు.
- ఇస్లాం ధర్మాన్నే ప్రేమించాలి.
- సర్వజనులకన్నా అల్లాహ్‌ను మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రేమించాలి .
- ధృఢమయిన విశ్వాసంతో అల్లాహ్‌ను ప్రేమించాలి.
- విశ్వాసం  మరియు ఏకదైవారాధన అల్లాహ్ ప్రేమకు ప్రతిరూపం.
- అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతే ప్రేమకు పునాది.

బిస్మిల్లాహ్ హిర్రహ్మా నిర్రహీమ్

# 1-అల్లాహ్ ప్రేమ పొందుటకు మౌలిక అంశాలు

## అల్లాహ్ ప్రీతి పొందుటకై తొలి అంశం:

మానవులు అల్లాహ్ ప్రేమను నోచుకోవాలంటే మరియు వారు చేసే కార్యాలకు ప్రతి ఫలం లభించాలంటే, మానవుల మొట్టమొదటి కార్యం **''లా ఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మదుర్ రసూలుల్లాహ్''** అని పలికి, దాని వాస్తవాన్ని మనసారా గ్రహించి, దానికి అనుగుణంగా జీవితాన్ని గడపడమే అల్లాహ్ ప్రేమాభిమానాలు పొందుటకు తొలి కార్యం. అంటే మనసా, వాచా, కర్మణ – త్రికరణ శుద్ధితో ఆ వచనాన్ని అంగీకరించాలి.

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కనుక (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో.నీ పొరపాట్లకుగాను క్షమాపణ వేడుకుంటూ ఉండు.... [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (ప్రవక్తా) ఇలా అను: ఓ గ్రంథ ప్రజలారా! మాకు మరియు మీకు మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం (ఉత్తరువు) వైపునకు రండి, అది ఏమిటంటే: 'మనం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు, ఆయనకు భాగస్వాములగా ఎవ్వరిని నిలబెట్టకూడదు. మరియు అల్లాహ్ తప్ప, మనవారిలో నుండి ఎవ్వరిని ప్రభువులుగా చేసుకోరాదు.' వారు (సమ్మతించక) తిరిగిపోతే: 'మేము నిశ్చయంగా అల్లాహ్‌కు విధేయు(ముస్లిం)లము దీనికి మీరు సాక్షులుగా ఉండండి' అని పలుకు. [2]

---

[1] (సూరతు ముహమ్మద్:19).

[2] (సూరతు ఆలి ఇమ్రాన్:64).

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) గారిని యమన్ దేశానికి పంపినప్పుడు ఇలా హితబోధ చేశారు:

**''ఓ ముఆజ్!** నువ్వు గ్రంథవహులైన ప్రజల దగ్గరికి వెళుతున్నావు. కనుక ముందుగా నువ్వు వారిని:

**''లా ఇలాహ ఇల్లల్లాహు''** (అల్లాహ్ తప్ప నిజమైన మరో ఆరాధ్యుడు లేడు) అని సాక్ష్యం పలకమని ఆహ్వానించు...''అని అన్నారు.[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: అబూ హురైరా!........ **''లా ఇలాహ ఇల్లల్లాహు''** (అల్లాహ్ తప్ప నిజమైన మరో ఆరాధ్యుడు లేడని) దృఢ చిత్తంతో పలికేవారు ఎవరు కనిపించినా వారికి స్వర్గ శుభవార్తను అందించు. అని అన్నారు.[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **ఓ ప్రజల్లారా! 'లా ఇలాహ ఇల్లల్లాహు'** అని చెప్పండి. మీరు సాఫల్యం పొందుతారు. (ముస్నద్ అహ్మద్, సహీహ్ ఇబ్ను హిబ్బాన్, సహీహ్ ఇబ్ను ఖుజైమా)

అదే విధంగా ఎవరి నోట **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అని తుది పలుకులు ఉంటాయో వారికి పరలోకంలో అల్లాహ్ వద్ద సాఫల్యం ఖాయం.

హజ్రత్ ముఆజ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''తన జీవితపు తుదిపలుకు **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అయిన వ్యక్తి స్వర్గానికి వెళ్తాడు.''[3]

---

[1] (బుఖారీ:1401, ముస్లిం:19).
[2] (ముస్లిం:31).
[3] (హాకిమ్, అబూదావూద్: 3116).

అదే విధంగా అల్లాహ్ వద్ద అన్నింటి కంటే విలువైనది కర్మల పత్రం **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అనే పదాలు. కనుక హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం:

''నిశ్చయంగా (పరలోకం కోసం) మనం సమాకూర్చుకునే (సామగ్రిలో) అత్యంత విలువైనది అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దేవుడు మరొకడు లేడని, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దైవ ప్రవక్త అని సాక్ష్యం చెప్పటం...'' అని అన్నారు.[1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ప్రళయ దినాన ప్రజలందరి ముందు నా ఉమ్మత్‌కు చెందిన ఒక వ్యక్తిని కేకలు పెట్టి పిలువడం జరుగుతుంది. తరువాత అతని ముందు తొంభైతొమ్మిది (కర్మల) పత్రాలను తెరిచి పరుస్తారు. ప్రతి పత్రం అతను చూడగలిగినంత దూరం వరకూ (పెద్దదిగా) ఉంటుంది.''

తరువాత అల్లాహ్ అతనితో: ''దీని (పాపాల పత్రాల)లో నీవు చేయని (విషయాలు) ఏమైనా ఉన్నాయనీ చెప్పగలవా? అని ప్రశ్నిస్తాడు. అతను ''లేదు నా ప్రభూ!'' అని అంటాడు.

మరలా అల్లాహ్ అతనితో: ''వాటిని జాగ్రత్తగా రాసేవారు (మున్కర్, నకీర్) నీపై (నీ పత్రాలలో) అన్యాయంగా ఏమైనా రాశారా!'' అని ప్రశ్నిస్తాడు.

తరువాత అల్లాహ్ అతనితో: ''నీ వద్ద వాటికి (ఆ పాపాల పత్రాలకు) బదులు పుణ్యాలేమైనా ఉన్నాయా?'' అని ప్రశ్నిస్తాడు.

---

[1] (ముస్లిం:173).

అప్పుడు అతను లోలోన భయపడుతూ: ''నా వద్ద (పుణ్యాలు) లేవు'' అని అంటాడు.

ఆ తరువాత అల్లాహ్ అతనితో: ''ఎందుకులేవు మా వద్ద నీ పుణ్యం ఒకటుందీ. ఈ రోజు మేము ఎవరికీ అన్యాయం చెయ్యబోము'' అని అల్లాహ్ (షహాదత్) **''అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు, వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు''** అన్న పత్రాన్ని అతనికి ప్రసాదిస్తాడు.

(దాన్ని చూసి) అతను: ''ఓ అల్లాహ్! ఈ ఒక్క పత్రం అన్ని (పాపాల) పత్రాలకు సరిసమానమవుతుందా? అని ఆశ్చర్యపడుతూ అంటాడు.

తరువాత అల్లాహ్: **'ఈ రోజు నీకు ఎలాంటి అన్యాయం జరగదనీ'** అంటాడు. తరువాత: (అతని పాపాల) పత్రాలన్ని ఒక పళ్లెంలో వేస్తారు. మరియు **'షహాదత్'** పత్రం మరొక పళ్లెంలో వేస్తారు. ఆ (పాపాల) పత్రాలన్ని తేలికైపోతాయి. **'షహాదత్'** పత్రం (అన్ని పత్రాలపై) బరువైపోతుంది. (ఎందుకంటే) **'అల్లాహ్ పేరు కంటే (ఎక్కువ) ఏదీ బరువుగా ఉండదు'** అని అంటాడు.[1]

## అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే మౌలిక విశ్వాసాలు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు మీ ముఖాలను తూర్పు దిక్కుకో, పడమర దిక్కుకో తిప్పటమే సదాచరణ కాదు. సదాచరణ అంటే వాస్తవానికి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, అల్లాహ్ దూతలనూ, అల్లాహ్ గ్రంథాన్నీ, అల్లాహ్ ప్రవక్తలనూ విశ్వసించటం. ధనప్రీతి ఉన్నప్పటికీ సమీప

---

[1] (సహీహ్ తిర్మిజీ: 2963, సహీహ్ ఇబ్నుమాజ: 4300).

బంధువులకు, అనాధలకు, అగత్యపరులకు, బాటసారులకు, యాచించే వారికి (ధనాన్ని) ఇవ్వటం. బానిసులకు విముక్తి నొసగటం, నమాజులను నెలకోల్పటం, జకాతును చెల్లిస్తూ ఉండటం, ఇచ్చిన మాటను నిలుపు కోవటం, లేమిలో కష్టకాలంలో, యుద్ధ సమయాలలో సహన స్థయిర్యాలను కనబరచటం–ఇవన్నీ కలిగి ఉన్నవారే వాస్తవానికి సత్యమూర్తులు, భయభక్తులు కలవారు కూడా వీరే.'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీలో ఎక్కువగా దైవభీతి గలవారే అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం గలవారు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు.'' [2]

నిజానికి సత్కార్యం అంటే ధర్మం యొక్క మౌలికాంశాలపై దృఢ విశ్వాసం కలిగి ఉండాలి. దైవం సూచించిన మంచి పనులను సజావుగా నిర్వర్తించాలి. నీతీ నడవడికలను కలిగి ఉండాలి. అల్లాహ్‌ను విశ్వసించట మంటే ఖుర్ఆన్, హదీసులలో సూచించబడినట్లుగా ఆయన అస్థిత్వాన్ని, ఆయన గుణగణాలను, ఆయన అధికారాలను వక్రభాష్యాలు చెప్పకుండా, ఉపమానాలు ఇవ్వకుండా విశ్వసించాలి. ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టకూడదు. ఆయన ఆజ్ఞలన్నింటినీ శిరసావహించాలి. అంతిమ దినాన్ని విశ్వసించటమంటే అర్థం శిక్షాబహుమానాల దినాన్ని స్వర్గ నరకాలను నమ్మటం. అలాగే దైవ గ్రంథాన్ని విశ్వసించటమంటే అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలన్నిటినీ నమ్మాలన్న భావం అందులో అంతర్లీనమై

---

[1] (సూరతుల్ బఖరా:177).

[2] (సూరతుల్ హుజురాత్: 13).

ఉంది. దైవదూతల ఉనికిని సత్యమని ధృవీకరించాలి. దైవప్రవక్తలందరి రాకను నిజమని నమ్మాలి. ఈ విశ్వాసాలతో పాటు (అంటే దేవుని హక్కులతో పాటు) సత్కార్యాలు (దాసుల హక్కులు) కూడా నెరవేర్చాలి. సిరిసంపదల పట్ల ఎంత వ్యామోహం ఉన్నప్పటికీ ఆప్తులకు అవసరం ఉన్నవారికీ ఎంతోకొంత ఇవ్వాలి. కష్టకాలంలో, ఆర్థిక ఇబ్బందుల్లో కలవర పడకుండా ఆత్మ నిబ్బరంతో పరిస్థితులకు ఎదురీదటం నేర్చుకోవాలి. ఇది చెప్పుకున్నంత సులభంకాదు. చాలా కఠినమయిన విషయం. అయితే కలిమిలో ఉబ్బితబ్బిబ్బవకుండా, లేమిలో కృంగిపోకుండా మసులుకునే సజ్జనులను అల్లాహ్ అమితంగా ఇష్టపడుతాడు....[1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడనీ, ఆయన ఒక్కడేననీ, ఆయనకు ఇతర భాగస్వాములెవరూ లేరనీ, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన దాసుడు మరియు ప్రవక్త అనీ, అలాగే ఈసా (శ్రీ యేసు) అలైహిస్సలామ్ కూడా అల్లాహ్ దాసుడు, ఆయన ప్రవక్త మాత్రమే అనీ, కాకపోతే ఆయన (తన తల్లి) మర్యమ్ వైపుకు చేరవేయబడిన దైవాజ్ఞ అనీ, దేవుని తరఫునుంచి వచ్చి (మర్యమ్ గర్భంలో శిశువు రూప దాల్చి)న ఒక ఆత్మ మాత్రమేననీ, స్వర్గ, నరకాల ఉనికి యదార్థమనీ ధృవీకరించిన వ్యక్తిని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు– అతని ఆచరణ ఎలాగున్నా సరే.''[2]

**ముఖ్యగమనికి:** పై హదీసు ద్వారా దైవప్రవక్తలు కూడా మానవ మాత్రులన్న విషయం బోధపడుతోంది. దైవప్రవక్తలు భగదవతారాలన్న

---

[1] (అహ్సనుల్ బయాన్ తెలుగు: 118)

[2] (బుఖారీ:3180, ముస్లిం:41).

భావనను ఈ హదీసు త్రోసిపుచ్చుతోంది. క్రైస్తవులు యేసుక్రీస్తును దేవుని కూమారుడన్నారు,యూదులు ఉజైర్‌ను దేవుని కుమారుడన్నారు. సహవాస దోషంవల్ల ఈవ్యాధి కొంతమంది ముస్లింలకు కూడా అంటుకుంది. ముస్లింలలోని ఒక వర్గం మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాక్షాత్తు **దేవుని వెలుగు** అని అనటం మొదలుపెట్టారు. ఆయన్ని ఓ మానవ తీత శక్తిగా తలపోస్తున్నారు. ఇవన్నీ పెడభావాలు తప్ప మరేమీ కావు.

**వెలుగు (నూర్) అనేది అల్లాహ్ గుణం.** అల్లాహ్ పేర్లలోగాని, ఆయన గుణగణాల్లో గాని వేరొకరిని సాటి కల్పిస్తే 'షిర్క్' (బహుదైవారాధన) చేసినట్లవుతుంది. దైవప్రవక్తలు మానవమాత్రులేనని సాక్ష్యం చెప్పటం కూడా విశ్వాసం (ఈమాన్)లో అంతర్భాగమే. దాన్ని నిరాకరిస్తే మొత్తం ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్ని నిరాకరించినట్లవుతుంది.

హజ్రత్ ఈసా – అలైహిస్సలామ్– **'కలిమతుల్లాహ్'** (అల్లాహ్ వచనం) అల్లాహ్ ఆజ్ఞ అంటే ఆయన పుట్టుక సృష్టి నిబంధనలకు భిన్నంగా దైవాజ్ఞ మేరకు జరిగిందని అర్థం. **'రూహుల్లాహ్'**(దైవాత్మ) అనేది అల్లాహ్ తరుపు నుండి ఆయనకు వొసగబడిన గౌరవాత్మకమైన బిరుదు. అంతేగాని దైవాత్మ అంటే నిజంగానే దేవుని ఆత్మ అని అర్థం ఎంతమాత్రం కాదు. దివ్య ఖుర్‌ఆన్‌లో సమూద్ జాతి వైపునకు పంపబడిన ఒంటెను **'నాఖతుల్లాహ్'** (దేవుని ఒంటె) అని పిలవటం జరిగింది. (అది ఒక ఆడ ఒంటె, అది జంతువు కడుపున జన్మించినది కాదు. దానిని ఒక రాతి బండ నుండి అల్లాహ్ ప్రత్యక్ష పరిచాడు. మానవుల కొరకు అది ఒక నిదర్శనం. దాని కారణంగా ఆ ఒంటె దేవునికి ఆడబిడ్డ అని అంటారా?) అలాగే పవిత్ర కాబా గృహాన్ని **'బైతుల్లాహ్'**(దేవునిగృహం) అని వ్యవహరిస్తుంటాం.

అంత మాత్రాన అది దేవుడు నివసించే ఇల్లని అర్థం చేసుకుంటామా? దేవుడు సప్తకాశాలపై మహోన్నత అధికార సిహాసనం (అర్ష్)పై అధిష్టించి ఉన్నాడన్న సంగతి అందరికీ తెలిసిందే కదా!

ఇకపోతే పై హదీసు ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే, ఘోరపాపానికి (కబీరా గునాహ్‌కు) ఒడిగట్టినంత మాత్రాన మనిషి విశ్వాస పరిధుల్ని అతిక్రమించినట్లు కాదు. మానవ సహజమైన దౌర్బల్యం వల్ల ఒక విశ్వాసి ఘోరపాపానికి ఒడిగట్టినప్పటికీ అతను విశ్వాసిగానే ఉంటాడు. అతణ్ణి స్వర్గప్రవేశం మాత్రం దేవుని యిష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. ఆయన తలచుకుంటే మొదట్లోనే అతని పాపాలన్నీ క్షమించేసి అతనికి స్వర్గప్రవేశాన్ని కల్పించవచ్చు. లేదా కొంతకాలం పాటు నరకంలో అతని పాపాలకు శిక్ష విధించి తరువాత స్వర్గానికి పంపవచ్చు. కాని విశ్వాసికి శాశ్వత నరకశిక్ష మాత్రం ఉండదు. పాపాలకు శిక్ష అనుభవించిన తరువాత అతనికి స్వర్గంలో ప్రవేశించే వీలు ఉంటుంది.[1]

## ఇస్లాం ధర్మాన్నే ప్రేమించాలి:

అల్లాహ్ ప్రసన్నత పొందుటకై ఏకైక ధర్మం ఇస్లామియ ధర్మం. ఆ ధర్మాన్ని ప్రేమించడమంటే, అల్లాహ్‌ను మాత్రమే నిజమైన దేవుడని మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని విశ్వసించాలి. మరియు గతంలో అల్లాహ్ వైపు నుండి పంపబడిన ప్రవక్తలను విశ్వసించాలి, వారికి ప్రసాదించబడిన

[1] (హదీసు కిరణాలు: 587-588)

గ్రంథాలను విశ్వసించాలి. అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానాలకు కట్టుబడి అనుసరించాలి. దీనినే ఇస్లామీయ పరిభాషలో **''ఇస్లాం ధర్మం''** అని అంటారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఈ రోజు మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా ఆమోదించాను.''[1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ విశ్వాసులారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు మీకు బద్ధ విరోధి.''[2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ ఎవరికయినా మేలు చేయదలచుకుంటే వారికి (ఇస్లామీయ) ధర్మావగాహన శక్తిని ప్రసాదిస్తాడు.''[3]

ఇస్లాం ధర్మాన్ని కాదని మనం ఇతర మార్గాలను అనుసరిస్తే ఆ ధర్మాలు లేక మార్గాలు ఆమోదించబడవు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవారంతా – తమకు ఇష్టమున్న లేకపోయినా ఆల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండగా, వీరు అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తారా? ఎట్టకేలకు వారంతా ఆయన వైపుకే మరలించబడతారు.'' – ఓ ప్రవక్త! వారితో ఇలా అను: ''మేము అల్లాహ్‌ను, మాపై అవతరింపజెయ్యబడిన దానినీ విశ్వసించాము. ఇంకా

---

[1] (సూరతుల్ మాయిదా:3).
[2] (సూరతుల్ బఖరా: 208).
[3] (బుఖారీ:69, ముస్లిం:1719).

ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబుపై, ఆయన సంతానంపై అవతరింపజెయ్యబడిన దానినీ, మూసా, ఈసా ఇంకా ఇతర ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున వొసగబడిన వాటిని మేము విశ్వసించాము. మేము వారి మధ్య ఎలాంటి భేదభావాన్ని కనబరచము. మేము ఆయనకే విధేయులము'' – ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేరిపోతాడు.'' [1]

అల్లాహ్‌ను తమ ప్రభువుగా, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ప్రవక్తగా మరియు ఇస్లాంను తమ దర్మంగా తమ హృదయపూర్వకంగా రాజి పడినట్లయితే అలాంటివారికి స్వర్గం కచ్చితంగా ప్రసాదించబడు తుంది, అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు.

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే అల్లాహ్‌ను తమ ప్రభువుగా, ఇస్లాంను తమ ధర్మంగా, మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను తమ ప్రవక్తగా (హృదయ పూర్వకంగా) అంగీకరిస్తారో వారికి తప్పకుండా స్వర్గం లభిస్తుంది...''[2]

హజ్రత్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక రోజు ఆయన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఇస్లాం స్వీకరించాలంటూ పోయి, ''ఇస్లాం స్వీకరిస్తే నా పాపాలన్నీ క్షమించబడాలి'' అని షరతు పెట్టారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా

[1] (సూరతు ఆల ఇమ్రాన్:83–85).

[2] (ముస్లిం:3496).

జవాబిచ్చారు: ''ఓ అమ్ర్ నీకు తెలియదా!? ఇస్లాం స్వీకరణ కారణంగా పూర్వపు పాపాలన్నీ తుడిచిపోతాయి....''[1]

ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని తిరస్కరిస్తారో మరియు ఇస్లాం ధర్మానికి విముఖతను చూపుతారో వారికి ఆ అధికారం ఉంది. కాని వారికి బదులు అల్లాహ్ ఇస్లాం ధర్మాన్ని ఇతర ప్రజలను అనుగ్రహిస్తాడు. వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులవుతారు. మరియు అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవుతాడు. ఆ విషయాన్ని అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ విశ్వాసులారా! మీలో ఎవరయినా సరే తమ (ఇస్లాం)ధర్మం నుంచి తిరిగిపోతే (పోవచ్చు), అల్లాహ్ త్వరలోనే మరోజాతివారిని తీసుకువస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు, వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు....'' [2]

---

[1] (ముస్లిం:173).

[2] (సూరతుల్ మాయిదా:54). **ఇస్లాం ధర్మానికి చెందిన ముఖ్యమైన అంశాలు:**

ఇస్లామియ ధర్మం గురించి అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పుకోవటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, అల్లాహ్ దూతలను, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను హృదయ పూర్వకంగా విశ్వసించటం''(2,సూరతుల్ బఖరా:177).

మరియు హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖించారు: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో (ప్రజలతో) సమావేశమయి ఉండగా, అకస్మాత్తుగా ఒకవ్యక్తి మా వద్దకు వచ్చాడు. అతని బట్టలు ఎంతో తెల్లగా, శిరోజాలు మరెంతో నల్లగా ఉన్నాయి. అతన్ని చూస్తే ప్రయాణం చేసి వచ్చినట్టుగా గాని, అతను మాకు పరిచయమున్న వ్యక్తిగా గాని తెలియడం లేదు.

అతను వచ్చి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు దగ్గరగా కూర్చున్నాడు, అతను తన మోకాళ్ళను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మోకాళ్ళకు ఆనించాడు. తన రెండు చేతులు ప్రవక్త తొడలపై పెట్టాడు. ఆ తరువాత అతను ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం):

**''మాకు ఇస్లాం గురించి తెలుపండి?'' అని అడిగాడు.**

## సర్వ జనులకన్నా అల్లాహ్‌ను మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రేమించాలి:

అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞలకు అనుగుణంగా తమ ఇష్టాయిష్టాలను సమర్పించుకోవాలి. మరియు వారి ఆజ్ఞలకు అనుకూలంగా తమ జీవితాలను మార్చుకోవాలి. అల్లాహ్

---

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఇస్లాం అంటే అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడనీ, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ సందేశహరుడనీ నీవు సాక్ష్యం పలకడం, నమాజు చేయడం, జకాత్ చెల్లించడం, రమజాన్ ఉపవాసాలు పాటించడం, ప్రయాణ స్థోమత కలిగి ఉంటే హజ్ చేయడం.'' అని అన్నారు.

దానికతను: **''మీరు చెప్పింది నిజం''** అని అన్నాడు.

మాకు ఆశ్చర్యం కలిగింది. ''అతనే ప్రశ్నిస్తున్నాడు మరియు అతనే తిరిగి ధృవీకరిస్తున్నాడని''

ఆ తరువాత అతను: **''నాకు విశ్వాసం (ఈమాన్) గురించి తెలుపండి?''** అని అడిగాడు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''విశ్వాసం అంటే నీవు అల్లాహ్‌ను, అల్లాహ్ దూతలను, అల్లాహ్ గ్రంథాలను, అల్లాహ్ ప్రవక్తలను, (పరలోకంలో) అల్లాహ్ ముందు హాజరు కావలసి ఉంటుందన్న విషయాన్ని (మరణించిన తరువాత మానవులు) తిరిగి బ్రతికించబడతారన్న విషయాన్ని నమ్మాలి.'' మరియు **మేలైనా, కీడైనా** అల్లాహ్ తరపునే జరుగుతుందన్న విషయాన్ని విశ్వసించాలి.'' అని సమాధానమిచ్చారు.

ఆ వ్యక్తి: **''మీరు చెప్పింది నిజం''** అని అన్నాడు.

తిరిగి ఆ వ్యక్తి: **''ఇహ్సాన్''** అంటే ఏమిటో నాకు తెలుపండి? అని అడిగాడు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇహ్సాన్ అంటే:

''నీవు అల్లాహ్‌ను చూస్తున్నట్లుగా (అత్యంత భయంభక్తితో) ఆరాధించాలి. నీవు ఆయనను చూడకపోయిన ఆయనయితే నిన్ను చూస్తునే ఉన్నాడు.'' (అన్న యదార్థాన్ని గుర్తించుకుంటూ ఆరాధించాలి) అని అన్నారు.

ఆ తరువాత అతను: **''నాకు ప్రళయాన్ని గురించి తెలుపండి?''** అని ప్రశ్నించాడు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ప్రళయం గురించి ప్రశ్నించేవాడికన్నా సమాధానమిచ్చేవాడికి ఎక్కువేమీ తెలియదు.'' అని బదులిచ్చారు....(ముస్లిం:9).

మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కన్నా ఏ విషయము మా మనుసుకు ప్రీతికరమై ఉండకూడదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (దైవ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: ''ఒక వేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ సమీప బంధువులు, మీరు సంపాదించిన మీ సిరిసంపదలు, కుంటుపడుతుందేమోనని మీరు భయపడే మీ వర్తకం, మీకెంతో ప్రియమైన మీ గృహాలు మీకు అల్లాహ్ కన్నా, ఆయన ప్రవక్త కన్నా, ఆయన మార్గంలో సలిపే పోరాటం కన్నా ఎక్కువ ప్రియమైనవైతే అల్లాహ్ తీసుకువచ్చే తీర్పు(శిక్ష)కొరకు ఎదురు చూడండి. అల్లాహ్ అవిధేయులకు సన్మార్గం చూపడు.'' [1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ఎవరిచేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. మీలో ఎవరయినాసరే తన తండ్రికన్నా, తన సంతానంకన్నా, సమస్త జనులకన్నా అధికంగా నన్ను ప్రేమించనంత వరకూ-అతను విశ్వాసి కాజాలడు. [2]

ఒక సారి హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: దైవప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం) తమరు 'నాకు నా ప్రాణం తప్ప మిగిలిన వస్తువులన్నింటికన్నా ప్రియతములు' అని అన్నారు.

అప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఎవరయినాసరే తమ ప్రాణం కన్నా అధికంగా నన్ను ప్రేమించ నంతవరకూ అతను విశ్వాసి కాజాలడు'

---

[1] (సూరతు తౌబా:24).

[2] (బుఖారీ:14, ముస్లిం:63).

అని అన్నారు.

ఈ మాట వినగానే: 'అయితే దైవసాక్షిగా! ఇకనుంచి నేను నా ప్రాణం కన్నా ఎక్కువగా తమరిని ప్రేమిస్తున్నాను' అని హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) చెప్పారు.

అప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఓ ఉమర్! ఇప్పుడు నువ్వు విశ్వాసివి అయ్యావు' అని అన్నారు. [1]

ఒక సారి ఒక పల్లెవాసి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పవిత్ర సన్నిధికి వచ్చి, – 'ప్రళయం ఎప్పుడొస్తుంది?' అని అడిగాడు.

దైవ ప్రవక్త(స): 'దాని కోసం నువ్వేం ఏర్పాట్లు చేసుకున్నావు?' అనడిగారు.

దానికావ్యక్తి: **'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త గారిని ప్రేమించడం'** అని అన్నాడు.

అతని సమాధానం విని: **'అయితే నీవు ఎవరిని ప్రేమిస్తున్నావో! వారితోనే ఉంటావు'** అని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు. [2]

## దృఢమయిన విశ్వాసంతో అల్లాహ్‌ను ప్రేమించాలి:

మనం అల్లాహ్ దాసులం. ఆయన మనందరిపై అన్ని విధాలుగా కనికరించి ఉన్నాడు. కనుక మనం ఆయనను మన ప్రభువుగా, మన ఆరాధ్యునిగా, మన రక్షకుడిగా విశ్వసించాలి. అంటే దేవుని అధికారాన్ని ఆయన మహోన్నతమైన గుణగణాలను హృదయపూర్వకంగా విశ్వసించాలి. మరియు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్తనని మనసారా నమ్మి

---

[1] (బుఖారీ:6142).

[2] (బుఖారీ:3412, ముస్లిం:4775).

తదనుగుణంగా నడుచుకోవాలి. అంటే దైవాజ్ఞల్ని అనుసరించి, చెడులకు దూరంగా ఉండటం, సత్కార్యాలను మనస్ఫూర్తిగా పాటించటం. సత్కార్యాలలో అన్నిటికంటే గొప్ప సత్కార్యం అల్లాహ్ పట్ల ఈమాన్ (విశ్వాసం) కలిగి ఉండటం.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ఓ ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: ''ఆరాధనను అల్లాహ్‌కే ప్రత్యేకించి ఆయన్ని మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించబడింది. – ఆజ్ఞను శిరసావహించే వారిలో నేను తొలివాణ్ణి కావాలని కూడా నాకు ఆజ్ఞాపించబడింది.''[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కనుక (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో. నీ పొరపాట్లకు గాను క్షమాపణ వేడుకుంటూ ఉండు. విశ్వాసులైన పురుషుల, విశ్వాసులైన స్త్రీలందరి (మన్నింపు) కోసం కూడా వేడుకుంటూ ఉండూ మీ రాకపోకల గురించి మీ విశ్రాంతి గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.''[2]

ఈ లోకంలో ఒక మనిషి ధనం ఎంత సంపాదించాడు, ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు అన్న విషయాలు ముఖ్యం కావు. కాని దేవుని గురించి ఎంతవరకు తెలుసుకున్నాడు, దేవుడ్ని ఆరాధిస్తున్నాడా? దేవుని ఆజ్ఞలకు కట్టుబడి ఉన్నాడా? పరలోక జీవితంలో సాఫల్యం చెందుతాడా? దేవుని ప్రేమకు అర్హుడా? ఆ అర్హతలు సాధించాలంటే చేయవలసిన కార్యాలను తెలుసుకోవడం ఎంతో ప్రాముఖ్యమైనది. ఎందుకంటే? అల్లాహ్ మానవులను

---

[1] (సూరతుజ్ జుమర్:11–12).

[2] (సూరతు ముహమ్మద్:19).

సృష్టించినది అల్లాహ్‌ను విశ్వసించి, ఆయనను ఆరాధించటానికే అన్న విషయం మనం తెలుసుకోవాలి.

ప్రియమైన సోదరులారా! ఎప్పుడైతే దేవుని గురించి చర్చిస్తామో అప్పుడు మన హృదయాలు దేవుని పట్ల విశ్వాసంతో, ప్రేమతో నిండిపోవాలి. దేవుని గురించి చర్చించే సభలలో హాజరైనప్పుడు మన హృదయాలు భయం, భక్తి మరియు ప్రేమానురాగాలతో పులకించిపోవాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిజమైన విశ్వాసులు ఎటువంటివారంటే – అల్లాహ్ ప్రస్తావన రాగానే వారి హృదయాలు భయంతో వణుకుపోతాయి. అల్లాహ్ ఆయతులు వారి ముందు పఠించినపుడు, అవి వారి విశ్వాసాన్ని మరింత వృద్ధిచేస్తాయి. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు.'' [1]

మరొకచోట ఇలా తెలియజేశాడు: ''కాని అల్లాహ్ విశ్వాసాన్ని మీకు ప్రియతమం చేశాడు. దాన్ని మీ హృదయాలలో శోభాయమానంగా చేశాడు. అవిశ్వాసం పట్ల, దుర్వర్తన పట్ల, అవిధేయత పట్ల, మీకు రోత కలిగేలా చేశాడు. ఇలాంటివారే సన్మార్గ గాములు. – (అది అల్లాహ్ తరుపు నుండి) వారికి లభించిన అనుగ్రహం మరియు ఉపకారం. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు వివేకవంతుడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరెవరయితే తాగూత్ (షైతాన్, దైవేతరుల) దాస్యానికి దూరంగా ఉన్నారో, (సంపూర్తిగా) అల్లాహ్

---

[1] (సూరతుల్ అన్ఫాల్:2).

[2] (సూరతుల్ హుజురాత్:7-8).

వైపుకు మరలారో, వారు శుభవార్తకు అర్హులు. కనుక (అటువంటి) నా దాసులకు (ఓ ముహమ్మద్!) శుభవార్తను వినిపించు.–వారు (అల్లాహ్) మాటను శ్రద్ధగా వింటారు. అందులోని మంచి విషయాన్ని ఖచ్చితంగా అనుసరిస్తారు. అల్లాహ్ సన్మార్గం చూపినది కూడా వారికే.''[1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరెవరయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసిస్తారో వారే తమ ప్రభువు దగ్గర సత్యవంతులు, సాక్షులు. వారి కొరకు వారి పుణ్యఫలం కూడా ఉంటుంది. వారి జ్యోతి కూడ ఉంటుంది....''[2]

మరియు ఒక హదీసులో; సిద్దీఖులకు (సత్యవంతులకు) స్వర్గంలో లభించే గొప్ప స్థానం గురించి ఈ విధంగా తెలుపబడింది:

''స్వర్గవాసులు తమపై అంతస్థు వారిని చూస్తారు. వారు ప్రకాశించే తూరుపు లేక పశ్చిమ తారల వలె ఆకాశపుటంచున ఉన్నట్లు కనిపిస్తారు. అంటే క్రిందివారికీ –పై వారికీ అంతటి వ్యత్యాసం ఉంటుంది.''

**'బహుశా అవి ప్రవక్తల ఉన్నత స్థానాలై ఉంటాయి. సామాన్యులకు ఆ స్థానాలు లభించవు'** అని సహచరులు అభిప్రాయపడగా!

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'అవును'. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ''వారు అల్లాహ్‌ను విశ్వసించటంతో పాటు, దైవప్రవక్తలను సత్యసంధులుగా ధృవీకరించినారు.''[3]

---

[1] (సూరతు జుమర్:17–18).

[2] (సూరతుల్ హదీద్:19).

[3] (బుఖారీ:3016, ముస్లిం:5059).

అంటే ఈమాన్ (విశ్వాసం) మరియు తస్‌దీఖ్ (ధృవీకరణ) హక్కును సజావుగా నెరవేర్చారు. [1]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు:

**' ఈ మూడు లక్షణాలున్న వ్యక్తి విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు.'**

1-అల్లాహ్ మరియు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు అందరికన్నా ప్రియతములై ఉండాలి.

2-కేవలం దైవప్రసన్నత కోసమే తోటి వ్యక్తిని ప్రేమించాలి.

3-అల్లాహ్ తనను అవిశ్వాస స్థితినుండి రక్షించిన తరువాత తిరిగి దానివైపుకు మరలిపోవటాన్ని తను అగ్నిలో పడటాన్ని ఎంతగా అసహ్యించు కుంటాడో అంతగా అసహ్యించుకోవాలి. [2]

## విశ్వాసం మరియు ఏకదైవారాధన అల్లాహ్ ప్రేమకు ప్రతిరూపం:

అల్లాహ్‌ను మాత్రమే ఏకైక ఆరాధ్యునిగా విశ్వాసించటం ద్వారా మనం అల్లాహ్ ప్రసన్నత మరియు ప్రేమ పొందుటకు అర్హులు కాగలుగుతాము. మరియు అదే మన జీవిత చివరి కార్యమై ఉండాలి. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరయితే మా ప్రభువు అల్లాహ్‌యే' అని పలికి, తర్వాత దానిపై గట్టిగా నిలబడ్డారో వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ లేదు.-వారే స్వర్గవాసులు. వారందులో కలకాలం ఉంటారు. వారు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం ఇది.'' [3]

---

[1] (ఫత్‌హుల్ బారీ, అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 2388).

[2] (బుఖారీ:15, ముస్లిం:61).

[3] (సూరతుల్ అహ్‌ఖాఫ్:13-14) అలాగే సూరతుల్ ఫుస్సిలత్: 30-32 లో కూడా ఉంది.

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా విశ్వసించి, సత్కార్యాలు చేసినవారి యెడల కరుణామయుడైన అల్లాహ్ ప్రేమానురాగాలను సృజిస్తాడు.'' [1]

ప్రపంచ మానవులందరూ మరియు వివిధ మతాలను అనుసరించే వారు కూడా అల్లాహ్‌ను విశ్వసించాలి. ఎందుకంటే సర్వ మానవాళికి దేవుడు ఒక్కడే, వారి ధర్మం కూడా ఒక్కటే. కనుక ఆ కరుణామయుడు ప్రజలందరిని ఇస్లాం ధర్మం వైపు అహ్వానిస్తున్నాడు. ఎవరైతే అల్లాహ్‌ను విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో అల్లాహ్ వారందరిని కూడా ప్రేమిస్తాడు, కరుణిస్తాడు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వసించినవారైనా, యూదులైనా, క్రైస్తవులైనా, సాబియనులైలయినా ఎవరయినాసరే – అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించి సదాచరణ చేస్తే వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.'' [2]

విగ్రహాలను, శిలువను, అగ్నినీ, మరే యితర వస్తువులను దేవుళ్ళుగా చేసుకొని ఆరాధిస్తున్నారో వారందరిని వదిలిపెట్టి, దేవుడు ఒక్కడే అన్న అసలైన నమ్మకం వైపునకు మరలండి. మరియు మనంమందరం సమానంగా దేవుడు ఒక్కడే అన్న విశ్వాసంపై కట్టుబడి ఉండి,ఆ అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిద్దాం. ఆ విషయం వైపుకే సర్వ ప్రజలను అల్లాహ్ ఇలా పిలుపునిచ్చాడు:

---

[1] (సూరతు మర్యమ్:96).

[2] (సూరతుల్ బఖరా: 62) మరియు సూరతుల్ మాయిదా: 69 లో కూడా ఉంది.

(ఓ ప్రవక్తా!)వారికి స్పష్టంగా చెప్పు: ''ఓ గ్రంథవహులారా! 'మాలోనూ, మీలోనూ సమానంగా ఉన్న ఒక విషయం వైపుకు రండి. అదేమంటే మనం అల్లాహ్‌ను తప్ప వేరెవరిని ఆరాధించ కూడదు, ఆయనకు భాగస్వాములుగా ఎవరిని కల్పించరాదు. అల్లాహ్‌ను వదిలి మనలో ఎవరూ ఇంకొకరిని ప్రభువులుగా చేసుకోరాదు.' ఈ ప్రతిపాదన పట్ల గనక వారు విముఖత చూపితే, 'మేము మాత్రం ముస్లిములము అన్న విషయానికి మీరు సాక్షులుగా ఉండండి' అని వారికి చెప్పేయండి.'' [1]

హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం: ఒక రోజు నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)సవారిపై వెనుక కూర్చొని ఉన్నాను. అప్పుడు ఆయనన్నుద్దేశించి ఇలా అన్నారు: **''అబ్బాయీ!** నేను నీకు కొన్ని ముఖ్యమయిన విషయాలు చెప్తాను. (వాటిని నీవు సదా గుర్తుంచుకో)!
నీవు అల్లాహ్‌ను (అంటే ఆయన ఆదేశాలను) కాపాడు; ఆయన నిన్ను కాపాడుతాడు.
నీవు దేవుని (హక్కులను) గుర్తుంచుకో; ఆయన నీ ముందున్నట్లే గ్రహిస్తావు. (అంటే ఆయన రక్షణ, సహాయ సహకారాలు నీ వెంటనే ఉంటాయి).
నీవు అర్థించదలుచుకున్నప్పుడు 'అల్లాహ్‌నే అర్థించు.'
నీవు సహాయం కోరాలంటే(సాధనాలు ఉపయోగించటంతోపాటు)
'అల్లాహ్‌నే సహాయం కోసం అర్థించు.'

**జాగ్రత్త!** లోకమంతా ఏకమై నీకు మేలు చేకూర్చాలనుకున్నా అల్లాహ్ నీకోసం వ్రాసి పెట్టిన దానికంటే ఎక్కువేమీ అది నీకు మేలు చేకూర్చ జాలదు. ఒకవేళ నీకు కీడు తలపెట్టాలన్న ఉద్దేశ్యంతో ఏకమైనా కూడ

[1] (సూరతు ఆల ఇమ్రాన్:64).

అల్లాహ్ నీ కోసం వ్రాసి ఉంచిన దానికంటే ఎక్కువ నష్టమేమీ అది కలిగించజాలదు. ఎందుకంటే? కలములు పైకి లేపుకోబడ్డాయి (అంటే విధివ్రాత రాయటం ఆయిపోయింది.) పత్రాల సిరా ఆరిపోయింది.''[1]

మరియు హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం: ఒక పల్లెవాసి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి,

**''ఓ అల్లాహ్ ప్రవక్తా! (స్వర్గాన్ని గాని నరకాన్ని గాని) అనివార్యం చేసే రెండు స్థితులేవి?''** అని అడిగాడు.

దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఎవరైతే బహుదైవారాధనకు గురికాకుండా మరణిస్తారో వారు స్వర్గానికి ప్రవేశిస్తారు. మరియు ఎవరైతే బహుదైవారాధన చేస్తూ మరణిస్తారో వారు నరకానికి చేరుకుంటారు.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మీరు చేసే మూడు పనుల వల్ల అల్లాహ్‌కు సంతోషం కలుగుతుంది. మరియు మూడు పనుల వల్ల అసహ్యం కలుగుతుంది.''

**అల్లాహ్‌కు సంతోషం కలిగించే పనులు;**

1) మీరు (అల్లాహ్)కు సహవర్తులుగా ఎవ్వరిని నిలబెట్టకుండా ఆయన్నే ఆరాధించడం.

2) మీరందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోవటం. (కలిసి మెలిసి ఉండటం).

3) పరస్పరం విడిపోకుండా ఉండటం.

---

[1] (తిర్మిజీ: 2516, సహీహ్ అల్ జామి:7957).

[2] (ముస్లిం:135).

**మరియు అల్లాహ్‌కు అసహ్యం కలిగించే పనులు:**

1) పనికిమాలిన సంభాషణలు జరపటం.

2) మితిమీరిన ప్రశ్నలు.

3) ధనం వృథా చేయటం.[1]

## అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతే ప్రేమకు పునాది:

ముస్లిములందరూ అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అందరికంటే ఎక్కువగా ప్రేమించాలి. ఆ ప్రేమించే విధానాన్ని కూడా ఆ అల్లాహ్‌యే మనకు నేర్పించాడు. కనుక వారి ప్రేమను మనం నోచుకోవాలంటే మరియు వారిని ప్రేమించాలంటే అతి ఉత్తమమైన విధానం వారి విధేయతను పాటించడమే అన్న విషయం మనం తెలుసుకోవాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఎవరు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, అల్లాహ్‌కు భయపడుతూ ఆయన (శిక్షల) నుండి తమను కాపాడుకుంటారో వారే విజయం సాధించేవారు.’’[2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: ‘‘మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా

---

[1] (ముస్లిం:3236).

[2] (సూరతున్ నూర్:52).

కనికరించేవాడు.''- ఇంకా వారికి ఇలా చెప్పు: ''మీరు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి. ఒకవేళ వారు విముఖత చూపితే అల్లాహ్ తిరస్కారులను ఏ మాత్రం ఇష్టపడడు.'' [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది. అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు.''[2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

'నా ఉమ్మతకు (సమాజం) చెందిన ప్రతి ఒక్కరూ స్వర్గంలోకి ప్రవేశిస్తారు (స్వర్గం) వద్దనుకున్నవారు తప్ప.

యా రసూలల్లాహ్! స్వర్గంలోకి ప్రవేశించడం ఎవరు వద్దనుకుంటారు? అని కొందరు అడిగారు.

దానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): ''నాకు విధేయత చూపినవారు స్వర్గానికి పోతారు. నన్ను ధిక్కరించినవారే స్వర్గంలోకి ప్రవేశించడానికి నిరాకరించినవారు'' అని సమాధానమిచ్చారు. [3]

దైవ ప్రవక్తను అనుసరించటం వల్ల మీ పాపాలు క్షమించబడటం ఒక్కటే కాదు. మీరు దైవానికి ప్రియతములుగా కూడా ఖరారు చేయబడతారు. ఒక మనిషి అల్లాహ్ సమక్షంలో ప్రియతమునిగా నిలబడటం అంటే సామాన్య విషయం కాదు - అది ఎంతో ఉన్నతమైన స్థానం, అది మహా భాగ్యవంతుల స్థానం. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

---

[1] (సూరతు ఆలి ఇమ్రాన్:31-32).
[2] (సూరతుల్ అహ్‌జాబ్:21).
[3] (బుఖారీ:6737).

''ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత కనబరుస్తారో వారే అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తనులతోనూ ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు. – ఇదీ అల్లాహ్ తరుఫు నుంచి లభించే అనుగ్రహం. తెలుసుకోవటానికి అల్లాహ్‌యే చాలు.'' [1]

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత కనబరిచినవారికి లభించే పుణ్యఫలం ఎటువంటిదో ఇక్కడ చెప్పటం జరిగింది. **''మనిషి ఎవరిని అభిమానిస్తాడో వారి సాంగత్యమే అతనికి లభిస్తుంది.''** అన్న హదీసు ఈ సందర్భంగా గమనార్హం. [2]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) ఇలా అంటున్నారు: ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నోట వెలువడిన ఈ ప్రవచనం విన్నప్పుడు సహాబాలకు కలిగినంత ఆనందం మరెన్నడూ కలగలేదు'' ఎందుకంటే? వారు స్వర్గంలో కూడా తమ ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంగత్యాన్ని కోరుకునేవారు.

ఈ ఆయతు పూర్వరంగానికి సంబంధించిన ఉల్లేఖనాల్లో ఇలా చెప్పబడింది: కొంతమంది సహచరులు వచ్చి,

''ఓ దైవప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం)! అల్లాహ్ మీ కొరకు స్వర్గంలో ఉన్నత స్థానాలను ప్రసాదిస్తాడు. మాకు అంతకన్నా అధమ స్థానమే లభిస్తుంది. అందువల్ల మేము అక్కడ మీ సాంగత్యానికి దూరమై పోతాము.

---

[1] (సూరతున్ నిసా:69–70).

[2] (బుఖారీ:5702, ముస్లిం:4779).

ప్రపంచంలో మాకు ప్రాప్తించిన మీ సహచర్య భాగ్యం పరలోకంలో ప్రాప్తించదు కదా!'' అని సందేహపడ్డారు.

అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి వారి వారి మనసులు కుదుటపడేలా చేశాడు (ఇబ్నె కసీర్).

మరి కొంత మంది సహచరులైతే స్వర్గంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచర్యం కోసం ప్రత్యేకంగా విన్నపాలు చేసుకున్నారు. అలాంటి వారిని ఉద్దేశ్యించి, నఫిల్ (స్వచ్ఛంద) నమాజులు అత్యధికంగా చేయమని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తాకీదు చేశారు. ''మీరు (వీలైనన్ని) ఎక్కువ సజ్దాల ద్వారా నాకు తోడ్పడండి'' అని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు.[1]

ఇంకొక హదీసులో ఇలా అనబడింది – ''సత్యసంధుడు, నిజాయితీ పరుడైన వర్తకుడు ప్రవక్తల, సిద్దీఖుల (సత్యసంధుల), షహీదుల (అమర వీరుల)లతో పాటు ఉంటాడు.'' [2]

విశ్వాసంలోనూ విధేయతలోనూ పరిపూర్ణ స్థాయికి చేరుకున్న వారిని 'సిద్దీఖులు'గా వ్యవహరిస్తారు. ప్రవక్త పదవి (నబువ్వత్) తరువాతి స్థానం ఇదే. మహానీయ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అనుచర సమాజంలో ఈ అంతస్థు పొందిన వారిలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజియల్లాహు అన్హు) అగ్రగాములు. అందుకే ప్రవక్తేతర వ్యక్తులలో మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తరువాతి స్థానం ఆయనదే అన్న విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇక దేవుని హక్కులతో పాటు, దాసుల

---

[1] (సహీహ్ ముస్లిం కితాబుస్సలాత్).

[2] (తిర్మిజీ:1130 కితాబుల్ బుయూ).

హక్కులను కూడా పూర్తిగా నెరవేరుస్తూ, అందులో ఎలాంటి లోటు రానివ్వకుండా జాగ్రత్త పడేవారిని సజ్జనులు (సాలిహీన్) అని అంటారు.[1]

ఇలా ఖుర్‌ఆన్ గ్రంథంలో ముప్పై కన్న ఎక్కువ ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ మరియు ప్రవక్త విధేయతను పాటించువారు అల్లాహ్ ప్రేమ, కారుణ్యం పొందుతారు. మరియు ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తనులతోనూ స్వర్గంలో ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు.

ఖుర్‌ఆన్ ఆయతుల ద్వారా మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసుల ద్వారా అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రేమ ప్రసన్నతకు సంభందించిన 'గీటురాయి' వారి విధేయత అని నిర్ధారించడం జరిగింది. ఆ గీటురాయిపై మేలిమి అని తేలినవారు సాఫల్యం పొందినట్లే లెక్క. లేకుంటే వారి ప్రేమ బూటకమ్మైనది. మరియు వారి విధేయత పాటించని పక్షంలో అల్లాహ్ ఆగ్రహానికి గురికాబడతారు. మార్గభ్రష్టులుగా తయారయి నరకానికి ప్రవేశిస్తారు.

కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''మాతో సంబంధం లేని – అంటే మేము చూపిన పద్ధతికి భిన్నమైన – రీతిలో ఎవరైనా ఏదన్నా ఆచరిస్తే అది త్రోసిపుచ్చదగినది.''[2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''వాక్యాలలో అన్నిటికంటే సత్యమ్మైన వాక్యం అల్లాహ్ గ్రంథం (ఖుర్‌ఆన్). మరియు మార్గాలన్నిటిలోకి అతి ఉత్తమమ్మైన మార్గం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గం.

---

[1] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: పేజి:389-390).

[2] (బుఖారీ:2499, ముస్లిం:3242).

మరియు ఆచారాలలో అతి చెడు ఆచారం క్రొత్త ఆచారాలు, మరియు ప్రతి క్రొత్త ఆచారం బిద్‌అత్, ప్రతి బిద్‌అత్ మార్గవిహీనమైనది. మరియు ప్రతి మార్గవిహీనత నరకానికి తీసుకువెళ్ళుతోంది...''[1]

## దృఢమైన నమ్మకం (తవక్కుల్ ) కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ప్రేమను పొందాలంటే అల్లాహ్‌పై దృఢమైన నమ్మకం కలిగి ఉండాలి. మనం కృషి, సాధన సంపత్తిపైనే పూర్తిగా ఆధార పడకుండా, అల్లాహ్ అభీష్టం కూడా దానికి తోడ్పడాలి. మరియు అల్లాహ్ అభీష్టం ప్రకారమే మా కార్యాలకు సత్ఫలితాలు లభిస్తాయన్న విశ్వాసం ఉండాలి. ఎలాంటి కార్యసాధనాలు నెరవేర్చాలన్నా అల్లాహ్ అభీష్టం లేనిదే జరగవు. కొంతమంది ప్రజల ఆలోచనల ప్రకారం కార్యాలన్ని అల్లాహ్ అభీష్టం ప్రకారమే జరుగుతాయి అంటూ చేతులు ముడుచుకొని ఒక మూలన కూర్చుంటే దానిని 'తవక్కుల్' అని తప్పుగా అర్థం చేసుకుంటారు. కాని 'తవక్కుల్' అనే పదానికి సరైన అర్థం: **''ఒక మనిషి తన శక్తివంచన లేకుండా చేసిన కృషి తరువాత దానికి బదులుగా (లాభమైన లేక నష్టమైన) లభించే ఫలితమే అల్లాహ్ నిర్ణయంగా భావించాలి.''** అలాంటి నమ్మకం కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. దాని కారణంగా అల్లాహ్ వారికి అమితంగా ఉపాధిని కూడా ప్రసాదిస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి క్షమాపణ కోసం (అల్లాహ్‌ను) వేడుకో. కార్య నిర్వహణలో వారిని సంప్రదిస్తూ ఉండు.

---

[1] (ఇబ్ను ఖుజైమా, సహీహుల్ జామే:1353).

ఏద్దైనా పని గురించి తుది నిర్ణయానికి వచ్చినప్పుడు, అల్లాహ్‌పై భారం మోపు. నిశ్చయంగా అల్లాహ్ తనను నమ్ముకున్న వారిని ప్రేమిస్తాడు.''[1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిజమైన విశ్వాసులు ఎటువంటి వారంటే అల్లాహ్ ప్రస్తావన రాగానే వారి హృదాయాలు భయంతో వణుకుతాయి. అల్లాహ్ ఆయతులు వారి ముందు పఠించ బడినప్పుడు, అవి వారి విశ్వాసాన్ని మరింత వృద్ధిచేస్తాయి. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు.'' [2]

ఒక సందర్భంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''విచారణ లేకుండా డెబ్బై వేల మంది ప్రజలు స్వర్గానికి ప్రవేశిస్తారు. వారు ఎవరంటే? వారు ఎన్నడూ మంత్రాలు చదివి ఊదటం, జాల విద్య చేయటం వంటివి చేయరు. ఇతరుల చేత కూడా చేయించరు, ఇంకా దుశ్శకునాలను పాటించరు. కేవలం తమ ప్రభువుపైనే నమ్మకం కలిగి ఉంటారు.'' [3]

పక్షులు ప్రతి రోజు ఉదయాన్నే ఆకలితో ఎగురుకుంటూ ఆహారం కోసం అన్వేషించి సాయంత్రం తమ గూళ్ళకు కడుపు నింపుకొని చేరుకుంటాయి. అదే విధంగా అల్లాహ్‌ను నమ్ముకున్న ప్రజలు కూడా తమ శక్తి వంచన లేకుండా కృషి చేసి దాని ఫలితాల కొరకు అల్లాహ్‌ను నమ్ముకుంటారు. ఎలాగైతే అల్లాహ్ పక్షులను ప్రతి రోజు కడుపు నింపుతున్నాడో అలాగే ఆయనను నమ్ముకున్నవారికి కూడా ఉపాధిని ప్రసాదిస్తాడు.

---

[1] (సూరతు ఆల ఇమ్రాన్: 159).

[2] (సూరతు అన్ఫాల్:2).

[3] (బుఖారీ:8991, ముస్లిం:321).

కనుక ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''మీరు అల్లాహ్‌పై ఏ విధంగా నమ్మకం ఉంచాలో ఆ విధంగా నమ్మకాన్ని కలిగివుంటే ఆయన పక్షులకు ఆహారాన్ని ప్రసాదించినట్లే మీకు కూడా ఉపాధిని ప్రసాదిస్తాడు. పక్షులు ఉదయం పూట ఆకలితో బయలుదేరి సాయంత్రానికి కడుపు నింపుకొని తిరిగి వస్తాయి.''[1]

## ఈమాన్ స్థిరత్వం (ఇస్తేఖామత్) కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

స్థయిర్యాన్ని ప్రదర్శించడమంటే ఇస్లాం ధర్మంలోని నిషేధాలను అమలు పరచడంలో నిలకడగా ఉండటం. దైవాజ్ఞల్ని, విధులను, దైవ ప్రవక్త సంప్రదాయాలను, పుణ్యకార్యాలను నిర్వర్తించడంతో పాటు దేవుని నిషేధాజ్ఞలకు, వారింపులకు దూరంగా ఉండటాన్నే **'ఇస్తేఖామత్'** అంటారు.

మరియు మనసారా అల్లాహ్‌ను ప్రేమిస్తూ, ఆయన్ని మాత్రమే ఆరాధిస్తూ, ఆయన ఆదేశాల పట్ల విధేయత పాటిస్తూ ఉండటాన్ని 'ఇస్తేఖామత్' అంటారు. మరియు అల్లాహ్ ప్రేమను మనం పొందాలంటే అన్ని సమయాల్లోను (సుఖదుఃఖాలలో, కష్టనష్టాలలో) అల్లాహ్ ఆజ్ఞలపైనే స్థిరంగా ఉండటాన్ని **'ఇస్తేఖామత్'** అంటారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''అలిఫ్–లామ్–మీమ్.** ''మేము విశ్వసించాము'' అని చెప్పినంత మాత్రాన తాము ఇట్టే వదలి వేయబడతామనీ, తాము పరీక్షించబడమని ప్రజలు అనుకుంటున్నారా?– వారి

---

[1] (తిర్మిజీ2/55, హాకిమ్4/318, అహ్మద్1/30).

పూర్వీకులను కూడా మేము బాగా పరీక్షించాము. వీరిలో సత్యవంతులెవరో, అసత్యవాదులెవరో నిశ్చయంగా అల్లాహ్ తెలుసుకుంటాడు.''[1]

**''మేము విశ్వసించాము''** అని నోటితో చెప్పినంతమాత్రాన, పరీక్షించకుండానే వదిలి వేయబడటం జరుగుతుందని భావించటం సరైనది కాదు. వారు ధన ప్రాణాల ద్వారా పరీక్షించబడతారు. కష్టాల ద్వారా పరీక్షించబడతారు. ఆకలిబాధ ద్వారా పరీక్షించబడతారు. ఈ పరీక్షల ద్వారా కల్తీ సరుకు ఏదో – మేలిమి సరుకు ఏదో, నిజాయితీపరులెవరో – నయవంచకులెవరో నిగ్గుదేల్చటం జరుగుతుంది. [2]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా అల్లాహ్‌యే తమ ప్రభువనీ ప్రకటించి, దాని (ఆ మాట) పైనే స్థిరంగా ఉండిపోయిన వారికి ఎలాంటి భయం లేక దుఃఖం అంటూ ఉండదు. అటువంటి వారే స్వర్గానికి పోయేవారు. అక్కడే వారు శాశ్వతంగా ఉంటారు. వారు (ప్రపంచంలో పుణ్యకార్యాలు) చేసిన పనులకు ప్రతిఫలంగా (స్వర్గం) ప్రసాదించబడింది.'' [3]

అంటే ఆ అల్లాహ్‌యే ఒకే ఒక్క దేవుడు. సాటిలేనివాడు, ఆయన ప్రభువు, పాలకుడు, పోషకుడు. ఒక వైపున ఆయన ప్రభుత్వాన్ని ఒప్పుకుంటూ, మరోవైపు ఆయన దైవత్వంలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించటం తగని పని. మనందరి ఆరాధ్య దైవం అల్లాహ్ ఒక్కడే! కనుక ఆయన పట్ల ప్రేమ, భయం, భక్తి, ఆశ, భరోస, మర్యాదలు కలిగి ఉండాలి.

---

[1] (29, సూరతుల్ అన్‌కబూత్:1-3).
[2] (అహ్‌సనుల్ బయాన్-తెలుగు:1708).
[3] (46,సూరతుల్ అహ్‌ఖాఫ్: 13-14).

మరియు శరణు కోరడం, సహాయనికై అర్థించడం, మొర పెట్టుకోవడం అంటూ జరిగితే అల్లాహ్ పేరున మాత్రమే జరగాలి. మరియు సజ్దాలు చెయ్యడము, ఖుర్బాని చెయ్యడము, మ్రొక్కుబడులు చెల్లించడము వంటి ఆరాధనలు అల్లాహ్ కొరకు మాత్రమే సమర్పించాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని (అల్లాహ్)ధర్మంపై నిలుపు'' అంటే దేవుని ఏకత్యం (తౌహీద్)పై, ఆయన ఆరాధనపై స్థిరంగా ఉండండి. మిథ్యా ధర్మాల వైపుకు వెళ్ళకండి. [1]

ఒక రోజు అబూ అమ్ర్ సుఫ్యాన్ బిన్ అబ్దుల్లాహ్ (రజియల్లాహు అన్హు) గారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి:

**యా రసూలల్లాహ్!** 'నాకేదైనా సమగ్రమైన విషయం బోధించండి. ఆ తరువాత నేను ఎవరినీ ఏమీ అడిగే అవసరం ఉండకూడదు' అని అభ్యర్థించారు.

దానికి ఆయన (స): ''నేను అల్లాహ్‌ను విశ్వసించాను అని చెప్పు. ఆ తరువాత ఆ మాటపైన గట్టిగా నిలబడు'' అని ప్రబోధించారు.[2]

ఎవరైతే అల్లాహ్‌ను నమ్మి, ఆ నమ్మకంపై స్థిరంగా ఉంటారో అటువంటి వారికి అల్లాహ్ ఇలా శుభవార్తను తెలియజేశాడు:

**'మా ప్రభువు అల్లాహ్ మాత్రమే'** అని పలికి దానిపై స్థిరంగా ఉన్న వారివద్దకు దైవ దూతలు దిగి వచ్చి, (ఇలా అంటూ ఉంటారు): ''మీరు భయపడకండి. దుఃఖించకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గలోకపు శుభవార్తను అందుకోండి. – ప్రాపంచిక జీవితంలో కూడా మేము

---

[1] (సూరతుర్ రూమ్:30).

[2] (ముస్లిం:55).

నేస్తాలుగా ఉంటూ వచ్చాము. పరలోకంలోకూడా ఉంటాము. మీ మనసు కోరినదల్లా, మీరు అడిగినదల్లా అందులో మీకు లభిస్తుంది. – క్షమాశీలి, దయాశీలి (ఆయన అల్లాహ్) తరపున లభించే ఆతిథ్యమిది.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ నా దాసులారా! ఈ రోజు మీకు ఎలాంటి భయం లేదు. ఎలాంటి దుఃఖం కూడా లేదు. మా వాక్యాలను విశ్వసించి విధేయులుగా ఉండి జీవితం గడిపినందుకు, మీరూ, మీ భార్యలూ స్వర్గంలో సంతోషంగా ప్రవేశించండి.'' [2]

---

[1] (సూరతు అస్సజ్‌దహ్: 30–32).

[2] (43,సూరతుజ్ జుఖ్రుఫ్:68–70).

# అధ్యాయం-2

## 64-81

## 2-భయభక్తులతో అల్లాహ్ వైపుకు మరలండి

- క్షమాపణ వేడుకొనేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- పశ్చాత్తాపం చెందేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- మన్నింపు మరియు పశ్చాత్తాపం వలన ప్రజలు అనుగ్రహింపబడతారు.
- మన్నింపు మరియు పశ్చాత్తాపం అంగీకరింపబడిన కొందరి మహాత్ముల గాధలు.

# 2–భయభక్తులతో అల్లాహ్ వైపుకు మరలండి

## క్షమాపణ వేడుకొనేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

పశ్చాత్తాపం చెందడానికి ముందు మనిషి అల్లాహ్ వద్ద క్షమాపణ కోరాలి. తరువాత చిత్తశుద్ధితో పశ్చాత్తాపం పడాలి. ఎందుకంటే? అతను చేసిన తప్పును తెలుసుకుంటేనే కదా పశ్చాత్తాపం చెంది తను చేసిన తప్పును మానుకుంటాడు. కనుక క్షమాపణ కోరేవారిని అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు, అపారంగా క్షమిస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు క్షమాపణ కోసం మీ ప్రభువును వేడుకోండి. మరి ఆయన వైపుకే మరలండి. నిశ్చయంగా నా ప్రభువు అమిత దయామయుడు, అపార ప్రేమమయుడు.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరయినా దుష్కార్యానికి పాల్పడి లేదా తనకు తాను అన్యాయం చేసుకుని, ఆ తరువాత క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తే, అతడు అల్లాహ్‌ను క్షమాశీలిగా, కృపాశీలిగా పొందుతాడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ దయానుగ్రహాలే గనక మీపై లేకపోయినట్లయితే (మీ నిర్వాకానికి గాను ఇప్పటికే శిక్ష అవతరించేది). అల్లాహ్ ప్రేమమయుడు, కనికరం కలవాడు. (కాబట్టి సరిపోయింది.)'' [3]

---

[1] (సూరతుల్ హూద్: 90).
[2] (సూరతున్ నిసా: 110).
[3] (సూరతున్ నూర్: 20).

అంటే: మీ వల్ల జరిగిన ఘోరమైన తప్పిదాన్ని అల్లాహ్ క్షమించటం వల్ల మీరు బ్రతికిపోయారు. ఆయనే గనక మీ చేష్టలపై ఆగ్రహించి ఉంటే మీరేమై ఉండేవారో ఆలోచించండి!?

హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్తుండగా ఆయన విన్నట్లు ఇలా తెలియజేశారు: ''ఏ మనిషి అయితే తప్పు చేసిన తరువాత అతను వుజూ చేసి, రెండు రకాతులు నమాజు చేసి, తరువాత క్షమాపణకై అల్లాహ్‌ను (పశ్చాత్తాపంతో) అర్థిస్తే, అల్లాహ్ అతడ్ని క్షమిస్తాడు. అని ఖుర్ఆన్ ఆయతును ఇలా చదివారు: ''తమ ద్వారా ఏదైనా నీతిబాహ్యమైన పని జరిగిపోతే లేదా తమ ఆత్మలకు వారు ఏదైనా అన్యాయం చేసుకుంటే వెంటనే అల్లాహ్‌ను తలుచుకొని, తమ పాపాల క్షమాపణకై వేడుకుంటారు. నిజానికి అల్లాహ్ తప్ప పాపాలను క్షమించే వాడెవడున్నాడు? – వారు తమ వల్ల జరిగింది తప్పు అని తెలిసినపుడు దానిపై హటం చెయ్యరు. – తమ ప్రభువు తరఫు నుంచి క్షమాభిక్ష, క్రింది కాలువలు ప్రవహించే స్వర్గవనాలు ప్రతిఫలంగా లభించేది ఇటువంటి వారికే, వాటిలో వారు ఎల్లకాలం ఉంటారు. ఈ సత్కార్యాలు చేసేవారికి లభించే పుణ్యఫలం ఎంత చక్కనిది!'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధిస్తుండగా తాను ఇలా విన్నానని హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) తెలిపారు;

**అల్లాహ్ అంటాడు:** ''ఓ ఆదం పుత్రుడా! నీవు నన్ను ప్రార్థిస్తూ ఉన్నంతకాలం, నా మీద ఆశతో ఉన్నంతకాలం నీవు ఎట్టి పరిస్థితుల్లో ఉన్నా నాకు ఫర్వాలేదు. నేను నిన్ను క్షమిస్తూ ఉంటాను.

---

[1] (సూరతు అల ఇమ్రాన్:135–136,– అబూదావూద్: 1521, తిర్మిజీ: 3006).

**ఓ ఆదం పుత్రుడా!** నీ పాపాలు ఆకాశాన్ని అంటుకుంటున్నా ఫర్వాలేదు. నువ్వు క్షమాభిక్షకై నన్ను వేడుకుంటే నేను నిన్ను క్షమిస్తాను.

**ఓ ఆదం పుత్రుడా!** నువ్వు నాతోపాటు మరెవరినీ సాటిగా నిలబెట్టని స్థితిలో భూమి నిండా పాపాలు తీసుకొని నా దగ్గరకి వస్తే నేను కూడా భూమి నిండా క్షమాపణలు తీసుకొని వచ్చి నిన్ను కలుస్తాను.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)గారు అల్లాహ్ ప్రవచించాడని ఇలా తెలియజేశారు: ఒక వ్యక్తి పాపానికి గురికాబడిన తరువాత: **'ఓ అల్లాహ్! నా పాపాన్ని క్షమించు'** అని వేడుకుంటే;

**దానికి బదులుగా అల్లాహ్:** 'నా దాసుడు తప్పు చేసినప్పటికీ తనను క్షమించే ప్రభువు ఒకడు ఉన్నాడనీ, ఆయన తనను ఆ పాపం విషయమై నిలదీయగలడన్న విషయాన్ని మాత్రం మర్చిపోలేదు' అని అంటాడు.

తరువాత ఆ దాసుడు మళ్ళీ తప్పు చేసి: **'ప్రభూ! నా పాపాన్ని క్షమించు'** అని వేడుకుంటాడు.

దానికి బదులుగా అల్లాహ్: 'నా దాసుడు తప్పు చేసినప్పటికీ తనను క్షమించే ప్రభువు ఒకడు ఉన్నాడనీ, ఆయన తనను ఆ పాపం విషయమై నిలదీయగలడన్న విషయాన్ని మాత్రం మర్చిపోలేదు' అని అంటాడు.

తరువాత ఆ దాసుడు మళ్ళీ తప్పు చేసి: **'ప్రభూ! నా పాపాన్ని క్షమించు'** అని వేడుకుంటాడు.

**దానికి బదులుగా అల్లాహ్:** 'నా దాసుడు తప్పు చేసినప్పటికీ తనను క్షమించే ప్రభువు ఒకడు ఉన్నాడనీ, ఆయన తనను ఆ పాపం విషయమై

---

[1] (తిర్మిజీ: 3540).

నిలదీయగలడన్న విషయాన్ని మాత్రం మర్చిపోలేదు, కనుక **'నేను నా దాసుడ్ని క్షమించేశాను. ఇతను ఇక తన ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు'** అని అంటాడు. [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కొందరు అల్లాహ్ దూతలు అల్లాహ్ నామస్మరణ చేసే(దాసులను)వారిని అన్వేషిస్తూ ఉంటారు.

**అల్లాహ్:** వారితో తనకు వారికంటే ఎక్కువగా తెలిసినప్పటికీ ఇలా అడుగుతాడు: 'నా దాసులు ఏమంటున్నారు?'

**అల్లాహ్ దూతలు:** 'వారు నరకం నుండి నీ శరణు కోరుతున్నారు.'

**అల్లాహ్:** 'మరి వారు నరకాన్ని ఎప్పుడైనా చూసారా?'

**అల్లాహ్ దూతలు:** 'లేదు. ప్రభూ! వారు సత్యంగా నరకాన్ని చూడనేలేదు.'

**అల్లాహ్:** 'ఒక వేళ వారు నరకాన్ని చూసిఉంటే వారి పరిస్థితి ఎలా ఉంటుంది?'

**అల్లాహ్ దూతలు:** 'వారు ఒకవేళ నరకాన్ని చూసిఉంటే! దాని బారినుండి మరింత దూరం పరుగెత్తుతారు. దానికి మరింత ఎక్కువగా భయపడతారు.'

**అల్లాహ్:** 'సరే, మీరంతా సాక్ష్యం ఉండండీ! నేను వారిని క్షమిస్తున్నాను' అని అంటాడు. [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

---

[1] (ముస్లిం:4953). తనకు ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చంటే అర్థం: ''అతను తప్పులు చేస్తూ తిరిగి పశ్చాత్తాపపడుతూ ఉన్నంతకాలం నేను అతన్ని క్షమిస్తూనే ఉంటాను. ఎందుకంటే? పశ్చాత్తాపం పూర్వపు పాపాలన్నిటినీ తుడిచి పెట్టేస్తుంది''.

[2] (బుఖారీ: 5929, ముస్లిం4854).

''ఎవరి చేతిలోనయితే నా ప్రాణముందో ఆయన సాక్షిగా! చెబుతున్నాను. ఒక వేళ మీరు పాపాలు చేయకపోతే అల్లాహ్ మిమ్మల్ని తొలగించి (మీ స్థానంలో) ఇతరుల్ని తీసుకొస్తాడు. వారు పాపాలు చేసి తమకు క్షమాభిక్షపెట్టమని అల్లాహ్‌ను వేడుకుంటారు. ఆ తరువాత అల్లాహ్ వారిని క్షమిస్తాడు.''[1]

## పశ్చాత్తాపం చెందేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

చిన్న పాపాలకు లేక పెద్ద పాపాలకు గురికాబడిన ప్రతి మనిషి అల్లాహ్ యందు తప్పకుండా నిష్కల్మషమైన పశ్చాత్తాపం చెందాలి. ప్రతి దైవభీతి కలిగిన వ్యక్తి పశ్చాత్తాపం కారణంగా అల్లాహ్ ప్రేమను, అభీష్టాన్ని పొందుతారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ పశ్చాత్తాపపడేవారిని, పారిశుద్ధ్యాన్ని అవలంభించేవారిని ఇష్టపడతాడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ఓ విశ్వాసులారా! అల్లాహ్ వైపు పశ్చాత్తాపంతో మరలండి – నిష్కల్మషమైన పశ్చాత్తాపభావంతో! మీ ప్రభువు మీ పాపాలను మీ నుండి దూరం చేయవచ్చు. క్రింద సెలయేళ్లు ప్రవహించే (స్వర్గ) వనాలలో మీకు ప్రవేశం కల్పించవచ్చు. ఆ రోజు అల్లాహ్ ప్రవక్తనూ, అతని వెంటనున్న విశ్వాసులను అవమాన పరచడు. వారి కాంతి వారి ముందు, వారి కుడి వైపూ పరుగెడుతూ

---

[1] (ముస్లిం: 4854). అంటే అల్లాహ్ పాపాలు చేయటాన్ని ప్రేమిస్తాడని దీని భావం ఎంతమాత్రం కాదు. తప్పు చేసిన తరువాత మానవుడు పశ్చాత్తాపభావంతో తన ప్రభువు వైపునకు మరులుతాడే.. ఆ మలుపునే ఆయన ఎంతగానో యిష్టపడతాడు అన్న విషయాన్ని మనం గ్రహించాలి.

[2] (సూరతుల్ బఖరా: 222).

ఉంటుంది. అప్పుడు వారిలా వేడుకుంటూ ఉంటారు. **''మా ప్రభూ! మా కాంతిని మా కొరకు పరిపూర్ణం గావించు. మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా నీవు అన్నింటిపై అధికారం కలవాడవు.''** [1]

**నిష్కల్మషమైన లేక నిజమైన పశ్చాత్తాపం అంటే ఇది:**

1) మనిషి తాను చేసిన ఏ పాపం పట్ల పశ్చాత్తాపం చెందుతాడో దాన్ని త్యజించాలి.

2) ఆ తప్పుపై అల్లాహ్ సమక్షంలో సిగ్గుతో కుమిలిపోవాలి.

3) ఇకమీదట ఎన్నడూ దానిని తిరిగి చేయనని సంకల్పించుకోవాలి.

తాను చేసిన తప్పు మానవహక్కులకు సంబంధించినదైతే – **ఉదాహరణకు:** ఎవరి హక్కునయినా తాను కబళించి ఉంటే, దాన్ని తిరిగి ఇచ్చి వేయాలి. తాను దౌర్జన్యం చేసిన వారికి క్షమాపణ చెప్పాలి. కేవలం ముఖం మీద లెంపలేసుకున్నంత మాత్రాన ఒరిగేదేమి ఉండదు. [2]

ఇతరుల దగ్గర నుండి డబ్బు రుణంగా తీసుకొని ఉంటే దానిని తిరిగి ఇవ్వాలి. ఒక వేళ ఆ రుణాన్ని తిరిగి ఇవ్వలేని పక్షంలో అతనితో రుణ భారాన్ని క్షమించవలసిందిగా రుణ సహాయం చేసినవారితో కోరాలి. ఒకవేళ రుణగ్రస్తుడు మరణించి నట్లయితే వారి బంధువులకు ఆ రుణాన్ని చెల్లించాలి. వారు కూడా లేకపోతే ఆ డబ్బును బీదవారికి దానంగా ఇవ్వాలి. అలా చేయలేని పక్షంలో పుణ్యాకార్యాల కొరకు అధికంగా శ్రమించండి. ఎందుకంటే పశ్చాత్తాపం అనేది తప్పనిసరి ఆచారం. దాని నుండి ఎవ్వరికీ మినహాయింపు లేదు.

---

[1] (సూరతు తహ్‌రీమ్:8).

[2] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 2491).

నిష్కల్మషమైన పశ్చాత్తాపం గురించి ఖుర్‌ఆన్ మరియు హదీసులలో అనేక చోట్ల దాని విశిష్టత గురించి తెలియజేయటం జరిగింది. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు క్షమాపణ కోసం మీ ప్రభువును వేడుకోండి. మరి ఆయన వైపుకే (పశ్చాత్తాపంతో) మరలండి. నిశ్చయంగా నా ప్రభువు అమిత దయామయుడు, అపార ప్రేమమయుడు.''[1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సేవకులు, హజ్రత్ అబూ హమ్జా అనస్ బిన్ మాలిక్ అన్సారీ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు: ''తన దాసుడు పాపాలపై పశ్చాత్తాప పడినందుకు ఎడారి ప్రదేశంలో ఒంటెను పోగొట్టుకొని తిరిగి పొందిన వ్యక్తి సంతోషించడం కన్నా ఎక్కువగా అల్లాహ్ సంతోషిస్తాడు.[2]

హజ్రత్ అబూ మూసా అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ అష్‌అరీ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''పగటిపూట పాపం చేసినవాడు రాత్రికి పశ్చాత్తాపం చెందాలని అల్లాహ్ రాత్రివేళ తన చేయిని చాపుతాడు.

అలాగే రాత్రి వేళ పాపం చేసినవాడు పగలు పశ్చాత్తాపం చెందుతాడని అల్లాహ్ పగటిపూట తన చేయిని చాచి ఉంచుతాడు. (ఈ పరంపర) సూర్యుడు పడమటి దిక్కు నుండి ఉదయించే (ప్రళయం) వరకూ కొనసాగుతూనే ఉంటుంది.[3]

---

[1] (సూరతు హూద్:90).

[2] (బుఖారీ:5834, ముస్లిం:4927).

[3] (ముస్లిం:4954).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సూర్యుడు పడమటి దిక్కు నుంచి ఉదయించక మునుపే తన పాపాలపై పశ్చాత్తాపం చెందేవాని పశ్చాత్తాపాన్ని అల్లాహ్ సమ్మతించి ఆమోదిస్తాడు.'' [1]

హజ్రత్ సఫ్వాన్ బిన్ అస్సాల్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''నిశ్చయంగా పడిమటి దిక్కున ఒక ద్వారం ఉన్నది. దాని వెడల్పులో ఒక రౌతు నలభై లేక డెబ్భై సంవత్సరాలు ప్రయాణించగల దూరం ఉంటుంది. పశ్చాత్తాపం చెందేవారి కోసం అల్లాహ్ భూమ్యాకాశాలను పుట్టించిన రోజు నుండే దానిని తెరిచి ఉంచాడు. సూర్యుడు పడమటి దిశ నుండి ఉదయించే వరకూ ఆ ద్వారాన్ని మూయడు.'' [2]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఆదాం (మనిషి) సంతతికి చెందిన ప్రతి వ్యక్తి పాపాలకు గురికాబడతారు. వారిలో అందరికంటే గొప్ప పాపి పశ్చాత్తాపం చెందేవారు.'' [3]

## మన్నింపు మరియు పశ్చాత్తాపం వలన ప్రజలు అనుగ్రహింపబడతారు:

అల్లాహ్ యందు మన్నింపు కోరడం వల్ల పరియు పశ్చాత్తాపం చెందటం వల్ల ఆయన ప్రసన్నుడవటమే కాకుండా మరెన్నో అనుగ్రహాలు

---

[1] (ముస్లిం:4872).

[2] (అహ్మద్:17401, తిర్మిజీ, అత్తర్గీబ్ వత్తర్హీబ్, హదీస్ హసన్: 3137).

[3] (తిర్మిజీ:2499, ఇబ్ను మాజా:4251).

కూడా ఇహపరాలలో ప్రసాదిస్తాడు. మన పాపాలను క్షమిస్తాడు, స్వర్గాన్ని ప్రసాదిస్తాడు, శక్తి మరియు మనస్థయిర్యాన్ని పెంచుతాడు. మన జీవితాలలో వృద్ధిని ప్రసాదిస్తాడు. కష్టాలను దూరం చేస్తాడు, ఆపదల నుండి కాపాడుతాడు, ధారాపాతంగా వర్షాన్ని కురిపిస్తాడు, ఉపాధిని అనుగ్రహిస్తాడు మరియు సంతానాన్ని ప్రసాదిస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నేనిలా అన్నాను – క్షమాపణకై మీ ప్రభువును వేడుకోండి. నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు. – ఆయన ఆకాశం నుంచి మీపై ధారాపాతంగా వర్షం కురిపిస్తాడు. – మీ సిరిసంపదల్లోనూ, పుత్ర సంతతిలోనూ పురోభివృద్ధిని వొసగుతాడు. మీ కొరకు తోటల్ని ఉత్పన్నం చేస్తాడు. ఇంకా మీ కోసం కాలువలను ప్రవహింప జేస్తాడు.'' [1]

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోధించారు: ''ఎవరైతే క్షమాభిక్ష వేడుకోవటాన్ని నిత్యకృత్యంగా చేసుకుంటాడో అల్లాహ్ అతన్ని అన్ని రకాల ఇరకాటాల నుంచి బయటపడే మార్గాలను సృష్టిస్తాడు. అన్ని రకాల దుఃఖాల నుంచి విముక్తిని ప్రసాదిస్తాడు. అతను ఊహించని చోటు నుంచి అతనికి ఉపాధిని ప్రసాదిస్తాడు.'' [2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఇంకా మీరు మీ తప్పుల మన్నింపు కోసం మీ ప్రభువును వేడుకోండి. తర్వాత పశ్చాత్తాపంతో ఆయన వైపుకే మరలండి. ఒక నిర్ధారిత కాలం వరకూ ఆయన మీకు మంచి (జీవన)

---

[1] (సూరతు నూహ్:10-12).

[2] (ఇబ్ను మాజా:3819, అబూదావూద్:1518).

సామగ్రిని సమకూరుస్తాడు. ఎక్కువగా ఆచరణ చేసే ప్రతి ఒక్కరికీ ఎక్కువ పుణ్యఫలం ప్రసాదిస్తాడు...''[1]

మరొకచోట ఇలా తెలియజేశాడు: ''ఓ నా జాతివారలారా! మీ పోషకుని (అల్లాహ్) సమక్షంలో మీ తప్పుల మన్నింపుకై ప్రార్థించండి. ఆయన సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి. ఆయన మీపై (ఆకాశం నుండి) ధారాపాతంగా వర్షం కురిపిస్తాడు. మీకున్న బలిమికి మరింత శక్తినీ, బలాన్నీ చేకూరుస్తాడు. మీరు మాత్రం అపరాధులుగా తిరిగి పోకండి.''[2]

హజ్రత్ హసన్ బస్రీ (రహ) గురించి ఈ విధంగా అనబడింది: ఎవరో ఒక వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి కరువు కాటకాల గురించి బాధతో చెప్పుకోగా 'ప్రభువును క్షమాపణ కోరుకోండి' అని ఆయన ఉపదేశించారు.
మరొక వ్యక్తి వచ్చి దారిద్ర్యం గురించి ఫిర్యాదు చేసుకున్నాడు. అతనికి కూడా ''క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకోండి'' అని ఆయన బోధపరిచారు.
ఒక వ్యక్తి వచ్చి తన తోట ఎండిపోయిందని వాపోయాడు. ఆయన అతనికి కూడా ఆ సలహా ఇచ్చారు.
ఇంకొక వ్యక్తి కూడా వచ్చి తనకు సంతానప్రాప్తి లేదని చెప్పుకోగా, అతనికి కూడా ఆదే చికిత్స ప్రతిపాదించారు.
తమరు ప్రతి ఒక్కరికీ ఒకే మందు (క్షమాభిక్ష మందు) ఇస్తున్నారేమిటీ అని ఎవరో ప్రశ్నిస్తే, అప్పుడాయన ఇలా అన్నారు: 'ఈ సమస్యలన్నింటికీ అల్లాహ్ చూపిన పరిష్కారం ఇదే.'[3]

---

[1] (సూరతు హూద్:3).

[2] (సూరతు హూద్: 52).

[3] (ఐసరుత్తఫాసీర్, అహ్‌సనుల్ బయాన్ తెలుగు;పేజీ: 2547).

## మన్నింపు మరియు పశ్చాత్తాపం అంగీకరింపబడిన కొందరి మహాత్ముల గాధలు:

చిత్త శుద్ధితో పశ్చాత్తాప పడాలేగాని అల్లాహ్ ప్రతి ఒక్కరి పశ్చాత్తాపాన్నీ ఆమోదిస్తాడు. మరియు పరమ దుర్మార్గుల పెద్ద పెద్ద తప్పులను సహితం తుడిచివేస్తాడు. మరియు తన కారుణ్య ఛాయలో చోటును ప్రసాదిస్తాడు.

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: 'మీకు పూర్వం ఒక వ్యక్తి ఉండేవాడు. అతను తొంభై తొమ్మిది మందిని హత్యలు చేశాడు.'

తరువాత (తన పాపాల పరిహారం) కొరకై ఈ భూమండలంపై అందరికంటే గొప్ప జ్ఞాని ఎవరని అన్వేషించాడు. చివరికి ఒక 'ఆబిద్' (దేవుని సేవలో నిమగ్నమైన వ్యక్తి) గురించి తెలుపడం జరిగింది.

**తరువాత ఆ 'ఆబిద్' వద్దకు వెళ్ళి:** 'నేను తొంభైతొమ్మిది మందికి హత్యలు చేశాను. నా పాపాలకు ప్రాయశ్చిత్తం ఉందా?' అని అడిగాడు.

**దానికి అతను:** 'లేదు' అని సమాధానమిచ్చాడు. అంతటితో ఆ 'ఆబిద్'ని కూడా హత్య చేసి వంద పూర్తి చేశాడు.

**ఆ తరువాత** (తన పాపాల పరిహారం) కొరకై ఈ భూమండలంపై అందరికంటే గొప్ప జ్ఞాని ఎవరైనా లేక పోతారా! అని మరలా అన్వేషించాడు.

**అప్పుడు ఒక 'ఆలిమ్'** (ధర్మ జ్ఞానం కలిగిన పండితులు) గురించి తెలుపడం జరిగింది.

**తరువాత ఆ 'ఆలిమ్' వద్దకు వెళ్ళి:** 'నేను వంద మందిని హత్య చేశాను. నా పాపాలకు ప్రాయశ్చితం ఉందా?' అని అడిగాడు.

**దానికి అతను:** 'ఉందీ' అని చెప్పి, ఇతనికీ – ఇతని పశ్చాత్తాపానికి అడ్డురాగలవాడెవడు? అంటూ 'నువ్వు ఫలానా చోటికి వెళ్ళు. అక్కడ కొంత మంది అల్లాహ్ ఆరాధనలో నిమగ్నులై ఉన్నారు. నీవు కూడా వారితో కలిసి అల్లాహ్‌ను ఆరాధించు. తరువాత ఇంకెప్పుడూ నీ ఊరికి తిరిగి రాకు. అది పాపిష్టి నేల' అని చెప్పి సాగనంపాడు.

**ఆ వ్యక్తి** అక్కడనుండి (ఆ ఊరుకై) బయలుదేరాడు. ఆ ఊరుకు సగం దూరం వెళ్ళేసరికి అతనికి చావు వచ్చింది.

**ఆ ఆత్మను తీసుకెళ్ళే** కారుణ్య దూతలు మరియు శిక్షించే దూతలు వచ్చారు. వారిద్దరి మధ్య సంభాషణ జరిగింది:

**కారుణ్యదూతలు:** 'ఇతను చిత్తశుద్ధితో హృదయపూర్వకంగా పశ్చాత్తాపం చెంది అల్లాహ్ వైపుకు మరలాడు' అని అన్నారు.

**శిక్షించేదూతలు:** 'ఇతను జీవితంలో ఒక్క మంచిపనైనా చేయలేదు' అని అన్నారు.

**చివరికి ఒక దైవదూత** మనిషి రూపంలో అక్కడికి చేరుకున్నాడు. ఇరుపక్షాల దూతలు ఆ వ్యక్తి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించారు.

**అప్పుడతను:** 'ఈ రెండు ఊళ్ల మధ్యనున్న దూరాన్ని కొలవండి (అతని శవం) ఏ ఊరు దగ్గరగా ఉందో తదనుగుణంగానే అతనితో వ్యవహరించండి' అని తీర్పు చేశాడు. ఆ తరువాత కొలిచి చూస్తే ఆ వ్యక్తి (ఆరాధనకై) పోదలచుకున్న ఊరు (ఒక జేనుడు) దగ్గర పడింది.

**దాంతో కారుణ్యదూతలు:** 'అతణ్ణి తమ ఆధీనంలోకి తీసుకున్నారు.'[1]

ఒక సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి ఒక స్త్రీ వ్యభిచరించిన కారణంగా గర్భవతయ్యి వచ్చింది,తరువాత:

'ఓ ప్రవక్తా! (సల్లల్లాహు అలైహి వసల్లం) నేను శిక్షార్హమైన తప్పు చేశాను. కనుక నాకు ఆ శిక్ష విధించండి' అని విన్నపం చేసింది.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమె వలీ (అతి దగ్గర బంధువు)ని పిలిపించి:

**'ఈమె పట్ల మంచిగా మెలుగు. ప్రసవా నంతరం ఈమెను నా వద్దకు తీసుకురా'** అని ఆదేశించారు.

అలాగే ఆమెను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు తీసుకొని వచ్చారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఆమెను ఆమె బట్టలతోనే గట్టిగా చుట్టి బంధించమ'ని ఆజ్ఞాపించారు.

ఆ తరువాత వారి ఆజ్ఞ ప్రకారం ఆమెపై రాళ్లు రువ్వడం (హతమార్చడం) జరిగింది. తరువాత జనాజా నమాజు చేయించారు.

దీనిపై హజ్రత్ ఉమర్(రజియల్లాహు అన్హు): 'దైవప్రవక్తా! మీరు ఈ జారిణికి జనాజా నమాజు చేయిస్తారా?' అని అభ్యంతరం వ్యక్తం చేశారు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ఈమె పడిన పశ్చాత్తాపం ఎంత గొప్పదంటే! **'ఈమె పశ్చాత్తాపాన్ని మదీనాలోని డెబ్బై మందికి పంచినా అది వారి (పాపాల మన్నింపు)కి సరిపోతుంది. దైవ**

---

[1] (బుఖారీ:3211, ముస్లిం:4967).

**ప్రసన్నత కోసం ఈమె తన ప్రాణాన్ని సైతం (లెక్క చెయ్యకుండా) త్యాగం చేసిందంటే ఇంతకన్నా ఘనకార్యం ఇంకేముంటుంది?'** అని అన్నారు. [1]

ఒక రోజు మాయిజ్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) గారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి: ''ఓ దైవప్రవక్తా! నన్ను పరిశుద్ధపరచండి'' అని అన్నారు.

దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు: అయ్యో నీకేమైనది! 'నీవెళ్ళి అల్లాహ్‌తో క్షమాపణలు కోరుకో మరియు పశ్చాత్తాపం చెందు' అని అన్నారు.

కొంత కాలానికి తిరిగి వెళ్ళిపోయారు. తరువాత మరలా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి: **'ఓ దైవప్రవక్తా! నన్ను పరిశుద్ధపరచండి'** అని అన్నారు.

దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు: అయ్యో నీకేమైనది! 'నీవెళ్ళి అల్లాహ్‌తో క్షమాపణలు కోరుకో మరియు పశ్చాత్తాపం చెందు' అని అన్నారు.

కొంత కాలానికి తిరిగి వెళ్ళిపోయారు. తరువాత మరలా ఆయన వద్దకు వచ్చి: **'ఓ దైవప్రవక్తా! నన్ను పరిశుద్ధపరచండి'** అని అన్నారు.

దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు మళ్ళి అలాగే జవాబు ఇచ్చారు.

తరువాత అతను నాల్గవసారి వచ్చినప్పుడు, అతనితో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ఏ విషయంలో నీకు పరిశుద్ధునిగా చేయాలి'** అని అడిగారు.

---

[1] (ముస్లిం:3209).

దానికి అతను: **'వ్యభిచరించిన పాపం నుండి'** అని అన్నారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ఇతనికేమైన పిచ్చిపట్టిందా?'** అని విచారించారు.

దానికి జవాబుగా: **'అతనికి పిచ్చి లేదు'** అని చెప్పడం జరిగింది.

తరువాత ఆయన: **'ఇతనేమైన మద్యం సేవించాడా?'** అని విచారించారు.

అప్పుడు ఒక వ్యక్తి అతని వద్దకు పోయి మద్యం దుర్వాసన వస్తున్నదా లేదా అని విచారిస్తే, ఆ దుర్వాసన కూడా అతని వద్ద రావడం లేదు.

చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో: **'నీవు వ్యభిచరించావా?'** అని అడిగారు.

అతను: **'అవును'** అని అన్నారు.

తరువాత అతనిపై రాళ్ళు రువ్వడం జరిగింది. (హత మార్చడం జరిగింది.)

తరువాత ప్రజలు అతని గురించి రకరకాలుగా మాట్లాడుకుంటూ రెండు వర్గాలుగా మారిపోయారు.

వారిలో ఒక వర్గం: **'అతను నాశనమయ్యాడు అతని పాపమే అతనికి చుట్టుకున్నది.'**

మరొక వర్గం వారు: **'మాయిజ్ పశ్చాత్తాపం కంటే గొప్ప పశ్చాత్తాపం ఏది లేదు'** ఎందుకంటే? 'ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి తన చేతిని ఆయన చేతిలో ఉంచి నన్ను రాళ్ళతో చంపమనీ కోరుకున్నాడు.' అని మాట్లాడుకుంటూ రెండు రోజులు లేక మూడు రోజులు గడిచిపోయాయి.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి వద్దకు వారు సమావేశమై ఉండగా వచ్చి వారికి సలామ్ చేసి, వారి సమావేశంలో కూర్చున్నారు.

తరువాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వారితో: **'మాయిజ్ బిన్ మాలిక్ కొరకై మన్నింపు దుఆ చేయవలసిందిగా'** ఆజ్ఞాపించారు.

అప్పుడు వారంతా: 'మాయిజ్ బిన్ మాలిక్ గారికి అల్లాహ్ మన్నించుగాక' అని దుఆ చేశారు.

ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) : **'నిశ్చయంగా అతను చెందిన పశ్చాత్తాపం ఎంత గొప్పదంటే? ఆ పశ్చాత్తాపం ఒక సమూహం వారికి పంచినా అది వారి (పాపాల మన్నింపు)కి సరిపోతుంది'** అని అన్నారు.[1]

బషీర్ బిన్ ముహాజిర్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక సారి నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద కూర్చుని ఉండగా, ఆయన సన్నిధికి 'గామిదీ' వంశానికి చెందిన ఒక స్త్రీ వచ్చింది.

**తరువాత ఆమె:** యా నబియ్యల్లాహ్! **'నేను వ్యభిచార పాపానికి గురికాబడితిని, మీరు నన్ను పరిశుద్ధపర్చండి'** అని అన్నది.

**దానికి ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఆమెను తిరిగి పంపించేశారు.'

మరసటి రోజు మరలా ఆయన(స) వద్దకు వచ్చి, తాను వ్యభిచరించినట్లు (స్వయంగా) ఒప్పుకున్నది. మరియు ఆమె: 'యా నబియ్యల్లాహ్! మీరు

---

[1] (ముస్లిం:3208).

నన్ను పరిశుద్ధపర్చండి. మీరు మాయిజ్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) గారికి త్రిప్పుకున్నట్లు నన్ను కూడా త్రిప్పుకుంటారేమో!
'అల్లాహ్ సాక్షిగా! ఇప్పుడు నేను (వ్యభిచరించిన కారణంగా) కడుపుతో ఉన్నాను' అని అన్నది.

**తరువాత ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను: **'ప్రసవానంతరం తరువాత రమ్మనీ'** ఆదేశించారు.

ప్రసవించిన తరువాత ఆమె చంటి బిడ్డతో సహా తిరిగి వచ్చి: **'ఓ ప్రవక్తా! ఇదిగో నాకు పుట్టిన బిడ్డ'** అని అన్నది.

**ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెతో: 'ఈ చంటిబిడ్డను నీ పాలు వదిలే(సమయం) వరకు పాలు పట్టుమనీ' తిరిగి పంపించేశారు.

**తరువాత ఆమె తిరిగి:** 'ఆ బాబు తన పాలు త్రాగడం వదిలిన తరువాత తన చేతితో రొట్టెముక్కను (తింటుండగా)' ప్రవక్త గారి సమక్షంలో హాజరయింది.

**తరువాత:** 'యా నబియ్యల్లాహ్! ఇదిగో నా అబ్బాయి పాలు (త్రాగడం) వదిలేశాడు' అని చెప్పింది.

**అప్పుడు ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం): ఆ అబ్బాయిని ఒక ముస్లిం వ్యక్తికి అప్పగించవలసింగా ఆదేశించారు.

చివరికి ఆమె కొరకు ఒక గుంత త్రవ్వి ఆమె రొమ్ము వరకు పాతి పెట్టి, ఆమెపై రాళ్ళు రువ్వవలసిందిగా ఆజ్ఞాపించారు.

ఆ తరువాత హ|జత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజియల్లాహు అన్హు) ఆమె తలపై ఒక రాయి రువ్వగా, రక్తం ఝుౖరుమని ఎగిరి హ|జత్ ఖాలిద్ ముహంపై పడింది. దాని కారణంగా ఆయన (ఖాలిద్) ఆమెను దూషించారు.

ఆ విషయాన్ని గమనించిన ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం):

**ఓ ఖాలిద్! అలా దూషించకూ!** ఎవరి చేతిలో నా ప్రాణముందో అతని సాక్షిగా! **'ఈమె పడిన పశ్చాత్తాపం గనక టాక్సరూపంలో (అన్యాయంగా) డబ్బు కాజేసే ఒక వ్యక్తి (ఘోరాతి ఘోరమైన పాపిష్టి) కూడా పశ్చాత్తాపం చెందితే, అల్లాహ్ అతడ్ని కూడా మన్నించివేస్తాడు.'** తరువాత ఆమె కొరకు జనాజా నమాజు చేశారు. మరియు ఆమెను ఖననం చేశారు.' [1]

[1] (ముస్లిం:3207).

# అధ్యాయం-3

## 83-108

## 3-ఇస్లామీయ విధులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

- అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే విధులు.
- అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం వేళకు నమాజు చేయడం
- తల్లిదండ్రుల సేవలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అల్లాహ్ మార్గంలో (షహీద్) అమరులైన వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు .
- ఉపవాసాలు పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- జకాత్ విధిగా చెల్లించేవారిపై అల్లాహ్ కారుణ్యం ఉంటుంది.
- హజ్జ్ చేసినవారి సర్వ పాపాలు క్షమించబడతాయి.

# 3–ఇస్లామీయ విధులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

## అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే విధులు:

ఇస్లాం ధర్మాన్ని సక్రమంగా విశ్వసించిన తరువాత ఇస్లామీయ విధులను ఆచరించటం అల్లాహ్ ప్రేమ పొందుటకు మూల కారణం. అంటే నమాజ్, జకాత్, ఉపవాసం, హజ్జ్ వంటి విధులు పాటించడం.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ– వారంతా ఒండొకరికి (సహాయకులుగా, చేదోడువాదోడుగా) మిత్రులుగా ఉంటారు. వారు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు. చెడుల నుండి వారిస్తారు. నమాజులను నెలకొల్పుతారు. జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. అల్లాహ్ అతి త్వరలో తన కారుణ్యాన్ని కురిపించేది వీరిపైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేచనశాలి. – విశ్వసించిన ఇలాంటి స్త్రీ పురుషులకు, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గ వనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలో పరిశుభ్రమైన మేడలు వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికీ మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. గొప్ప సాఫల్యం అంటే ఇదే.''[1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు, అల్లాహ్ అన్నాడు:.... ''నేను నా దాసుడిపై విధిగా (ఫర్జ్)

[1] (సూరతు తౌబా: 71–72)

చేసిన విషయాలను ఆచరించి అతను నాకు దగ్గరయితే అంతకన్నా నాకు ప్రీతి కరమైన విషయం మరొకటి లేదు....'' [1]

హజ్రత్ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజియల్లాహు అన్హు) కథనం: ఒక రోజు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికి నజ్ద్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి వచ్చాడు. అతని తల వెంట్రుకలు చిందరవొందరగా ఉన్నాయి. ముందుగా మాకు అతని మాటలు అర్థం కాలేదు. అతని మాటల తాలుకు శబ్దం మాత్రం మాకు వినపడసాగింది. దగ్గరకు వచ్చిన తర్వాత అర్థమయింది.

అతను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇస్లాం ధర్మం గురించి అడుగుతున్నాడని. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని ప్రశ్నకు సమాధానమిస్తూ:

'(ఇస్లాం ప్రకారం) రేయిం బవళ్లలో ఐదు నమాజులు చేయాలి' అని అన్నారు.

అతను: 'అవిగాక ఇతర నమాజులేమయినా నేను చేయవలసి ఉంటుందా?' అని అడిగాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): '(విధిగా చేయనవసరం) లేదు. ఒక వేళ నీవు స్వచ్ఛందంగా చేయదలచుకుంటే చేసుకోవచ్చు. పోతే రమజాన్ మాసంలో విధిగా ఉపవాసం పాటించవలసి ఉంటుంది' అని అన్నారు.

అతను: రమజాన్ ఉపవాసాలు గాక ఇతర ఉపవాసాలేవయినా నేను పాటించవలసి ఉంటుందా?' అని అడిగాడు.

---

[1] (బుఖారీ:6021).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'పాటించవలసిన అవసరం లేదు. ఒక వేళ నీవు స్వచ్ఛందంగా పాటించాలంటే అది నీ యిష్టం' అని చెప్పారు.

అదే విధంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'జకాత్' గురించి కూడా వివరించారు.

అప్పుడు కూడా అతను: 'అదనంగా మరేమయినా చెల్లించవలసి ఉంటుందా?' అని అడిగాడు.

ఆయన(స) దానికి సమాధానమిస్తూ: 'అవసరం లేదు.' ఒక వేళ నీవు స్వచ్ఛందంగా ఏదయినా దానం చేస్తే అది వేరే విషయం. అని సెలవిచ్చారు.

ఆ తర్వాత ఆ వ్యక్తి: 'అల్లాహ్ సాక్షిగా! ఇక నేను ఇందులో ఏ విషయాన్నీ చేర్చను. ఇందులో దేన్ని తగ్గించను కూడా' అనుకుంటూ తిరిగి వెళ్ళిపోసాగాడు.

అతని మాటలు విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఇతను గనక నిజంగా తన మాటల్ని ఆచరణలో పెడితే తప్పకుండా సాఫల్యం పొందుతాడు' అని అన్నారు. [1]

కొంత మంది నమాజ్ మరియు హజ్ వంటి విధులను పాటించకుండా ప్రజా సేవలో సమయాన్ని గడిపితే మరియు హజ్జ్ కొరకు ఖర్చు చేసే డబ్బుకు బదులు ఆ డబ్బుతో బీదవారిని ఆదుకుంటే దేవుని ప్రేమ పొందగలం అని నమ్ముతారు. అలా వారి నమ్మకం సరికాదని పైన ఇవ్వబడిన ఆయతుల ద్వారా మరియు హదీసుల ద్వారా స్పష్టమవుతున్నది.

---

[1] (బుఖారీ:44, ముస్లిం:12).

కనుక ఒక హదీసులో ఇలా ఉంది; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: అల్లాహ్ తన దాసులలో ఎవరినయినా ప్రియతమునిగా చేసుకున్నప్పుడు, జిబ్రయీల్ (అలైహిస్సలామ్)ను పిలిచి: **'నిశ్చయంగా నేను ఫలాన దాసుణ్ణి ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా అతన్ని ప్రేమించు'** అని అంటాడు.

మరియు అతని గురించి ఆకాశంలో ప్రకటన గావిస్తాడు. ఆ తరువాత భూ మండలంలో కూడా ఆ వ్యక్తి పట్ల (అందరికి) ప్రియతమునిగా రాణిస్తాడు.

ఆ విషయమే కదా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారి యెడల కరుణామయుడైన అల్లాహ్ ప్రేమానురాగాలను సృజిస్తాడు.'' [1]

మరియు అల్లాహ్ తన దాసులలో ఎవరినయినా ఆగ్రహించినప్పుడు జిబ్రయీల్ (అలైహిస్సలామ్)ను పిలిచి: ''నిశ్చయంగా నేను ఫలాన దాసుణ్ణి ఆగ్రహిస్తున్నాను. నీవు కూడా అతన్ని ఆగ్రహించు'' అని అంటాడు. మరియు ఆయన గురించి ఆకాశంలో ప్రకటన గావిస్తాడు. ఆ తరువాత భూ మండలంలో ఉన్నవారు కూడా ఆ వ్యక్తిని ఆగ్రహించు కున్నట్టుగా చేస్తాడు' [2]

## అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం వేళకు నమాజు చేయడం:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (ముస్లిములారా!) వాస్తవానికి మీ స్నేహితులు అల్లాహ్, ఆయన ప్రవక్త, ఇంకా నమాజును నెలకొల్పే, జకాతును చెల్లించే, రుకూ చేసే విశ్వాసులు మాత్రమే. – అల్లాహ్‌ను

---

[1] (సూరతు మర్యమ్:96).

[2] (తిర్మిజీ: 3161, సహీహ్ అల్‌జామే: 284).

ఆయన ప్రవక్తను, విశ్వాసులను మిత్రులుగా చేసుకున్నవారు, అల్లాహ్ పక్షంవారే విజయం పొందుతారన్న విషయాన్ని తెలుసుకోవాలి.''[1]

హజ్రత్ అబూ అబ్దుర్ రహ్మాన్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం: నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని 'అల్లాహ్ వద్ద అతి ప్రీతికరమైన ఆచరణ ఏది?' అని అడిగాను.

**దానికి ఆయన(స):** 'వేళకు నమాజు చేయడం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**దానికి ఆయన(స):**'తల్లి దండ్రుల పట్ల మంచిగా మెలగటం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**అందుకాయన(స):**'అల్లాహ్ మార్గంలో(జిహాద్)పోరాడటం' అని చెప్పారు.[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచిస్తుండగా తాను విన్నాని హజ్రత్ ఉస్మాన్ బిన్అఫ్ఫాన్ (రజియల్లాహుఅన్హు) తెలియజేశారు: ''ఏ ముస్లిం అయినా ఫర్జ్ నమాజ్ వేళ కాగానే చక్కగా వుజూ చేసి, ఎంతో భక్తితో, ఉత్తమ పద్ధతిలో రూకూ చేస్తే, అది అతని వెనుకటి పాపాలకు పరిహారం అవుతుంది. అయితే అతను ఘోరపాపానికి ఒడిగట్టి ఉండకూడదు. ఈ పరంపర నిత్యం కొన సాగుతునే ఉంటుంది.''[3]

మరియు హజ్రత్ అబూ మూసా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: ''రెండు శీతల (ఫజ్ర్, అస్ర్) నమాజులను చేసేవారు స్వర్గానికి వెళ్తారు.''[4]

---

[1] (సూరతుల్ మాయిదా: 55–56).
[2] (బుఖారీ:496, ముస్లిం:122).
[3] (ముస్లిం:335).
[4] (బుఖారీ:540, ముస్లిం:1005).

మరొక హదీసులో ఇలా ఉంది: ''సూర్యోదయానికి ముందు(ఫజర్) నమాజ్, సూర్యాస్తమయానికి ముందు (ఇషా)నమాజ్ చేసినవాడెవడూ నరకానికి వెళ్ళడూ.'' [1]

హజ్రత్ జుందుబ్ బిన్ సుఫ్యాన్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఉదయం పూట నమాజ్ చేసే వ్యక్తి అల్లాహ్ రక్షణలో ఉంటాడు. కనుక ఓ మనిషీ! తాను ఇచ్చిన రక్షణ గురించి అల్లాహ్ నిన్ను ప్రశ్నించకుండా జాగ్రత్తపడు!'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఉదయం సాయంత్రం మస్జిద్‌కు వెళ్ళేవ్యక్తి కోసం, అల్లాహ్ స్వర్గంలో అతని ఆతిథ్యానికి ఏర్పాట్లు చేస్తాడు. అతను ఉదయం పూట లేక సాయంత్రం పూట ఎప్పుడు వెళ్ళినా అలాగే జరుగుతుంది.'' [3]

హజ్రత్ ఇబ్ను ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సామూహికంగా చేసే నమాజ్ ఒంటరిగా చేసే నమాజ్ కంటే ఇరవై ఏడు రెట్లు శ్రేష్ఠమైనది.'' [4]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదిస్తుండగా తాను విన్నానని హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజియల్లాహు అన్హు) తెలియ

[1] (ముస్లిం:1004).
[2] (ముస్లిం:1050, అహ్మద్:18060, రియాజుస్ సాలిహీన్:1049).
[3] (బుఖారీ:622, ముస్లిం:1073).
[4] (బుఖారీ:609, ముస్లిం:1038).

జేశారు: ''ఎవరయినా 'ఇషానమాజు'ను సామూహికంగా నెరవేరిస్తే వారు అర్ధ రాత్రి వరకు దైవారాధనలో గడిపినట్లే.
మరెవరయితే **'ఫజ్ర్ నమాజు'**ను సామూహికంగా నెరవేరుస్తారో వారు రాత్రంతా నమాజ్ చేసినట్లే.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అజాన్ చెప్పటానికి, తొలి పంక్తిలో చేరటానికి ఎంతటి ఘనత ఉందో ప్రజలకు తెలిస్తే, దానిని పొందటానికి పరస్పరం లాటరీ వేసుకోవటం తప్ప గత్యంతరం లేదని తెలిస్తే, వారు తప్పకుండా లాటరీ వేసుకుంటారు.'' [2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే నలభై రోజుల వరకు మొదటి తక్బీర్‌లో చేరి సామూహికంగా నమాజు పాటిస్తారో! వారికి రెండు విధాల విముక్తి ప్రాప్తమవుతుంది. ఒకటి, వారు నరకాగ్ని నుండి రక్షించబడుతారు, రెండు కాపట్యం నుండి విముక్తి పొందుతారు.''[3]

## తల్లిదండ్రుల సేవలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాల మేరకు గమనిస్తే మనిషి అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత నమాజును విధిగా ఆచరించటం వలన అల్లాహ్ ప్రేమ పొందుటకు

---

[1] (ముస్లిం:1049).
[2] (బుఖారీ:580, ముస్లిం:661).
[3] (తిర్మిజీ: 241, హదీస్ హసన్).

ముఖ్యమైన మార్గం. ఆ తరువాత తల్లిదండ్రుల విధేయతను పాటించటం, ఆ తరువాత అల్లాహ్ పేరు ప్రతిష్టకై జిహాద్ చేయడం అని తెలుస్తుంది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు: మీరు ఆయనను తప్ప మరొకరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి. నీ సమక్షంలో వారిలో ఒకరుగాని, ఇద్దరుగానీ వృద్ధాప్యానికి చేరుకొని ఉంటే వారి ముందు (విసుగ్గా) **''ఊఫ్''** అని కూడా అనకు. వారిని కసురుకుంటూ మాట్లాడకు. పైగా వారితో మర్యాదగా మాట్లాడు. – అణుకువ దయా భావంతో ఉట్టిపడే విధంగా నీ భుజాలను వారి ముందు అణిచిపెట్టు. **''ఓ ప్రభూ! బాల్యంలో వీరు నన్ను (ప్రేమానురాగాలతో) పోషించినట్లుగానే నీవు వీరిపై దయజూపు''** అని వారికోసం ప్రార్థిస్తూ ఉండు.[1]

హజ్రత్ అబూ అబ్దుర్ రహ్మాన్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం: 'నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ''అల్లాహ్ వద్ద అతి ప్రీతికరమైన ఆచరణ ఏది?' అనడగాను.

**దానికి ఆయన(స):** 'వేళకు నమాజు చేయడం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**దానికి ఆయన(స):** 'తల్లి దండ్రుల పట్ల మంచిగా మెలగటం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**అందుకాయన** 'అల్లాహ్ మార్గంలో (జిహాద్) పోరాడటం' అని చెప్పారు...[2]

---

[1] (బనీ ఇస్రాయీల్:23).

[2] (బుఖారీ:496, ముస్లిం:122).

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ మిన్ ఆస్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి:

''నేను (ధర్మం కోసం) హిజ్రత్ ప్రస్థానం (హిజ్రత్) చేస్తాననీ, జిహాద్‌లో పాల్గొంటానని మీతో ప్రమాణం చేస్తున్నాను. దాని వలన అల్లాహ్ తరఫు నుండి పుణ్యం లభించాలని కోరుకుంటున్నాను' అని అన్నాడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో **'నీ తల్లిదండ్రుల్లో ఒకరైనా బ్రతికి ఉన్నారా?'** అనడిగారు.

దానికావ్యక్తి : **'అవును,** ఇద్దరూ బ్రతికి ఉన్నారు' అని సమాధానమిచ్చాడు.

అందుకాయన(స): 'నిజంగానే అల్లాహ్ నీకు పుణ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నావా?' అని అడిగారు.

అతను: **'అవును'** అని అన్నాడు.

**అప్పుడాయన(స): 'అలాగయితే నువ్వు నీ తల్లిదండ్రుల దగ్గరికి తిరిగి వెళ్ళిపో. వారిద్దరికి బాగా సేవ చెయ్యి'** (అందులోనే నీకు ఆ పుణ్యం లభిస్తుంది) అని చెప్పి పంపించారు. [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''తండ్రి సంతుష్టంలోనే అల్లాహ్ సంతుష్టం ఉంది. మరియు తండ్రి అసంతుష్టంలోనే అల్లాహ్ అసంతుష్టం ఉంది.'' [2]

---

[1] (ముస్లిం:4624).

[2] (సహీహ్ తిర్మిజీ: 1899).

అబూ దర్దా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచిస్తుండగా తాను ఇలా విన్నాని తెలియజేశారు: ''నిశ్చయంగా తల్లిదండ్రులు స్వర్గ ద్వారాలన్నిటిలో మధ్య ద్వారం లాంటివారు. నీ కిష్టమయితే ఆ ద్వారాన్ని నాశనం చేసుకో, లేదా కాపాడుకో.'' [1]

హజ్రత్ ముఆవియా బిన్ జాహిమా (రజియల్లాహు అన్హు) కథనం, జాహిమా (రజియల్లాహు అన్హు) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, నేను జిహాద్ లో పాల్గొనాలని అనుకుంటున్నాను, దానికి మీ అభిప్రాయం తెలుపండి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అని అడిగితిని.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'మీ తల్లిగారు ఉన్నారా?' అని అడిగారు.

దానికి నేను: 'అవును' అని అన్నాను.

అయితే నీవు: **'నీ తల్లి దగ్గరే (సేవ చేసుకుంటూ) ఉండూ, నీ తల్లి కాళ్ళ దగ్గరే స్వర్గం ఉంది'** అని అన్నారు.[2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: నేను స్వర్గంలోనికి పోయాను అక్కడ నేను (ఖుర్ఆన్) పఠిస్తుండగా విన్నాను. అతనెవరు? అని నేను అడిగితిని. దానికి (దైవదూతలు) వారు: 'హారిసా బిన్ నౌమాన్'

[1] (సహీహ్ తిర్మిజీ:1900).

[2] (అల్ ముస్తద్‌రక్ అలస్ సహీహైన్ లిల్ హాకిమ్: 2502).

అని అన్నారు. ''మంచిగా ప్రవర్తిస్తే ఇలాగే ఉంటుంది-మంచిగా ప్రవర్తిస్తే ఇలాగే ఉంటుంది'' అని ప్రవక్త (స) అన్నారు. (ఆయన తన తల్లితో అందరికంటే ఉత్తమంగా ప్రవర్తించేవారు.) [1]

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా ఇలా విన్నాను అని తెలియజేశారు:

'మీ (బనీ ఇస్రాయీల్) పూర్వీకుల్లోని ముగ్గురు వ్యక్తులు కలిసి ప్రయాణి స్తుండగా దారిలో (వర్షంకారణంగా) ఒక గుహలో శరణు తీసుకుందామని అందులోకి వెళ్ళారు. అంతలోనే కొండపై నుంచి ఒక (పెద్ద) బండరాయి దొర్లిపడింది. దాని కారణంగా గుహ ముఖద్వారం మూసుకుపోయింది.'

ఆ ముగ్గురు: 'మనం గతంలో చేసుకున్న సత్కార్యాల ఆధారంగా అల్లాహ్‌ను వేడుకోవడం తప్ప బయటపడే మార్గం వేరొకటి లేదు' అని తీర్మానం చేసుకున్నారు.

వారిలో ఒకడు ఇలా వేడుకున్నాడు: 'ఓ అల్లాహ్! నా వద్ద చాలా వృధాప్యా నికి చెందిన తల్లిదండ్రులుండేవారు. నేను నా తల్లిదండ్రుల కంటే ముందు నా భార్య బిడ్డలకు, నా నౌకర్లుకు సాయంత్రం పూట పాలు త్రాపించేవాణ్ణి కాను. ఒక రోజు నేను (పశువులకు) చెట్ల మేత కోసం చాలా దూరం వెళ్ళిపోయాను. నేను ఇంటికి తిరిగి వచ్చేసరికి వారిద్దరూ నిద్రపోయారు. వారికోసం నేను పాలు పితికి తీసుకు వచ్చాను. అప్పటికే వారిద్దరూ మంచి నిద్రలో ఉండడం గమనించి వారిని నిద్ర లేపడం అంత మంచిది కాదనుకున్నాను. అలాగే వారికంటే ముందు నా భార్యబిడ్డలకు లేక నా

---

[1] (సహీహ్ సునన్ నసాయీ:3104, సిల్‌సిలతుస్ సహీహా: 913, హాకిమ్:4917).

నౌకర్లకు పాలు త్రాపించడం కూడా నాకిష్టం లేదు. చివరికి నా పిల్లలు నా కాళ్ళ మీదపడి విలవిల్లాడిన (నేను వారికి త్రాపకుండా) పాల ప్రాత్ర నా చేతిలో పట్టుకొని తెల్లవారేదాక వాళ్ళ దగ్గరే నిలబడి, (ఏ సమయంలోనైనా వారు మేల్కుంటారేమోనని) ఎదురు చూడసాగాను. చివరికి వారు నిద్రమేల్కొన్నారు. వారికోసం ఉంచిన పాలు వారు తాగారు.

**ఓ అల్లాహ్! కేవలం నీ ప్రసన్నత కోసమే నేనీ పని చేసివుంటే మేము చిక్కుకున్న ఈ గుహ ముఖద్వారం నుండి బండ రాయిని తొలగించి మమ్మల్ని రక్షించు.'** అంతలో ఆ బండ రాయి కొద్దిగా జరిగింది. అయినా ఆ సందుగుండా వారు బయటికి రాలేకపోయారు.

**తరువాత రెండోవ్యక్తి అభ్యర్థించుకోసాగాడు:** 'ఓ అల్లాహ్! నా బాబాయి కూతురు ఉండేది. నేనామెను అమితంగా అమితంగా ఇష్టపడేవాణ్ణి. (వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది): మగవారు ఆడవారిని అమితంగా ప్రేమించినంతగా నేను ఆమెను ప్రేమించేవాడిని. ఒకసారి నేను ఆమె పొందుకోసం పరితపించాను. అందుకామె ఒప్పుకోలేదు. ఆఖరికి దుర్భిక్షం ఆమెను గత్యంతరం లేక నా వద్దకు వచ్చేలా చేసింది. అప్పుడు ఆమె నాతో ఏకాంతంలో గడిపే షరతుపై నేనామెకు నూట ఇరవై దీనార్లు ఇచ్చాను. (గత్యంతరం లేక ఆమె అవి తీసుకుంది). నా కోరిక తీర్చేందుకు సిద్ధమయ్యింది. నేనామెను ఆక్రమించుకున్నప్పుడు, (వేరొక ఉల్లేఖనం ప్రకారం) నేను ఆమె రెండు తొడల మధ్య కూర్చున్నప్పుడు ఆమె నాతో: **''అల్లాహ్‌కు భయపడు! అక్రమంగా కన్నెపొరను చీల్చకు'** అని అంది.

ఆ మాటలు విన్న తడవుగా నేను ఆమె దగ్గరనుండి లేచి పోయాను. నిజానికి ఆమె నాకు ప్రజల్లో అత్యంత ప్రియమైనది. నేను ఆమెకిచ్చిన

బంగారు దీనార్లను కూడా వదులుకున్నాను. **'ఓ అల్లాహ్! నేను కేవలంనీ ప్రసన్నత కోసమే ఇలా చేసి ఉన్నట్లయితే మాపై వచ్చిపడిన ఈ విపత్తు నుండి మమ్మల్ని రక్షించు.' రెండొవ్యక్తి వేడుకోలు తరువాత ఆ బండరాయి ఇంకొంచెం తొలగింది.** అయినా గాని వారు బయట పడేందుకు మార్గం సుగమం కాలేదు.

**ఆ తరువత మూడోవ్యక్తి వేడుకోవడం ప్రారంభించాడు:** 'ప్రభూ! నేను కొంత మంది పని మనుషులను జీతానికి ఉంచుకున్నాను. నేను వారందరికీ జీతాలిచ్చేశాను. కాని వారిలో ఒకడు మాత్రం తన జీతం పుచ్చుకోకుండానే వెళ్ళిపోయాడు. నేను అతని జీతాన్ని వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాను. దాంతో చాలా ధనం పోగయ్యింది. కొంత కాలానికి ఆ వ్యక్తి వచ్చి,
**'ఓ అల్లాహ్ దాసుడా!** నాకు నా జీతం ఇవ్వు' అనడిగాడు. దానికి నేను, 'నువ్వు చూస్తున్నటువంటి ఈ ఒంటెలు, ఆవులు, మేకలు, బానిసలు– అన్నీ నీ జీతం ఫలాలే (వాటిని నువ్వ తీసుకో)' అన్నాను. అందుకతను:
**'ఓ అల్లాహ్ దాసుడా!** నాతో పరాచికాలు వద్దు' అంటూ చిన్నబోయాడు. నేను **'ఇది పరాచికం కాదు (నిజం చెబుతున్నాను' అన్నాను. అప్పుడు అతను (నా కోసం) ఏమీ వదల కుండా ఆ సంపదనంతా తరలించుకొని వెళ్ళిపోయాడు: ఓ అల్లాహ్! నేను ఈ పని కేవలం నీ ప్రసన్నతను దృష్టిలో పెట్టుకొనే చేసినట్లయితే మేము చిక్కుకున్నటువంటి ఈ ఆపద నుంచి మమ్మల్ని కాపాడు.'**

దాంతో ఆ బండరాయి పూర్తిగా తొలగిపోయి గుహద్వారం తెరుచుకోవటంతో వారు ముగ్గురూ బయటపడ్డారు. [1]

---

[1] (బుఖారీ:2111, ముస్లిం:4926, హదీసు కిరణాలు: 12).

## అల్లాహ్ మార్గంలో (షహీద్) అమరులైన వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు తమ ప్రభువు వద్ద (అల్లాహ్ దృష్టిలో) బ్రతికే ఉన్నారు, ఆహారం ప్రసాదించబడుతున్నది. అల్లాహ్ తన కృపతో ప్రసాదించిన దానిపట్ల వారు ఎంతో సంతోషంగా ఉన్నారు. తమ వెనుక (ప్రపంచంలో) ఉండిపోయి ఇంకా తమతో చేరని విశ్వాసులకు (పుణ్యాత్ములకు) కూడా ఏ విధమైన భయంకానీ, దుఃఖంకానీ కలిగే అవకాశం లేదని వారు నిశ్చింతగా ఉన్నారు. అల్లాహ్ బహుమానాలకు, ఆయన అనుగ్రహాలకు వారు (సంతోషంతో) వారు పొంగిపోతున్నారు. నిశ్చయంగా విశ్వాసుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధా చెయ్యడు.''[1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; మేము ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో: 'షహీదుల ఆత్మలు ఎక్కడ ఉంటాయని?' ప్రశ్నించగా, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

'వారి ఆత్మలు పచ్చని పక్షుల ఉదరాల్లోకి ప్రవేశపెట్ట బడతాయి. అల్లాహ్ అర్ష్ క్రింద పంజరములు వ్రేలాడుతూ ఉంటాయి, వాటిలో ఆ అత్మలు ఉంటాయి. అవి స్వర్గంలో ఎక్కడ కావాలంటే అక్కడ తిరుగుతూ ఉంటాయి. తరువాత ఆ పంజరములోకి తిరిగి వస్తాయి.'

---

[1] (3,ఆల ఇమ్రాన్: 169–171).

ఒక సారి అల్లాహ్ వారి ముందుకు వచ్చి: 'నా నుండి మీరు ఏమన్నా కోరుకోండి' అని అంటాడు.

అప్పుడు వారందరూ: 'ఏమని కోరుకోవాలి? మనం స్వర్గంలో తోచిన చోటెల్లా (అందలి అనుగ్రహాలను ఆస్వాదిస్తూ) విహరిస్తూ ఉన్నాము' అని అంటారు.

ఇలా మూడుసార్లు వారు ప్రశ్నంచబడతారు. చివరికి వారు అల్లాహ్ కోరికను స్వీకరించేవరకు ప్రశ్నించబడతూనే ఉంటారని గ్రహించి, అల్లాహ్‌ను ఇలా విన్నవించుకుంటారు:

'ఓ మా ప్రభూ! మళ్లీ మా అత్మలను మా దేహాలలోకి పంపిస్తే మేము మళ్లీ నీ మార్గంలో పోరాడి అమరగతి నొందాలన్నది మా కోరిక' అని అంటారు. (వారి జవాబును విన్న తరువాత) అల్లాహ్: 'వారికి ఎలాంటి అవసరం లేదని అడగడం వదిలేస్తాడు. [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రెండు కారణాల వలన కండ్లకు అగ్ని కాల్చదు.

**ఒకటి;** అల్లాహ్‌తో భయపడి కన్నీరు కార్చినందుకు.

**రెండు;** అల్లాహ్ మార్గం (జిహాద్)లో రేయంతా కాపలా కాసినందుకు.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ బాటలో

---

[1] (ముస్లిం:3500). ఎందుకంటే ఒక సారి మరణించిన తరువాత ప్రపంచంలో తిరిగివెళ్ళే అవకాశం ఎవరికీ ఇవ్వబడదు. అంటే ఏడేడు జన్మలు లేక మనిషి తిరిగి భూలోకానికి రావడం అసాధ్యం. అది అల్లాహ్ సృష్టించిన ప్రకృతికి విరుద్ధం.

[2] (తిర్మిజీ1563, ముస్నద్ అబీయాలా: 4346).

(జిహాద్‌లో) అంటుకున్న దుమ్ము మరియు నరకం యొక్క పొగ ఒక విశ్వాసి గల (ముస్లిం) దాసుని కడుపులో సమకూర్చబడవు.'' [1]

షహీద్‌గా మృత్యువు చెందిన వ్యక్తి అల్లాహ్ దగ్గర ఆరు విధాలుగా బహుమానం పొందుతాడు. హ|జత్ మిఖ్‌దామ్ బిన్ మాదీకరీబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: షహీద్‌కు అల్లాహ్ వద్ద ఆరు విశిష్టతలు ఉన్నాయి:

1) మొదటి రక్తపు చుక్క కారిన వెంటనే క్షమించబడుతాడు.
2) స్వర్గంలో అతని నివాసాన్ని అతనికి చూపబడుతుంది. మరియు సమాధి శిక్ష నుండి కాపాడబడుతాడు.
3) అతి పెద్ద (ప్రళయ) భయాందోళనకు గురికాకుండా శాంతి ప్రాప్తమవుతుంది.
4) విశ్వాసం మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు.
5) పెద్ద కళ్ళుగల హూర్ (అప్సరస)తో వివాహం జరుగుతుంది.
6) (ప్రళయం రోజు) 70 మంది చుట్టాలకు (స్వర్గానికై) సిఫారసు (అతని వైపున) అంగీకరించబడుతుంది.[2]

హ|జత్ సహల్ బిన్ హునైఫ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సంకల్ప శుద్ధితో షహీద్‌గా మరణించాలని కోరుకున్న వ్యక్తికి అల్లాహ్ షహీదుల ఉన్నత స్థానాన్ని ప్రసాదిస్తాడు. ఒక వేళ అతనికి తన పడకపైనే మృత్యువు జరిగిఉన్నా సరే.'' [3]

---

[1] (సహీహ్ ఇబ్ను మాజా:2774).
[2] (తిర్మిజి, సహీహ్ ఇబ్నుమాజ: 2257).
[3] (ముస్లిం:3532).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ అనుచరులతో: 'మీలో షహీద్‌గా మృత్యువు చెందినారనే విషయాన్ని ఎలా తెలుసుకోగలరు' అని ప్రశ్నించారు.
అప్పుడు వారు: **'ఎవరైతే అల్లాహ్ మార్గంలో చంపబడ్డారో వారే షహీద్'** అని అనుచరులు అన్నారు.
అలాగైతే నా సమాజంలో షహీదుల సంఖ్య చాలా తక్కువే! అని ప్రవక్త అన్నారు.
అయితే, వారెవరో కాస్త తెలుపండి? అని ప్రజలు అడిగారు.
అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స):

1) అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారు షహీద్.
2) అల్లాహ్ మార్గంలో **(ఫీ సబీలిల్లాహ్)** మృత్యువు పొందినవారు షహీద్.
3) అంటువ్యాధి **(మహమ్మారి)** వలన మృత్యువు పొందినవారు షహీద్.
4) కడుపు బాధ వలన మృత్యువు పొందినవారు షహీద్.
5) నీటిలో మునిగిమృత్యువు పొందినవారు షహీద్. అని తెలియజేశారు.[1]

హజ్రత్ జాబిర్ బిన్ ఉతైక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**అల్లాహ్ మార్గంలో చంపబడిన షహీద్ గాకుండా ఇంకా ఏడు రకాల షహీద్‌లు ఉన్నారు.**

1) మహమ్మారి కారణంగ చనిపోయినవారు షహీద్.
2) నీళ్ళలో మునిగి చనిపోయినవారు షహీద్.

[1] (ముస్లిం:3539).

3) నిమోనియా వ్యాధి వలన చనిపోయినవారు షహీద్.

4) కడుపు బాధ వలన చనిపోయినవారు షహీద్.

5) అగ్నిలో పడి కాలిపోయినవారు షహీద్.

6) దేని క్రిందనైనా పడిపోయి నలిగి చనిపోయిన వారు షహీద్.

7) గర్భస్రావం జరిగి ఆ బాధలోనే చనిపోయిన స్త్రీ షహీద్.[1]

హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''తమ ధనానికి బదులు చంపబడ్డ వ్యక్తి షహీద్, తమ కుటుంబీకుల (రక్షణ)కై చంపబడ్డ వ్యక్తి షహీద్, తమ ధర్మాన్ని (రక్షించుట)కై చనిపోయిన వ్యక్తి షహీద్, తన ప్రాణాన్ని (రక్షించుకొనుట) కై చంపబడ్డ వ్యక్తి షహీద్'' [2]

పైన చెప్పబడిన వివిధ మరణాలు అనుకోకుండా జరిగే సంఘటల కారణంగా మృత్యువు ప్రాప్తమైతే **'షహీద్'** అనే పుణ్యమైన మృత్యువు అవుతుంది. ఒకవేళ కావాలనీ మరియు ఉద్దేశపూర్వకంగా తమ ప్రాణాలకు హాని కలిగించుకొనీ ఆత్మహత్యకు పాల్పడితే శాశ్వతమైన నరక శిక్ష తప్పదు. కనుక ఒక హదీసులో ఇలా ఉంది:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే ఉరి వేసుకొని చనిపోతాడో, అతను నరకంలో ఉరి వేసుకొనే శిక్షను అనుభవిస్తాడు. ఎవరైతే కత్తితో పొడుచుకొని చనిపోతాడో, అతను నరకంలో కత్తితో పొడుచుకొనే శిక్షను అనుభవిస్తాడు.'' [3]

---

[1] (సహీహ్ అబూదావూద్: 3111, సహీహ సునన్ నసాయీ:1846,సహీహ అల్ జామి: 3739).

[2] (సహీహ తిర్మిజీ:1421, సహీహ సునన్ నసాయీ:4095).

[3] (బుఖారీ:1276).

## ఉపవాసాలు పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

ఉపవాసాన్ని అరబీ భాషలో **'సియామ్'** లేక **'సౌమ్'** అని అంటారు. అరబీ నెల 'రమజాన్'లో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలకు, భార్యతో సంభోగానికి దూరంగా ఉండటం అని అర్థం. ఈ వ్రతం కేవలం అల్లాహ్ ప్రసన్నత కొరకే పాటించాలి. ఇది ఆత్మ శుద్ధికి అత్యంత ముఖ్యమైన ఆరాధన గనుక మీకు పూర్వం గతించిన సమాజాలపై కూడా ఈ ఆరాధన విధిగా నిర్ణయించబడింది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది – మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది. [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయినా రమజాన్ మాసంలో విశ్వాసంతో, పుణ్యఫలా పేక్షతో ఉపవాసం పాటిస్తే, గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి'' [2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ప్రతి మనిషి అతను చేసే సత్కార్యానికిగాను, పది నుండి ఏడువందల రెట్ల పుణ్యం ప్రసాదించబడుతుంది. అల్లాహ్ ఇలా తెలియజేశాడు: కాని ఉపవాసం (పుణ్యం) అలా కాదు. ఉపవాసం ప్రత్యేకంగా నా కోసం పాటించబడుతుంది. అందువల్ల నేను స్వయంగా

[1] (సూరతుల్ బఖరా: 183).

[2] (బుఖారీ:37, ముస్లిం:1268).

దానికి ప్రతిఫలం ప్రసాదిస్తాను. ఉపవాసికి రెండు సందర్భాల్లో అమిత ఆనందం లభిస్తుంది. ఒకటి; ఉపవాసాన్ని విరమించేటప్పుడు. రెండవది; తన ప్రభువును కలుసుకున్నప్పుడు. నిశ్చయంగా అతని నోటి నుండి వెలువడే వాసన అల్లాహ్ దృష్టిలో కస్తూరి వాసన కన్నా మేలైనది.'' [1]

హజ్రత్ సహల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''స్వర్గంలో ఒక ద్వారం ఉంది. దాన్ని **'రయ్యాన్'** అని పిలుస్తారు. ప్రళయ దినాన దానిగుండా ఉపవాసులు స్వర్గప్రవేశం చేస్తారు. వారు తప్ప ఇతరులెవరూ దాని గుండా ప్రవేశించలేరు.
ఆ రోజున 'ఉపవాసులేరి?' అని ఆరాతీయటం జరుగుతుంది. ఆ మాట వినగానే ఉపవాసులందరూ (స్వర్గప్రవేశానికి) బయలు దేరుతారు. వారు లోనికి ప్రవేశించగానే, ఇతరులెవరూ లోనికి రాకుండా, ఆ ద్వారం మూయబడుతుంది.'' [2]

హజ్రత్ సహల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఉపవాసుల కొరకు ఒక ద్వారం ఉంది. దాన్ని **'రయ్యాన్'** అని పిలుస్తారు. దానిగుండా ఉపవాసులు తప్ప ఇతరులెవరో స్వర్గంలో ప్రవేశించలేరు. వారిలో చివరి వ్యక్తి ప్రవేశించగానే ఆ ద్వారం మూయబడుతుంది. దానిలో ప్రవేశించిన వాడు (పవిత్రమైన పానీయం) త్రాగుతాడు, మరియు ఆ నీటిని త్రాగినచో ఇక ఎన్నటికీ దాహం కలగదు.'' [3]

---

[1] (ముస్లిం:1945).
[2] (బుఖారీ:1763, ముస్లిం:1947).
[3] (సహీహ్ నసాయి: 2236, సహీహ్ ఇబ్ను ఖుజైమా:1796).

## జకాత్ విధిగా చెల్లించేవారిపై అల్లాహ్ కారుణ్యం ఉంటుంది:

నమాజు మరియు ఉపవాసం, హజ్జ్ వంటి ఆరాధనలు**'హుఖూఖుల్లాహ్'** (అల్లాహ్ హక్కుల) జాబితాలోకి రాగా, జకాత్ **'హుఖూఖుల్ ఇబాద్'** (దాసుల హక్కుల) జాబితాలోకి వస్తుంది. కనుక మనిషి అల్లాహ్ వద్ద ప్రేమింపబడాలంటే అల్లాహ్ కోసం చేయవలసిన ఆరాధనలు పాటిస్తూ, దాసుల హక్కులు నెరవేర్చితే అల్లాహ్ ప్రేమ మరియు కారుణ్యం పొందగలరు. కనుక జకాత్‌ను విధిగా చెల్లించడానికి అర్హులైనవారు జకాత్ చెల్లిస్తే అల్లాహ్ వారిపై తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. మరియు స్వర్గాన్ని కూడా ప్రసాదిస్తాడని ఖుర్ఆన్‌లో అనేక చోట్ల తెలియజేశాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు మీరు నమాజులను నెలకోల్పుతారు, జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. అల్లాహ్ అతి త్వరలోనే తన కారుణ్యాన్ని కురిపించేది వీరిపైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాశీలి.''[1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: మరియు మీరు నమాజ్‌ను నెలకొలప్పండి, జకాత్‌ను ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు మంచి రుణం ఇవ్వండి. మీరు మీ కోసం ఏ మంచిని (పుణ్యకార్యాన్ని) ముందుగా పంపినా, దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు. క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలి, దయాశీలి.'' [2]

---

[1] (సూరతు తౌబా:71).

[2] (సూరతుల్ ముజ్జమ్మిల్:20).

హ్రజత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ఒక పల్లెవాసి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చి,

**'యా రసూలల్లాహ్!** నన్ను స్వర్గానికి గొనిపోగల సత్కర్మ ఏమిటో తెలుపండి' అని అడిగాడు.

**అందుకాయన:** ''ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. ఆయనకు సహ వర్తులుగా మరెవరినీ నిలబెట్టకు. నమాజును స్థాపించు. జకాత్‌ను విధిగా చెల్లించు. రమజాన్ నెల ఉపవాసాలు పాటించు'' అని ఉపదేశించారు.

**(అంతా విన్న తరువాత ఆ పల్లెవాసి):** ''ఎవరిచేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. నేనిందులో (అధనంగా) ఏ విషయాన్ని చేర్చను'' అంటూ తిరిగి వెళ్ళి పోయాడు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): అతని వైపు చూపిస్తూ **'మీలో స్వర్గవాసిని చూడగోరేవారు ఈ వ్యక్తిని చూడవచ్చు'** అని అన్నారు. [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ప్రజల సొమ్ములలో చేరి వృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో ఎంతమాత్రం వృద్ధి చెందదు. అయితే అల్లాహ్ ముఖాన్ని చూచేందుకు (ప్రసన్నతను చూరగొనేందుకు) మీరు జకాతు దానం ఇచ్చినట్లయితే ఎన్నోరెట్లు వృద్ధిపరుచుకున్న వారవుతారు.''[2]

---

[1] (బుఖారీ:1310, ముస్లిం:16).
[2] (సూరతుర్ రూమ్: 39).

మరొక చోట ఇలా తెలియజేశాడు: ''కనుక మీరు నమాజును నెలకొల్పండి, జకాతును చెల్లించండి, అల్లాహ్‌ను స్థిరంగా ఆశ్రయించండి. ఆయనే మీ సంరక్షకుడు! (ఆయన) ఎంత చక్కని సంరక్షకుడు! మరెంత చక్కని సహాయకుడు!'' [1]

హజ్రత్ అబూ అయ్యూబుల్ అన్సారీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ఎవరయితే అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించి, ఆయనతో ఇతరులెవరినీ సాటి కల్పించకుండా, నమాజ్‌ను నెలకోల్పి, జకాత్‌ను చెల్లించి మరియు పెద్ద పాపాల నుండి దూరమై (ప్రళయ దినాన అల్లాహ్ వద్దకు) వస్తాడో, అతనికి స్వర్గం ప్రసాదించబడుతుంది.''[2]

## హజ్ చేసినవారి సర్వ పాపాలు క్షమించబడతాయి:

హజ్ యాత్ర స్థోమత కలిగి ఉన్న ప్రతి ముస్లిం హజ్ చేయడం విధి. అంటే: అతని వద్ద ప్రయాణ ఖర్చులు, అవసరమైన వస్తు సామగ్రి ఉండాలి. మరియు హజ్ యాత్రకై పరిస్థితులు సానుకూలంగా ఉండాలి. వెళ్ళే దారిలో శాంతియుత నెలకొని ఉండాలి. ధనమాన, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం పొంచి ఉండకూడదు.

ప్రయాణం చేయగలిగేందుకు ఆరోగ్యవంతంగా ఉండాలి. స్త్రీలు యాత్రకు బయలుదేరితే వారివెంట మహ్రమ్ బంధువులు తప్పక ఉండాలి. శక్తీ స్థోమతలు ఉండి కూడా హజ్ చేయడానికి నిరాకరిస్తే అది కుఫ్ర్

---

[1] (సూరతుల్ హజ్:78).

[2] (సహీహ్ సునన్ నసాయీ:4009, అహ్మద్:22403).

(తిరస్కారవైఖరి) అవుతుందని ఖుర్ఆన్ మరియు హదీసు గ్రంథాలలో తీవ్రంగా హెచ్చరించడం జరిగింది.

కనుక అల్లాహ్ ఇలా ఆదేశించారు: 'అక్కడికి వెళ్ళే స్థోమతగల వారికి, ఆ గృహ(యాత్ర) హజ్ చేయటాన్ని అల్లాహ్ విధిగా చేశాడు. మరెవరయినా (ఈ ఆజ్ఞను శిరసావహించటానికి) నిరాకరిస్తే అల్లాహ్‌కు సమస్త లోకవాసుల అవసరం ఎంతమాత్రం లేదు.' [1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను 'ఆచరణలన్నిటిలో కెల్లా శ్రేష్ఠమైనది ఏది?' అని అడిగారు.

అందుకాయన ఇలా తెలియజేశారు: **'అల్లాహ్‌ను, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించటం'** అని అన్నారు.

ఆ తర్వాత ఏది? అని అడిగారు: **'దానికి ఆయన అల్లాహ్ మార్గంలో పోరాటం'** అని చెప్పారు.

ఆ తర్వాత ఏది? అని అడిగితే : **'హజ్జే మబ్రూర్'** అని చెప్పారు. [2]

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నాని హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) గారు ఇలా తెలియజేశారు: ''ఎవరయితే ఎలాంటి అపసవ్యమైన చేష్టలకు, వ్యర్థ విషయాలకు పాల్పడకుండా, అల్లాహ్ అవిధేయతకు ఒడిగట్టకుండా జాగ్రత్తపడుతూ హజ్ చేస్తారో, వారు ఆ రోజే తల్లి గర్భం నుంచి పుట్టిన వారిలా (పరమ పవిత్రులై) తిరిగి వస్తారు.'' [3]

---

[1] (సూరతుల్ ఇమ్రాన్:97).
[2] (బుఖారీ:25, ముస్లిం:118).
[3] (బుఖారీ:1424, ముస్లిం:2404).

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా చేయటం వాటి మధ్య జరిగిన పాపాలన్నిటికీ పరిహారం అవుతుంది. మబ్రూర్ (ఆమోదించబడిన)హజ్‌కు ప్రతి ఫలం స్వర్గం తప్ప మరేమీ లేదు.''[1]

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం; ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో కలిసి హజ్ చేస్తుండగా ఆ వ్యక్తిని ఒంటె తన కాళ్ళ క్రింద త్రొక్కి చంపేసింది. అతను ముహ్రిం (హజ్ దీక్ష బూనియున్న వక్తి) స్థితిలో ఉన్నాడు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఆదేశించారు: ''నీళ్ళలో రేగు ఆకులు వేసి అతన్ని స్నానం చేయించండి. అవే దుస్తులలో ఖననం చేయండి. సుగంధాలు పూయకండి. అతని తలను కప్పకండి. ఎందుకంటే అతను ప్రళయ దినాన తన సమాధి నుండి 'తల్బియా' పలుకుతూ లేస్తాడు.'' [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) కథనం; నేనొకసారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని:

**యా రసూలల్లాహ్!** '' మేము అల్లాహ్ మార్గంలో పోరాటాన్ని శ్రేష్ఠమైన ఆచారణగా భావిస్తాం. అందుకని మాకు అల్లాహ్ మార్గంలో పోరాడాలని ఉంది'' అని అన్నాను.

---

[1] (బుఖారీ:1650, ముస్లిం:2403).

[2] (బుఖారీ:1186, ముస్లిం:2092). **'తల్బియా'** లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక లా షరీక లక లబ్బైక్, ఇన్నల్ హమ్ద వన్నిమత లక వల్ ముల్కలాషరీక లక్.

అందుకాయన, ''ఉండవచ్చు, కాని (మీ కొరకు) శ్రేష్ఠమైన పోరాటం **'హజ్జె మబ్రూర్'** చేయటానికి ప్రయత్నించటం'' అని చెప్పారు.[1]

ఆరాధనలన్నిటిలో విధులకు (ఫర్జ్‌లకు) ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. అల్లాహ్ మనపై విధించిన ఆరాధలను పాటిస్తూ, అల్లాహ్ సామీప్యాన్ని పొందే మార్గం ఇతర మార్గాలన్నిటికన్నా అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవి. ఎందుకంటే ఫర్జ్ (విధి)ఆరాధనలు ధర్మానికి పునాదుల్లాంటివి. పునాది గట్టిగా లేకపోతే కట్టడం కూడా బలహీనంగానే ఉంటుంది. అదే విధంగా విధుల్ని నిర్వర్తించకుండా కేవలం నఫిల్ ఆరాధనలు చేస్తే దానివల్ల ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు.

ఫర్జ్ ఆరాధనలను నిర్వర్తించని వాడు అసలు ముస్లిం అని చెప్పటానికి అనర్హుడు. ఫర్జ్ ఆరాధనల్ని వదిలిపెట్టే వారికి ఖుర్ఆన్, హదీసుల్లో ఎన్నో హెచ్చరికలు చేయబడ్డాయి. కాని నఫిల్ ఆరాధనల్ని వదిలిపెట్టినవారిని తప్పు పట్టడం జరగదు. అయితే ఫర్జ్‌లతో పాటు నఫిల్ కార్యాలు కూడా పాటిస్తే దాని ప్రయోజనం మరింత ఎక్కువుతుంది. అల్లాహ్ సన్నిధిలో గౌరవ ప్రదమైన స్థానం లభిస్తుంది, అలాంటి వారిని అల్లాహ్ అనేక విధాలుగా గౌరవ సన్మానాలతో అనుగ్రహిస్తాడు. అందువలన ఇప్పుడు మేము మీ కొరకు నఫిల్ ఆరాధనల ప్రత్యేకత మరియు దాని ఘనత గురించి తెలియజేస్తాము.

---

[1] (బుఖారీ: 1423).

# అధ్యాయం–4

## 110–127

## 4–నఫిల్ ఆరాధనలు పాటించువారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

- అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే అదనపు ఆరాధనలు.
- అల్లాహ్ తన దాసుల పుణ్యాలను రెట్టింపు చేస్తాడు.
- సున్నత్ మరియు నఫిల్ నమాజులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- క్రమం తప్పకుండా చేసే పుణ్యాలు అల్లాహ్‌కు ప్రీతికరమైనవి.
- తహజ్జుద్ నమాజ్.
- విత్ర్ నమాజు.
- చాష్త్ నమాజు (జుహా లేక అవ్వాబీన్ల నమాజు).
- తస్‌బీహ్ నమాజు.
- పశ్చాత్తాపం నమాజు.
- వుజూ చేసిన తరువాత రెండు రకాతుల నమాజు.
- నఫిల్ ఉపవాసాలు.

# 4-నఫిల్ ఆరాధనలు పాటించువారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

**అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే అదనపు ఆరాధనలు:**

విశ్వాసి అల్లాహ్ విధుల్ని (ఫర్జ్ ఆరాధనలు) పాటిస్తూ, స్వయంగా తన తరఫు నుండి కూడా సున్నత్ మరియు నఫిల్ ఆరాధనలు చేస్తూ అల్లాహ్ సామీప్యాన్ని పొందటానికి కృషి చేస్తూ ఉంటాడు.అయితే స్వచ్ఛందంగా చేసే ఆరాధనలు పాటించక పోతే పాపం లేదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరెవరయితే సత్కార్యాలు చేస్తూ ఉంటాడో అతను విశ్వాసి(కూడా) అయివుంటే అతని కృషికి గుర్తింపు లభించకపోవటం అంటూ జరగదు. మేము దాన్ని వ్రాసి ఉంచాము.''[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''స్వచ్ఛందంగా ఎవరైనా ఏదైనా సత్కార్యం చేస్తే అల్లాహ్ ఆదరించేవాడు, తెలుసుకునేవాడు.'' [2]

మరొకచోట ఇలా తెలియజేశాడు: ''కాని ఎవరైనా స్వచ్ఛందంగా ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు.'' [3]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు.'' [4]

---

[1] (సూరతుల్ అంబియా:94).

[2] (సూరతుల్ బఖరా: 158).

[3] (సూరతుల్ బఖరా: 184).

[4] (సూరతుల్ బఖరా: 215).

మరియు అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''ఎవరు అణుమాత్రం సత్కార్యం చేసిన దాన్ని అతను చూసుకుంటాడు.'' [1]

హ|జత్‌ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ ఇలా అంటున్నాడని తెలియజేశారు: ''ఎవరైనా నా మిత్రుణ్ణి ద్వేషిస్తే నేనతనిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నాను. నా దాసుడు నేను విధించిన ఫర్జ్‌ల(విధులను)ను నిర్వర్తించి నా సామీప్యం పొందాలనుకుంటే, దాన్ని నేను అన్నిటికన్నా ఎక్కువగా యిష్టపడతాను. నా దాసుడు స్వచ్ఛంద ఆరాధనల (నవాఫిల్‌) ద్వారా కూడా నా సామీప్యాన్ని పొందటానికి కృషి చేస్తూ ఉంటాడు. అది చూసి నేనతన్ని ప్రేమించటం మొదలుపెడతాను. నేను గనక అతన్ని ప్రేమించానంటే నేనతను వినే చెవినైపోతాను, అతను చూసే కన్ను నయిపోతాను, అతను పట్టుకునే చేయినై పోతాను, అతను నడిచే కాలునై పోతాను. అతను నన్నేదయినా అడిగితే తప్పకుండా ఇస్తాను. అతను శరణు కోరితే తప్పకుండా నేనతనికి శరణు ఇస్తాను.....'' [2]

మనం సున్నత్‌ మరియు నఫిల్‌ (స్వచ్ఛందంగా) ఆరాధనలు పాటించి నందుకు అల్లాహ్‌ అనేక విధాలుగా అనుగ్రహిస్తాడు. మరియు ఆయన ప్రసన్నుడవుతాడు, తన ప్రియదాసులుగా చేసుకుంటాడు, కోరింది ప్రసాదిస్తాడు, మా మొరలను ఆలకిస్తాడు. మరియు ప్రతి బాధలోను, ప్రతి కష్టంలోను ఆదుకుంటాడు. చివరకు ప్రళయ దినాన మనం విధిగా పాటించవలసిన ఏవైన ఆరాధనలు కొరత ఉంటే, వాటిని మనం చేసిన

---

[1] (సూరతుల్‌ జిల్‌జాల్‌:7).

[2] (బుఖారీ:6021).

నఫిల్ ఆరాధనలను ఫర్జ్ ఆరాధనలుగా మార్చుకుంటాడు. మరియు క్షమిస్తాడు. కనుక ఒక హదీసులో ఇలా వుంది:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ప్రళయ దినాన మనిషి అన్నిటికంటే ముందు ప్రశ్నించబడేది అతను విధిగా చేయవలసిన నమాజు గురించి. అతను నమాజు సవ్యంగా ఆచరించి ఉంటే, సాఫల్యాన్ని విజయాన్ని పొందుతాడు. ఒకవేళ నమాజు సవ్యంగా లేదంటే, అవమాన పాలవుతాడు, నష్టపోతాడు. కొందరు (సోమరితనంవల్ల) నమాజులను (చదవని కారణంగా) కొరత చేసిఉంటే, ప్రళయ దినాన అల్లాహ్ ఇలా అంటాడు: ''నా దాసుడు నఫిల్ (అదనపు) నమాజు ఏమైనా నెరవేర్చి ఉంటే వాటి ద్వారా విధి గావించబడిన నమాజుల కొరతను పూర్తి చేయండి'' అని ఆజ్ఞాపిస్తాడు. అలా (విశ్వాసులుగా ఉన్న) వారి (ఇతర) కర్మల పట్లా ఇదే విధంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది.''[1]

## అల్లాహ్ తన దాసుల పుణ్యాలను రెట్టింపు చేస్తాడు:

ఒక వ్యక్తి పాపాలు చేస్తే ఎంత పాపం చేస్తాడో అంతే దుష్ఫలితం పొందుతాడు. కాని ఆ పాపానికి బదులు ఎక్కువ దుష్ఫలితం పొందడు. అదే ఒక వ్యక్తి పుణ్యకార్యాన్ని చేస్తే దానికి ఎంత పుణ్యమో అంతే ప్రతిఫలం పొందుతాడు. అలాగే కొన్ని సార్లు ఒకే పుణ్యానికి బదులు దాని ప్రతిఫలం ఎన్నో రెట్లు పెంచి ఇవ్వడం జరుగును. అది అల్లాహ్ వైపునుండి ప్రత్యేకమైన సందర్భాలలో మరియు ప్రత్యేకమైన పుణ్యాలను బట్టి ప్రతిఫలం

---

[1] (సహీహ్ తిర్మిజీ:413, సహీహ్ నసాయి:465, సహీహ్ అబూదావూద్:864).

ప్రాప్తమవుతుంది. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ వద్దకు సత్కార్యాన్ని తీసుకువచ్చే వాని కొరకు పది వంతులు ప్రతిఫలం ఉంది. దుష్కార్యాన్ని తీసుకువచ్చే వాని కొరకు అతడు ఎంత తప్పు చేశాడో అంతే ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.'' [1]

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''మీరు గనక అల్లాహ్‌కు మంచి రుణాన్ని ఇస్తే, ఆయన మీకు దానిని ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. మీ పొరపాట్లను మన్నిస్తాడు.'' [2]

హ‌జ్రత్ అబూ జర్రీన్ (రజియల్లాహు అన్హు) కథనం; అల్లాహ్ ప్రవచించాడనీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు:

''ప్రతి పుణ్యం పది పుణ్యాల వంటిది లేక దానికంటే ఎక్కువ. మరియు పాపము ఒక పాపము వంటిది. లేక దానిని కూడా అల్లాహ్ క్షమించవచ్చు. నీవు అల్లాహ్‌కు సాటి కల్పించకుండా భూమినిండా పాపాలు చేసి కలిసినా, అల్లాహ్ కూడా నిన్ను భూమినిండ క్షమాపణలతో కలుస్తాడు.'' [3]

''తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసేవారి ఖర్చు ఉపమానం ఇలా ఉంటుంది. ఒక్క విత్తనాన్ని నాటితే అది మొలచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపజేస్తాడు. అల్లాహ్ అమితంగా ఇచ్చేవాడూ, అన్నీ తెలిసినవాడునూ.'' [4]

---

[1] (సూరతు అన్ఆమ్: 160).

[2] (సూరతుత్ తగాబున్: 17).

[3] (అహ్మద్:20398, అస్ సిల్‌సిలతుస్ సహీహ: 581).

[4] (సూరతుల్ బఖరా: 261).

ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి అల్లాహ్ మార్గంలో ఒక ఒంటెను దానం చేశాడు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి ఇలా (శుభవార్తను) తెలిపారు: **''ప్రళయ దినాన దీనికి బదులు నీకు అల్లాహ్ ఏడువందల ఒంటెలను ప్రసాదిస్తాడు.''** [1]

హ్జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం; అల్లాహ్ ప్రవచించాడనీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ పుణ్యాలను మరియు పాపాలను విధిరాతలో పొందుపరిచాడు. తరువాత వాటిని వేరువేరు చేశాడు.

ఎవరైనా మంచిని చేయాలని అనుకొని దానిని చేయలేక పోయినా అల్లాహ్ దాని పూర్తి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు.

ఒక వేళ అతను చేయాల నుకున్న పుణ్యకార్యాన్ని చేస్తే, అల్లాహ్ ఆ పుణ్యానికి ప్రతిఫలంగా పదిరెట్ల నుండి పెంచి ఏడువందల రెట్లు వరకూ పెంచుతాడు. (అల్లాహ్ అనుకుంటే)మరింత ఎక్కువగా కూడా పెంచుతాడు.

ఎవరైనా చెడుని గురించి ఆలోచించి దానిని చేయలేదు, అయినా దానికి బదులు ఒక పూర్తి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు.

ఒక వేళ అతను అనుకున్న చెడు కార్యాన్ని చేస్తే, దానికి బదులు అతనికై ఒక పాపమే పొందుపరుస్తాడు.'' [2]

---

[1] (ముస్లిం:3508).

[2] (బుఖారీ:6010, ముస్లిం:187).

## సున్నత్ మరియు నఫిల్ నమాజులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ సామిప్యం మరియు ప్రీతి పొందుట కొరకు నమాజు అతి గొప్ప మార్గం. మరియు నఫిల్ నమాజులు అనగా ఫర్జ్ నమాజులు తప్ప మనం చదివే ప్రతి నమాజును నఫిల్ గా భావించవచ్చు. అంటే: ప్రతి రోజు చేసే సున్నతులు,నఫిల్ నమాజులు మరియు తహజ్జుద్ నమాజ్, వితర్ నమాజ్, జుహా నమాజులు వంటివి.

హజ్రత్ మాదాన్ బిన్ అబీ తల్హా అల్ యామరియ్యి (రజియల్లాహు అన్హు) కథనం: నేను సౌబాన్ మౌలా (రజియల్లాహు అన్హు) గారితో కలిసి:

''నా కొరకు మీరు ఏదోఒక్క కార్యం గురించి తెలుపండి దాని ద్వారా నేను స్వర్గానికి చేరుకోవాలి. లేదా అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం గురించి తెలుపండి'' అని కోరాను.

దానికి ఆయన: సమాధానం ఇవ్వలేదు. మరలా నేను వారితో ప్రశ్నించాను. అయినా సమాధానం ఇవ్వలేదు. మూడవసారి నేను వారితో ప్రశ్నించాను. అప్పుడు ఆయన: ''నేను కూడా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో ఇలాగే ప్రశ్నించాను''

అప్పుడు ప్రవక్త (స): ఇలా తెలియజేశారు: సౌబాన్! ''నీవు ఎక్కువగా సజ్దాలు చేస్తూ ఉండూ. ఎందుకంటే? నీవు చేసే ప్రతి సజ్దాకు బదులుగా అల్లాహ్ నీ కొరకు ఒక అంతస్తు పెంచుతాడు. మరియు ఒక పాపాన్ని తుడిచివేస్తాడు.'' [1]

[1] (ముస్లిం:753).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సేవకులు మరియు సుఫ్ఫా విద్యార్థుల్లో ఒకరైన హజ్రత్ అబూ ఫిరాస్ రబీయా బిన్ కాబ్ అస్లమీ (రజియల్లాహు అన్హు) కథనం:

నేను రాత్రి పూట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంట ఉండేవాడిని. ఆ సమయంలో నేనాయనకు వుజూ చేసుకోవటానికి నీళ్ళు, ఇతర అవసరమైన వస్తువులు అందించేవాణ్ణి.

ఒక రోజు ఆయన: ''నా నుండి నీకేం కావాలో కోరుకో'' అని అన్నారు.

అందుకు నేను:''స్వర్గంలో మీకు తోడుగా ఉండే భాగ్యాన్ని కోరుకుంటున్నాను'' అని విన్నవించుకున్నాను.

తిరిగి ఆయన(స): ''ఇంకా ఏమైనా కోరుకుంటున్నావా'' అని అడిగారు.

దానికి నేను ''అది చాలు'' అని అన్నాను.

అప్పుడు ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) ''మరయితే దానికోసం ఎక్కువగా సజ్దాలు చేస్తూ నాకు చేదోడుగా ఉండు'' అని అన్నారు. [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేస్తుండగా మాతృ మూర్తి హజ్రత్ ఉమ్మె హబీబా రమ్లా బిన్తె అబూ సుఫ్యాన్ (రజియల్లాహు అన్హు) తాను విన్నానని ఇలా తెలియజేశారు:

''ఏ ముస్లిం దాసుడయినా అల్లాహ్ కోసం ప్రతి రోజూ ఫర్జ్ నమాజులు కాక (అదనంగా) పన్నెండు రకాతుల (సున్నత్) నమాజ్ చేస్తాడో, అల్లాహ్ అతని కోసం గృహాన్ని నిర్మిస్తాడు (లేక) అతని కోసం స్వర్గంలో ఒక గృహం నిర్మించబడుతుంది'' అని అన్నారు. [2]

---

[1] (ముస్లిం:754).

[2] (ముస్లిం:1199).

జుహ్ర్ ఫర్జ్ నమాజ్‌కు ముందు నాలుగు రకాతులు, ఫర్జ్ తర్వాత రెండు రకాతులు, మగ్రిబ్ తర్వాత రెండు రకాతులు, ఇషా తర్వాత రెండు రకాతులు, ఫజ్ర్ (ఉదయం) ఫర్జ్‌కు ముందు రెండు రకాతులు. [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రమం తప్పకుండా పాటించిన నమాజులు. వీటిని **'సుననే ముఅక్కదా'** అని అంటారు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''జుహ్ర్‌కు ముందు నాలుగు రకాతుల్ని దాని తర్వాత నాలుగు రకాతుల్ని క్రమం తప్పకుండా చేసేవారి కొరకు అల్లాహ్ నరకాగ్నిని నిషిద్ధం చేశాడు.''[2]

అస్ర్ సమయంలో ఫర్జ్ నమాజుకు ముందు 4 రకాతులు. మగ్‌రిబ్ సమయంలో ఫర్జ్ నమాజుకు ముందు 2 రకాతులు. మరియు ఇషా సమయంలో ఫర్జ్ నమాజుకు ముందు 4 రకాతులు. సున్నతే ముఅక్కదా పరిధిలోకి రావు. అయితే ఈ నమాజులను కూడా చదవడం ఎంతో అభిలషణీయం (ముస్తహబ్).

హజ్రత్ ఇబ్ను ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''అస్ర్‌కు ముందు నాలుగు రకాతులు చేసేవారిని అల్లాహ్ కరుణించుగాక!'' అని దీవించారు.[3]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''జుహ్ర్‌కు ముందు నాలుగు రకాతులను ఉదయానికి (ఫజ్ర్‌కు) ముందు రెండు రకాతులను ఎన్నడూ వదలిపెట్టేవారు కాదు.''[4]

---

[1] (సహీహ్ తిర్మిజీ:415).
[2] (సహీహ్ అబూదావూద్:1269, సహీహ్ తిర్మిజీ:428).
[3] (అబూదావూద్:1271, తిర్మిజీ:430).
[4] (బుఖారీ:1110).

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఫజ్ర్ వేళ చేసే రెండు రాకాతుల (సున్నత్) నమాజు – ప్రపంచం అందులో ఉన్న వస్తువులన్నిటికంటే శ్రేష్ఠమైనది.'' [1]

**మరొక ఉల్లేఖన ప్రకారం:** ''ఆ రెండు రకాతుల నమాజు నాకు ప్రపంచమంతటి (ధన సామగ్రి) కన్నా ప్రియమైనవి.'' [2]

## క్రమం తప్పకుండా చేసే పుణ్యాలు అల్లాహ్‌కు ప్రీతికరమైనవి:

ఎల్లపుడూ క్రమం తప్పకుండా మనిషి చేసే మంచి పనినే అల్లాహ్ ఎక్కువగా ఇష్టపడుతాడు. అది కొంచమైనను చాలు. మనం నఫిల్ నమాజులను ప్రారంభిస్తే వాటిని ప్రతి రోజు నెరవేర్చుటకు ప్రయత్నించాలి. అలాగే నమాజు విధుల్లో సుధీర్ఘమైన ఖియామ్‌తో కూడిన నమాజు అత్యంత శ్రేష్ఠమైనది. మరియు అల్లాహ్‌కు ప్రీతికరమైనది.

హజ్రత్ ఆయిషా(రజియల్లాహు అన్హ)ఉల్లేఖనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''షాబాన్ నెలకంటే ఎక్కువగా ఉపవాసాలు ఇతర నెలల్లో పాటించేవారు కాదు.

ఆయన షాబాన్ నెల మొత్తం ఉపవాసాలు పాటించి ఇలా అనేవారు: మీ శక్తిమేరకే పనులు చేయండి. అల్లాహ్ విసుగు చెందడు చివరికి మీరే విసుగెత్తి పోవచ్చు.

---

[1] (ముస్లిం:1193).
[2] (ముస్లిం:1194).

ప్రవక్త(స)కు అన్నిటికంటే అత్యంత ప్రియమైన నమాజు శాశ్వితంగా (ఎల్లప్పుడు) పాటించే నమాజు, అది స్వల్పమైన సరే. మరియు ఆయన నమాజును పాటిస్తే దాన్ని శాశ్వితంగా పాటించేవారు.''[1]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ఒక సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన దగ్గరకు వచ్చినప్పుడు ఆమె దగ్గర ఒక స్త్రీ కూర్చొని ఉంది.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు: ''ఎవరీమె?'' అని అడిగారు.

దానికి హజ్రత్ ఆయిషా (రజి): ''ఈమె ఫలాన స్త్రీ. ఎక్కువగా నమాజులు చేస్తుందంటూ (ఇతరులు) చెప్పుకుంటారు'' అని తెలిపారు.

అది విని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఇక ఆపు, మీ శక్తిమేరకే పనులు చేయండి. అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ విసుగు చెందడు చివరికి మీరే విసుగెత్తి పోవచ్చు.''[2]

శక్తికి మించిన ఆరాధన చేయడాన్ని ఈ హదీసులో వారించడం జరిగింది. ఎందుకంటే ఇలా చేయడం వల్ల మనిషి కొన్ని రోజుల తర్వాత దానిపై విసుగు చెంది, అసలు ఆరాధనే మానేసే ప్రమాదముంది.కనుక ఆరాధనలు వినయ విధేయతల్లో మధ్యేమార్గాన్ని అవలంభించడం అవసరం.

మరియు హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం: ''నమాజులన్నిటిలో అత్యంత శ్రేష్ఠమైన నమాజు ఏది?'' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అడగటం జరిగింది. అందుకాయన: **'సుదీర్ఘంగా నిలబడి చేసే నమాజు'** అని చెప్పారు.[3]

---

[1] (బుఖారీ:1834).

[2] (బుఖారీ:1083).

[3] (ముస్లిం:1258).

నఫిల్ నమాజుల్లో ఎక్కువగా ఖుర్‌ఆన్ పారాయణం చేయటానికి వీలవుతుంది. మరియు చాలా సేపు ఖియామ్‌లో నిలబడి చేసే నమాజు అత్యంత శ్రేష్ఠమైనది అని పైన ఇవ్వబడిన హదీసు ద్వారా తెలుస్తున్నది.

## తహజ్జుద్ నమాజ్:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''రాత్రిపూట తహజ్జుద్ నమాజు చెయ్యి. ఇది నీకు అదనపు నమాజు. నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్ఠింప జేయటం జరుగుతుంది.'' [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: ''అల్లాహ్ వద్ద అత్యంత ప్రీతిపాత్రమైన నమాజు దావూద్ (అలైహిస్సలామ్) నమాజు. అత్యంత ప్రీతిపాత్రమైన ఉపవాసం దావూద్ (అలైహిస్సలామ్) ఉపవాసం.
ఆయన అర్థరాత్రి వరకు నిద్రపోయేవారు. తర్వాత మూడింటిట ఒక వంతు రాత్రి భాగంలో అల్లాహ్‌ను ఆరాధించేవారు.
ఆ తర్వాత ఆరోవంతు భాగంలో (మళ్ళీ) నిద్రపోయేవారు. ఒక రోజు ఉపవాసం ఉంటే మరోరోజు ఉపవాసం మానుకునేవారు.'' [2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విధి నమాజు తరువాత అన్నిటికంటే శ్రేష్ఠమైనది తహజ్జుద్ నమాజు...'' [3]

---

[1] (సూరతుల్ ఇస్రా: 79).
[2] (బుఖారీ:1063, ముస్లిం:1969).
[3] (ముస్లిం:1983).

హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

- ''ప్రజలారా! సలాంను వ్యాపింపజేయండి.
- అన్నం తినిపించండి.
- చుట్టరికాన్ని బల పర్చండి.
- ప్రజలు రాత్రి నిద్రలో ఉండే సమయంలో నమాజు చేయండి. అలా చేస్తే మీరు ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశించగలరు.'' [1]

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఏ వ్యక్తి అయితే రాత్రి ఒక భాగాన్న (నిద్ర) మేలుకునీ నమాజు చేసి, అలాగే తన భార్యను కూడా నమాజు పాటించుటకై నిద్రనుండి మేలుకోల్పాడు. అయిన ఆమె మేలుకోవడానికి నిరాకరిస్తే, ఆమె ముఖంపై నీటి చుక్కలు చెల్లిన వ్యక్తికీ అల్లాహ్ కరుణించుగాక!.''

మరియు 'ఏ స్త్రీ అయితే రాత్రి ఒక భాగాన్నే (నిద్ర) మేలుకొనీ నమాజు చేసి, అలాగే తన భర్తను కూడా నమాజు పాటించుటకై నిద్రనుండి మేలుకోల్పింది. అయినా అతను మేలుకోవడానికి నిరాకరిస్తే, అతని ముఖంపై నీటి చుక్కలు చెల్లిన స్త్రీకీ అల్లాహ్ కరుణించుగాక!.' [2]

హ|జత్ అబూ ఉమామా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''తహజ్జుద్ నమాజు తప్పక చేయండి, అది గతించిన పుణ్యాత్ముల ఆచారం, మరియు

---

[1] (సహీహ్ ఇబ్నుమాజా: 1334, సహీహ్ తిర్మిజీ: 2485,).

[2] (సహీహ్ అబూదావూద్:1308).

దీని కారణంగా అల్లాహ్ సామిప్యం పొందుతారు. మరియు (ఆ నమాజు) పాపాలను తుడిచిపెట్టేస్తుంది, తప్పుల నుండి నివారిస్తుంది.'' [1]

## విత్ర్ నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిస్సందేహంగా అల్లాహ్ బేసి సంఖ్యలో ఉన్నాడు. బేసిని ప్రేమిస్తాడు. కనుక ఖుర్ఆన్ (గ్రంథంగల) ప్రజలారా! బేసి సంఖ్యలో (విత్ర్) నమాజ్ చేయండి.'' [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ మీ కోసం ఒక నమాజు అదనంగా ప్రసాదించాడు. అది మీ పాలిట ఎరుపు ఒంటెలకన్నా ఎంతో మేలైనది. అది విత్ర్ నమాజు, ఆ నమాజును ఇషా మరియు ఫజ్ర్ మధ్య కాలంలో అల్లాహ్ మీ కొరకు ఉంచాడు. [3]

## చాష్త్ నమాజు (జుహా లేక అవ్వాబీన్ల నమాజు):

హజ్రత్ అబూ జర్ర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు:
''మీలోని ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఉదయం తన ఒక్కొక్క కీలుకు బదులుగా సదఖా (దానం) ఇచ్చుకోవలసి ఉంటుంది. (అయితే) ప్రతిసారి **'సుబ్‌హానల్లాహ్'** అని పలకటం సదఖాగా పరిగణించబడు తుంది. ప్రతిసారి **'అల్‌హమ్దు లిల్లాహ్'** అని అనటం కూడా సదఖాయే.

---

[1] (సహీహ్ తిర్మిజీ:3549,హాకిమ్:1/502).
[2] (సహీహ్ అబూదావూద్:1416, సహీహ్ తిర్మిజీ:453).
[3] (సహీహ్ అబూదావూద్:1418, సహీహ్ తిర్మిజీ:452).

ప్రతిసారి **'లా ఇలాహ ఇల్లాల్లాహ్'** అని అనటమూ సదఖాయే. ప్రతిసారి 'అల్లాహు అక్బర్' అని అనటం కూడా సదఖాయే. మంచిని గురించి ఆదేశించటం, చెడు నుండి ఆపటం కూడా సదఖాయే. ఎవరైనా వీటన్నిటికీ బదులుగా జుహా వేళ రెండు రకాతుల నమాజ్ చేసినా సరిపోతుంది.''[1]

హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; కొంత మంది జుహా నమాజ్ చేస్తుండగా చూసి తను ఇలా అన్నారు:

''జాగ్రత్త! ఈ నమాజును ఇప్పుడు కాకుండా వేరే సమయంలో చేయటం ఉత్తమం అన్న సంగతి వీరికి బాగా తెలుసు.''

నిస్సందేహంగా దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ''(పాపాల నుండి) మరలేవారి (అవ్వాబీన్‌ల) నమాజు, ఎండ తీవ్రతకు గున్న ఒంటెల కాళ్ళు కాలినప్పుడు చేయబడుతుంది.''[2]

మరియు సహీహ్ ముస్లిం ఆధారంగా జుహా నమాజు రకాతుల సంఖ్య 2,4,8 రకాతులుగా ప్రవక్త ముహమ్మద్ (స) చదివినట్లు రూఢి అవుతుంది.

## తస్‌బీహ్ నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజియల్లాహు అన్హు) గారికి ఇలా బోధించారు:

''ఓ బాబాయి! మీకు ఓ ప్రార్థన నేర్పుతాను దాని వలన మీరు ముందు వెనుక చేసిన పాపాలను, క్రొత్త పాత పాపాలను, తెలిసీ తెలియక చేసిన పాపాలను, చిన్న పెద్ద పాపాలను, గోచర ఆగోచర పాపాలన్నిటినీ క్షమించడం జరుగుతుంది........

[1] (ముస్లిం:1181).
[2] (ముస్లిం:1237).

ఓ బాబాయి! మీరు ఈ నమాజును ప్రతి రోజు, లేదా ప్రతి వారనికి, లేదా ప్రతి నెలకు, లేదా ప్రతి సంవత్సరమునకు ఒక సారి చదవగలిగితే చదువుకోండి. లేదా జీవితంలో కనీసం ఒక సారైనా చదవండి'' అని అన్నారు. [1]

## పశ్చాత్తాపం నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''ఏ వ్యక్తి అయితే పాపానికి గురికాబడిన తరువాత వుజూ చేసుకొని పోయి (రెండు రకాతుల) నమాజ్ నెరవేర్చి, పశ్చాత్తాప పడి, అల్లాహ్ వద్ద మన్నింపు కోరితే అతని పాపాలన్నీ క్షమించబడతాయి.'' [2]

హజ్రత్ ఇబ్ను మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక వ్యక్తి ఓ స్త్రీని ముద్దాడాడు. కాని తరువాత (పాపభీతితో) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరకు వచ్చి, తన తప్పుని ఒప్పుకున్నాడు. ఆ సందర్భంగా అల్లాహ్ (దివ్య ఖుర్‌ఆన్‌లోని) ఈ సూక్తిని అవతరింపజేశాడు. 'నమాజు స్థాపించు – పగలు రెండు సంధ్యావేళల్లోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. నిస్సందేహంగా సత్కర్మలు దుష్కర్మల్ని దూరం చేస్తాయి.' ఈ ఆదేశం నా కొక్కడికేనా దైవప్రవక్తా! అని అడిగాడా వ్యక్తి. దానికి సమాధానంగా '(లేదు). నా అనుచర సమాజంలోని వారందరికీ' అని అన్నారు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం). [3]

---

[1] (సహీహ్ అబూదావూద్:1297, సహీహ్ ఇబ్నుమాజా:1387).
[2] (సహీహ్ తిర్మిజీ:406, సహీహ్ ఇబ్నుమాజా:1395).
[3] (బుఖారీ:495, ముస్లిం:4963).

## వుజూ చేసిన తరువాత రెండు రకాతుల నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘ఏ వ్యక్తి అయితే నేను చేసినట్లు వుజూ చేసి, ప్రపంచపు ఎలాంటి ఆలోచనలు చెయ్యకుండా రెండు రకాతులు నమాజు చేస్తే, అతని వల్ల జరిగిన గత పాపాలన్నిటిని అల్లాహ్ క్షమిస్తాడు.’’ [1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘ఏ ముస్లిమయితే చక్కగా వుజూ చేసి, పూర్తి ఏకాగ్రతతో రెండు రకాతుల నమాజు చేస్తే, అతనికై స్వర్గం అనివార్యమైపోతుంది.’ [2]

హజ్రత్ బురైదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక రోజు ఉదయాన హజ్రత్ బిలాల్ (రజియల్లాహు అన్హు) గారిని పిలిచి:

‘బిలాల్! నాకంటే ముందు ఏ ఆచరణ కారణంగా నీవు స్వర్గంలో ఉన్నావు? నేను స్వర్గంలో ప్రవేశించిన ప్రతిసారి నా ముందర నీవు నడిచే (పాదాల) సవ్వడి విన్నాను. మరియు ఈ రోజు రాత్రి కూడా అలానే జరిగింది. నేను స్వర్గంలో ప్రవేశించగానే నీవు నడిచే సవ్వడిని విన్నాను...’ అని అన్నారు.

దానికి హజ్రత్ బిలాల్ (రజియల్లాహు అన్హు) ఇలా సమాధానమిచ్చారు: **యా రసూలల్లాహ్!** ‘నేను ఆజాన్ చెప్పిన ప్రతిసారి రెండు రకాతుల నమాజ్ తప్పక చేసుకుంటాను. నా వుజూ భంగమయిన ప్రతి సారి తిరిగి వుజూ చేసుకుంటాను. (వుజూ చేసుకున్న ప్రతిసారి) అల్లాహ్ కోసం

---

[1] (బుఖారీ:155, ముస్లిం:331).

[2] (సహీహ్ సునన్ నసాయీ:151)

రెండు రకాతుల నమాజు చదవడం నాపై అనివార్యమైనదిగా చేసుకున్నాను' అని అన్నారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (స ): **'ఆ రెండు రకాతుల కారణంగానే నీవు నాకంటే ముందుగా ఉన్నావన్న మాట'** అని అన్నారు. [1]

## నఫిల్ ఉపవాసాలు:

ఫర్జ్ ఉపవాసాలను నేరవేర్చిన తరువాత ఒక ముస్లిం అదనపు ఉపవాసాలు పాటిస్తే అల్లాహ్ ప్రసన్నత పొందే అవకాశాలు ఉండాయి.

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: 'ఎవరయితే అల్లాహ్ మార్గంలో ఒక రోజు ఉపవాసం ఉంటారో, వారి ముఖాలను అల్లాహ్ నరకం నుండి డెబ్బై యేండ్ల (ప్రయాణం) మేరకు దూరంగా ఉంచుతాడు' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రమజాన్ తరువాత

---

[1] (అహ్మద్:5/360, సహీహ్ తిర్మిజీ:3689).

**ముఖ్య గమనిక:** షబే మేరాజ్ నమాజ్ మరియు షబేబరాత్ నమాజు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) లేక సహాబాలు (రజియల్లాహు అన్హుం) ఆచరించినట్లు ఒక్క హదీసు సహితం నిజమైనది లేదు.
కనుక ఆ నమాజుల గురించి వచ్చిన విధానాలు కూడా కల్పితాలు మాత్రమే. ఆ రెండు రాత్రుల్లో లేక పగలు చేసే ఏ ఒక్క కార్యానికి ఆధారాలు లేవు. కనుక అది ఇస్లాం ధర్మంలో క్రొత్తగా జొప్పించబడిన బిద్అత్ కార్యాలు.

[2] (బుఖారీ:2628, ముస్లిం:1948).

అల్లాహ్ మాసమయిన ముహర్రం నెలలో పాటించబడే ఉపవాసాలు అత్యంత శ్రేష్ఠమైనవి. అలాగే ఫర్జ్ నమాజుల తరువాత పాటించబడే (నఫిల్) నమాజుల్లో తహజ్జుద్ నమాజు అత్యంత శ్రేష్ఠమైనది.''[1]

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, ''అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది'' అని చెప్పారు.[2]

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని నేను ఇలా అడిగాను:

**'యా రసూలల్లాహ్!** మీరు షాబాన్ మాసంలో (అధికంగా) ఉపవాసాలు పాటించినట్లు, ఏ ఇతర మాసాలలో అన్ని ఉపవాసాలను పాటించినట్లు నేను మిమ్మల్ని చూడలేదు.'

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా బదులిచ్చారు: ''రజబ్ మరియు రమజాన్ నెలకి మధ్య ఉన్న షాబాన్ నెల యొక్క వాస్తవం ప్రజలకు తెలియదు. ఈ నెలలో ప్రజలు చేసిన కార్యాలు అల్లాహ్ యందు సమర్పించబడతాయి. కనుక నా పుణ్యకార్యాలు అల్లాహ్ ముందు నేను ఉపవాస స్థితిలో ఉండగా సమర్పించబడాలని ఇష్టపడుతున్నాను.''[3]

---

[1] (ముస్లిం:1983).
[2] (ముస్లిం:1977).
[3] (సహీహ్‌సునన్ నసాయీ:2357, అహ్మద్:20758 ).

# అధ్యాయం-5

## 129-148

## 5-అల్లాహ్ ప్రేమ పొందుటకై ముఖ్యమైన మార్గాలు

- దానధర్మాలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు మరియు అనుగ్రహిస్తాడు.
- కృతజ్ఞతలు చెల్లించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అల్లాహ్‌ను ఎప్పుడు మొరపెట్టుకున్నా ఆలకిస్తాడు.
- ఖుర్ఆన్ పారాయణం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అల్లాహ్ నామస్మరణ కారణంగా ప్రేమించబడతారు.

# 5–అల్లాహ్ ప్రేమ పొందుటకై ముఖ్యమైన మార్గాలు

**దానధర్మాలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు మరియు అనుగ్రహిస్తాడు:**

జకాత్ ఫర్జ్ (విధిగావించిన) ధర్మం. దాన్ని నేరవేర్చడం తప్పనిసరి. కాని దాన ధర్మాలు ప్రతి ముస్లిం అల్లాహ్ ప్రీతి పొందుటకై చేసే కార్యం, అదనపు దాన ధర్మాలు. ఇలాంటి దాన ధర్మాలు వలన అల్లాహ్ అనుగ్రహాలతో పాటు, అల్లాహ్ ప్రసన్నత కూడా లభిస్తుంది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: అల్లాహ్ ప్రీతి కోసం నిరుపేదలకు, అనాథులకు, ఖైదీలకు అన్నం పెడుతుంటారు. – (పైగా వారిలా అంటారు): 'కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే మీకు తినిపిస్తున్నాము. అంతేగాని మీనుండి మేము ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, ధన్యవాదాలనుగానీ ఆశించటం లేదు.' [1]

దాన ధర్మాలు చేయడం వలన అతని పాపాలు తుడిచిపోతాయి. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''దాన ధర్మాలు పాపాలను తుడిచిపెట్టేస్తాయి. ఎలాగైతే నీరు అగ్నిని ఆర్పేస్తుందో.''[2]

మరొక హదీసులో ఇలా ఉంది: ''రహస్యంగా చేసే ధర్మం అల్లాహ్ కోపాన్ని చల్లబరుస్తుంది.'' [3]

---

[1] (సూరతుద్ దహ్ర్:8–9).

[2] (సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్:866, రవాహు అబూయాలా).

[3] (అల్‌మోజముల్ కబీర్, తబ్రానీ, సహీహ అత్తర్గీబ్ వత్తర్హీబ్:888).

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు మీరు మంచి మార్గంలో ఖర్చు చేసేది మీ (మేలు) కొరకే. మీరు ఖర్చు చేసేది అల్లాహ్ ప్రీతిని పొందటానికే అయి ఉండాలి. మీరు మంచి మార్గంలో ఏమి ఖర్చు చేసినా, దాని ఫలితం మీకు పూర్తిగా లభిస్తుంది మరియు మీకు ఎలాంటి అన్యాయం జరగదు.'' [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుచేసినవారి ఉపమానం ఇలా ఉంటుంది: ఒక విత్తనాన్ని నాటగా, అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకు వస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారికి సమృద్ధి నొసుగుతాడు. అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు. ప్రతిదీ తెలిసినవాడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరయితే తమ సిరిసంపదలను రేయింబవళ్లు రహస్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు చేస్తారో వారి కొరకు వారి ప్రభువు వద్ద (గొప్ప) పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.'' [3]

మరొక చోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా? దాన్ని ఆయన ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. (ఉపాధిని) తగ్గించేవాడు, పెంచేవాడు అల్లాహ్‌యే. కడకు మీరంతా మరలి పోవలసింది ఆయన వద్దకే.'' [4]

---

[1] (సూరతుల్ బఖరా: 272).
[2] (సూరతుల్ బఖరా:261).
[3] (సూరతుల్ బఖరా: 274).
[4] (సూరతుల్ బఖరా: 245).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

అల్లాహ్ హలాల్ (పవిత్ర) సంపాదన మాత్రమే స్వీకరిస్తాడు. అంచేత ఎవరైనా తమ పవిత్ర సంపాదనలో నుండి ఒక ఖర్జూరపుటంత ధనం దానం చేసినా అల్లాహ్ దాన్ని తన కుడిచేత్తో అందుకుంటాడు. ఆ తరువాత దాన్ని మీరు గుర్రపు పిల్లను పెంచి పెద్దచేసినట్లుగా దానం చేసినవాడి కోసం (అతని పుణ్యాన్ని) పెంచుతాడు. అలా పెరుగుతూ చివరకూ అది పర్వతమంత పెద్దదిగా అయిపోతుంది.'' [1]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; కొంత మంది ఒక మేకను కోసారు. (దాని మాంసంలో చాలా భాగం ప్రజలకు పంచి పెట్టారు). ఆ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయిషా (రజి) తో మాట్లాడుతూ: 'ఆ మాంసంలో ఇంకా ఎంత మిగిలి ఉంది?' అని అడిగారు.

'అంతా అయిపోయింది, ఒక్క బుజం మాత్రమే మిగిలి ఉంది' అని చెప్పారామె.

దానికాయన: '(కాదు, కాదు) ఆ భుజం తప్ప మాంసమంతా (ధర్మం చేసిన మాసం దానం రూపంలో) మిగిలే ఉంది' అని అన్నారు. [2]

ఈ హదీసు భావం ఏమిటంటే, మేకను కోసిన వాళ్ళు ఒక భుజాన్ని మాత్రం ఉంచుకొని మిగతా మాంసమంతా దానం చేశారు. దానం చేసిన మాంసానికి పరలోకంలో ప్రతిఫలం లభిస్తుంది కాబట్టి అది మిగిలే ఉంది.

---

[1] (బుఖారీ:1321, ముస్లిం:1685).

[2] (సహీహ్ తిర్మిజీ:2470).

హజ్రత్ అదీ బిన్ హాతిమ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు:
''ఒక ఖర్జూరపండు ముక్కను దానం చేసైనా సరే మిమ్మల్ని మీరు నరకాగ్ని బారి నుండి కాపాడుకోండి.'' [1]

## కృతజ్ఞతలు చెల్లించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

మనిషి కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి. అది మనిషి స్వయానికే లాభం చేకూరుస్తుంది. మరియు కృతజ్ఞతా భావం కలిగిఉన్న దాసులను అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు. మరియు కృతఘ్నుతా ధోరణి కలవారిని అల్లాహ్ ఇష్టపడడు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''ఒకవేళ మీరు తిరస్కార వైఖరిని అవలభించినట్లయితే అల్లాహ్‌కు మీ అవసరం ఎంత మాత్రం లేదు (అన్న విషయాన్ని తెలుసుకోండి). తన దాసులు కృతఘ్నుతా ధోరణిని ఆయన ఇష్టపడడు. మీరు గనక కృతజ్ఞతా పూర్వకంగా మసలుకుంటే, దాన్ని ఆయన మీ కోసం ఇష్టపడుతాడు...'' [2]

హజ్రత్ నూహ్ అలైహిస్సలామ్ మరియు ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్, హజ్రత్ మూసా అలైహిస్సలామ్ మరియు ప్రతి ప్రవక్త అల్లాహ్ పట్ల కృతజ్ఞతా ధోరణితోనే మసులుకున్నారనీ ఖుర్ఆన్ అనేక ఆయతుల ద్వారా స్పష్టమవుతుంది.

హజ్రత్ ముజాహిద్ (రజియల్లాహు అన్హు) గారు: ''ఆయన (నూహ్ అలైహిస్సలామ్) మాత్రం కృతజ్ఞత పూర్వకంగా మెలిగిన మా దాసుడు.'' [3]

---

[1] (బుఖారీ:3328).
[2] (సూరతుజ్ జుమర్: 7).
[3] (బనీ ఇస్రాయీల్:3).

ఈ ఆయతు గురించి ఇలా వాఖ్యానించారు: ''ఆయన ఏదైన తింటే మరియు త్రాగితే (కృతజ్ఞతా భావంతో) **'అల్‌హమ్దు లిల్లాహ్'** అని స్తుతించేవారు. అందుకని అల్లాహ్ ఆయన గురించి కృతజ్ఞతా భావంతో మెలిగిన దాసుడని అల్లాహ్ తెలియజేశాడు.''[1]

మరియు హజ్రత్ ఇబ్ను మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''నిశ్చయంగా అల్లాహ్ ఆ దాసుని పట్ల చాలా సంతోషిస్తాడు. ఏ దాసుడయితే ఆహారం తినిన తరువాత అల్లాహ్‌ను (కృతజ్ఞతా భావంతో **'అల్‌హమ్దు లిల్లాహ్'** అని) స్తుతిస్తాడో, లేక ఏమైనా పానీయాన్ని త్రాగిన తరువాత అల్లాహ్‌ను **('అల్‌హమ్దు లిల్లాహ్'** అని) స్తుతిస్తాడో.''[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి గురించి హదీసు గ్రంథంలో ఇలా ఉంది. హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రిపూట నిలబడి నమాజు చేసేవారు. దాని మూలంగా ఆయన పాదాలపై వాపు కూడా వచ్చేది.

**అది చూసి నేను: యా రసూలల్లాహ్!** 'మీకు ఇంత శ్రమదేనికీ? **మీ పూర్వపరాల పాపాలన్నిటిని అల్లాహ్ మన్నించేశాడు కదా?'** అని అన్నాను. **దానికాయన(స):** 'నేను అల్లాహ్‌కు కృతజ్ఞుడైన దాసుణ్ణి కాకూడదా?' అని అన్నారు.[3]

---

[1](తఫ్సీర్ తబ్రీ:17/354 తఫ్సీర్ ఇబ్ను కసీర్:5/46)

[2] (ముస్లిం:4915).

[3] (బుఖారీ:4459, ముస్లిం:5044).

కనుక హ|జత్ అబూ బక్రా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఏదైన సంతోషకరమైన విషయం కలిగిందంటే, లేక సంతోషకరమైన వార్త తెలిసిందంటే అల్లాహ్ ముందు కృతజ్ఞతా భావంతో సజ్దా (సాష్టాంగం) చేసేవారు. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఇంకా నీ ప్రభువు అనుగ్రహాలను గురించి పొగుడతూ ఉండు.'' [2]

అంటే కృతజ్ఞతా వైఖరి ద్వారా ఈ అనుగ్రహాలను వ్యక్త పరచడం, మెచ్చుకోలుగా చెప్పు కోవటం దైవానికి ఇష్టకరమైనది.

మరియు హ|జత్ అబూ యహ్యా సుహైబ్ బిన్ సినాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసి వ్యవహారం చాలా విచిత్రంగా ఉంటుంది. అతను చేసే ప్రతి పనిలో అతని కొరకు మేలు ఉంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈ భాగ్యం ప్రాప్తించలేదు. అతనికి ఆనంద ఘడియలు ఎదురైతే అందుకు అతను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది. (దాని కారణంగా అతనికి పుణ్యం లభిస్తుంది) ఒక వేళ అతనికి కష్టాలు ఎదురైతే అతను సహనం వహిస్తాడు, ఈ సహనం కూడా అతనికి మేలే కలుగజేస్తుంది.'' [3]

అల్లాహ్ చేసిన మేళ్లను ఎన్నటికి మరవకూడదు. మనిషి కృతజ్ఞతా పూర్వకంగా మసులుకోవాలి. కృతజ్ఞత భావం వల్ల అతని అనుగ్రహాలలో

---

[1] (సహీహ్ అబూదావూద్: 2774).

[2] (సూరతుజ్ జుహా:11).

[3] (ముస్లిం:5318).

శుభాలు కలుగుతాయి. మరియు అతనికి మరిన్ని కానుకలు ప్రసాదించబడుతాయి. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్రహిస్తాను.'' [1]

మరియు హజ్రత్ నౌమాన్ బిన్ బషీర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఎవరైతే స్వల్పమైన వాటి (విషయాల)పై కృతజ్ఞతలు తెలుపరో, వారు అధికమైన వాటి(విషయాల)పై కూడా కృతజ్ఞతలు తెలుపలేరు.

మరియు ఎవరైతే ప్రజలకు కృతజ్ఞతలు తెలుపరో, వారు అల్లాహ్‌కు కూడా కృతజ్ఞతలు తెలుపలేరు.

అల్లాహ్ అనుగ్రహాల పట్ల మీరు (గొప్పగా) చెప్పుకుంటే కృతజ్ఞులు అవుతారు. ఆలా చేయని పక్షంలో కృతఘ్నులు అవుతారు.

కలసికట్టుగా ఉండటం (అల్లాహ్)కారుణ్యమవుతుంది. మరియు తెగలుగా చీలిపోవడం (అల్లాహ్) శిక్ష అవుతుంది.''[2]

ముర్రియు హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలామ్) గారు ఇలా ప్రర్థించేవారు: ''నా ప్రభూ! నువ్వు నాకు, నా తల్లిదండ్రులకూ ప్రసాదించిన అనుగ్రహాలకు గాను నిత్యం నీకు కృతజ్ఞతలు తెలుపుకునే సద్బుద్ధిని నాకు ఇవ్వు. నేను నీ మెప్పును పొందే మంచిపనులు చేసేలా చూడూ. నీ దయతో నన్ను నీ సజ్జన దాసులలో చేర్చుకో.'' [3]

---

[1] (సూరతు ఇబ్రాహీమ్:7).

[2] (జవాయిద్ ముస్నద్ అహ్మద్, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 976).

[3] (సూరతున్ నమ్ల్:19).

హ|జ్రత్ ముఆజ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక సారి నా చెయ్యి పట్టుకొని ఇలా అన్నారు:

**ఓ ముఆజ్!** అల్లాహ్ సాక్షిగా! 'నేను నిన్ను అభిమానిస్తున్నాను' మరియు నేను నీకు 'వసీయత్' చేస్తున్నాను, నీవు ప్రతి నమాజు తరువాత: **'అల్లాహుమ్మ అయిన్నీ అలా జిక్రిక, వ షుక్రిక, వ హుస్ని ఇబాదతిక్'** (యా అల్లాహ్! నేను నీ దాస్యం చేయటానికి, నీకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి, తగు రీతిలో నిన్ను ఆరాధించటానికి, నాకు సహాయం చెయ్యి) అని చదువు.[1]

అల్లాహ్ మానవుల కొరకు అంతులేని అనుగ్రహాలను ప్రసాదించాడు. అల్లాహ్ ప్రసాదించిన ఏ ఏ అనుగ్రహాలను లెక్కించగలుగుతారు? మనుషుల కొరకు భూమండలాన్ని సృష్టించి అతి అనుకూలమైన జీవన అభివృద్ధిని ప్రసాదించాడు. భూమ్యాకాశాల మధ్యలో అనేక వస్తువులను సృష్టించి మనిషికి అనుకూలంగా మల్చాడు. ఆకాశంలో సూర్యచంద్ర, నక్షత్ర గ్రహాలను సృష్టించి రెయింబళ్ళను చేశాడు. భూమిలో తియ్యటి మరియు ఉప్పు నీటి జలాలను మరియు ఖనిజాలను సృష్టించి మనిషికి అనుగ్రహించాడు. మానవ శరీరంలో ఉన్న అవయువాలను అతి గొప్ప విధానంలో సృష్టించి మనిషికి గౌరవించాడు. మరియు ప్రతి యుగంలో మానవుల కొరకు ప్రవక్తలను, గ్రంథాలను ప్రసాదించి రుజు మార్గాన్ని చూపాడు. అల్లాహ్ మనిషి కొరకు ప్రసాదించిన ఏ ఏ అనుగ్రహాన్ని లెక్క పెట్ట గలరు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **'మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు'** కావాలంటే మీరు ఖుర్ఆన్ గ్రంథంలో **'రహ్మాన్‌సూరా'**ను చదవండి.

---

[1] (సహీహ్ అబూదావూద్: 1522).

## అల్లాహ్‌ను ఎప్పుడు మొరపెట్టుకున్నా ఆలకిస్తాడు:

మనిషి తన దాస్యం కారణంగా అల్లాహ్‌కు దగ్గరవుతాడు. మరియు అల్లాహ్ అతన్ని ప్రేమిస్తాడు. అందుకని ప్రార్థన కూడా ఒక రకమైన ఆరాధనే. పైగా ఆరాధనకు ప్రాణం, సారం ప్రార్థనే. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: **'దుఆ ఆరాధన యొక్క సారం'** [1]

దాసుడు అల్లాహ్‌ను మొరపెట్టుకుంటే అతని మొరను తిరస్కరించడు. పైగా అల్లాహ్ అతన్ని ప్రేమిస్తూ అతని మొరను కూడా ఆలకిస్తాడు. అల్లాహ్ మా విన్నపాలు అంగీకరించుటకై మాకు అతి దగ్గరలో ఉన్నాడు మరియు మా దుఆలను ఆమోదిస్తాననీ ఖుర్‌ఆన్ గ్రథంలో అనేక చోట్ల తెలియజేశాడు. కనుక సూరతుల్ బఖరా: 186వ ఆయతులో అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''(ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అతి సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు)''

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు ఆయన సజీవుడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి మీరు స్వచ్ఛమైన ఆరాధనను ఆయనకే సమర్పిస్తూ ఆయన్నే వేడుకొండి....''[2]

హ్రజత్ సల్మాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా మీ ప్రభువు

---

[1] (సహీహ్ తిర్మిజీ:2969).

[2] (సూరతుల్ మూమిన్: 65).

సజీవుడు, గొప్ప ఉదాత్తుడు. అల్లాహ్‌ను మొరపెట్టుకుంటూ రెండు చేతులు పైకెత్తిన దాసునికి ఏమియు ప్రసాదించకుండా (మొరను)రద్దు చేయటాన్ని (అల్లాహ్) సిగ్గు చెందుతాడు.'' [1]

హ[జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు)కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మీరు అల్లాహ్‌ను మొరపెట్టుకొండి! ఆయన (మీ దుఆను) తప్పక స్వీకరిస్తాడనే నమ్మకంతో. మీరు తెలుసుకోండి! ఏకాగ్రత లేని మరియు నిర్లక్ష్య హృదయంతో చేసే దుఆలు ఆమోదించబడవు.'' [2]

హ[జత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ముస్లింగా ఉండే ఏ వ్యక్తి అయినా అతను మొరపెట్టుకునే దుఆ గనక తప్పుడు పనికి కాకుండా మరియు రక్త సంభందాల తెగతెంపులకు కాకుండా ఉంటే, ఆ దుఆ మూడు విధాలలో ఏదోఒక్క విధానంలో తప్పక స్వీకరించ బడుతోంది. ''అతని దుఆ (అప్పుడే) ఆలకించబడుతుంది. లేదా; ఆ దుఆ కారణంగా పరలోకంలో (పుణ్యాలు) సమకూర్చటం జరుగుతుంది.

లేదా; చేసిన దుఆకు సమానంగా అతనికి (రాబోయే) చెడును దూరం చేయడం జరుగుతుంది....'' [3]

మనిషికి ఏ బాధ, దుఃఖం వచ్చినా, ఏ కష్టం, నష్టం కలిగినా అల్లాహ్‌నే వేడుకుంటూ ఉండాలి. సంతోషాల కొరకు మరియు లాభాల కొరకు

---

[1] (సహీహ్ అబూదావూద్:1488).

[2] (సహీహ్ తిర్మిజీ: 3479).

[3] (అహ్మద్: 10709, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1633).

అల్లాహ్‌నే ప్రార్థించాలి. సంతాన ప్రాప్తి కొరకు మరియు మగ పిల్లలు, ఆడ పిల్లలు కావాలన్నా అల్లాహ్‌నే వేడుకోవాలి. అతి పెద్ద అవసరమైనా లేక అతి చిన్న అవసరమైనా అల్లాహ్‌తోనే సహాయం కోరాలి.

వేడుకోవడం అల్లాహ్ ఆరాధనేననీ అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నన్ను ప్రార్థించండి నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పని సరిగా అవమానానికి గురై నరకములో ప్రవేశిస్తారు.'' [1]

మరియు అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ మొరపెట్టుకోకూడదని అల్లాహ్ ఇలా హెచ్చరించాడు: ''నిశ్చయంగా మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరనీ పిలవకండి.'' [2]

ఇంకా అల్లాహ్ ఈ విధంగా తెలియజేశాడు: ''ఎవడైనా, తన దగ్గర ఏ ప్రమాణమూ లేకపోయినప్పటికీ – అల్లాహ్‌తో పాటు వేరొక దేవుణ్ణి మొరపెట్టుకుంటే, అటువంటి వ్యక్తి లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది. నిశ్చయంగా అవిశ్వాసులు సఫలురు కాలేరు.'' [3]

మరియు హ్జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''ఎవరైతే అల్లాహ్‌ను ప్రార్థించరో (దుఆ చేయరో) అలాంటివారితో అల్లాహ్ కోపగించుకుంటాడు.'' [4]

---

[1] (సూరతుల్ మూమిన్: 60).
[2] (సూరతుల్ జిన్:18).
[3] (సూరతుల్ మూమినూన్: 117).
[4] (సహీహ్ ఇబ్నుమాజా: 3827).

## ఖుర్ఆన్ పారాయణం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నమాజు నెలకొల్పు – సూర్యుడు నెత్తి నుండి వాలినప్పటి నుండి రాత్రి చీకటి అలుముకునే వరకు. తెల్లవారు జామున ఖుర్ఆన్ పారాయణం చెయ్యి. నిశ్చయంగా తెల్లవారు జామున చేసే ఖుర్ఆన్ పారాయణానికి సాక్ష్యం ఇవ్వబడుతుంది. – రాత్రిపూట కొంత భాగం తహజ్జుద్ (నమాజు)లో ఖుర్ఆన్ పఠనం చెయ్యి. ఇది నీ కొరకు అదనం. త్వరలోనే నీ ప్రభువు నిన్ను **'మఖామె మహ్మూద్'** కు (ప్రశంసనీయమైన స్థానానికి) చేరుస్తాడు.''[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా తెల్లవారు జామున చేసే ఖుర్ఆన్ పారాయణానికి సాక్ష్యం ఇవ్వబడుతుంది'' అంటే 'ఫజ్ర్ వేళ' అల్లాహ్ దూతలు దివి నుండి భువికి దిగివస్తారు. [2]

మరో హదీసులో ఇలా ఉంది: 'రాత్రి వేళ విధుల్ని నిర్వహించిన దూతలు అల్లాహ్ సన్నిధికి చేరుకున్నపుడు – తనకంతా తెలిసినప్పటికీ – మీరు నా దాసుల్ని ఏ స్థితిలో వదలి వచ్చారు?' అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు. దానికి వారు: 'మేము వారి వద్దకు వెళ్ళినప్పుడు కూడా వారు నమాజులో లీనమై ఉన్నారు. మేము వారివద్ద నుంచి తిరిగి వస్తున్నప్పుడు కూడా వారు నమాజులోనే నిమగ్నులై ఉన్నారు' అని సమాధానమిస్తారు.[3]

---

[1] (సూరతు బనీ ఇస్రాయీల్: 78–79).
[2] (సహీహ్ తిర్మిజీ: 3135, సహీహ్ ఇబ్నుమాజా:670).
[3] (బుఖారీ:522, ముస్లిం:1001).

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: 'ప్రజలలో కొంత మంది అల్లాహ్‌కు అతి దగ్గరవారై ఉండారు.' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు.

యా రసూలల్లాహ్! 'వారెవరూ?' అని కొందరు అడిగారు.

దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'వారు అహ్‌లుల్ ఖుర్‌ఆన్, (ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పారాయణం చేసేవారు, దానిని నేర్పేవారు, నేర్చుకునేవారు) మరియు వారే అల్లాహ్‌కు అతి దగ్గరవారై ఉంటారు, వారు ఆయనకు ప్రత్యేకులు' అని అన్నారు. [1]

హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మీలో ఖుర్‌ఆన్ నేర్చుకొని ఇతరులకు నేర్పించినవారే అందరికంటే ఎక్కువగా మేళ్లు కలిగి ఉన్నవారు.'' [2]

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''నిశ్చయంగా అల్లాహ్ ఈ గ్రంథం కారణంగా కొన్ని జాతుల్ని ఉన్నతమైన స్థితికి పెంచుతాడు. మరికొన్ని జాతుల్ని దీని కారణంగానే అధోగతికి దిగజార్చుతాడు.'' [3]

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) తెలియజేశారు:

---

[1] (నసాయి, ఇబ్ను మాజా, హాకిమ్: సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1432).

[2] (బుఖారీ:4639).

[3] (ముస్లిం:1353).

''సుమధుర స్వరంతో గొంతెత్తి ఖుర్‌ఆన్ పారాయణం చేసే ధైవప్రవక్త కంఠ శ్వరాన్ని శ్రద్ధగా ఆలకించినట్లుగా అల్లాహ్ మరే స్వరాన్నీ ఆలకించడు.'' [1]

సమధుర స్వరంతో ఖుర్‌ఆన్ పారాయణం చేసేవాని పట్ల అల్లాహ్ ప్రసన్నుడయి అతని ఆచరణను అంగీకరిస్తాడు అని అర్థం.

హ|జత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: అన్సార్ జాతికి చెందిన ఒక సహాబీ(అనుచరుడు) మస్జిద్ ఖుబాలో ఇమామత్ చేసేవారు.

ఆయన ప్రతి రకాతు ఆరంభంలో **'ఖుల్‌హువల్లాహు అహద్'** సూరా పఠించిన తరువాత మరొక సూరా చదివేవారు. ఇలాగే ఆయన ప్రతి రకాతులో చేసేవారు.

కొందరు ఆయనను ఇలా అడిగారు? 'నీవు ఆ సూరాను నమాజులో చదవకుంటే నమాజు కానట్టుగా ప్రతి రకాతులో నిత్యం చదువుతుంటావు, నీవు చదివేటుగా ఉంటే ఆ సూరను మాత్రమే చదువు లేకుంటే ఇతర సూరాలను చదువు' అని అన్నారు.

తరువాత ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'చూడండి! నేను ఇలాగే నమాజు చదువుతాను మీకిష్టమైతే నేను మీ కొరకు ఇమామత్ చేస్తాను, మీకు ఇష్టం లేదంటే చెప్పండి ఇమామత్ మానుకుంటాను' అని అన్నారు.

వారిలో అందరికంటే గొప్ప వ్యక్తిగా ఆయనను వారు భావించేవారు. కనుక ఇతరులు ఇమామత్ చేయడం వారికి ఇష్టముండేది కాదు.

[1] (బుఖారీ:4636, ముస్లిం:1319).

చివరికి కొంత మంది ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)వద్దకు పోయి ఈ సమస్య గురించి తెలియజేశారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ వ్యక్తితో:

'వారి కోరిక ప్రకారం (ఇమామత్) చేయుటకై నీకు ఏ విషయం అడ్డు? ఆ సూరానే నీవు ఎందుకు ప్రతి రకాతులో చదవాలనుకుంటున్నావు?' అని అడిగారు.

దానికి ఆ వ్యక్తి: యా రసూలల్లాహ్! 'నేను ఆ సూరా **(ఖులహువల్లాహు అహద్)** ను ఇష్టపడుతున్నాను' అని అన్నారు.

అది విని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో: 'ఆ సూరాను నీవు ఇష్టపడుతున్నావంటే అది నిన్ను స్వర్గానికి తీసుకెళ్తుంది' అని చెప్పారు. [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఖుర్‌ఆన్‌లో ముప్పై వాక్యాలు గల, ఒక సూరా ఉంది. అది (అల్లాహ్ సన్నిధిలో) ఒక వ్యక్తి గురించి సిఫారసు చేసి ఆఖరికి అతనికి క్షమాభిక్ష లభించేలా చేసింది.'' అదే, 'తబారకల్లజీ బియదిహిల్ ముల్కు.' [2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''దివ్య ఖుర్‌ఆన్‌లో ఒక సూరా ఉంది. అది తనను పఠించేవాని తరఫున వాదిస్తుంది. కడకు అతన్ని స్వర్గంలో చేర్పిస్తుంది.'' (మజ్‌మవుజ్ జవాయిద్).

---

[1] (సహీహ్ తిర్మిజీ:2901).

[2] (తిర్మిజీ: 2891, ఇబ్నుమాజా: 3786, అబూదావూద్).

హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: 'తబారకల్లజీ బియదిహిల్ ముల్క్' ప్రతి రాత్రి చదివిన కారణంగా అల్లాహ్ వారిని సమాధి శిక్షనుండి కాపాడుతాడు.' [1]

హ్రజత్ జాబిర్(రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''అలిఫ్ లామ్ మీమ్ తన్జీల్ అస్‌సజ్దా' మరియు 'తబారకల్లజీ' సూరాలు పారాయణం చేసేవరకు నిద్రపోయేవారు కాదు.'' అని తెలిపారు. [2]

హ్రజత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''సూరతుజ్ జుమర్' మరియు 'బనీ ఇస్రాయీల్' సూరాలు పారాయణం చేసేవరకు నిద్రపోయేవారు కాదు.'' అని తెలిపారు.[3]

హ్రజత్ అబ్దుల్లాహ్ ఇబ్ను మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైనా ఖుర్‌ఆన్ గ్రంథంలోని ఒక అక్షరాన్ని చదివితే అతనికి ఒక పుణ్యం లభిస్తుంది. ఆ ఒక్క పుణ్యం పది పుణ్యాలకు సమానంగా ఉంటుంది.'' **నా అభిప్రాయం ప్రకారం: 'అలిఫ్ లామ్ మీమ్**' అనేది ఒకే అక్షరం కాదు. పైగా 'అలిఫ్' ఒక అక్షరం, 'లామ్' ఒక అక్షరం, మీమ్' ఒక అక్షరం' అని అన్నారు.[4]

---

[1] (హాకిమ్, సహీహ్ తర్గీబ్ వత్ తర్హీబ్: 1589).

[2] (సహీహ్ తిర్మిజీ: 2892).

[3] (సహీహ్ తిర్మిజీ: 2892).

[4] (సహీహ్ తిర్మిజీ: 2910, సహీహ్ నసాయి: 2391, హాకిమ్).

## అల్లాహ్ నామస్మరణ కారణంగా ప్రేమించబడతారు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి.– ఉదయం సాయంకాలం ఆయన పవిత్రతను కొనియాడండి.– మీపై తన కారుణ్య అనుగ్రహాలను పంపేవాడు ఆయనే. ఇంకా ఆయన దూతలు కూడా (మీపై కారుణ్యం కురవాలని ప్రార్థిస్తారు) – ఆయన మిమ్మల్ని చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు వైపుకు తీసుకు వచ్చేటందుకు! అల్లాహ్ విశ్వాసుల పాలిట అపార కరుణామయుడు.''[1]

మరోకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే పురుషులు–స్మరించే స్త్రీలు–వీరందరి కోసం అల్లాహ్ (విస్తృతమైన) మన్నింపును, గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.''[2]

హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ వద్ద నాలుగు వచనాలు అన్నిటికంటే ప్రియమైనవి: **''సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు, వల్లాహు అక్బర్...''**[3]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు, వల్లాహు అక్బర్''** అని పలకటం నాకు సూర్యుడు ఉదయించే (ప్రపంచంలోని) వస్తువులన్నిటికంటే ప్రియమైనది.''[4]

---

[1] (సూరతుల్ అహ్‌జాబ్: 41–43).
[2] (సూరతుల్ అహ్‌జాబ్: 35).
[3] (ముస్లిం:3985).
[4] (ముస్లిం:4861).

హజ్రత్ అబూ జర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు: అల్లాహ్ వద్ద అత్యంత ప్రియమైన పలుకు ఏదో నీకు తెల్పనా? అల్లాహ్ వద్ద అత్యంత ప్రియమైన పలుకు **''సుబ్‌హానల్లాహి వబిహమ్దిహీ.''** [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) విన్నారని ఇలా తెలియజేశారు: అల్లాహ్ వద్ద అన్నిటికంటే శ్రేష్ఠమైన **'జిక్ర్'** (స్మరణ) **'' లా ఇలాహ ఇల్లల్లాహు''** మరియు అన్నిటికంటే గొప్ప **'షుక్ర్'** (కృతజ్ఞత) **''అల్ హమ్దులిల్లాహ్''** అని పలకడం. [2]

హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు)కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే **'సుబ్హానల్లాహి వ బిహమ్దిహి'** అని అంటారో, వారి కోసం స్వర్గంలో ఒక ఖర్జూరపు చెట్టు నాటడం జరుగుతుంది.'' [3]

హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో: 'నేను నీకు స్వర్గ నిధుల్లోని ఒక నిధి గురించి తెలుపనా?' అని అన్నారు.

నేను (రజి): యా రసూలల్లాహ్!'తప్పకుండా తెలుపండి' అని అన్నాను. అందుకాయన(స): **'లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్'** అని చెప్పారు. [4]

---

[1] (ముస్లిం:4911).

[2] (సహీహ్ ఇబ్ను హిబ్బాన్: 2326, సిల్‌సిలతుస్ సహీహా: 1528).

[3] (సహీహ్ తిర్మిజీ 3464).

[4] (బుఖారీ:3883, ముస్లిం:4875).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: రెండు వచనాలు నాలికపై చాలా తేలికపైనవి, త్రాసులో చాలా బరువైనవి, మరియు కరుణామయునికి చాలా ప్రియమైనవి, అవి:

**''సుబ్హానల్లాహి వబిహమ్దిహి, సుబ్హానల్లాహిల్ అజీమ్.''** [1]

హజ్రత్ అబూ మాలిక్ అష్అరీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''పరిశుభ్రత సగం విశ్వాసం (ఈమాన్). **'అల్‌హమ్దు లిల్లాహ్'** త్రాసుని నింపేస్తుంది. **'సుబ్‌హానల్లాహి, అల్‌హమ్దు లిల్లాహి,** అనే పలుకులు త్రాసుని నింపేస్తాయి లేక భూమ్యాకాశాల మధ్య ఉన్నదాన్ని (ఖాళీ స్థలం సమానంగా పుణ్యాలతో) నింపేస్తాయి.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ముఫర్రిదూన్‌లు మించిపోయారు'** అని అన్నారు.

ఆ మాట విని సహచరులు: యా రసూలల్లాహ్! **'ముఫర్రిదీన్‌లు అంటే ఎవరు?'** అని అడిగారు.

అందుకు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): **'అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే స్త్రీ, పురుషులు'** అని అన్నారు. [3]

---

[1] (బుఖారీ:5927, ముస్లిం:4860).
[2] (ముస్లిం:328).
[3] (ముస్లిం: 4834).

హజ్రత్ ఇబ్ను మస్‌వూద్ కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: నాకు మేరాజ్ యాత్ర చేయించబడిన రాత్రి నేను ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) గారిని కలిసాను.

అప్పుడాయన నాతో: 'ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! మీ అనుచర సమాజానికి నా తరఫున సలాం చెప్పండి.' **ఇంకా వారికి ఇలా తెలుపండి:** 'స్వర్గంలోని మట్టి శుద్ధమైనది, అక్కడి నీళ్ళు తీయగా ఉంటాయి, అదో చదును మైదానం.

మరియు **'సుబ్‌హానల్లాహి వల్ హమ్దు లిల్లాహి, వలా ఇలాహ ఇలల్లాహు'** అని అంటే అక్కడ ఒక చెట్టుని నాటుకున్నట్లే' అని అన్నారు.[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**'సుబ్‌హానల్లాహి వబిహమ్దిహి'** అని రోజుకు వందసార్లు స్మరించినట్లయితే సముద్రంలో నురుగుకు సమానమైన పాపాలైన సరే క్షమించబడతాయి'' [2]

---

[1] (సహీహ్ తిర్మిజీ:3462).

[2] (సహీహ్ తర్మిజీ: 3466, సహీహ్ ఇబ్ను మాజా: 3812).

# అధ్యాయం–6

## 150–169

## 6– అల్లాహ్ ప్రీతిని పొందుటకు అతి గొప్ప సమయాలు

- ఇస్లాం ధర్మంలో సమయాల వాస్తవికత.
- ముహర్రం నెల విశిష్ఠత.
- రజబ్ నెలవిశిష్ఠత.
- షాబాన్ నెల విశిష్ఠత.
- రమజాన్ నెల విశిష్ఠత.
- జుల్ హజ్జ్ (బక్రీద్) నెల విశిష్ఠత.
- రమజాన్ మరియు జుల్‌హజ్జ్ పది రోజుల విశిష్ఠత.
- ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) విశిష్ఠత.
- జుల్ హజ్జ్ పది రోజులు అల్లాహ్‌కు అతి ప్రియమైనవి.
- ముహర్రం పదొవరోజు విశిష్ఠత.
- షాబాన్ 15వ రాత్రి విశిష్ఠత.
- జుల్‌హజ్జ్ తొమ్మిదవ (అరఫా)రోజు అల్లాహ్ తన దాసులను మెచ్చుకుంటాడు.
- అరఫా రోజు ఉపవాసం విశిష్ఠత.
- శుక్రవారం రోజు విశిష్ఠత.
- సోమ, గురువారాల విశిష్ఠత.

# 6- అల్లాహ్ ప్రీతిని పొందుటకు అతి గొప్ప సమయాలు

## ఇస్లాం ధర్మంలో సమయాల వాస్తవికత:

సమయాలను మనం నెలల క్రమంగా, రోజుల క్రమంగా, అలాగే రాత్రుల క్రమంగా, మరియు సందర్భ సమాయాల క్రమంగా వాటిని తెలుసుకుందాము. ఆయా సమయాలలో అల్లాహ్ ప్రీతిని, ఆయన అనుగ్రహాలను, మరియు ఆ సమయాలలో ఉన్న శుభాలను, వాటి విశిష్టతను ఇక్కడ తెలియజేయడం జరుగుతున్నది. కనుక సమయం గురించి హదీసు ఖుద్సీలో ఇలా ఉంది: అల్లాహ్ ఇలా తెలియజేశాడు; ''ఆదము పుత్రుడు(మానవుడు) కాలాన్ని (రోజులను, నెలలను, సంవత్సరాలను, ఘడియలను) తిట్టుతున్నాడు. మరియు నేనే కాలాన్ని. నా చేతిలోనే రాత్రింబవళ్ళ మార్పిడి ఉన్నది.'' [1]

మరొక చోట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''మీరు కాలాన్ని తిట్టకండి. నిశ్చయంగా అల్లాహ్‌యే కాలము.''** [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మనిషి ఘోర పాపాలకు దూరంగా ఉంటే, ఐదు పూటల నమాజులు, ఒక జుమా నుండి మరొక

---

[1] (బుఖారీ:4452, ముస్లిం:4170).

[2] (ముస్లిం:4165).

జుమా, ఒక రమజాన్ మాసం నుండి మరొక రమజాన్ మాసం వరకు మధ్యకాలంలో జరిగిన పాపాలకు పరిహారమవుతాయి.'' [1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా చేయటం వాటి మధ్యకాలంలో జరిగిన పాపాలన్నిటికీ పరిహారం అవుతుంది....'' [2]

సమయాన్ని మనం ఎలా ఉపయోగిస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. మనం సమయాన్ని పుణ్యాల కొరకు మరియు అల్లాహ్ ప్రీతి కొరకు ఉపయోగిస్తే దానివలన మనకు ప్రతి సమయంలోనూ మంచిదే జరుగుతుంది. ఒకవేళ చెడుగా ఉపయోగించుకుంటే చెడే ప్రాప్తమవుతుంది. దాని వలన కాలాన్ని దూషించటం కూడా మహా పాపమే అవుతుంది.

**వరుస క్రమంగా అరబీ నెలల పేర్లు:**

1)ముహర్రం, 2)సఫర్, 3)రబీవుల్ అవ్వల్, 4)రబీవుస్ సానీ,
5)జమాదివుల్ అవ్వల్(ఊల), 6)జమాదివుస్ సానీ(ఆఖర్)
7)రజబ్, 8)షాబాన్, 9) రమజాన్, 10) షవ్వాల్,
11) జుల్ ఖాయిదా, 12)జుల్ హజ్జా.

**వరుస క్రమంగా అరబీ రోజుల పేర్లు:**

1)యౌముల్ జుముఅ, 2)యౌముస్ సబ్త్, 3)యౌముల్ అహద్,
4)యౌముల్ ఇస్నైన్, 5)యౌముస్ సులసా, 6)యౌముల్ అర్బిఆ,
7)యౌముల్ ఖమీస్.

[1] (ముస్లిం:342).
[2] (బుఖారీ:1650, ముస్లిం:2403).

## ముహర్రం నెల విశిష్ఠత:

అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు: ''నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి) ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.....'' [1]

ఆ నాలుగు మాసాల గురించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కాలం తిరిగి తిరిగి యధాస్థితికి – అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి – వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు విశిష్టమైనవి (పవిత్రమైనవి) వాటిలో మూడు మాసాలు ఒక దాని తరువాత ఒకటి వస్తాయి. అవే జుల్ ఖాయిదా, జుల్ హజ్, ముహర్రం నాల్గవ మాసం రజబ్. ఇది జమాదివుల్ ఆఖిర్ నెలకీ – షాబాన్ నెలకీ మధ్యన ఉంటుంది.''[2]

హ॥జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రమజాన్ తరువాత అల్లాహ్ మాసమయిన ముహర్రం నెలలో పాటించబడే ఉపవాసాలు అత్యంత శ్రేష్ఠమైనవి. అలాగే ఫర్జ్ నమాజుల తరువాత పాటించబడే (నఫిల్) నమాజుల్లో తహజ్జుద్ నమాజు అత్యంత శ్రేష్ఠమైనది.'' [3]

---

[1] (సూరతుతౌబా:36).
[2] (బుఖారీ:2958, ముస్లిం:3179)
[3] (ముస్లిం:1982).

ముహర్రం మాసపు ఘనతను తెలియజేయటానికి దానిని **'అల్లాహ్ మాసం'** అని అనటం జరిగింది. ఉదాహరణకు **అల్లాహ్‌గృహం, అల్లాహ్‌ఒంటె** అని ఖుర్‌ఆన్‌లో పేర్కొనడం జరిగింది. అల్లాహ్ అలా పేర్కొనంత మాత్రన అవి అల్లాహ్‌కు అవసరమైన వస్తువులు అని అర్థం కాదు. కాని అల్లాహ్ వాటి విశిష్ఠతను వివరించటమే దాని ఉద్దేశ్యం.

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధామిస్తూ, **''అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది.''** అని చెప్పారు. [1]

## రజబ్ నెల విశిష్ఠత:

రజబ్ అంటే: అరబీ భాషలో 'గౌరవమైనది, పవిత్రమైనది' కనుక అరబ్ వాసులు ఈ నెలను పవిత్రంగా భావించేవారు మరియు మూఢ (జాహిలియత్) కాలంలో ఈ నెలలో తమ ఆరాధ్యులైన విగ్రహాల పేరున జంతువులను బలినిచ్చేవారు. ఆ జంతువులను వారు 'అతీరా' అని పేర్కోనేవారు. కాని ఇస్లాం ధర్మం వచ్చిన తరువాత ఆ ఆచారాన్ని నిర్మూలించడం జరిగింది.

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) రాక మునుపే, అంటే అనాదిగా రజబ్, జుల్ ఖాయదా, జుల్ హజ్జా మరియు ముహర్రం నెలలను పవిత్రంగా భావించేవారు. ఆ నెలలలో దండయాత్రలు లేక యుద్ధాలు, తగాదాలు వంటి కార్యాలు నిషేధించబడి యున్నవి. దానివల్ల

[1] (ముస్లిం:1976)

ప్రజలు హజ్ నియమాలను శాంతి భద్రతతో నెరవేర్చుటకు అనుకూల మయ్యేది. తరువాత ఆ నిషేధిత ఆదేశం కూడా తొలిగిపోయింది. అనివార్యమైన స్థితిలో ధర్మ యుద్ధాలు చేయవచ్చునని ధర్మ గురువులు ఏకీభవించారు. కాని ఇతర నెలల కంటే ఎక్కువగా ఈ నాలుగు నెలల పవిత్రతను దృష్టిలో ఉంచుకొని పాపాలకు మరియు అల్లాహ్ ఎడల అవిధేయతకు గురికాకుండా జాగ్రత్త పడాలని హితోపదేశం చేశారు.[1]

ఎందుకంటే? ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే కొనసాగుతున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రద మైనవి) ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.....''[2]

## షాబాన్ నెల విశిష్ఠత:

హజ్రత్ ఇమామ్ హాఫిజ్ ఇబ్నే హజ్ర్ (రహ) రజబ్ నెల గురించి ఇలా తెలియజేశారు: ''రజబ్ నెల పవిత్రమైన నెల కనుక అరేబియా ప్రజలు ఈ నెల గడిచిన పిమ్మట నీటి కొరకై అనేక ప్రాంతాల వైపుకు, కొండల వైపుకు బయలుదేరేవారు. కనుక ఈ నెలను షాబాన్ నెల అంటారు.''[3]

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని నేను:

---

[1] (లతాయిఫుల్ మఆరిఫ్).
[2] (సూరతుతౌబా:36).
[3] (ఫత్హుల్‌బారీ:4/251).

ఓ అల్లాహ్ ప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం)! 'మీరు షాబాన్ మాసంలో (అధికంగా) ఉపవాసాలు పాటించినట్లు, ఏ ఇతర మాసాలలో అన్ని ఉపవాసాలను పాటించినట్లు నేను మిమ్మల్ని చూడలేదు' అని అడిగాను.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''రజబ్ మరియు రమజాన్ నెలకి మధ్య ఉన్న షాబాన్ నెల యొక్క వాస్తవం ప్రజలకు తెలియదు. ఈ నెలలో ప్రజలు చేసిన కార్యాలు అల్లాహ్ యందు సమర్పించబడతాయి. కనుక నా పుణ్యకార్యాలు అల్లాహ్ ముందు నేను ఉపవాస స్థితిలో ఉండగా సమర్పించబడాలని ఇష్టపడుతున్నాను'' అని బదులిచ్చారు. [1]

హజ్రత్ అబూ మూసా అల్ అష్అరి (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''షాబాన్ నెల మధ్య(15వ)రాత్రిన అల్లాహ్ బహిర్గతమవుతాడు, బహుదైవారాధకుడిని మరియు సంబంధాన్ని తెంచుకున్నవాడిని తప్ప ప్రతి ఒక్కరిని క్షమిస్తాడు.''[2]

## రమజాన్ నెల విశిష్టత:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''రమజాన్ నెల – ఖుర్ఆన్ అవతరింప జేయబడిన నెల,అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. కనుక మీలో ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసాలుండాలి....'' [3]

---

[1] (సహీహ్ నసాయి:2357).

[2] (సహీహ ఇబ్నుమాజా:1390, సిల్‌సిలతుస్ సహీహ:1144, 1/135).

[3] (సూరతుల్ బఖరా: 185).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయినా రమజాన్ మాసంలో విశ్వాసంతో, పుణ్యఫలా పేక్షతో ఉపవాసం పాటిస్తే, గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రమజాన్ మాసం రాగానే స్వర్గ ద్వారాలు తెరువబడతాయి. నరక ద్వారాలు మూయబడతాయి. షైతానులను బంధించటం జరుగుతుంది.'' [2]

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలందరికన్నా ఎక్కువ దానశీలురు. రమజాన్ మాసంలో జిబ్రయీల్ దూత తనను కలుసుకున్నప్పుడయితే ఆయన ఇంకా ఎక్కువగా దానాలు చేసేవారు. నిజం చెప్పాలంటే జిబ్రయీల్ తనను కలిసినప్పుడు ఆయన ప్రభంజనం కన్నా వేగంగా దానధర్మాలు చేసేవారు. [3]

## జుల్ హజ్జ్ (బక్రీద్) నెల విశిష్ఠత:

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు: ''నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే సాగు తున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి.)

---

[1] (బుఖారీ:37, ముస్లిం:1268).

[2] (బుఖారీ:3035, ముస్లిం:1793).

[3] (బుఖారీ:5, ముస్లిం:4268).

ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి......[1]

ఆ నాలుగు మాసాల గురించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కాలం తిరిగి తిరిగి యధాస్థితికి – అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి – వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు విశిష్టమైనవి (పవిత్రమైనవి) వాటిలో మూడు మాసాలు ఒక దాని తరువాత ఒకటి వస్తాయి. **అవే జుల్ ఖాయిదా, జుల్ హజ్, ముహర్రం నాల్గవ మాసం రజబ్.** ఇది జమాదివుల్ ఆఖిర్ నెలకీ – షాబాన్ నెలకీ మధ్యన ఉంటుంది.''[2]

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అరఫా ఉపవాసం(ఘనత) గురించి విచారించగా, దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు:

''ఆ (ఉపవాసం) గత సంవత్సరానికి మరియు రాబోయే సంవత్సరానికి (పాపాలకు) పరిహారమగును.''[3]

## రమజాన్ మరియు జుల్‌హజ్జ్ పది రోజుల విశిష్టత:

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; రమజాన్ మాసం చివరి దశకం రాగానే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''రాత్రిళ్లు జాగారం చేసేవారు. తమ ఇంటివారిని కూడా మేల్కొలిపేవారు. నడుం బిగించి బాగా, ముమ్మరంగా ఆరాధన చేసేవారు.''[4]

---

[1] (సూరతుతౌబా:36).
[2] (బుఖారీ:2958, ముస్లిం:3179).
[3] (ముస్లిం:1976).
[4] (బుఖారీ:1884, ముస్లిం:2008).

''రమజాన్ మాసపు చివరి దశకంలో ఏతెకాఫ్ కోసం కూర్చునేవారు. మరియు ఘనమైన రేయిని మీరు రమజాన్ మాసపు చివరి దశకంలో అన్వేశించండి'' అని ఉపదేశించేవారు.[1]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఘనమైన రేయిని మీరు రమజాన్ మాసపు చివరి దశకంలోని బేసి రాత్రుల్లో అన్వేషించండి.''[2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం: నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని:

'ఓ అల్లాహ్ ప్రవక్తా! ఒకవేళ ఘనమైన రేయి ఏదో కనుగొంటే ఆ రాత్రి నేను ఏమని ప్రార్థించాలో కాస్త చెబుతారా?' అని అడిగాను.

అందుకాయన: **''అల్లాహుమ్మ ఇన్నక అఫువున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ''** (అల్లాహ్ నీవు అమితంగా మన్నించేవాడవు. మన్నింపును ఇష్టపడతావు. కనుక నన్ను మన్నించు). ప్రార్థించమని ఉపదేశించారు.[3]

## ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) విశిష్ఠత:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్‌ఆనును) ఘనమైన రాత్రి యందు అవతరింపజేసాము. – ఘనమైన రాత్రి గురించి నువ్వేమనుకున్నావు? – ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ(జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ)

---

[1] (బుఖారీ:1896, ముస్లిం:1996).
[2] (బుఖారీ:1881).
[3] (సహీహ్ తిర్మిజీ:3513).

నిమిత్తం (దివి నుంచి భువికి) దిగివస్తారు. - ఆ రాత్రి ఆసాంతం శాంతియుతమైనది- తెల్లవారే వరకూ (అది ఉంటుంది).'' [1]

అంటే? - ఈ రాత్రి యందు చేసే దైవారాధన వెయ్యి మాసాలలో చేసే ఆరాధనకంటే కూడా గొప్పది. వెయ్యి మాసాలంటే మామూలు విషయమా? 83 సంవత్సరాల 4 నెలలన్నమాట! అతి తక్కువ కాలంలో అత్యంత అధికంగా పుణ్యం సంపాదించుకునేందుకు వీలుగా, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజంపై అల్లాహ్ చేసిన మహోపకారం ఇది. [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే విశ్వాసంతో, పుణ్యఫలా పేక్షతో ఘనమైన రేయిలో నమాజు చేస్తూ నిలబడ్డాడో (అల్లాహ్ ఆరాధన చేశారో)గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి.'' [3]

## జుల్ హజ్జ్ పది రోజులు అల్లాహ్‌కు అతి ప్రియమైనవి:

అల్లాహ్‌ను విశ్వసించే దాసులు పుణ్యకార్యాల కొరకు జుల్ హజ్జ్ నెల ప్రథమ పది రోజులను ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే? ఈ రోజులలో కొద్దిపాటి సమయంలో చేసే పుణ్యకార్యాలకు అధిక సంఖ్యలో పుణ్యాలు ప్రాప్తమవుతాయి. కనుక ఈ పది రోజుల ప్రాముఖ్యం గురించి అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''ఉషోదయం సాక్షిగా!-పది రాత్రుల (జుల్‌హజ్జ్ పది రోజుల)సాక్షిగా!''** [4]

---

[1] (సూరతుల్ ఖద్ర్).
[2] (తఫ్సీర్ అహ్సనుల్ బయాన్ తెలుగు: 2733).
[3] (బుఖారీ:34, ముస్లిం:1268).
[4] (సూరతుల్ ఫజ్ర్:1-2).

ఇమామ్ ఇబ్ను కసీర్ (రహ) గారు; 'తఫ్సీర్ ఇబ్ను కసీర్' లో ఇలా తెలియజేశారు: హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజియల్లాహు అన్హు) గారు పది రాత్రులు అనగా! **'అవి జుల్ హజ్జ్ మొదటి పది రోజులు'** అని తెలియజేశారు.

మరియు హ|జత్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''జుల్ హజ్జ్ నెలలోని ప్రథమ దశకంలో చేసిన పుణ్యకార్యాలు అల్లాహ్‌కు అన్నిటికన్నా ఎక్కువ ప్రియమైనవి.'' అని అన్నారు.

అది విని సహచరులు అశ్చర్య పడుతూ!: ''ఓ అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ మార్గంలో చేయబడే పోరాటం కూడా దీనంతగా ప్రియమైనది కాదా?'' అని అడిగారు.

దానికి సమాధానమిస్తూ: ''అల్లాహ్ మార్గంలో చేయబడిన పోరాటం కూడా (ప్రియమైనది) కాదు. ఒక వేళ ఎవరయినా ధన ప్రాణాలు సమేతంగా బయలుదేరి వాటిలో ఏదీ తిరిగిరాకపోతే (అల్లాహ్ మార్గంలో వీరమరణం పొందితే మాత్రం అతనే శ్రేష్ఠుడు)'' అని చెప్పారు. [1]

షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్ను తైమియా (రహ) గారితో కొందరు: 'రమజాన్ చివరి దశకం ఎక్కువ శ్రేష్ఠమైనదా? లేక జుల్ హజ్జ్ ప్రథమ దశకం శ్రేష్ఠమైదా?' అని అడిగారు.

దానికి ఆయన జవాబు ఈ విధంగా ఇచ్చారు: ''రమజాన్ చివరి పది రాత్రులు జుల్ హజ్జ్ ప్రథమ పది రాత్రులకంటే శ్రేష్ఠమైనవి, ఎందుకంటే? దానిలో **లైలతుల్ ఖద్ర్** ఉంది. అది అన్ని రాత్రుల కంటే గొప్పరాత్రి.

---

[1] (బుఖారీ:916).

మరియు జుల్‌హజ్జ్ ప్రథమ దశకం పగలు రమజాన్ చివరి దశకం పగలు కన్నా శ్రేష్ఠమైనవి, ఎందుకంటే? దీనిలో **అరఫా రోజు** ఉంది. ఆ రోజు అన్ని రోజుల కంటే ఎంతో శ్రేష్ఠమైన, ఘనమైన రోజు.'' [1]

## ముహర్రం పదోవరోజు విశిష్ఠత:

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, 'అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది' అని చెప్పారు. [2]

## షాబాన్ 15వ రాత్రి విశిష్ఠత:

హజ్రత్ అబూ మూసా అల్ అష్అరి (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''షాబాన్ నెల మధ్య (15వ)రాత్రిన అల్లాహ్ బహిర్గతమవుతాడు, బహుదైవారాధకుడిని మరియు సంబంధాన్ని తెంచుకున్నవాడిని తప్ప ప్రతి ఒక్కరిని క్షమిస్తాడు.'' [3]

షాబాన్ నెల మధ్య (15వ) రాత్రి లేక పగలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రత్యేకమైన ఆరాధనలు చేసినట్లు లేక ఆరాధనలు పాటించమని ఆదేశించినట్లు ఆధారాలు లేవు. సమాజంలో కొంత మంది

---

[1] (మజ్మూవుల్ ఫతావా).

[2] (ముస్లిం:1977).

[3] (ఇబ్నుమాజా:1390, సిల్‌సిలతుస్ సహీహ:1562).

కొన్ని ప్రత్యేకమైన ఆరాధనలను రాత్రి మరియు పగలు పాటించాలని కొన్ని నిరాధారమైన హదీసులను ప్రచురించారు.వాటి ప్రకారం ఆచరించడం ఎంత మాత్రం ధర్మం కాదు.

## జుల్‌హజ్జ్ తొమ్మిదవ (అరఫా)రోజు అల్లాహ్ తన దాసులను మెచ్చుకుంటాడు:

కనుక హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; నిశ్చయంగా అరఫా రోజు సాయంత్రం అరఫా(మైదానం)లో బస చేసిన వారి గురించి అల్లాహ్ తన దూతల ముందు గొప్పలు చెప్పుకుం టున్నాడు. ఆయన ఇలా అంటాడు:

**చూడండీ!** ''నా దాసులను వారు నా వద్దకు తమ వెంట్రుకలు చిందరవొందరగా, దుమ్ముధూళియైన స్థితిలో సదూర ప్రాంతాల నుండి వచ్చారు. నా కరుణపై (స్వర్గం మీద) ఆశతో వచ్చారు. నా శిక్ష నుండి భయపడుతూ వాచ్చారు.అయినా వారు నన్ను చూడలేదు. ఒకవేళ వారు నన్ను చూసినట్లయితే వారి వ్యవహారం ఎలా ఉంటుంది?

వారి పాపాలు వారి మీద ఇసుక సంఖ్యకు సమానమైన. లేక ఇహలోకపు రోజులకు సమానమైన లేక వర్షం బిందువుల సంఖ్యకు సమానమైన పాపాలను అల్లాహ్ మీ నుండి కడిగి వేస్తాడు.

ఇంకా మీరు జమ్రాత్(షైతాన్ చిహ్నం)పై గులకరాళ్ళు విసరినందుకు మీ కొరకై పుణ్యాలు సమకూర్చుతాడు, మీరు తలనీలలు అర్పించినందుకు ప్రతి వెంట్రుకకు బదులుగా ఒక పుణ్యం ప్రసాదిస్తాడు. మరియు (కాబతుల్లాహ్) ప్రదక్షణ చేసినందకు సర్వపాపాల నుంచి పునీతులుగా

చేస్తాడు ఎలాగైతే మీరు మాతృ గర్భం నుంచి పాపాలు లేకుండా పునీతులుగా జన్మించినారో.'' [1]

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రజియల్లాహు అన్హు) తన తండ్రి నుండి ఆయన తన తాత నుండి చేసిన కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రార్థనల్లో అరఫా రోజు చేసే ప్రార్థన (ఎంతో ఘనమైనది). నేను మరియు నా కంటే ముందు పంపబడిన ప్రవక్తలు పలికిన పదాలు ఎంతో శ్రేష్ఠమైనవి. అవి: **''లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లా షరీక లహు లహుల్ ముల్కు, వలహుల్ హమ్దు, వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్.''** [2]

## అరఫా రోజు ఉపవాసం విశిష్ఠత:

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అరఫా ఉపవాసం (ఘనత) గురించి విచారించగా, దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు: ''ఆ (ఉపవాసం) గత సంవత్సరానికి మరియు రాబోయే సంవత్సరానికి (పాపాలకు) పరిహారమగును.'' [3]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''అల్లాహ్ తన దాసులను అరఫా రోజు నరకాగ్ని నుండి విముక్తిని ప్రసాదించినంతగా మరే రోజులోనూ ప్రసాదించడు.'' [4]

---

[1] (తబ్రానీ వ హస్సనహు అల్బానీ ఫీల్ జామిఅస్ సగీర్: 1360).
[2] (సహీహ్ తిర్మిజీ: 3585).
[3] (ముస్లిం:1977).
[4] (ముస్లిం:2402).

## శుక్రవారం రోజు విశిష్ఠత:

ప్రతి వారంలో శుక్రవారానికి మరియు సోమవారానికి, గురువారానికి ఆరాధనల కారణంగా ప్రాముఖ్యత ఉంది. ఆరాధనలు పాటించని పక్షంలో వారికి ఎలాంటి ప్రాముఖ్యత లేదు. మరియు శుక్రవారం విశ్వాసులు సామూహికంగా ఆరాధనలు ఆచరించాలని ఆజ్ఞాపించబడింది. కనుక అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

‘‘ఓ విశ్వాసులారా! శుక్రవారం నమాజుకు పిలువబడినప్పుడు మీరు అల్లాహ్ నామమును స్మరించడానికి పరుగెత్తండి.’’ [1]

ముస్లిం సమాజానికి అల్లాహ్ ప్రసాదించిన అనేక వరాలలో శుక్రవారం కూడా ఒకటి. ఇది ఎంతో శ్రేష్ఠమైనది. ముస్లిములకు అల్లాహ్ ఆ రోజును ప్రత్యేక ప్రార్థనాదినంగా చేశాడు. ఈ ప్రత్యేక దినం యూదులకు, క్రైస్తవులకు లభించలేదు.

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘మా కంటే ముందువున్న యావత్తు అనుచర సమాజాలకు ఎంతో శ్రేష్ఠమైన శుక్రవారం రోజు లభించలేదు. శనివారం యూదులకు లభించింది. ఆదివారం క్రైస్తవులకు లభించింది. తరువాత అల్లాహ్ మనల్ని సృష్టించాడు, శుక్రవారాన్ని ప్రసాదించాడు. ఇలా శుక్రవారం, శనివారం, ఆదివారం వరుసగా చేశాడు. ప్రళయ దినాన వారు మనకంటే వెనుక ఉంటారు. కాని ప్రపంచంలో మనం యూవత్తు అనుచర సమాజాలకంటే వెనుక వచ్చాము. అయితే ప్రళయ

---

[1] (సూరతుల్ జుమా:9).

దినాన యావత్తు అనుచర సమాజాలలో మొట్టమొదట మనకే తీర్పు జరుగుతుంది.'' [1]

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సూర్యుడు ఉదయించిన రోజుల్లో అన్నిటికంటే శ్రేష్ఠమైనది అది శుక్రవారం రోజు. శుక్రవారం రోజే ఆదం (అలైహిస్సలామ్) గారు సృష్టించబడ్డారు. శుక్రవారం రోజే ఆయన స్వర్గానికి ప్రవేశింపబడ్డారు. శుక్రవారం రోజే స్వర్గం నుండి వెలికి తీయబడ్డారు. మరియు శుక్రవారం రోజే ప్రళయం కూడా రానున్నది.'' [2]

హ|జత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే శుక్రవారం రోజు **'సూరతుల్ కహఫ్'** పఠిస్తారో వారి కొరకై వచ్చే శుక్రవారం వరకు కాంతి ప్రసాదించబడుతుంది. అది వారిని ప్రకాశవంతంగా ఉంచుతుంది. [3]

అల్లామా ఇబ్నుల్ ఖయ్యూమ్ (రహ) ఇలా ఉల్లేఖించారు: ''నెలల్లో రమజాన్ నెలకు ప్రత్యేకత ఉన్నట్లే శుక్రవారానికి ఓ ప్రత్యేకత ఉంది. అలాగే రమజాను నెలలో ఓ ఘనమైన శుభరాత్రి ఉన్నట్లే ఈ దినములో కూడా శుభ ఘడియ ఒకటి ఉంది.'' [4]

---

[1] (ముస్లిం:1415).

[2] (ముస్లిం:1410).

[3] (హాకిమ్:3349, (అత్తర్‌గీబ్ వత్తర్హీబ్:736 సహీహ్ అల్బాని).

[4] (జాదుల్ మఆద్:1/398).

కనుక హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా శుక్రవారం రోజున ఒక ఘడియ ఉన్నది ఆ ఘడియలో ఎవరైనా ముస్లిం నమాజు స్థితిలో అల్లాహ్‌ని ఏదైనా వేడుకుంటే అల్లాహ్ అతని కోరికను కచ్చితంగా తీరుస్తాడు. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ సంగతి చెబుతూ: **'ఆ ఘడియ అతి స్వల్పంగా ఉంటుందనీ చేత్తో సైగ చేశారు.'** [1]

అల్లామా ఇబ్నుల్ ఖయ్యూమ్ (రహ) ఆ ఘడియను సహీహ్ హదీసుల వెలుగులో పరిశీలించి రెండు సమయాలను ఇలా స్పష్టం చేశారు.

**(1) ఆ శుభఘడియ:** ఇమాము ప్రసంగానికై వేదికపై కూర్చునప్పటి నుంచి నమాజ్ ముగిసే వరకు మధ్యకాలంలో ఉంటుంది. [2]

**(2)ఆ శుభఘడియ:** అస్ర్ మరియు మగ్రిబ్ నమాజుల మధ్యకాలంలో ఉంటుంది. [3]

హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక వ్యక్తి శుక్రవారం రోజు స్నానం చేసి, వీలైనంత వరకు శుచి శుభ్రతను పాటించి, నూనె రాసుకొని లేక తన ఇంట్లో ఉన్న పరిమళాన్ని పూసుకొని, ఆ తర్వాత (మసీదుకు)వెళ్ళి, (అక్కడ) ఏ ఇద్దరి మధ్యనుంచి కూడా తోసుకొని వెళ్ళకుండా, (మీకంటే ముందుగా కూర్చున్నవారిని

---

[1] (బుఖారీ:883, ముస్లిం:1406).
[2] (ముస్లిం:1409).
[3] (జాదుల్ మఆద్:1/389-390).

అటూఇటూ జరిపి కూర్చోడానికి ప్రయత్నం చేయకూడదు. ఎక్కడ ఖాళి స్థలం ఉంటే అక్కడే కూర్చోవాలి.) తన అదృష్టంలో వ్రాసిఉన్న నమాజు చేసుకొని, ఆ తర్వాత ఇమాము ప్రసంగిస్తే నిశ్శబ్ధముగా కూర్చుంటే, ఆ శుక్రవారం నుండి మరొక శుక్రవారం వరకు అతనివల్ల జరిగే పాపాలు మన్నించబడతాయి.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఒక్క శుక్రవారం తప్ప ప్రతి రోజు నరకాగ్ని రగిలించబడుతుంది.'' [2]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఏ ముస్లిముకయితే శుక్రవారము రాత్రి లేక పగలు మరణం సంభవిస్తుందో వారిని సమాధి శిక్షకు గురికానివ్వడు.'' [3]

## సోమ, గురువారాల విశిష్ఠత:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సోమ మరియు గురువారాల్లో స్వర్గ ద్వారాలు తెరవబడతాయి. ఆ రోజు అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ సాటి కల్పించనివారి ప్రతి ఒక్కరి పాపాలు మన్నించ బడతాయి. కాని తనకూ తన తోటి (ముస్లిం) సోదరునికి మధ్య శత్రుత్వ మున్నవాని పాపాలు మాత్రం మన్నించబడవు.'

---

[1] (బుఖారీ:834).
[2] (జాదుల్ మఆద్:1/387).
[3] (సహీహ్ తిర్మిజీ:1074, అహ్మద్:6294, (సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్హీబ్:3562).

వారి గురించి: **''వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి!''** అని అనటం జరుగుతుంది. [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సోమ మరియు గురువారాల్లో (అల్లాహ్ సన్నిధిలో దాసుల) ఆచరణలు ప్రవేశపెట్టబడతాయి. అందుకని నేను ఉపవాసిగా ఉన్న స్థితిలో నా ఆచరణ ప్రవేశపెట్టబడడాన్ని నేనిష్టపడతాను.'' [2]

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని సోమవారం ఉపవాసం గురించి విచారించటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, ''అది నా పుట్టిన రోజు మరియు నేను ప్రవక్తగా నియమించబడిన రోజు లేక నాపై వహీ అవతరణ ప్రారంభమైన రోజు'' అని వివరించారు. [3]

---

[1] (ముస్లిం:4652).
[2] (సహీహ్ తిర్మిజీ:747).
[3] (ముస్లిం:1977).

# అధ్యాయం–7

170–173

# 7–ప్రత్యేకమైన సందర్భాల్లో చేసే ప్రార్థనలను అల్లాహ్ తప్పక ఆలకిస్తాడు

- అజాన్ మరియు ఇఖామత్ సమయం.
- అల్లాహ్ మార్గంలో యుద్ధం చేసే సమయం.
- వర్షం కురుస్తున్నప్పుడు అల్లాహ్ కారుణ్యం అవతరిస్తుంది.
- శుక్రవారం రోజు.
- అర్థ రాత్రి సమయం.

# 7-ప్రత్యేకమైన సంధర్భాల్లో చేసే ప్రార్థనలను అల్లాహ్ తప్పక ఆలకిస్తాడు

## అజాన్ మరియు ఇఖామత్ సమయం:

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'అజాన్ మరియు ఇఖామత్‌ల మధ్య చేయబడే ప్రార్థన త్రోసిపుచ్చబడదు' అని అన్నారు.

**యా రసూలల్లాహ్!** అప్పుడు మనం ఏమని దుఆ చేయాలి? అని అడిగారు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'మీరు అల్లాహ్ వద్ద ఇహలోకంలోనూ, పరలోకంలోనూ క్షేమాన్ని ప్రసాదించమనీ వేడుకోండి'** అని అన్నారు.[1]

## అల్లాహ్ మార్గంలో యుద్ధం చేసే సమయం:

హజ్రత్ సహల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''రెండు ప్రార్థనలు త్రోసిపుచ్చబడవు. లేక అవి త్రోసిపుచ్చబడటం అనేది జరగదు'' వాటిలో:

**ఒకటి:** ''అజాన్ సమయంలో చేయబడే ప్రార్థన.''

**రెండవది:** ''ఇరుపక్షాలు తలపడి యుద్ధం చేసుకున్నప్పుడు చేసుకునే ప్రార్థన'' అని అన్నారు.[2]

---

[1] (సహీహ్ తిర్మిజీ:3594).

[2] (సహీహ్ అబూదావూద్:2540, సహీహ్ ఇబ్ను ఖుజైమా:412).

## వర్షం కురుస్తున్నప్పుడు అల్లాహ్ కారుణ్యం అవతరిస్తుంది:

హ్రజత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక రోజు మనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో ఉండగా వర్షం కురిసింది.
అప్పుడు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ వర్షం బిందువులు ఆయనపై కురువాలని తమ శరీరంపై నుండి దుస్తులను కొద్దిగా తొలగించారు.
మేము ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో: 'అలా మీరు ఎందుకు చేశారు?' అని అడిగాము.
దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఇప్పుడిప్పుడే తమ ప్రభువు వైపు నుండి అనుగ్రహం (వర్షం) కురిసింది' అని అన్నారు. [1]

హ్రజత్ సహల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''రెండు ప్రార్థనలు త్రోసిపుచ్చబడవు'' వాటిలో :
**ఒకటి:** 'అజాన్ సమయంలో చేయబడే ప్రార్థన'
**రెండవది:** 'వర్షం క్రింద (కురుస్తుండగా)' అని అన్నారు.[2]

హ్రజత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: పెనుగాలులు మరియు కారుమబ్బులు క్రమ్ముకుంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ముఖ కవళికలు కారణంగా తెలిసిపోయేది.
''ఆయన ముందుకు మరియు వెనక్కి తిరిగేవారు. వర్షం కురిసిందంటే ఆనందించేవారు. మరియు ఆయన ఆందోళన ఛాయలు తొలిగిపోయేవి.''

---

[1] (ముస్లిం:1494).
[2] (సహీహ్ అబూదావూద్:2178, సహీహ్ అల్ జామే: 3078).

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) గారు ఆ పరిస్థితి గురించి ప్రవక్త(స) గారితో ప్రశ్నించగా, ప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

**ఆయిషా!** ''ఆ మేఘాలు నా ఉమ్మత్ (సముదాయం)పై ఆపదగా పడుతాయేమోననీ ఆందోళన చెందుతాను. మరియు నేను వర్షం కుర్తుండగా చూస్తే (అల్లాహ్) కారుణ్యంగా భావిస్తాను.'' [1]

## శుక్రవారం రోజు:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''నిశ్చయంగా శుక్రవారం రోజున ఒక ఘడియ ఉన్నది ఆ ఘడియలో ఎవరైనా ముస్లిం నమాజు స్థితిలో అల్లాహ్‌ని ఏదైనా వేడుకుంటే అల్లాహ్ అతని కోరికను కచ్చితంగా తీరుస్తాడు.'' ప్రవక్త (స) ఈ సంగతి చెబుతూ: **''ఆ ఘడియ అతి స్వల్పంగా ఉంటుందనీ''** చేత్తో సైగ చేశారు. [2]

## అర్ధ రాత్రి సమయం:

హజ్రత్ అబూ ఉమామా (రజియల్లాహు అన్హు) కథనం; హజ్రత్ అమ్ర్ బిన్ అబసా (రజియల్లాహు అన్హు) విన్నారని ఇలా తెలియజేశారు:

''దాసుడు తన ప్రభువుకి అత్యంత సన్నిహితంగా ఉండే సమయం అర్ధరాత్రి చివరి జామున. నీవు గనుక ఆ సమయంలో అల్లాహ్‌ను ప్రార్థన చేయాలనుకుంటే చెయ్యి.'' [3]

---

[1] (ముస్లిం:1495).

[2] (బుఖారీ:883, ముస్లిం:1406).

[3] (సహీహ్ తిర్మిజీ:3579, హాకిమ్:1/453, అబూదావూద్).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించగా తాను విన్నానని హ|జత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) తెలియజేశారు:

''నిశ్చయంగా రాత్రిపూట ఒక ఘడియ వస్తుంది. ముస్లిం వ్యక్తి ఎవరైనా ఆ ఘడియను పొంది, ఆ సమయంలో అల్లాహ్‌ను, ఇహపరాల వ్యవహారాలకు సంబంధించిన ఏదయినా మంచిని కోరుకుంటే అల్లాహ్ తప్పకుండా ప్రసాదిస్తాడు'' ఆ ఘడియ ప్రతి రాత్రి వస్తుంది. [1]

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''అల్లాహ్ ప్రతి రోజు రాత్రి మూడొవ వంతు చివరి సమయం ఉండగా భూ ఆకాశానికి దిగి వస్తాడు, నన్ను ప్రార్థించేవారు ఎవరైనా ఉన్నారా! వారి ప్రార్థనను నేను ఆలకిస్తాను. ఏమైన కోరుకున్నట్లయితే వారి కోరికను తీర్చుతాను, ఎవరైన క్షమాపణ కోరితే వారిని క్షమిస్తాను'' అని అంటాడు. [2]

హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

అల్లాహ్ రాత్రి మూడొవ వంతు చివరి సమయం ఉండగా భూ ఆకాశానికి దిగి వస్తాడు, తరువాత ఆకాశ ద్వారాలు తెరవబడుతాయి, తరువాత అల్లాహ్ తన చేతిని చాచుతాడు. తరువాత ఇలా అంటాడు:

**'ఎవరైనా మొరపెట్టుకునేవారున్నారా? వారి మొరను ఆలకిస్తాను.'**

ఇదే ప్రకారం ఫజ్ర్ సమయం అయ్యే వరకూ (అడగటం) జరుగుతూనే ఉంటుంది.' [3]

---

[1] (ముస్లిం:1259).

[2] (బుఖారీ:1077, ముస్లిం:1261).

[3] (అహ్మద్:3491, ఇబ్ను ఖుజైమా:89, ఇర్వావుల్ గలీల్ లిల్ అల్బానీ).

# అధ్యాయం-8

175-178

## 8-అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన స్థలాలు

- ప్రపంచంలోనే అతి విశిష్ఠమైన మసీదులు.

# 8-అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన స్థలాలు

అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''మరియు నిశ్చయంగా, మస్జిదులు అల్లాహ్‌ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కావున వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ ప్రార్థించకండి.'' [1]

హ్రజత్‌ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్థలాలన్నిటిలో అల్లాహ్‌కు అతి ప్రియమైన స్థలాలు మస్జిదులు (ప్రార్థనాస్థలాలు). అలాగే ప్రదేశా లన్నిటిలో అత్యంత అయిష్టకరమైన ప్రదేశాలు బజారులు.'' [2]

హ్రజత్‌ ఉస్మాన్‌ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''కేవలం అల్లాహ్‌ ప్రసన్నత కోసం ఎవరైనా మస్జిదు నిర్మిస్తే అతని కోసం అల్లాహ్‌ అలాంటిదే ఒక ఇల్లు స్వర్గంలో నిర్మిస్తాడు.'' [3]

హ్రజత్‌ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''నా ఇంటికి మరియు నా మెంబరు (మదీనా మస్జిద్‌లో బయాన్‌ చేసే వేదిక)కు మధ్య ఉన్న స్థలం స్వర్గపు తోటలలో నుండి ఒక తోట.'' [4]

హ్రజత్‌ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఉల్లేఖించారు: ''ఇండ్లల్లో (మరియు పేటల్లో) నమాజ్‌ చేసే స్థలాలను నిర్ధారించుకోవాలనీ, వాటిని

---

[1] (సూరతుల్‌ జిన్‌: 18).
[2] (ముస్లిం:1076).
[3] (బుఖారీ:431, ముస్లిం:829).
[4] (బుఖారీ:1120, ముస్లిం::2463).

పరిశుభ్రంగా ఉంచుకోవాలని'' ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశించారు. [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఏ వ్యక్తి అయినా అల్లాహ్‌ను స్మరించనటువంటి సభలో కూర్చుంటే,ఆ సభ అల్లాహ్ తరఫున నష్టాన్ని పొందుటకు కారణమవుతుంది. మరియు ఏ వ్యక్తి అయినా అల్లాహ్‌ను స్మరించనటువంటి స్థలములో పడుకుంటాడో, ఆ స్థలము అతనికి అల్లాహ్ తరఫున నష్టాన్ని పొందుటకు కారణముతుంది.''[2]

## ప్రపంచంలోనే అతి విశిష్ఠమైన మసీదులు:

హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''**కాబతుల్లాహ్‌లో** ఒక నమాజు ఆచరిస్తే లభించే పుణ్యం ఇతర మసీదులలో లక్ష నమాజులను ఆచరించడం కంటే మేలైనది.'' [3]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''**మస్జిదే ఖుబా** (మదీనాలో ఉన్న ఒక మసీదు)లో నమాజు ఆచరిస్తే ఉమ్రా చేసినంత పుణ్యం లభిస్తుంది.'' [4]

హజ్రత్ అబూ ఉమామ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే తమ

---

[1] (అహ్మద్:25182, సహీహ్ అబూదావూద్:455, సహీహ్ తిర్మిజీ:594).

[2] (అబూదావూద్:4856, సహీహుల్ జామే: 5/342).

[3] (సహీహ్ ఇబ్ను మాజా:1406).

[4] (సహీహుల్ జామే:3872, సహీహ్ ఇబ్నుమాజా:1411).

ఇంటి నుండి చక్కగా వుజూ చేసుకొని వచ్చి మస్జిదే ఖుబా లో నాలుగు రకాతులు నమజు చేస్తే ఉమ్రా చేసినంత పుణ్యం లభిస్తుంది.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మస్జిదే నబవీలో ఒక నమాజు ఆచరిస్తే (లభించే పుణ్యం) కాబతుల్లాహ్‌లో తప్ప, ఇతర మసీదులలో వెయ్యి నమాజులను ఆచరించడం కంటే మేలైనది.'' [2]

హజ్రత్ అబూ జర్ (రజియల్లాహు అన్హు) కథనం; మేము ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సమక్షంలో మస్జిదే నబవీ మేలైనదా? లేక మస్జిదే అఖ్సా మేలైనదా? అని సంభాషించుచుండగా అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మస్జిదే అఖ్సాలో నాలుగు నమాజులు ఆచరిస్తే (లభించే పుణ్యం), మస్జిదే నబవీలో ఆచరించిన ఒక నమాజుతో సమానమైనది.''[3]

**అల్లాహ్ ప్రియ దాసులారా!**

అల్లాహ్ తఆలా హక్కులను (ఆరాధనలను) మనం సక్రమంగా తీర్చినట్లయితే ఆయన ఎంతగానో మమ్మల్ని ప్రేమిస్తాడు. మరియు

---

[1] (ముసన్నద్ అబూషైబా: 55, అస్సమరుల్ ముస్తతాబ్: 1/570).

[2] (ముస్లిం:2469).

[3] (అల్ ముస్తద్‌రక్ లిల్‌హాకిమ్:8553, అస్సమరుల్ ముస్తతాబ్: అల్బాని: 1/547).

మస్జిదే అఖ్సా విశిష్టత గురించి అనేక హదీసులు ఉన్నాయి. కొన్ని హదీసులలో అక్కడ నమాజు ఆచరించే పుణ్యం వెయ్యి నమాజులతో సమానమనీ, మరి కొన్ని హదీసులలో యాభై వేల నమాజులతో సమానమనీ తెలుస్తుంది. కాని ఆ హదీసులన్ని వివిధ కారణాల వలన ప్రామాణికమైనవి కావనీ ఇమామ్ నాసిరుద్దీన్ అల్బానీ (రహ)గారి హదీసు గ్రంథాల ద్వారా రూఢి అవుతున్నాయి.

పైన ఇవ్వబడిన హదీసు ప్రామాణికమైన హదీసుగా అల్లామా నాసిరుద్దీన్ అల్బానీ(రహ) గారు నిర్ధారించారు. ఆ హదీసు ప్రకారం మస్జిదే అఖ్సాలో నమాజు ఆచరించే వారికి లభ్యమయ్యే పుణ్యం 250 నమాజులకు సమానమైనదిగా తెలుస్తుంది. (వాల్లాహు ఆలమ్).

ఆదరిస్తాడు. అల్లాహ్ తన కారుణ్యాన్ని మాపై కురిపించి రక్షిస్తాడు. మరియు చిన్న చిన్న ఆరాధనలకు బదులుగా రెట్టింపు పుణ్యాలను ప్రసాదిస్తాడు. ఆ వివరాలను మనం అనేక ఖుర్‌ఆన్ ఆయతుల ఆధారంగా మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రామాణికమైన హదీసుల ఆధారంగా గ్రహించాము. కనుక మనమందరం ఆ విధానాలకు అనుగుణంగా నడుచుకొని అల్లాహ్ సమక్షంలో ప్రీతి పాత్రులమైన దాసులలో చేరిపోవాలని అల్లాహ్‌ను వేడుకుందాము.

# అధ్యాయం-9

## 180-188

## 9- ధర్మాన్ని నేర్చుకోవటం మరియు దాన్ని విస్తరింపజేయటం

- అల్లాహ్ తన ప్రియమైన దాసులకు ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు
- ధర్మ జ్ఞానం బోధించేవారిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని కురిపిస్తాడు.
- పరస్పరం ఉపన్యాసం చేసుకునే విశిష్టత.
- అల్లాహ్‌కు ప్రియమైన సభ, సమావేశం.

# 9– ధర్మాన్ని నేర్చుకోవటం మరియు దాన్ని విస్తరింపజేయటం

## అల్లాహ్ తన ప్రియమైన దాసులకు ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు:

ఖుర్ఆన్ మరియు హదీసుల జ్ఞానం దివ్యజ్ఞానం. అల్లాహ్ గురించి మనం ఎంతగా తెలుసుకుంటామో అంతగానే మనకు అల్లాహ్ గొప్పతనం మరియు మహోన్నత గురించి తెలుస్తుంది. దాని కారణంగా మా విశ్వాసం అల్లాహ్ పట్ల మరింత పెరుగుతుంది. ఇంకా మనకు అల్లాహ్ మీద పూర్తి విశ్వాసం మరియు తృప్తి కలుగుతుంది. అందుకనే అల్లాహ్ తఆలా ధర్మజ్ఞానం కలవారికి స్వర్గంలో ప్రత్యేకమైన అంతస్తులు ప్రసాదిస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''జ్ఞానం ప్రసాదించబడినవారి అంతస్థులను అల్లాహ్ పెంచుతాడు. మీరు చేసే ప్రతి పనీ అల్లాహ్‌కు తెలుసు.'' [1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ ఎవరికయినా మేలు చేయదలుచుకుంటే వారికి ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు...'' [2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ దాసులలో జ్ఞాన సంపన్నులు మాత్రమే ఆయనకు భయపడుతారు. నిశ్చయంగా అల్లాహ్ సర్వాధికుడు, క్షమాశీలి.'' [3]

---

[1] (ముజాదలా:11).

[2] (బుఖారీ:69, ముస్లిం:1719).

[3] (సూరతుల్ ఫాతిర్: 28).

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఏమీ? విజ్ఞానులు మరియు అజ్ఞానులు సరిసమానులు కాగలరా? వాస్తవానికి బుద్ధిమంతులే హితబోధ స్వీకరిస్తారు.'' [1]

హ॥జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''(ధర్మ) జ్ఞానం గ్రహించుటకై ఎవరయినా ఒక దారిన పడితే అల్లాహ్ ఆ దారి గుండా అతని కోసం స్వర్గమార్గాన్ని సుగమనం చేస్తాడు.'' [2]

హ॥జత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రళయ దినాన ఖుర్‌ఆన్ (సిఫారసుగా)వస్తుంది, తరువాత ఇలా అంటుంది:

**ఓ నా ప్రభూ!** 'అతన్ని తొడిగించు' అప్పుడు అతనికి గౌరవమైన కిరిటాన్ని ధరింపజేస్తారు.

**తరువాత ఆ ఖుర్‌ఆన్ ఇలా అంటుంది:** 'ఓ నా ప్రభూ! మరింత ఎక్కువ ప్రసాదించు.'

**తరువాత అతనికి:** 'గౌరవమైన దుస్తులు ధరింపజేస్తారు.'

**తరువాత ఓ నా ప్రభూ!** 'ఇతని పట్ల ప్రసన్నుడవు.'

**అలాగే అతనితో (అల్లాహ్):** 'ప్రసన్నుడవుతాడు.'

**తరువాత అతనితో:** 'ఖుర్‌ఆన్ పారాయణం చేస్తూ (స్వర్గం) అంతస్తుల పైకి ఎక్కు, ప్రతి ఆయతుకు బదులు ఒక పుణ్యం (అంతస్తు) ప్రసాదించబడుతుంది' అని అంటాడు. [3]

---

[1] (సూరతు జుమర్:9).

[2] (సహీహ్ బుఖారీ, బాబుల్ ఇల్మి, ముస్లిం:4867).

[3] (సహీహ్ తిర్మిజీ: 2915, సహీహ్ అల్‌జామే:8030).

## ధర్మ జ్ఞానం బోధించేవారిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని కురిపిస్తాడు:

హ|జత్ అబూ ఉమామా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు: ''ప్రజలకు మంచి (ధర్మజ్ఞానం)ని బోధించే వారి మీద అల్లాహ్ కారుణ్యాన్ని కురిపిస్తాడు. ఇంకా అల్లాహ్ దూతలు, భూమ్యాకాశాల్లో ఉన్నవారు, చివరికి చీమలు తాముండే రంధ్రంలో నుండి, చేపలు వారి మీద అల్లాహ్ కారుణ్యం వర్షించాలని దుఆ చేస్తూ ఉంటారు.'' [1]

హ|జత్ సహ్ల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హ|జత్ అలీ (రజియల్లాహు అన్హు) గారికి ఇలా హితోపదేశం చేశారు: ''అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ నీ మూలంగా ఏ ఒక్క వ్యక్తికి సన్మార్గాన్ని చూపించినా అది నీ పాలిట ఎరుపు ఒంటెల కన్నా ఎంతో విలువైనది.'' [2]

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సన్మార్గం వైపుకు పిలిచిన వ్యక్తికి అతని పిలుపునందుకొని (సన్మార్గాన్ని) ఆచరించిన వారందరికీ లభించినంత పుణ్యం లభిస్తుంది, దానివల్ల వారి పుణ్యంలోనూ ఎలాంటి తగ్గింపు జరగదు…'' [3]

---

[1] (సహీహ్ తిర్మిజీ: 2685).
[2] (బుఖారీ:2724, ముస్లిం:4420).
[3] (ముస్లిం:4831).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మనిషి చనిపోగానే అతని కర్మల పరంపర అంతటితో ఆగిపోతుంది. అయితే మూడు కర్మల పుణ్యం మాత్రం అతనికి (అతను చనిపోయినప్పటికీ) లభిస్తూనే ఉంటుంది. అవి, ఒకటి: శాశ్వతంగా నిలిచిపోయే (సదఖయే జారియా) దానం. రెండవది: తన ప్రజలకు ఉపయోగపడే విద్య. మూడవది: తన శ్రేయస్సు కోసం ప్రార్థించే పుణ్య(కార్యాలు చేసే) సంతానం.'' [1]

**ముఖ్య గమనిక:** మనిషి ప్రజల పట్ల ఉపకారిగా మారాలంటే మరియు అతనికి దాని ప్రతిఫలం లభించాలంటే తనకు తాను సరిదిద్దుకుంటూ సమాజంలో ఉన్నవారిని మేలువైపుకు ఆహ్వానించాలి. మరియు చెడుల నుంచి ఆపాలి. అంతటి గొప్పకార్యాలను సాధించాలంటే తను జ్ఞానవంతుడు కావాలి. తరువాత ఆ జ్ఞానాన్ని ఇతరులకు సక్రమంగా బోధించాలి. అప్పుడే మనం ప్రపంచంలో సత్సమాజాన్ని చూడగలుగుతాము. అలా కాదని తమ ఇష్టానుసారం తమ మనోవాంఛల ప్రకారం ప్రజలకు జ్ఞాన ఉపకారం చేయలేరు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్(రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ మనుషుల హృదయాల నుండి జ్ఞానాన్ని తీయడు, కాని జ్ఞానులు (విద్వాంసులు) అంతరించిన కారణంగా జ్ఞానాన్ని తీసుకుంటాడు, ఈ విధంగా ఒక్క జ్ఞానవంతుడు కూడా మిగలడు. అప్పుడు ప్రజలు మూర్ఖుల్ని

---

[1] (ముస్లిం:3084).

నాయకులుగా చేసుకుంటారు. వారితో ధార్మిక(తీర్పులు) కోరుతారు, వారు తమకు ధర్మజ్ఞానం లేక పోయిన ఫత్వాలు (తీర్పులు) ఇస్తారు. అలా వారు మార్గభ్రష్టత్వానికి గురిఅవుతారు, ఇతరులను కూడా మార్గ భ్రష్టత్వానికి గురిచేస్తారు.'' [1]

## పరస్పరం ఉపన్యాసం చేసుకునే విశిష్ఠత:

మానవత్వం గల ప్రతి మనిషి మంచిని బోధించాలి మరియు చెడు నుండి హెచ్చరించాలి. మన సమాజంలో అనేక మంది చెడు గురించి చెప్పాలన్నా లేక ఎత్తి చూపాలన్నా మనకెందుకులే అన్న భావంతో తప్పుకుంటారు. లేదా ఎవరు ఎలా పోయినా మనకెందుకులే అని ప్రక్కకు జారుకుంటారు. చివరికి ఆ చెడు ప్రభావం మొత్తం సమాజంపై పడుతుంది. మరియు ప్రతి ఒక్కరు దాని కీడును అనుభవించక తప్పదు.

మంచి అంటే ఇస్లామియ ధర్మం దృష్టిలో మంచివిగా పరిగణించబడే అంశాలు. చెడు అంటే ఇస్లామియ ధర్మం దృష్టిలో చెడ్డవిగా భావించబడే విషయాలు. అంతేగానీ ప్రజలు తమ మనోవాంఛలను బట్టి మంచివిగా భావించే ప్రతిదీ మంచిది కాజాలదు. అలాగే ప్రజలు తాము చెడుగా భావించినదల్లా చెడుగా అనిపించుకోదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసే వారే సాఫల్యాన్ని పొందుతారు.''** [2]

---

[1] (బుఖారీ:98, ముస్లిం:4828).

[2] (సూరతు ఆలి ఇమ్రాన్:104).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మీలో ఎవరైనా చెడు జరుగుతుండటం చూస్తే దాన్ని చేత్తో ఆపటానికి ప్రయత్నించండి. అంత శక్తి లేకపోతే నోటితోనైనా దాన్ని వారించండి. అదీ చేయలేకపోతే కనీసం మనసులోనైనా దానిని చెడుగా భావించండి. ఇది విశ్వాసపు అతి బలహీన స్థాయి.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: 'విశ్వాసం (ధర్మం) అపరిచిత పరిస్థితుల్లో ప్రారంభమయింది. తిరిగి ఆ అపరిచిత పరిస్థితికే పునరావృతమవుతాది. ఆ నాటి అపరిచితులకు శుభవార్త!' అని అన్నారు.

వారెవరూ? అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని కొందరు అడిగారు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'నా తరువాత ప్రజలు చెరిపివేసిన నా సాంప్రదాయాన్ని పునరుద్ధరించేవారు'** అని అన్నారు.[2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటివాడు, మరియు ఒక విశ్వాసి మరో విశ్వాసికి సోదరుడు. అతనికి అన్ని విధాల అర్థిక సహాయం చేస్తాడు, మరియు అతని వెనుక నుండి కూడా సంరక్షకుడిగా ఉంటాడు.''[3]

---

[1] (ముస్లిం:70).

[2] (అహ్మద్:16094, సిల్‌సిలతుస్ సహీహా:1273).

[3] (సహీహ్ అబూదావూద్: 4918).

అద్దం మనిషికి తన ముఖంలో ఉన్న మంచి చెడులను ఏ విధంగా తెలుపుతుందో ఒక నిజమైన ముస్లిం తమ తోటి మిత్రుల తప్పుఒప్పులను తెలుపుతాడు. మరియు వారిని సవరిస్తూ ఉంటాడు. మరియు తమ మిత్రులకు ఏలాంటి కష్టం వచ్చినా శక్తివంచన లేకుండా నిత్యం సహాయపడుతుంటాడు.

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వాసులైన పురుషులు, విశ్వాసులైన స్త్రీలు–వారంతా ఒండొకరికి (సహాయకులు, చేదోడువాదోడుగా) మిత్రులుగా ఉంటారు. వారు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు. చెడుల నుంచి వారిస్తారు. నమాజులను నెలకొల్పుతారు, జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. అల్లాహ్ అతి త్వరలో తన కారుణ్యాన్ని కురిపించేది వీరిపైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేచనశీలి.– విశ్వసించిన ఇలాంటి స్త్రీ పురుషులకు, కాలువలు ప్రవహించే స్వర్గ వనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గ వనాలలో పరిశుభ్రమైన మేడలు వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికీ మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. గొప్పసాఫల్యం అంటే ఇదే.''[1]
స్వర్గవాసులకు స్వర్గంలో ప్రాప్తించే అనుగ్రహాలన్నిటికన్నా అల్లాహ్ ప్రసన్నత రూపంలో లభించే వరం ఎంతో మహత్పూర్వకమైనదై ఉంటుందని హదీసు ద్వారా కూడా రూఢీ అవుతోంది. [2]

---

[1] (సూరతు తౌబా: 71–72).

[2] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 857).

## అల్లాహ్‌కు ప్రియమైన సభ, సమావేశం:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వసించిన ఓ ప్రజలారా! మీ సమావేశాలలో (వచ్చేవారికి) చోటు కల్పించండని మీతో అన్నప్పుడు, మీరు జరిగి చోటు కల్పించండి. అల్లాహ్ మీకు విశాలమైన చోటును ప్రసాదిస్తాడు.'' [1]

ఈ వాక్యంలో ముస్లింలకు సభా మర్యాదలు తెలుపబడ్డాయి. ఇక్కడ సభ (లేక సమావేశం) అనే పదం చాలా విస్తృతార్థం గలది. మంచి ఉద్దేశంతో, పుణ్యం పొందే ఉద్దేశంతో, ఇతరులకు బోధపరిచే సంకల్పంతో నిర్వహించే ప్రతి సభా ఇందులోకి వస్తుంది (తఫ్సీరే ఖుర్తుబీ). 'ఎడంగా కూర్చోండి' అంటే మీరు కూర్చున్న సభాస్థలి విశాలంగా ఉండాలి. తరువాత వచ్చిన వారు ఇబ్బంది పడకుండా సర్దుకుని కూర్చు నేలా ముందునుంచే జాగ్రత్తపడాలి. తరువాత వచ్చేవారు నిలబడక తప్పని పరిస్థితిని సృష్టించకూడదు. ముందు వచ్చి కూర్చున్న వారిని లేపి వారి స్థలంలో కూర్చోవటం కూడా మంచి పద్ధతి కాదు. మనసులో చోటు ఉంటే సభలలో కూడా చోటు ఉంటుంది. అందుకే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: ఎవరయినా ఒక వ్యక్తి మరో వ్యక్తిని లేపి తాను ఆ చోటులో కూర్చోరాదు. ఈ పరిస్థితి రాకుండా ఉండటానికి (ముందుగానే) సభాస్థలిని విశాలంగా ఉంచండి'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

---

[1] (58,సూరతుల్ ముజాదిలహ్:11).

[2] (బుఖారీ, ముస్లిం, అహ్‌సనుల్ బయాన్ తెలుగు:2404).

''అల్లాహ్ గృహాలలో ఏదైన ఒక గృహంలో కొంత మంది గుమిగూడి అల్లాహ్ గ్రంథాన్ని పారాయణం చేస్తూ, దాని గురించి పరస్పరం చర్చించు కుంటూ ఉంటే వారిమీద ప్రశాంతత అవతరిస్తుంది. అల్లాహ్ కారుణ్యం వారిని కమ్ముకుంటుంది. అల్లాహ్ దూతలు వారిని చుట్టుముడుతారు. ఇంకా వారిగురించి అల్లాహ్ తన ఆస్థానంలోని(దూతల)వద్ద ప్రశంశిస్తాడు.''[1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు: ఎవరైనా ఒక సమావేశంలో కూర్చొని ఎన్నో వ్యర్థమైన మాటలు మాట్లాడి, అతను ఆ సమావేశం నుండి లేవక మునుపు ఈపదాలను: **''సుబ్హానకల్లాహుమ్మ వబిహమ్‌దిక అష్‌దు అల్లాహ్ ఇలాహ ఇల్లా అన్‌త, అస్‌తగ్‌ఫిరుక వఅతూబు ఇలైక.''** చదివినచో ఆ సమావేశంలో జరిగిన పొరపాట్లు క్షమించబడుతాయి. [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఏదైనా ఒక సమూహం ఒక సభలో కూర్చొని అక్కడ అల్లాహ్‌ను జ్ఞాపకం చేయనిచో మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై **'దరూద్ దుఆ'** చదవనిచో, ఆ సభవారికి నష్టాన్ని కలిగించడానికి కారణమవుతుంది. ఆయన తలిస్తే వారిని శిక్షించనూ వచ్చు లేదా క్షమించనూ వచ్చు.'' [3]

---

[1] (ముస్లిం:4867).

[2] (సహీహ్ తిర్మిజీ:3433).

[3] (సహీహ్ తిర్మిజీ: 3380).

# అధ్యాయం–10

## 190–218

## 10–సుగుణవంతులను అల్లాహ్‌ ప్రేమిస్తాడు

- కోపాన్ని దిగమింగేవారిని అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- సహనమూర్తులను అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- పేదవారిని అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- సత్యవంతులను అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- న్యాయమూర్తులను అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- భయంభక్తిగా జీవించేవారిని అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- పరిశుద్ధులను అల్లాహ్‌ ప్రేమిస్తాడు.
- తుమ్ముల కారణంగా ప్రేమింపబడతారు.
- బిడియం స్వర్గానికి మార్గం.

# 10-సుగుణవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు

సమాజంలో ప్రేమాభిమానాలతో అనునిత్యం కళకళలాడాలంటే ప్రతి ఒక్కరు ధర్మజ్ఞానాన్ని పట్టుదలగా నేర్చుకోవాలి. మరియు దానిని మొత్తం సమాజంలో విస్తరింపజెయ్యాలి. అంతటి గొప్ప కార్యం చేపట్టాలంటే మనిషి జ్ఞానంతో పాటు, సద్గుణాలు కలిగి ఆదర్శమూర్తిగా నిలబడాలి. అలా చేసిన నాడు సమాజం సత్సమాజంగా అలరారుతుంది. పరలోకంలో అల్లాహ్ ప్రీతి కూడా పొందగలరు.

హ్జ్రత్ అబూ సాలబా అల్ ఖషని (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ దగ్గర అందరికంటే ఎక్కువగా ప్రియతములు మరియు నాకు అందరికన్నా (ప్రళయదినాన) ఎక్కువగా దగ్గరగా ఉండేవారు సుగుణవంతులు. మరియు అల్లాహ్ దగ్గర అందరికన్నా ఎక్కువగా అయిష్టులు మరియు నాకు అందరికన్నా ఎక్కువగా దూరంగా ఉండేవారు వదరుబోతులు, డాబుసరిగా మాట్లాడేవారు, వికటంగా నవ్వుతూ మాట్లాడేవారు'' అని అన్నారు. [1]

హ్జ్రత్ ఉసామా బిన్ షురైక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర మనం ఎంతో నిశబ్దంగా, అంటే మన తలపై పక్షులు వాలి ఉన్నాయా అన్నంత ఏకాగ్రతతో ఎవ్వరితో మాట్లాడకుండా కూర్చొని ఉంటిమి.

---

[1] (సహీహ్ ఇబ్ను హిబ్బాన్: 483).

అంతలో కొంత మంది ప్రజలు వచ్చి: 'అల్లాహ్ దగ్గర అందరికంటే ఎక్కువగా ప్రియతములు ఎవరు?' అని అడిగారు.
దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) : 'మీలో అందరికంటే ఉత్తమ గుణవంతులు' అని అన్నారు. [1]

ఇస్లాంలో లేదా దివ్య ఖుర్ఆన్‌లో ఏ ఉత్తమ ఆదర్శాల గురించి అల్లాహ్ మానవుల కొరకు ప్రత్యేకించాడో, వాటిని పాటించువారే అల్లాహ్ దగ్గర అతి ప్రియమైన దాసులు. ఒక సారి హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) గారిని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి గుణాల గురించి ప్రశ్నించగా, **'ఆయన గారి గుణగణాలు ఖుర్ఆన్‌కు దర్పణం వంటివి'** అని సమాధానమిచ్చారామె. [2]

ప్రపంచమానవులందరిలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సంపూర్ణమైన సుగుణవంతులు. ఆయన సంస్కారం, మర్యాద మృదుతత్వ, వాత్సల్యం, నిజాయితీ సచ్ఛీలత, సౌమ్యం, దాతృత్యం, ప్రేమా, జాలి వంటి ఉన్నతమైన సుగుణాల శిఖరానికి ఆయన చేరుకొని యుంటిరి. అందుకని అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి వ్యక్తిత్వాన్ని ఇలా వర్ణించాడు: **''ఇంకా నీవు నైతికంగా అత్యున్నత స్థానంలో ఉన్నావు.''** [3]

మరియు హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) గారు కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''మానవులందరిలోకెల్లా సుగుణవంతులు.'' అని తెలియజేశారు. [4]

---

[1] (తబ్రానీ, హైసమ్, సిల్‌సిలతుస్ సహీహ: 432).

[2] (అహ్మద్:23460).

[3] (సూరతుల్ ఖలమ్:4).

[4] (బుఖారీ:5735, ముస్లిం:1054).

హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హ) గారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఓదార్చెందుకు ఆయన గుణాలను ఈ విధంగా కొనియాడారు: '' కానేకాదు, అల్లాహ్ సాక్షిగా! చెబుతున్నాను: ''అల్లాహ్ ఎన్నటికీ మిమ్మల్ని వృధా చేయడు. ఎందుకంటే మీరు బంధువుల హక్కు చెల్లిస్తారు. రుణగ్రస్తులకు విముక్తి నిస్తారు. పేదవారికి సహాయం చేస్తారు. అభాగ్య జీవులను ఆదుకుంటారు. అతిథులకు మర్యాద చేస్తారు. సత్యాన్ని బలపరుస్తారు. ఆపదల్లో ఉన్నవారికి ఆపద్బాంధవుల్లా తోడ్పడతారు.''[1]

మరియు హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) గారు ఇలా తెలియజేశారు: ''మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎవ్వరిని దూషించేవారు కారు. అపకారం చేసిన వారికి అపకారం చేసేవారు కారు. పైగా మన్నింపుల వైఖరిని అవలంభించేవారు. ఏదేని విషయంలో ఆయనకు స్వేచ్ఛ ఇవ్వబడితే సరళ విధానాన్ని అవలంభించడానికే ఇష్టపడేవారు. అయితే ఏదైన విషయంలోని ఉచితానుచితాలను, ధర్మా ధర్మాలను పరికించి ధర్మ సమ్మతమైన దానిని మాత్రమే ఎన్నుకునేవారు. స్వవిషయంలో ఆయన ఎన్నడూ ఎవరిపై ప్రతీకారం తీర్చుకోలేదు. అయితే దైవాజ్ఞలను ధిక్కరించిన వారికి దైవ శాసనానుసారం శిక్ష విధించేవారు.'' [2]

మూడు విషయాలను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన దరికి చేరనీయలేదు:

**ఒకటి:** 'వాదులాట.'

---

[1] (బుఖారీ:3, ముస్లిం:231).

[2] (బుఖారీ).

**రెండు;** ‘అవసరానికి మించి మాట్లాడటం.’

**మూడు;** ‘తనకు అక్కరలేని విషయాల్లో తల దూర్చటం.’

మరియు ఇతర విషయాల్లో కూడా మూడు విషయాలకు దూరంగా ఉండేవారు.

**ఒకటి;** ‘ఒకరికి చెడు అనేవారు కారు.’

**రెండు;** ‘ఒకరి తప్పులెంచేవారు కారు.’

**మూడు;** ‘కూపీలు లాగటానికి తాపత్రయ పడేవారు కారు.’[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రజల్ని అతి ఎక్కువగా స్వర్గానికి గొనిపోయే కర్మలు ఏవని? ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అడగడం జరిగింది.

దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): **‘దైవభీతి, ఉత్తమ నడవడికలు’** అని సమాధానమిచ్చారు.

మరియు ప్రజలను అతి ఎక్కువగా నరకానికి గొనిపోయే కర్మలు ఏవని? అడగారు.

దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): **‘నోరు మరియు మర్మాంగం’** అని అన్నారు.[2]

మరొక హదీసులో ఇలా ఉంది: ‘‘ఉత్తమ నడవడికను కలిగి ఉన్న వ్యక్తికి స్వర్గంలో ఎత్తయిన ప్రదేశంలో ఒక గృహాన్ని ఇప్పించేందుకు నేను పూచీ వహిస్తున్నాను.’’ [3]

---

[1] (హృదయాల విజేత ముహమ్మద్ (స)పేజి: 11–13, షమాయిల్ తిర్మీదీ:346).

[2] ( సహీహ్ తిర్మిజీ: 2004).

[3] (సహీహ్ అబూదావూద్: 4800).

హ|జత్ అబూ దర్దా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ప్రళయ దినాన విశ్వాసి **త్రాసులో ఉత్తమ నడవడికకన్నా బరువైన వస్తువు మరొకటి ఉండదు...''**[1]

హ|జత్ అబూ హురైరా, అబ్దుర్రహ్మాన్ బిన్ సఖర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ మీ శరీరాలను, మీ ముఖాలను చూడడు. కాని ఆయన **మీ అంతరంగాలను, ఆచరణలను** చూస్తాడు...'' [2]

అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''పుణ్యకార్యాలు చేసేవారు పురుషులైనా స్త్రీలైనా– వారు గనక విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు.'' [3]

దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ప్రపంచం సమస్తం జీవన సామగ్రి. ఈ ప్రపంచ సామగ్రిలో అన్నిటికంటే ఉత్తమమైన వస్తువు మంచి (సద్గుణాలు కలిగిన) స్త్రీ.'' [4]

## కోపాన్ని దిగమింగేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారు కలిమిలో లేమిలో ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు. కోపాన్ని దిగమ్రింగేవారు. ఇతరుల తప్పులను క్షమించేవారు. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం''[5]

---

[1] (సహీహ్ తిర్మిజీ:2002, సహీహ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 2641).
[2] (ముస్లిం:4650).
[3] (4,సూరతున్ నిసా: 124).
[4] (ముస్లిం:2668).
[5] (3,సూరతు ఆలి ఇమ్రాన్: 134).

హ|జత్ ముఆజ్ బిన్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరికైతే కోపం వస్తుందో, దాన్ని చూపించే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికి తమ కోపాన్ని దిగమింగేస్తే, ప్రళయ దినాన అల్లాహ్ సర్వ సృష్టిరాసులందరి సమక్షంలో వారిని పిలిచి: ''నీకు ఇష్టమైన స్వర్గకన్యను ఎన్నుకోమని'' అంటాడు.[1]

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కుస్తీపట్టి ఇతరులను చిత్తుచేసే వాడు ఘనుడు కాడు. కాని కోపం వచ్చినప్పుడు తన్ను తాను అదుపులో పెట్టుకోగలిగినవాడే నిజమైన ఘనుడు.''[2]

హ|జత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; కొంత మంది యూదులు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఇంటికి వచ్చి **''అస్సాము అలైకుమ్''** (మీకు చావు రావాలి) అని చెప్పారు.

ఇది వింటున్న ఆయన ధర్మ పత్ని ఆయిషా (రజియల్లాహు అన్హు) (ఆగ్రహంతో) వెంటనే: **'వాలైకుముస్ సాము వల్ లానతు'** (మీకు చావు రావాలి మరియు మీపై శాపం పడాలి) అని అన్నారు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను వారిస్తూ: 'ఆయిషా! **'వదిలేయి' మృదువుగా అవలంభించు. అల్లాహ్ ప్రతి విషయంలోనూ మృదుత్వాన్నే ఇష్టపడుతాడు'** అని అన్నారు.

యా రసూలల్లాహ్! మీరు వినడం లేదా? వారు ఏమంటున్నారు.

సరే నేను కూడా వారికి జవాబుగా **''వాలైకుమ్''** అన్నాను కదా.[3]

---

[1] (సహీహ్ తిర్మిజీ:2021, సహీహ్ ఇబ్ను మాజా:4186).

[2] (బుఖారీ:5649, ముస్లిం:4723).

[3] (బుఖారీ: 5565).

## సహనమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు అల్లాహ్ సహనం వహించేవారిని ప్రేమిస్తాడు.'' [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరయితే మా మార్గంలో బాధలు భరిస్తారో, వారికి మేము తప్పకుండా మా 'మార్గాలు' చూపుతాము. నిశ్చయంగా అల్లాహ్ సద్వర్తనులకు తోడుగా ఉంటాడు.''[2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''సహనం వహించేవారికి లెక్కలేనంత పుణ్యఫలం ప్రసాదించబడుతుంది.'' [3]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు.'' [4]

మరోకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మేము ఏదో ఒక విధంగా మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తూ ఉంటాము – భయంతో, ఆకలిదప్పులతో, ధనప్రాణాల నష్టంతో, పండ్లకొరతతో (పరీక్షిస్తాము)! ఈ సహనమూర్తులకు శుభవార్త ఇవ్వండి.'' [5]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మరణం పొందాలని ఆశించకండి. ఒక వేళ మీరు పుణ్యాత్ములుగా ఉంటే

---

[1] (ఆల ఇమ్రాన్:146).
[2] (సూరతు ఆన్‌కబూత్: 69).
[3] (సూరతుజ్ జుమర్:10).
[4] (సూరతల్ బఖరా:153).
[5] (సూరతుల్ బఖరా: 155).

మరింత అధికంగా పుణ్యకార్యాలు చేయవచ్చు. ఒక వేళ పాపాత్ములుగా ఉంటే పశ్చాతాపం చెంది అల్లాహ్‌ వద్ద క్షమాపణ కోరి ప్రేమను పొందవచ్చు.'' [1]

హ్రజత్ అబూ సయీద్‌ ఖుద్రీ, అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ముస్లింకు ఏ విధమైన ఆపద వచ్చినా, బాధ కలిగినా, ఆందోళన కలిగినా, దుఃఖం కలిగినా, చివరికి ముల్లు గుచ్చుకున్నా సరే దాన్ని అల్లాహ్‌ అతనికై పాప పరిహారంగా చేస్తాడు.'' [2]

మరియు అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''నువ్వు సహనంతో మసులుకో. నిశ్చయంగా సద్వర్తనుల పుణ్యఫలాన్ని అల్లాహ్‌ వృథా కానివ్వడు.''[3]

ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరికైతే అల్లాహ్‌ మేలు చెయ్యాలనుకుంటాడో అతనికి బాధలతో పరిక్షిస్తాడు.'' [4]

మరియు అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''ఇలాంటివారికే వారి సహన స్థయిర్యాలకు బదులుగా స్వర్గంలోని అత్యున్నత స్థానాలు వొసగబడతాయి. అక్కడ సలాం, దీవెనెలతో వారికి స్వాగత సత్కారాలు లభిస్తాయి.''[5]

---

[1] (బుఖారీ:5241).
[2] (బుఖారీ:5215, ముస్లిం:4670).
[3] (సూరతు హూద్‌: 115).
[4] (బుఖారీ:5213).
[5] (సూరతుల్‌ ఫుర్ఖాన్‌: 75).

హ|జత్ అబూసయీద్ సాద్ బిన్ మాలిక్ బిన్ సినాన్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం: కొంత మంది అన్సారులు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను యాచించారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారడిగింది ఇచ్చారు.

వాళ్ళు: 'మళ్ళీ మళ్ళీ యాచించారు.' అప్పుడు కూడా ఆయన వారికి ఇచ్చారు.

చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర ఉన్నదంతా అయిపోయింది.

ఉన్నదంతా అయిపోయిన తరువాత ఆయన వారితో: **'నా వద్దకు ఏ కొంత ధనం వచ్చినా నేను దాన్ని నిల్వచేసి ఉంచుకోను.' అని:**

- ఎవడైతే యాచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాడో అల్లాహ్ అతన్ని కాపాడుతాడు.
- నిరపేక్షభావం అవలపరచుకోవాలనుకున్న వ్యక్తిని అల్లాహ్ నిరపేక్షాపరునిగా చేస్తాడు.
- సహనం కోరే వ్యక్తికి అల్లాహ్ సహనం వహించే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు.

**''మనిషికి ఇవ్వబడిన కానుకల్లో ఓర్పును మించిన మేలైన, విశాలమైన కానుక మరొకటి లేదు.''** అని అన్నారు.[1]

హ|జత్ అబూ యహ్యా సుహైబ్ బిన్ సినాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

---

[1] (బుఖారీ:1376, ముస్లిం:1745).

విశ్వాసి వ్యవహారం చాలా విచిత్రంగా ఉంటుంది. అతను చేసే ప్రతి పనిలో అతని కొరకు మేలు ఉంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈ భాగ్యం ప్రాప్తించలేదు.

- అతనికి ఆనంద ఘడియలు ఎదురైతే అందుకు అతను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది. (దాని కారణంగా అతనికి పుణ్యం లభిస్తుంది)
- ఒక వేళ అతనికి కష్టాలు ఎదురైతే అతను సహనం వహిస్తాడు, ఈ సహనం కూడా అతనికి మేలే కలుగజేస్తుంది. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కాలం సాక్షిగా! నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు– అయితే విశ్వసించి సత్కార్యాలు చేసిన వారు, పరస్పరం సత్యం గురించి ఉపదేశించినవారు, ఒండొకరికి సహనం (స్థయిర్యం) గురించి తాకీదు చేసినవారు మాత్రం నష్టపోరు'' [2]

**ఇంతకీ సహనం (ఓర్పు, నిగ్రహం) దేనిపై?**

అంటే – కష్టాలపై! దైవశాసనాల ప్రకారం జీవితం గడిపే సమయంలో ఎదురయ్యే పరీక్షలపై! పాపకార్యాలు, నీతిబాహ్యమైన విషయాలు ఎదురుపడినప్పుడు! మనోవాంఛలను త్యాగం చేయవలసి వచ్చినప్పుడు!

ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ఓపిక పట్టి, సత్యధర్మంపై స్థిరత్వం కనబరచాలి. ఇది నిజంగా సాహసోపేతమైన విజయమే.

---

[1] (ముస్లిం:5318).

[2] (సూరతుల్ అస్ర్).

**'సహనం'** కూడా సత్యంలో ఇమిడి ఉన్న విషయమే అయినప్పటికీ ఈ సూరాలో దీన్ని ప్రత్యేకంగా విడదీసి చెప్పటం జరిగింది. దీన్నిబట్టి ధర్మావలంబనలో **'సహనానికి'** గల ప్రాముఖ్యత ఎంతటిదో అవగతం అవుతోంది. [1]

ఒకసారి ఒక నల్లటి మహిళ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చి:

''నాకు మూర్ఛరోగం వస్తూ ఉంటుంది. అప్పుడు నా ఒంటి మీద బట్టలు కూడా తొలిగిపోతాయి. అందుచేత నాకోసం అల్లాహ్‌ను ప్రార్థించండి'' అని మనవి చేసుకున్నది.

దానికి ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం):

''నీవు తలిస్తే (ఈ బాధపట్ల) సహనం వహించవచ్చు. ఆ సహనానికి బదులుగా నీకు స్వర్గం లభిస్తుంది''

''ఇక నీవు కోరినట్లయితే నేను నీ కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తాను నీ బాధ దూరం కావాలని'' అని అన్నారు.

దానికామే: ''సరే నేను సహనం వహిస్తాను'' అని అన్నది.

ఆ తరువాత కాస్సేపటికి: 'కాని నా ఒంటి మీద బట్టలు తొలిగిపోతాయి. ఇవి తొలిగిపోకుండా ఉండేందుకు (అయినా) అల్లాహ్‌ను ప్రార్థించండి' అని అన్నది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ ప్రకారం ఆమె కోసం ప్రార్థన చేశారు. [2]

---

[1] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 2756).

[2] (బఖారీ:5220, ముస్లిం:4673 ).

## పేదవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్‌కు భయపడుతూ నిరపేక్షాభావంతో, గుట్టుగా జీవితం గడిపే మనిషిని అల్లాహ్ ప్రేమిస్తాడు.'' [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ (రజియల్లాహు అన్హు) గారు చెప్తుండగా విన్నాననీ – హజ్రత్ అబ్దుర్ రహ్మాన్ బిన్ అల్ హుబులియ్యు (రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేశారు:

**ఒక వ్యక్తి వచ్చి:** ''మనం ముహాజిరీన్ల (వలసవచ్చినవారు)కు చెందిన పేదవారము కామా?' అని అడిగాడు.

**తరువాత అబ్దుల్లాహ్ అతనితో:** ''నీ కొరకు ఒక భార్య ఉందా? దాని వద్దకు నీవు పోతుంటావు'' అని అడిగారు.

**దానికాయన:** 'అవును' అని అన్నారు.

**తరువాత:** 'నీ కొరకు నివసించుటకై ఒక నివాసం ఉందా?' అని అడిగారు.

**దానికాయన:** 'అవును' అని అన్నారు.

**తరువాత ఆయన: అయితే** 'నీవు ధనవంతుడివి' అని అన్నారు.

**ఆ తరువాత అతను:** 'నా వద్ద ఒక పని మనిషి కూడా ఉన్నాడు' అని తెలియజేశారు.

**అయితే:** 'నీవు రాజులలో ఒక రాజువి' అని ఆయన అన్నారు.[2]

హజ్రత్ అబూ అబ్దుర్ రహ్మాన్ (రజియల్లాహు అన్హు) గారు ఇలా తెలియజేశారు: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ (రజియల్లాహు అన్హు) దగ్గరకు ముగ్గురు వ్యక్తులు నేను అక్కడుండగానే వచ్చారు.

---

[1] (ముస్లిం:5266).

[2] (ముస్లిం:5290).

**వారు:** యా అబా ముహమ్మద్! అల్లాహ్ సాక్షిగా! 'మా దగ్గర ఎలాంటి వసతి లేదు, ఖర్చులకు డబ్బుగానీ, లేదా సవారిగానీ, లేదా (జీవన మనుగడక్కై కావలసిన) వస్తువులుగాని లేవు' అని అన్నారు.

**ఆయన వారితో:** 'మీకేంకావాలి? అని అడిగారు.

'మీకేమైన కావాలంటే తిరిగి నా దగ్గరకు రండి, అల్లాహ్ నాకు అనుగ్రహించిన దానిలో మీకు ఏమైనా ఇస్తాను.'

**లేదా!** 'మీ పరిస్థితి గురించి రాజు గారి దగ్గర వివరిస్తాను.'

**లేదా!** 'మీరు సహనంతో (జీవితం) గడపండి.' ఎందుకంటే?

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్తుండగా నేను ఇలా విన్నాను: ''నిశ్చయంగా ప్రళయ దినాన ముహాజిరీన్‌కు చెందిన నిరుపేదలు ధనవంతులకన్నా నలభై సంవత్సరాల ముందే స్వర్గంలోకి చేరుకుంటారు'' అని అన్నారు.

ఆ మాట విన్న తరువాత వారు: 'అయితే మేమంతా సహనాన్ని పాటిస్తాము, ఏ సహాయము మేము వేడుకోము' అని అన్నారు. [1]

హజ్రత్ అబుల్ అబ్బాస్ సహ్లా బిన్ సాద్ సాయిదీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఒక వ్యక్తి వచ్చి, **''యా రసూలల్లాహ్!** అల్లాహ్ మరియు ప్రజలు నన్ను ప్రేమించాలంటే ఏం చెయ్యాలో చెప్పండి?'' అని అడిగాడు.

అందుకు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **''లోకంపట్ల అనాసక్తత చూపు. అల్లాహ్ నిన్ను ప్రేమిస్తాడు''**

---

[1] (ముస్లిం: 5291).

ఆ తర్వాత: **''ప్రజల దగ్గర ఉన్నవాటి పట్ల అనాసక్తత కనబరచు. అప్పుడు ప్రజలు నిన్ను అభిమానిస్తారు''** అని సమాధానమిచ్చారు. [1]

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''నేను స్వర్గ ద్వారంలో నించొని చూసాను. స్వర్గంలో ప్రవేశించేవారిలో చాలామంది అభాగ్యులే (పేదవారే) కనిపించారు. ధనవంతులు (స్వర్గంలో ప్రవేశించలేక) ఆగిపోతున్నారు. (అంతలో) నరకవాసుల్ని నరకానికి తీసుకెళ్ళమని ఆదేశమయింది...'' [2]

హజ్రత్ సఅద్ బిన్ అస్సాయిదీ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర నుంచి ఒక వ్యక్తి పోసాగాడు.

అంతలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులతో: 'ఈ వ్యక్తి గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగారు.

దానికి ప్రవక్త గారి అనుచరులు: 'మా అభిప్రాయం ప్రకారం ఇతను గొప్ప వ్యక్తులలో ఒక వ్యక్తి, ఒక అజాద్ వ్యక్తి, మరియు అతను ఎవరికైనా పెళ్ళికి అహ్వానం చేస్తే, అతని ఆహ్వానాన్ని అంగీకరిస్తారు. అతను ఎవరికైన సిఫారసు చేస్తే అతని సిఫారసు అంగీకరిస్తారు. అతను మాట్లాడితే అతని మాటను (శ్రద్ధగా) వింటారు' అని అన్నారు.

ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏమనలేదు. తరువాత మరొక వ్యక్తి అక్కడి నుండి పో సాగాడు.

---

[1] (ఇబ్నుమాజా: 4102, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 3213).

[2] (బుఖారీ:4797, ముస్లిం:4919).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులతో: 'ఈ వ్యక్తి గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగారు.

దానికి ప్రవక్త గారి అనుచరులు: 'మా అభిప్రాయం ప్రకారం ఇతను పేదవారికి చెందిన ఒక ముస్లిం. ఒక అజాద్ వ్యక్తి. అతను ఎవరికైనా పెళ్ళికి అహ్వానం చేస్తే, అతని ఆహ్వానాన్ని అంగీకరించరు. అతను ఎవరికైన సిఫారసు చేస్తే అతని సిఫారసు అంగీకరించరు. అతను మాట్లాడితే అతని మాటను (శ్రద్ధగా) వినరు' అని అన్నారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **''ఈ వ్యక్తి వారి (ధనవంతుల) కంటే ఎంతో మేలైనవాడు. అలాంటివారు (ధనవంతులు) భూమండాలానికి సమానమైన సరే''** అని అన్నారు. [1]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: మృతుని వెంట మూడు వస్తువులు (సమాధి దగ్గరికి) వెళతాయి.

**ఒకటి:** అతని కుటుంబీకులు.

**రెండు:** అతని సంపద.

**మూడు:** అతని కర్మలు.

''రెండు వస్తువులు వెనక్కి తిరిగి వస్తాయి, ఒకటి మాత్రం అక్కడే ఉండిపోతుంది.''

**''కుటుంబీకులు, సంపద తిరిగి వస్తాయి. కాని కర్మలు మాత్రం అతని వెంటే ఉంటాయి.''** [2]

---

[1] (సహీహ్ ఇబ్ను మాజా: 4120).

[2] (బుఖారీ:6033, ముస్లిం:5260).

హజ్రత్ ఖతాద బిన్ నౌమాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఎప్పుడైతే అల్లాహ్ ఒక వ్యక్తిని ప్రేమిస్తాడో అప్పుడు అతనికి ప్రపంచ ఐశర్యం (ధనం, హోదాలు) ఇవ్వడం తగ్గించేస్తాడు. ఎలాగైతే ఒక డాక్టరు చికిత్స నిమిత్తం (రోగికి) నీళ్ళను త్రాపించడం తగ్గిస్తాడో.''[1]

అంటే; డాక్టరు ఒక రోగికి నీరు హాని చేస్తుందని గ్రహించినప్పుడు పత్యంగా ఆ రోగికి నీళ్ళు ఇవ్వకుండా అతనికి మేలు చేస్తాడు. అలాగే అల్లాహ్ కూడా మనిషికి ఐశర్వం, ధనం, హోదాలు తగ్గించి అతనికి పాపాల నుండి రక్షించుటకై పేదవానిగా చేసి, దౌర్జన్యాలకు, అహంకారాలకు పాల్పడే హోదాలు కట్టబెట్టకుండా అతనికి మేలు చేస్తాడు. మరియు పుణ్యమైన జీవితాన్ని గడుపుటకు అవసరమైన ఉపాధిని మాత్రమే ప్రసాదిస్తాడు.

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా ప్రవచించారు: **''పేదవారు ధనవంతులకన్నా ఐదొందల సంవత్సరాల ముందే స్వర్గంలోకి ప్రవేశిస్తారు.''** (ప్రళయం దినంలో) అది సగ దినమవుతుంది.[2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసికి ప్రపంచం చెరసాల (జైలు) వంటిది. అవిశ్వాసికి ఇది స్వర్గం వంటిది.''[3]

---

[1] (సహీహ్ తిర్మిజీ: 2036, సహీహ్ అల్‌జామే: 282).
[2] (సహీహ్ తిర్మిజీ: 2353).
[3] (ముస్లిం:5256).

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఓ అల్లాహ్! అసలు జీవితమంటే పరలోక జీవితమే (భోగభాగ్యాల జీవితం) అని అన్నారు.'' [1]

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) గారు ఇలా తెలియజేశారు: 'పేదవారిని అభిమానించండి!' ఎందుకంటే?

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దుఆ చేస్తుండగా నేను ఇలా విన్నాను :ఓ అల్లాహ్! 'నన్ను పేదవానిగా బ్రతకనివ్వు, పేదరికంలోనే నాకు మరణాన్ని ప్రసాదించు, (మరణానంతరం) పేదవారి సమూహంలోనే నన్ను లేపు'... అని అన్నారు. [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఈ సంపద మరియు ఈ సంతానం, కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే. కాని శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతి ఫలానికి ఉత్తమమైనవి మరియు దానిని ఆశించటానికి కూడా ఉత్తమమైనవి.''[3]

**సత్కార్యాలంటే? మంచి పనులు:** అల్లాహ్ మనపై ధర్మపరంగా నియమించిన విధులు (ఫరాయిజ్), వాజిబాత్‌లు, ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయాలు (సునన్).

మరియు అదనం (నవాఫిల్)గా చేసే మంచి పనులు ఇంతే గాకుండా నిషేధింపబడిన వాటి నుండి దూరంగా ఉండటం కూడా సత్కార్యాల పరధిలోకే లెక్కింపబడుతాయి.

---

[1] (బుఖారీ:2622, ముస్లిం:3368).
[2] (తిర్మిజీ:2352, ఇబ్నుమాజా: 4126).
[3] (సూరతుల్ కహఫ్: 46).

## సత్యవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

సత్యం అంటే? జరిగిన వాస్తవికతను ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా తెలుపడం. ఉదాహరణకు: ఈ రోజు ఆదివారం ఉంటే, దానిని ఆదివారం అనే చెప్పాలి. ఒక వేళ సోమవారము అంటే అది అసత్యమైన మాట. సత్యానికి విరుద్ధంగా అబద్ధం పలికినట్లు.

ఏ మాట పలుకుతామో దానికి అనుగుణంగా మన కర్తవ్యం కూడా ఉంటే దాన్ని సత్యంగా భావిస్తాము. ఇంకా, ఒక వ్యక్తి తన నోటితో ఏదైతే పలుకుతాడో, ఆ మాట మేరకే అతని మనసులో కూడ ఉండాలి. మరియు ఏ పని చేస్తామో, ఆ పని గురించి తమ మనసుకు పూర్తిగా ఇష్టమై ఉండాలి. ఇలాంటి వాటినే సత్యము, నిజము, వాస్తవము అని అంటాము.

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం ప్రయోజనకరమవుతుంది. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలు ప్రాప్తిస్తాయి. అందులో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు, వాస్తవానికి సాఫల్యం అంటే ఇదే.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా సత్యం మంచికి మార్గం చూపుతుంది, మరియు మంచి స్వర్గానికి మార్గం చూపుతుంది, అలాగే ఆ వ్యక్తి సత్యమే పలుకేవాడుంటే చివరకు అల్లాహ్ వద్ద అతని పేరు సత్యసంధుడు అని వ్రాయబడుతుంది. మరియు అసత్యాలు పాపాలకు దారి చూపుతాయి. పాపాలు నరకానికి

[1] (5,సూరతుల్ మాయిదా: 119).

దారి చూపుతాయి. అలాగే ఆ వ్యక్తి అసత్యాలు పలుకుతూంటే చివరకూ అల్లాహ్ వద్ద అతని పేరు అసత్యవాది అని వ్రాయబడుతుంది.''[1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ...''వ్యాపారస్తులు తమ వ్యాపారంలో సత్యమైన బాటను పాటించి, (ఆ సామాగ్రి మంచి చెడులను గురించి) విడమర్చి చెప్పి వ్యాపారం చేస్తే వారి వ్యాపారంలో అల్లాహ్ శుభాలను ప్రసాదిస్తాడు.''[2]

మనం అనవసరమైన మాటలు మాట్లాడకూడదు అవి నిజమేనైతే తప్ప. ఎందుకంటే? ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే అల్లాహ్‌ను మరియు ప్రళయదినాన్ని విశ్వసిస్తున్నారో, వారు సత్యమే పలకండి, లేదంటే మాట్లాడకుండా ఉండండి.''[3]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతుల వెంట ఉండండి.''[4]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్తుండగా హజ్రత్ ఉమ్మే కుల్సూమ్ (రజియల్లాహు అన్హు) విన్నారనీ ఇలా తెలియజేశారు: ''అబద్ధాలను ప్రజల వ్యవహారాలను సరిదిద్దుటకై చెప్పేవాడు అసత్యవాది కాడు. దాని వలన అతను మేలును కాంక్షిస్తున్నాడు, లేక మేలు కొరకై చెప్తున్నాడు.''[5]

---

[1] (బుఖారీ:5629, ముస్లిం:4719).
[2] (బుఖారీ:1937, ముస్లిం:2825).
[3] (బుఖారీ:5994, ముస్లిం:67).
[4] (9,సూరతుతౌబా:119).
[5] (బుఖారీ:2495, ముస్లిం:4717).

## న్యాయమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

నిత్యం న్యాయం చేయండి. ఎందుకంటే న్యాయం చేసేవారిని అల్లాహ్ ఎంతగానో ఇష్టపడుతాడు. న్యాయం చేసేవారికి ఆయన గొప్ప బహుమానం ఇస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''న్యాయం చేయండి నిశ్చయంగా అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు.'' [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా న్యాయానికి కట్టుబడి ఉండేవారు కరుణామయుని (అల్లాహ్) సన్నిధిలో కుడివైపు కాంతితో నిండిన వేదికలపై ఉంటారు...'' [2]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఇహలోకంలో న్యాయానికి కట్టుబడి ఉండేవారు పరలోకంలో కరుణామయుని (అల్లాహ్) ముందర ముత్యాల వేదికలపై ఉంటారు. వారు ఇహలోకంలో న్యాయాన్ని నిలబెట్టినందుకు.'' [3]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ఇయాజ్ బిన్ హిమార్ (రజియల్లాహు అన్హు) తెలియజేశారు: ముగ్గురు (గుణవంతులు) స్వర్గవాసులవుతారు.

1) న్యాయంగా పరిపాలించే, సదాచరణ చేసే భాగ్యం కలిగిన రాజు.

---

1 (సూరతుల్ హుజురాత్:9).

2 (ముస్లిం:3406).

3 (అల్ మొస్తదరక్ లిల్‌హాకిమ్: 7106, అహ్మద్: 6197).

2) దగ్గరి బంధువుల పట్ల, ఇతర ముస్లిముల పట్ల జాలి, దయా కలిగిన హృదయంతో ఉన్న వ్యక్తి.
3) పేదవాడైనప్పటికీ ఆత్మాభిమానం కారణంగా ఎవరి ముందర చేయి చాచని వ్యక్తి... [1]

మనిషి నిత్యం న్యాయానికి, ధర్మానికి కట్టుబడి ఉండాలి. అంటే మీ మనోవాంఛ, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, వర్గ దురాభిమానం, రాగద్వేషాలు మిమ్మల్ని న్యాయం, ధర్మాల విషయంలో గుడ్డివారిగా చేయరాదు. న్యాయం విషయంలో అల్లాహ్‌కు భయపడాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''న్యాయం చే యండి. ఇది దైవభీతికి అత్యంత చేరువైనది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుస్తూనే ఉంటాయి.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఏ రోజు అల్లాహ్ నీడ తప్ప వేరే నీడ లభ్యం కాదో ఆ రోజు అల్లాహ్ ఏడు రకాల మనుషులకు తన నీడలో ఆశ్రయమిస్తాడు.''

1) న్యాయశీలుడైన పాలకునికి.
2) తన జీవితాన్ని అల్లాహ్ ఆరాధన మరియు విధేయతలో గడిపిన యువకునికి.
3) మసీదులోనే తన మనసును లగ్నం చేసుకున్న వ్యక్తికి. (అతను మసీదు నుండి వెలుపలికి రాగానే మళ్ళీ మసీదులోకి ఎప్పుడు తిరిగి పోతానా అని నిరీక్షిస్తూ ఉంటాడు).

---

[1] (ముస్లిం: 5109).

[2] (సూరతుల్ మాయిదా: 8).

4) అల్లాహ్ ప్రేమ కొరకు మాత్రమే స్నేహబంధాలను కోరుకునే ఇద్దరు వ్యక్తులు. అలాగే వారిద్దరూ అల్లాహ్ ప్రేమ కొరకు మాత్రమే విడిపోతారు.

5) ఉన్నత వంశీయురాలైన స్త్రీ చెడుపనికి ఆహ్వానిస్తే కేవలం అతను అల్లాహ్‌కు భయపడుతూ ఆ ఆహ్వానాన్ని తిరస్కరించిన వ్యక్తికి.

6) రహస్యంగా దాన ధర్మాలు చేసిన వ్యక్తికి. అతను కుడి చేత్తో చేసిన దానం ఎడమ చేయికి తెలియదు.

7) ఏకాంతంలో అల్లాహ్‌ను ధ్యానిస్తూ ఉండగా అతని కళ్ళారా కన్నీరు కార్చే వ్యక్తికి అని తెలిపారు. [1]

## భయభక్తిగా జీవించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

భయభక్తులను కలిగి ఉండటం అంటే అల్లాహ్ నిషేధించిన విషయాల జోలికి పోకుండా ఉండటం. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆచరించమని చెప్పినవాటిని ఆచరించటం. ఇలాంటి సజ్జనులు అల్లాహ్ ప్రీతికి అర్హులవుతారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వాస్తవానికి, ఎవడు తన ఒప్పందాన్ని పూర్తిచేసి భయభక్తులు కలిగి ఉంటాడో, అలాంటి భయభక్తులు గలవారిని నిశ్చయంగా అల్లాహ్ ప్రేమిస్తాడు.'' [2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''వల్లాహు వలియ్యుల్ ముత్తఖీన్''** (మరియు అల్లాహ్ దైవభీతి కలవారికి సన్నిహితుడు). [3]

---

[1] (బుఖారీ:620, ముస్లిం:1712).

[2] (సూరతు ఆల ఇమ్రాన్:76).

[3] (సూరతుల్ జాసియా:19).

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆ రోజు మేము భయభక్తి గలవారిని అనంత కరుణామయుని సన్నిధిలో అతిథులుగా ప్రవేశపెడతాము.'' [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో అల్లాహ్‌కు భయపడుతూ ఆయన (శిక్షల) నుండి తమను కాపాడుకుంటారో వారే విజయం సాధించేవారు.''[2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పరుగెత్తండి. దాని వెడల్పు భూమ్యాకాశాలంత ఉంటుంది. అది భయభక్తులు గలవారి కోసం తయారు చేయబడింది.'' [3]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా దైవభీతి పరాయణులు సురక్షిత (ప్రశాంత) స్థలంలో ఉంటారు.-ఉద్యానవన చెలమల మధ్యన..- పల్చటి సిల్కు వస్త్రాలను, దళసరి పట్టు వస్త్రాలను ధరించి ఎదురెదురుగా ఆసీనులై ఉంటారు. (భక్తిపరాయణుల పట్ల) ఇలాగే వ్యవహరించబడుతుంది. (హూరు) అందగత్తెలతో మేము వారి వివాహం జరిపిస్తాము. వారక్కడ నిక్షేపంగా (కూర్చొని) అన్ని రకాల పండ్లు ఫలాదులను తెప్పించుకుంటూ ఉంటారు. - మొదటిసారి వచ్చిన మరణం తప్ప, మరింకా వారు అక్కడ మరణం రుచి చూడటమనేదే ఉండదు. నరకాగ్ని శిక్ష నుండి అల్లాహ్ వారిని రక్షించాడు ఇది కేవలం నీ ప్రభువు కృప మాత్రమే. చాలా గొప్ప విజయమంటే ఇదే.'' [4]

---

[1] (సూరతు మర్యమ్: 85).
[2] (సూరతున్ నూర్:52).
[3] (సూరతు అల ఇమ్రాన్: 133).
[4] (సూరతు దుఖాన్: 51-57).

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వినండి! అల్లాహ్ స్నేహితులకు భయముగాని, దుఃఖంగానీ ఉండదు–వారు విశ్వసించినవారై (చెడుల విషయంలో) అల్లాహ్‌కు భయపడేవారై ఉంటారు.''[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే అల్లాహ్‌కు భయపడుతూ కన్నీరు కార్చారో వారు నరకానికి ప్రవేశించరు. ఎప్పటివరకైతే పాలు పొదుగులోకి తిరిగి పోదో!''...[2]

## పరిశుద్ధులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ పశ్చాత్తాపపడే వారిని, పారిశుద్ధ్యాన్ని అవలంభించేవారిని ఇష్టపడుతాడు.''[3]

మరియు ఇలా తెలియజేశాడు: ''బాగా పరిశుద్ధతను పొందటాన్ని ఇష్టపడేవారు అందులో (మస్జిదే ఖుబాలో) ఉన్నారు. బాగా పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.'' (సూరతు తౌబా:108).

పరిశుద్ధతను బాగా పాటించే ఈ సజ్జనులు ఎవరు? వారు ఖుబా వాసులని హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

''అల్లాహ్ మీ శుచీ శుభ్రతలను కొనియాడాడు, ఇంతకీ మీరు ఏం చేస్తారు?'' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వాళ్లను ఒకసారి దర్యాప్తు చేయగా, ''మేము మట్టి పెడ్డలను ఉపయోగించటంతో పాటు, నీరును కూడా ఉపయోగిస్తాం'' అని వారు వివరించారు.[4]

---

[1] (సూరతు యూనుస్:62–63).

[2] (సహీహ్ తిర్మిజి: 1632, సహీహ్ నసాయి:3108, అహ్మద్:10156).

[3] (సూరతుల్ బఖరా: 222).

[4] (ఇబ్నె కసీర్, అహ్సనుల్ బయాన్ తెలుగు:880).

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మిస్వాక్ ద్వారా నోరు శుభ్రమవుతుంది. మరియు ప్రభువు (అల్లాహ్) ప్రసన్నత లభిస్తుంది.''[1]

అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక హదీసులో ఇలా ఆదేశించారు: ''నా అనుచర సమాజం లేక ప్రజలు ఇబ్బందికి లోనవుతారనే భయం గనక నాకు లేకపోయినట్లయితే నేను వారిని ప్రతి నమాజు సమయంలోనూ మిస్వాక్ చేయాలని ఆదేశించేవాణ్ణి.''[2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: పది విషయాలు మానవ సహజమైనవి.

1) మీసాలు కత్తిరించటం.

2) గడ్డం పెంచటం.

3) పల్లు తోముకోవటం.

4) ముక్కుని నీటితో శుభ్రం చేసుకోవటం.

5) గోళ్లు కత్తిరించుకోవటం

6) వ్రేళ్ళ మధ్య భాగాన్ని కడుక్కోవటం.

7) చంకలోని వెంట్రుకల్ని తొలగించటం.

8) నాభి క్రింద వెంట్రుకల్ని తీసి వేయటం.

9) మూత్రశుద్ధి నీటితో చేసుకోవటం. ఆ తర్వాత ఉల్లేఖకుడు ఇలా అంటున్నాడు –పదో విషయం నేను మర్చిపోయాను. బహుశా అది

10) 'పుక్కిలించటం' కావచ్చని నా అభిప్రాయం.[3]

---

[1] (నసాయి:5, ఇబ్ను ఖుజైమా:1074, అహ్మద్:7).

[2] (బుఖారీ:838, ముస్లిం:370).

[3] (ముస్లిం:384).

## తుమ్ముల కారణంగా ప్రేమింపబడతారు:

ఇస్లామీయ షరీఅత్ ప్రకారం అనేక ఆచారాల గురించి వ్యవహారాల గురించి ఉత్తమమైన సుగుణాల గురించి వివిధమైన నియమాలు నేర్పబడ్డాయి. అందువలన ఇక్కడ మేము తుమ్ముల విశిష్ఠత గురించి తెలుసుకుందాము. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ తుమ్ములను ఇష్టపడుతాడు, కాని ఆవలింతలు అల్లాహ్‌కు అయిష్ఠమైనవి...'' [1]

**ఇమామ్ అల్ ఖుర్తుబీ (రహ) ఇలా తెలియజేశారు:**

''ఆవలింతలు వచ్చే సమయంలో మేము వాటిని (ప్రభావాన్ని) తగ్గించుకోకపోతే షైతాన్ నవ్వుతాడు, మరియు నోటిలోకి పోతాడు. మరియు కొందరు ఇలా అన్నారు: షైతాన్ వారి నోటిలో కక్కుతాడు.''

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ తుమ్ములను ఇష్టపడుతాడు, ఆవలింతను అయిష్టపడుతాడు, మీరు తుమ్మినప్పుడు 'అల్‌హమ్దులిల్లాహ్' అనాలి. దానిని విన్న ప్రతి ముస్లిం తుమ్మినవారికి విధిగా జవాబు ఇవ్వాలి.''[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తుమ్మినప్పుడు: **'అల్‌హమ్దులిల్లాహ్'** అని చెప్పేవారు.

ఆయనకు బదులుగా **'యర్‌హముకల్లాహ్'** అని అనేవారు.

---

[1] (బుఖారీ:5755).

[2] (బుఖారీ:5755, ముస్లిం:4023).

తరువాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) **'యహ్‌దీకుముల్లాహు వ యుస్‌లిహ్ బాలకుమ్'** అని తిరిగి చెప్పేవారు. [1]

హజ్రత్ ఇబ్ను ఉసైమీన్ (రహ) ఇలా తెలియజేశారు: అల్లాహ్ తుమ్ములను ఎందుకు ఇష్టపడుతాడంటే? 'తుమ్మిన వ్యక్తి బాగా హుషారుగా ఉంటాడు. మరియు అల్లాహ్ హుషారుగా ఉన్న వ్యక్తిని ఇష్టపడుతాడు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''శక్తి మంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికంటే మేలైనవాడు. మరియు అల్లాహ్‌కు ఎంతగానో ఇష్టమైనవాడు, ప్రతి ఒక్కరిలోను మేలు ఉంటుంది. మీకు ప్రయోజనం చేకూర్చే దాని కోసమే అశపడండి...'' [2]

ఒక వ్యక్తికి తుమ్ములు వచ్చాయంటే అతను ఎంతగానో చురుకుగా హుషారుగా ఉన్నాడని అర్థం. అందుకనే తుమ్ములంటే అల్లాహ్‌కు ఇష్టమైనవి. తుమ్మిన వ్యక్తి **'అల్‌హమ్దులిల్లాహ్'** అని అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపు తున్నాడు. అల్లాహ్‌ను కృతజ్ఞతలు చెల్లించేవాళ్ళే ప్రియమైన దాసులు.

## బిడియం (సిగ్గు) స్వర్గానికి మార్గం:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సిగ్గు విశ్వాసానికి చెందిన అంశం, మరియు విశ్వాసం వలన స్వర్గం లభ్యమౌతుంది, అశ్లీలమైన (సిగ్గుమాలిన) సంభాషణ దుష్ట వ్యవహారమ వుతుంది. దుష్ట వ్యవహారం వలన నరకం లభ్యమవుతుంది.''[3]

---

[1] (అహ్మద్: 1657, సిల్‌సిలతుస్ సహీహా: 2387).

[2] (ముస్లిం:4816).

[3] (సహీహ్ తిర్మీజి: 2009, సహీహ్ ఇబ్ను మాజా:4184, సహీహుల్ జామే:5510).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సిగ్గు చెందటం మరియు నోటిని అదుపు చేయడం విశ్వాసానికి చెందిన రెండు భాగాలు, సిగ్గుమాలిన సంభాషణ మరియు అతిగా మాట్లాడటం వంచనకు చెందిన భాగాలు.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక సారి: ''అల్లాహ్ ఎడల లజ్జగా మెలగండి. సిగ్గుపడవలసిన రీతిలోనే ఆయన ఎదుట సిగ్గుపడండి'' అని అన్నారు.

**దానికి అక్కడున్న వారు:** ''దైవప్రవక్తా! అల్లాహ్ కృపవల్ల మేము అల్లాహ్ ఎడల లజ్జా పూరితంగానే మెలుగుతున్నాము.'' అని బదులు పలికారు.

**అప్పుడు ఆయన ఇలా బోధించారు:** అదికాదు, ''అల్లాహ్ ఎడల సిగ్గుపడవలసిన రీతిలో సిగ్గుపడటమంటే మీరు మీ మస్తిష్కాన్ని, అందులో ఉత్పన్నమయ్యే ఆలోచనలను అదుపులో పెట్టుకోవాలి. కడుపును, అందులో వేసుకునే భుక్తిని కనిపెట్టుకుంటూ ఉండాలి.

మృత్యువును, దాని పర్యవసానం కుళ్ళి, కృషించి అంతమయి పోవడాన్నీ జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి.

ఏ వ్యక్తి పరలోక సాఫల్యాన్ని కోరుకుంటాడో అతడు ప్రాపంచిక ఆడంబరాలను త్యజిస్తాడు. ప్రపంచానికి బదులు పరలోకానికి ప్రాముఖ్యంనిస్తాడు. ఇలా ఆచరించిన వ్యక్తే వాస్తవానికి అల్లాహ్ పట్ల సిగ్గుపడవలసిన రీతిలో సిగ్గుపడినవాడు.'' [2]

---

[1] (సహీహ్ తిర్మిజి: 2027, సహీహుల్ జామే:5512, అహ్మద్:21280).

[2] (తిర్మిజీ, హదీస్ హసన్:1724, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్:1724).

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పరదా ధరించే కన్యకన్న ఎక్కువగా సిగ్గుపడేవారు. ''ఒక వేళ ఆయన చిరాకు కలిగే విషయాన్ని చూసారంటే అది ఆయన ముఖంలో వెంటనే కనపడుతుంది.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సిగ్గు విశ్వాసానికి చెందిన ఒక భాగం నా జాతిలో అతి ఎక్కువ లజ్జ గల వ్యక్తి హజ్రత్ ఉస్మాన్ (రజియల్లాహు అన్హు)'' అని తెలిపారు. [2]

---

[1] (బుఖారీ5637, ముస్లిం:4284).

[2] (సిల్‌సిలతుస్ సహీహా: 1828).

# అధ్యాయం–11

## 220–243

## 11–తోటి మనిషిని ప్రేమిస్తే అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు

- పరస్పరం ప్రేమానుబంధాలను పెంచుకోవాలి.
- పరామర్శించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- ఒండొకరిని సందర్శించుకునే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- ఉపకారం (ఇహ్సాన్) చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- తోటి సహోదరులకు సహాయపడితే అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అనాథులను ఆదరిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు.
- ఆడ పిల్లలను పెంచి పోషిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు.

# 11– తోటి మనిషిని ప్రేమిస్తే అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు

## పరస్పరం ప్రేమానుబంధాలను పెంచుకోవాలి:

ప్రతి మనిషి కొరకు ఇస్లాం ధర్మం ఆచరణే ప్రేమానుబంధాలకు నిజమైన మార్గం. మనిషి తన జీవితపు ప్రతి కోణంలో ప్రతి నిమిషంలో ప్రేమానుబంధాలను సమాజం పట్ల పెంపొందించుకోవడాన్ని ప్రేమ అంటారు. ప్రేమానుబంధాలు ఒక రోజు కొరకో, ఒక వారాని కొరకో, లేదా సంవత్సరానికి ఒక రోజు సంబరాలు జరుపుకోవడం కాదు ప్రేమంటే. ప్రేమానుబంధాలు రోజు రోజుకు మెరుగుపడడమే అసలైన, నిజమైన ప్రేమ. మన ఊపిరి ఉన్నంత కాలం ఒకరిపట్ల మరొకరు ప్రేమానుబంధాలు కలిగి ఉంటే దీనిని నిజమైన ప్రేమ అంటారు. ఆ అనుబంధాలను చిత్తశుద్ధితో అల్లాహ్ భీతితో ఒండొకరి పట్ల కనబరిస్తే అల్లాహ్ కూడా వారిని ప్రేమిస్తాడు. మరియు దానికి బదులు గొప్ప బహుమానాలు కూడా ఆయన ప్రసాదిస్తాడు. మానవులందరూ ఒండొకరి పట్ల చిత్తశుద్ధి కలిగి, ప్రేమాభి మానంతో, గౌరవ సన్మానాలతో మసులుకుంటే వారు ఇహపర జీవితాలలో సుఖసంతోషాలు పొందుతారు. ఎవరైతే సమాజాన్ని ప్రేమించలేరో వారు పరిపూర్ణమైన ముస్లిములు కారు. మరియు వారిని కూడా అల్లాహ్ ఎంత మాత్రమూ ప్రేమించడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘అల్లాహ్ నీకు ఏ విధంగా మేలు చేసాడో అదే విధంగా నువ్వు కూడా (ప్రజల పట్ల) సద్వ్యవహారం చెయ్యి.

భువిలో అరాచకం కోసం ఆరాట పడకు. అరాచకం సృష్టించగోరేవారిని అల్లాహ్ ఎంత మాత్రం ఇష్టపడడు.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రళయదినాన అల్లాహ్, ''నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య) నీడ తప్ప మరే నీడ లభించని ఈ రోజు నేను వారికి నా నీడ పట్టున ఆశ్రయం కల్పిస్తాను'' అని అంటాడు.[2]

మరియు హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''మీరు మూమిన్ (విశ్వాసి) కానంతవరకు స్వర్గంలో ప్రవేశించలేరు. మరియు మీరు పరస్పరం ప్రేమాభిమానాలతో మెలగనంతవరకు మూమిన్లు (విశ్వాసులు) కాలేరు....'' [3]

ప్రేమానుబంధాల పట్ల అల్లాహ్ ప్రతి ఒక్కరి కొరకు ఒక ఉన్నత స్థానాన్ని నిర్ణయించాడు. దానిలో మొట్టమొదటి స్థానం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)గారి స్థానం అతి ఉన్నతమైనది. ఆ తరువాత తల్లిదండ్రుల స్థానం. ఆ విషయాలను మనం ముందు పేజీలలో తెలుసుకున్నాము. ఇప్పుడు మనం సమీప బంధువుల పట్ల, గురువు, శిష్యుల పట్ల, భార్యాభర్తల పట్ల, అన్నదమ్ముళ్ళ పట్ల, అక్కచెల్లెళ్ల పట్ల, స్నేహితుల పట్ల, ఇరుగు పొరుగు వారి పట్ల, అనాథుల పట్ల,

---

[1] (సూరతుల్ ఖసస్: 77).
[2] (ముస్లిం:4655).
[3] (ముస్లిం:81).

వికలాంగుల పట్ల, దరిద్రుల పట్ల, పశుపక్షాధుల పట్ల మరియు అనేకమైన సమాజ సంబంధిత జాతుల పట్ల ప్రేమాభిమానంతో మసులుకోవలసిన విధానాలను తెలుసుకుందాము. ఆ విధానాల ప్రకారం ప్రజలు జీవించి నట్లయితే అల్లాహ్ ప్రీతిని పొందుతారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయనకు ఎవ్వరినీ భాగస్వాములుగా చేసి నిలబెట్టకండి. తల్లిదండ్రులతో, దగ్గరి బంధువులతో, అనాథలతో, నిరుపేదలతో, బంధువులైన పొరుగువారితో, ప్రక్కనున్న మిత్రులతో, అందరితోనూ ఉదార స్వభావులై మెలగండి. నిశ్చయంగా అల్లాహ్ దురహంకారిని, గొప్పలు చెప్పుకుని బీరాలు పోయేవాడిని ప్రేమించడు.'' [1]

ఒక హదీసులో ఇలా ఉంది: ''పరస్పర ప్రేమానురాగాలను పంచుకో వటంలోనూ, ఒండొకరిపై దయజూపటంలోనూ విశ్వాసుల ఉపమానం ఒక శరీరం లాంటిది. శరీరంలోని ఏదైనా ఒక అవయం బాధకు గురైనప్పుడు మొత్తం శరీరానికి నొప్పి కలుగుతుంది. శరీరమంతా వ్యాకులతకు లోనవుతుంది.''[2]

మరియు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఒక బంధువు ఉపకారం చేస్తే ప్రతిగా ఉపకారం చేసేవాడు (నిజమైన) బంధుప్రియుడు కాడు. తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాన్ని కొనసాగించే వాడే (సిసలైన) బంధుప్రియుడు.''[3]

---

[1] (సూరతున్ నిసా: 36).
[2] (ముస్లిం:4685).
[3] (బుఖారీ:5532).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: బంధుత్వం అల్లాహ్ సింహాసనానికి వ్రేలాడబడి ఉంది. అది ఇలా ప్రార్థిస్తూ ఉంటుంది: ''నాతో సత్సంబంధాలు పెట్టుకున్నవాడితో అల్లాహ్ కూడా సత్సంబంధాలు పెట్టుకొనుగాక! నన్ను విచ్ఛిన్నం చేసినవాడిని అల్లాహ్ కూడా విచ్ఛిన్నం చేయుగాక!.'' [1]

మరియు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **'మీరు పరస్పరం కరుణతో మెలగనంత వరకు విశ్వాసులు కాలేరు'** అని అన్నారు.

**అది విన్న సహచరులు:** యా రసూలల్లాహ్! 'మేమందరం పరస్పరం కరుణతోనే మసులుకుంటున్నాము కదా!' అని అన్నారు.

**అప్పుడు దైవ ప్రవక్త** (సల్లల్లాహు అలైహి వసల్లం): 'మీ ఈ పరస్పర కరుణ వాత్సల్యాలు కేవలం మీ ఆప్తుల వరకే పరిమితం కాకూడదు. **'రహ్మతన్నాసి'** సమస్త మానవుల పట్ల కనికరం కలిగి ఉండాలి. **'రహ్మతన్ ఆమ్మహ్'** విశ్వమంతటి ప్రాణుల పట్ల సాత్విక కరుణతో మెలగాలి' అని అన్నారు. [2]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చుని ఉండగా మరో వ్యక్తి అతని సమీపం నుండి వెళ్ళాడు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చున్న వ్యక్తి, వెళ్ళుతున్న వ్యక్తి వైపు చూస్తూ, **'యా రసూలల్లాహ్! నేను ఇతన్ని ప్రేమిస్తున్నాను'** అని అన్నాడు.

---

[1] (బుఖారీ:5529, ముస్లిం:4635).

[2] (సహీహ్ తర్గీబ్ వత్తర్హీబ్:2253, అల్ ముస్తద్రక్ అలస్ సహీహైన్ లిల్‌హాకిమ్: 7418).

**ప్రవక్త** (సల్లల్లాహు అలైహి వసల్లం): 'మరి ఈ విషయం అతనితో చెప్పావా?' అని అన్నారు.

**అందుకావ్యక్తి**: 'చెప్పలేదు' అని అన్నాడు.

**అప్పుడు ఆయన (స):** 'నువ్వు ఈ సంగతి అతనికి తెలియజెయ్యి' అని అదేశించారు.

**అతను ప్రవక్త (స)** ఆదేశం విని, (తక్షణమే) ఆ వ్యక్తి, అతన్ని కలుసుకొని: 'అల్లాహ్ కోసం నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పాడు.

**అందుకతను: 'ఎవరికోసం నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో ఆయన కూడా నిన్ను ప్రేమించుగాక!'** అని అన్నాడు. [1]

అల్లాహ్ మనల్ని మానవులుగా సృష్టించాడు కాబట్టి అల్లాహ్ మనందరిపై ప్రతి మానవుడి హక్కులను సంరక్షించాలంటూ విధి గావించాడు. మరియు మనం ఒకరినొకరు సహాయ సహకారాలు అందజేస్తూ ఉండాలంటూ విధి విధానాలను తెలిపాడు. మనిషి తన వ్యక్తి త్వ జీవితానికి ఉత్తమమైన విధానంలో గడపడానికి ప్రత్యేకమైన సద్గుణాలను నేర్పాడు. వాటి ప్రకారం జీవితం గడిపితే మన జీవితాలు సుఖసంతోషాలతో కొనసాగుతాయి. మరియు అల్లాహ్ దగ్గర అతి ప్రియమైన దాసులుగా కనికరించబడి ఉన్నతమైన అంతస్తులు కూడా ప్రసాదించబడతాయి.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ముఆజ్ (రజియల్లాహు అన్హు)ఇలా తెలియజేశారు: ''నా ఔన్నత్యం ప్రాతి పదికపై పరస్పరం అభిమానించుకున్నవారి కోసం

---

[1] (సహీహ్ అబూదావూద్: 5125).

ప్రవక్తలు, అమర వీరులు సయితం అసూయ చెందేటువంటి జ్యోతిర్మయ వేదికలు ఉంటాయి.'' [1]

## ఒండొకరిని సందర్శించుకునే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

హ్జ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు)కథనం; ఆయన ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా విన్నానని ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ – తనకోసం పరస్పరం అభిమానించుకునేవారిని, తనకోసం ఒకచోట సమావేశమయ్యేవారిని, తన కోసం ఒండొకరిని సందర్శించు కొనేవారిని, తన కోసం ఒండవకరిపై ఖర్చు చేసేవారిని తాను తప్పకుండా ప్రేమిస్తానని అంటున్నాడు.'' [2]

హ్జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ఒక వ్యక్తి వేరొక ఊరిలో ఉంటున్న తన సోదరుణ్ణి కలవటానికని (మంచిచెడు తెలుసుకొనుటకు) బయలుదేరాడు. **అంతలో అల్లాహ్ ఒక దూతను అతను వెళ్ళే దారిలో అతని వద్దకు పంపాడు.**

**ఆ దూత ఆ వ్యక్తితో**: 'ఎక్కడికి వెళ్ళుతున్నావనీ?' ప్రశ్నించాడు.

**ఆ వ్యక్తి ఆ దూతతో**: 'ఈ ఊరులో నా సోదరుడు ఉన్నాడు, అతన్ని కలవటానికి వెళ్తున్నాను' అని అన్నాడు.

**ఆ దూత:** 'అతను నీకేదైనా ఉపకారం చేసి ఉంటాడు, నువ్విప్పుడు అతని ఉపకారాన్ని తీర్చడానికి వెళ్తున్నావు కదా!' అని అడిగాడు.

---

[1] (తిర్మీజి: 2390, అహ్మద్:21066).

[2] (మాలిక్:1503, సహీహుల్ జామే: 4331).

**ఆ వ్యక్తి:** అలా ఏమీ కాదు. 'నేను అల్లాహ్ కోసమే అతన్ని ప్రేమిస్తున్నాను' అని అన్నాడు.

**తరువాత దైవదూత:** చూడు, నేను అల్లాహ్ తరఫు నుండి నీ వద్దకు పంపబడిన దూతను. **'నీవు అతన్ని అల్లాహ్ కోసం ప్రేమించినట్లే, అల్లాహ్ కూడా నిన్ను ప్రేమస్తున్నాడని' చెప్పమని అల్లాహ్ నీవద్దకు నన్ను పంపాడు'** అని అన్నాడు. [1]

హజ్రత్ అబూ జర్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మంచి పనిని ఏమాత్రం హీనంగా భావించకు. నీ సోదరుడిని చిరు నవ్వుతో కలుసుకోవడం కూడా పుణ్యకార్యమైనది.'' [2]

## వ్యాధిగ్రస్తులను పరామర్శించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

హజ్రత్ సౌబాన్ (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక ముస్లింను పరామర్శించటానికి వెళ్ళి తిరిగి వచ్చేవరకూ అతను స్వర్గంలో తాజా పండ్లను ఏరినట్లు.'' [3]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**అల్లాహ్ ప్రళయ దినాన (దాసునికి):** 'ఓ ఆదం పుత్రుడా! నేను అస్వస్థతలో ఉన్నప్పుడు నీవు నన్ను పరామర్శించ లేదే?' అని ప్రశ్నిస్తాడు.

---

[1] (ముస్లిం:4656).

[2] (ముస్లిం:4760).

[3] (ముస్లిం:4658).

**అప్పుడు (దాసుడు):** 'ఓ నా ప్రభూ! నేను నిన్ను పరామర్శించడమేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** 'నీకు గుర్తులేదా! నా ఫలాన దాసుడు అనారోగ్యంతో ఉంటే, నీవు పరామర్శకు అతని వద్దకు పోలేదే! ఏం నీకు తెలీదా!? అతన్ని నీవు పరామర్శించినట్లయితే నన్ను అక్కడ నీవు పొందేవాడివి కదా!'' అని అంటాడు. [1]

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **'ప్రతి ముస్లింపై సాటి ముస్లింకు ఆరు బాధ్యతలున్నాయి'** అని అన్నారు.

**అప్పుడు అక్కడున్నవారు:** 'అవి ఏవి?' అని అడిగారు.

**తరువాత ప్రవక్త(స):** ఈ విధంగా బోధించారు:

1) ముస్లిం సోదరుడిని కలిస్తే అతనికి సలాం చెయ్యి.
2) అతను విందుకు ఆహ్వానిస్తే ఆహ్వానాన్ని స్వీకరించు.
3) అతను ఉపన్యాసం చెయ్యమని కోరితే ఉపన్యాసం చెయ్యాలి.
4) అతను తుమ్మి **'అల్ హమ్దులిల్లాహ్'** అంటే నీవు దానికి **'యర్‌హముకల్లాహ్'** అని బదులివ్వు.
5) అతను వ్యాధిగ్రస్తుడయితే వెళ్ళి పరామర్శించు.
6) అతను చనిపోతే అతని జనాజాకు (నమాజుకు మరియు శ్మశానానికి) తోడుగా వెళ్ళు.'' [2]

---

[1] (ముస్లిం:4661).
[2] (ముస్లిం:4023).

హ్జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక రోజు : **''ఈ రోజు మీలో ఎవరు ఉపవాసం ఉన్నారు?''** అని అడిగారు.

**దానికి హ్జ్రత్ అబూ బకర్ (రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

**తిరిగి ప్రవక్త (స) గారు:** 'ఈ రోజు మీలో ఎవరు పేదవాడికి అన్నదానం చేశారు?' అని అడిగారు.

**దానికి హ్జ్రత్ అబూ బకర్(రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

**మరలా ప్రవక్త (స) గారు:** 'ఈ రోజు మీలో ఎవరు జనాజా వెంట (ఖనన సంస్కారానికి) పోయారు?' అని అడిగారు.

**దానికి హ్జ్రత్ అబూ బకర్(రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

ఆ తరువత ప్రవక్త(స) గారు: 'ఈ రోజు మీలో ఎవరు రోగిని పరామర్శించారు?' అని అడిగారు.

**దానికి హ్జ్రత్ అబూ బకర్(రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

**అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స)** ఇలా ప్రవచించారు: **''ఏ వ్యక్తిలోనయితే ఈ గుణాలు సమకూర్చబడ్డాయో వారు తప్పక స్వర్గానికి పోతారు.''** [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హ్జ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) తెలియజేశారు:

**''ఉదయం పూట** ఒక ముస్లిం తోటి ముస్లింను పరామర్శిస్తే, డెబ్భైవేల దైవదూతలు సాయంత్రం వరకూ అతని శ్రేయస్సు కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉంటారు.

---

[1] (సహీహ్ ఇబ్ను ఖుజైమా: 1954, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 953).

**అదే సాయంత్రం వేళ** పరామర్శిస్తే, ఉదయం వరకు డెబ్భైవేల దైవదూతలు అతని శ్రేయస్సు కోసం ప్రార్థిస్తూ ఉంటారు. ఇంకా అతని కోసం స్వర్గంలో ఒక తోట ఏర్పాటు చేయడం జరుగుతుంది.'' [1]

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించటానికి పోయి, అతని తల దగ్గర కూర్చొని ఏడు సార్లు:

**'అస్ అలుల్లాహల్ అజీమ, రబ్బల్ అర్షిల్ అజీమి అయ్ యష్ఫియక'** (నేను స్వస్థత చేకూర్చమనీ మహోన్నత సింహాసనానికి సర్వోన్నతుడైన అల్లాహ్‌ను అర్థిస్తున్నాను.) ఆ పదాలను చదివినట్లయితే (ఆ వ్యాధి) అతనికి మరణం కాకతోతే, అల్లాహ్ అతనికి ఆ వ్యాధి నుండి స్వస్థత చేకూర్చుతాడు.'' [2]

రోగులను పరామర్శించే విషయంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తరతమ భేదాలుగాని, ముస్లిములు ముస్లిమేతరులన్న తేడా కాని కనబరచలేదు. ఎవరైనా వ్యాధిగ్రస్తులై ఉన్నారని తెలిస్తే, ప్రతి ఒక్కరిని పరామర్శించేవారు, మరియు వారిని ఓదార్చేవారు, మరియు నిజమైన ప్రభువువైపు ఆహ్వానించేవారు.

ఒక యూద బాలుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సేవలు చేస్తుండేవాడు. ఒకసారి అతను వ్యాధిగ్రస్తుడయితే,

**ప్రవక్త ముహమ్మద్(స):** 'అతన్ని పరామర్శించటానికి వెళ్ళారు.'
అక్కడికి వెళ్ళి అతని తల దగ్గర కూర్చోని: **'ఇస్లాం స్వీకరించు బాబూ!'** అని అన్నారు.

---

[1] (సహీహ్ తిర్మిజీ: 969, సహీహ్ సహీహ్ ఇబ్ను మాజా: 1442).
[2] (సహీహ్ అబూదావూద్:3106, సహీహ్ తిర్మిజీ:2083, ఇబ్ను హిబ్బాన్, హాకిమ్).

**ఆ బాలుడు:** ఏం చెయ్యాలో అర్థం కాక తండ్రి వైపు చూడసాగాడు.

**ఆ తండ్రి తన కొడుక్కి:** 'అబుల్ ఖాసిం (ముహమ్మద్-స) మాట విను' బాబూ అంటూ హితవు చెప్పాడు.

**దాంతో ఆ బాలుడు: 'ఇస్లాం స్వీకరించి'** ముస్లిం అయిపోయాడు.

ఆ తర్వాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ఈ బాలుణ్ణి నరకాగ్ని నుండి కాపాడిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు'** అని అంటూ తిరిగి బయలుదేరారు. [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పినతండ్రి అబూతాలిబ్ ఒక అవిశ్వాసి. మరణకాలం దాపురించగానే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన వద్దకు వెళ్ళారు.

ఆయనను పరామర్శించి: 'బాబాయి! మీరు **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని అనండి. **అల్లాహ్ వద్ద మీ కొరకు ఈ వాక్యం మాధ్యమంగా నేను అల్లాహ్‌కు సిఫారసు చేయగలను'** అని అన్నారు.

కాని ఆయన: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మాటను: **'అంగీకరించలేదు'** (అవిశ్వాసిగానే మరణించారు.) [2]

## ఉపకారం (ఇహ్సాన్) చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

ఉపకారం చేసేవారిని అరబీలో **'ముహ్సినీన్'** అంటారు. ఇది ఇహ్సాన్ అనే పదం నుండి వచ్చింది. ఇహ్సాన్ అంటే – అల్లాహ్ మన ముందర ఉన్నాడనీ, ఆయన మనల్ని గమనిస్తున్నాడని భావించి ప్రతి మంచి పనినీ

---

[1] (బుఖారీ:1268).

[2] (బుఖారీ:1272).

చిత్తశుద్ధితో, ఉత్తమ రీతిలో చేయటం అని అర్థం. ఇంకా ఆ మంచిపని దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానానికి అనుగుణంగా ఉండాలి. కీడు తల పెట్టేవారికి మేలు చేకూర్చాలి. అపకారానికి ఉపకారం చేయాలి. తమకు దక్కవలసిన హక్కు పూర్తిగా దక్కకపోయినా తమపై ఎదుటి వారికి ప్రాధాన్యత నివ్వాలి– ఇవన్నీ ఇహ్సాన్ (ఉపకారం, సదమరవర్తన) క్రిందికి వస్తాయి. [1]

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మేలు చేయండీ! నిశ్చయంగా అల్లాహ్ మేలు చేసేవారిని ప్రేమిస్తాడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ వారికి ప్రాపంచిక ఫలాన్నీ ఇచ్చాడు, పరలోకపు ఉత్తమ పుణ్యఫలాన్ని కూడా ప్రసాదించాడు. సత్కార్యాలను ఉత్తమ రీతిలో నిర్వర్తించేవారిని అల్లాహ్ ఎంతగానో ప్రేమిస్తాడు.'' [3]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ ప్రళయ దినాన **(దాసునికి)** ''ఓ ఆదం పుత్రుడా! నేను అస్వస్థతలో ఉన్నప్పుడు నీవు నన్ను పరామర్శించలేదే?'' అని ప్రశ్నిస్తాడు.

**అప్పుడు(దాసుడు):** ''ఓ నా ప్రభూ! నేను నిన్ను పరామర్శించడమేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ''నీకు గుర్తులేదా! నా ఫలాన దాసుడు అనారోగ్యంతో ఉంటే నీవు పరామర్శకు అతని వద్దకు పోలేదే. ఏం నీకు తెలీదా! అతన్ని

---

[1] (అహ్సనుల్ బయాన్ తెలుగు: 1742).

[2] (సూరతుల్ బఖరా: 195).

[3] (అల ఇమ్రాన్: 148).

నీవు పరామర్శించినట్లయితే నన్ను అక్కడ నీవు పొందేవాడివి కదా!'' అని అంటాడు.

''ఓ ఆదం పుత్రుడా! నేను నీ వద్దకు అన్నానికై వచ్చాను. కాని నీవు నాకు అన్నం పెట్టలేదే?'' అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు.

**అప్పుడు (దాసుడు):** ''ఓ నా ప్రభూ! నేను నీకు అన్నంపెట్టేదేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ''నీకు గుర్తులేదా! నా ఫలాన దాసుడు అన్నం పెట్టమని అడిగినప్పుడు నీవు అతనికి అన్నం పెట్టలేదే. ఏం నీకు తెలీదా! అతనికి నీవు అన్నం పెట్టిఉంటే నీవు దానిని(పుణ్యాన్ని) నా దగ్గర పొందేవాడివి కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ''ఓ ఆదం పుత్రుడా! నేను నీ వద్దకు నీళ్ళు త్రాగటానికి వచ్చాను. కాని నీవు నాకు నీళ్ళని త్రాపించలేదే?'' అని అంటాడు.

**అప్పుడు(దాసుడు):**''ఓ నా ప్రభూ! నేను నీకు నీళ్ళని త్రాగించడమేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** నీకు గుర్తులేదా!''నా ఫలాన దాసుడు నీళ్ళు త్రాగించమని వచ్చినప్పుడు నీవు అతనికి త్రాగించలేదే! ఏం నీకు తెలీదా! అతనికి నీవు నీళ్ళు త్రాగించి ఉంటే నీవు అతన్ని నా దగ్గర (పుణ్యాన్ని) పొందేవాడివి కదా!'' అని అంటాడు. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి కోసం వారి ప్రభువు దగ్గర వారు కోరినదల్లా ఉంది. సదాచార సంపన్నులకు లభించే ప్రతిఫలం ఇదే.'' [2]

[1] (ముస్లిం:4661).
[2] (సూరతు జుమర్: 34).

## తోటి సహోదరులకు సహాయపడితే అల్లాహ్ ప్రేమిస్తాడు:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఒక వ్యక్తి వచ్చి:

**యా రసూలల్లాహ్!** ''అల్లాహ్ దగ్గర అతి ప్రియాతి ప్రియమైన మనుషులు ఎవరూ?'' అని అడిగాడు.

**దానికి ప్రవక్త (స):** ''ప్రజలకు అందరింకంటే ఎక్కువగా మేలుచేసేవాడు అల్లాహ్‌కు అందరికంటే ప్రియమైనవాడు.''

**మరియు** ''అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం ఒక ముస్లిం మనసును సంతోషపరచడం. లేక అతని ఒక కష్టాన్ని దూరం చేయడం. లేక అతని రుణాన్ని తీర్చడం. లేక అతని ఆకలిని దూరం చేయడం.''

**మరియు** ''నీవు నా మసీదులో అంటే మస్జిదే నబవీలో ఒకనెల (ఆరాధనకై) కూర్చోవడం కంటే ఎక్కువ ఇష్టమైన కార్యం నీవు ఒక సహోదరుని అవసరంలో సహాయపడడానికి నడిచి వెళ్ళడం.''

**మరియు** ''ఎవరికైతే కోపం వస్తుందో, దాన్ని చూపించే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికి తమ కోపాన్ని దిగమింగేస్తే, ప్రళయదినాన అల్లాహ్ అతని మనసును సంతోషంతో నింపేస్తాడు.''

**మరియు** ''ఎవరైతే ఒక సహోదరుని వెంట వెళ్ళి అతని అవసరం తీరే వరకు అతనితో ఉంటాడో, వారి పాదాలను (ప్రళయ దినాన) అల్లాహ్ స్థిరంగా ఉంచుతాడు, ఏ రోజు అయితే (ప్రళయం రోజు) పాదాలు స్థిరంగా నిలబడలేవో!'' అని అన్నారు.[1]

---

[1] (తబ్రానీ: 862, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 2623).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఎవరైతే ఒక విశ్వాసి (మూమిన్) కష్టాలలో నుండి ఒక కష్టాన్నయితే దూరం చేస్తాడో, ప్రళయ దినాన అల్లాహ్ అతని కష్టాలను దూరం చేస్తాడు. ఎవరైతే ఒకరి ఋణభారాన్ని సులభవంతంగా చేస్తాడో, అల్లాహ్ అతనితో ఇహపరలోకాలలో సులభతరంగా మసులుకుంటాడు.''

''ఎవరైతే ఒక ముస్లిం చేసిన తప్పును కప్పిపుచ్చుతాడో, అల్లాహ్ వారి తప్పులను ఇహపర లోకాలలో కప్పివేస్తాడు. ఎప్పటివరకైతే దాసుడు తన తోటి సహోదరుని సహాయంలో ఉంటాడో, అప్పటివరకు అల్లాహ్ ఆ దాసుని సహాయంలోనే ఉంటాడు...'' [1]

హజ్రత్ అబూ హురైరా (సల్లల్లాహు అలైహి వసల్లం) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

ఒక వ్యక్తి అవసరమున్న వారికి అప్పులు ఇచ్చేవాడు. అతను తన అప్పులను వసూలు చేసే వ్యక్తికి ఇలా ఆదేశించేవాడు: ''నీవు నిరుపేదల వద్ద అప్పును అడుగుటకై పోతే వారిని (క్షమించి) వదలిపెట్టు. దానివలన అల్లాహ్ మనల్ని (క్షమించి) వదలిపెట్టవచ్చు'' అని చేప్పేవాడు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: ''అతను అల్లాహ్‌ను కలుసుకున్నాడు అల్లాహ్ అతనిని క్షమించాడు.'' [2]

---

[1] (ముస్లిం:4867).

[2] (బుఖారీ:3221, ముస్లిం2922).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటివాడు, మరియు ఒక విశ్వాసి మరో విశ్వాసికి సోదరుడు. అతనికి అన్ని విధాల ఆర్థిక సహాయం చేస్తాడు, మరియు అతని వెనక నుండి కూడా సంరక్షకుడిగా ఉంటాడు.'' [1]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీలోని ఐశ్వర్యవంతులు, స్థితి మంతులు తమ బంధువులకు, నిరుపేదలకు, అల్లాహ్ మార్గంలో స్వస్థలం వదలి వచ్చిన వారికి 'ఇవ్వబోము' అని ఒట్టు పెట్టుకోరాదు. పైగా వారిని క్షమించాలి. (వారిపట్ల) మన్నింపుల వైఖరిని అవలంబించాలి. ఏమిటీ, అల్లాహ్ మిమ్మల్ని క్షమించాలని మీరు అభిలషించరా? అల్లాహ్ మాత్రం (తప్పులను) క్షమించేవాడు, కరుణామయుడు.'' [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) గారిపై అపనిందలో పాల్గొన్న మిస్తహ్ పేదవారు. దైవ మార్గంలో వలస వచ్చినవారు(ముహాజిర్). పైగా ఆయన హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) గారికి పిన్నికొడుకు అవుతారు.

అందువల్ల ఆయన పోషణా బాధ్యతను హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) స్వీకరించారు. కాని ఈ సంఘటన కారణంగా ఆ తండ్రి మనస్సు చివుక్కుమంది. ఇలా జరగటం సహజం కూడాను.

''ఇకమీదట ఎన్నడూ మిస్తహ్‌కు ఆర్థిక సహాయం అందజేయనని హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) కోపంతో ఒట్టేసుకున్నారు.''

---

[1] (సహీహ్ అబూదావూద్: 4918).

[2] (సూరతున్ నూర్: 22).

ఈ విధంగా **ప్రతిన బూనటం అల్లాహ్‌కు నచ్చలేదు.** హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) మామూలు వ్యక్తి కారు. సాధారణ వ్యక్తి వల్ల ఇలాంటి చిన్న పొరపాటు జరిగితే అది తీవ్రంగా పరిగణించబడేది కాదేమో!

కాని ఆ తండ్రి మనసు ఎంతగా తల్లడిల్లినప్పటికీ – ప్రతీకారవాంఛతో– ధన సహాయాన్ని నిలిపివేస్తాననటం ఆయన సత్యసంధతకు, ఔదార్యానికి శోభయమానం కాదుకదా!

అందుకే!అల్లాహ్ చాలా సుతిమెత్తగా హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) మానవ సహజ దౌర్బల్యాన్ని ఎత్తి చూపిస్తూ, మన్నింపుల వైఖరిని అవలంబించవలసిందిగా ఉపదేశించాడు. అల్లాహ్ మీ తప్పుల్ని మన్నించాలన్నది మీ అభిమతం కాదా?! అంటూ క్షమా గుణాన్ని, ప్రేమసాగరాన్ని చిలికించాడు.

ఈ ఆదేశాన్ని విన్నంతనే హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) లోని గుండె ద్రవించింది. ఔదార్యం వర్షించసాగింది. **'ఓ ప్రభూ! నీ క్షమాబిక్షను ఎందుకు అభిలషించము? నీవు మమ్మల్ని క్షమించాలని మనసారా కోరుకుంటున్నాము'** అని ప్రతిస్పందించారు.

తరువాత ఆయన తన ప్రమాణ భంగానికి పరిహారం (కఫ్ఫారా) చెల్లించి, మిస్తహ్ పోషణాభారాన్ని మునుపటి మాదిరిగానే స్వీకరించారు. [1]

## అనాథులను ఆదరిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు:

అల్లాహ్ ఇలా ఆదేశించాడు: ''నీవు అనాథుల పట్ల కఠినంగా ప్రవర్తించకు – మరియు యాచకుణ్ణి కసురుకోకు.'' [2]

---

[1] (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్ను కసీర్, అహ్‌సనుల్ బయాన్: తెలుగు:1513).

[2] (సూరతు జుహా:9-10).

హ|జత్ అబూ హురైరా: (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అనాధుల పోషకుడు, అనాధకు బంధువైనా, కాకపోయినా సరే, నేను మరియు అతను స్వర్గంలో ఈ రెండు వ్రేళ్ళు మాదిరిగా (కలిసి) ఉంటాం...''[1]

హ|జత్ సహ్లా బిన్ సాద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నేను మరియు అనాధల పోషకుడు స్వర్గంలో ఇలా ఉంటాం'' ఆయన తన చూపుడు వ్రేలు మరియు మధ్య వ్రేలిని కలపకుండా, కొంత సందు ఉంచి చూపించారు. [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఓ అల్లాహ్! ఇద్దరు అబలల హక్కుల విషయంలో నేను ప్రజలను పదేపదే భయపెడుతున్నాను. వారు అనాథ మరియు స్త్రీ.'' [3]

## ఆడ పిల్లలను పెంచి పోషిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు:

మానవ చరిత్రలో మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆవిర్భావానికి పూర్వం వరకు స్త్రీ మూర్తిని అనేక విధాలుగా అవమాన పర్చడం జరిగింది. యూదులు స్త్రీని పాపాలకు తల్లిగా, చెడుకు మూలంగా, మానవత నుదిటిపై మచ్చగా తీర్మానిస్తే, క్రైస్తవులు ఆమెను ఒక వ్యక్తిగా అంగీకరించేందుకు సైతం నిరాకరించారు. అంతేగాకుండా స్త్రీ మానవ రూపంలోని ఒక పిశాచిగా తీర్మానించారు. హిందూమతంలో ఆడపిల్ల

---

[1] (ముస్లిం:5296).
[2] (బుఖారీ:4892).
[3] (సహీహ్ ఇబ్ను మాజా: 3678).

పుట్టుకను అశుభమైనదిగా భావించడం జరిగింది. ఆడపిల్ల వివాహం జరిగిన తార్వత దౌర్భాగ్యవశాత్తూ ఒకవేళ ఆమె భర్త చనిపోయినట్లయితే ఆమెకు క్రింద పేర్కొనబడిన మార్గాలలో నుంచి ఏదో ఒక మార్గాన్ని ఎంచుకోవడం మినహా మార్గాంతరం లేకుండాపోయేది.

1) ఆమె తన కొరకు మృత్యువు కంటే హీనమయిన జీవితాన్ని ఎంచుకోవాలి.

2) భర్త చితితో పాటే ఆమె కూడా సహగమనం చేసి సజీవింగా దహనమైపోయి బూడిదగా మారిపోవాలి.

ఇక అరేబియాలో కూడా నాడు ఆడపిల్ల పుట్టుకను అప్రతిష్ఠగా భావించేవారు. ఏ ఇంటిలోనయితే ఆడపిల్ల పుడుతుందో ఆ ఇంటి యజమాని తన ముఖాన్ని ప్రజలకు చూపించకుండా చాటేస్తూ తిరిగేవాడు. అంతే గాకుండా అప్పుడే పుట్టిన ఆడ శిశువులను సజీవంగా భూమిలో పాతిపెట్టి తమ చర్య పట్ల గర్వించేవారు.

అటువంటి తరుణంలో సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ ఆఖరి దైవప్రవక్త హ్రజత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కారుణ్య మూర్తిగా ప్రభవింపజేశాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కారుణ్య ఖజానాలను సమస్త మానవాళిపై కుమ్మరించడమే కాకుండా తన వాత్సల్యంతో సున్నితమైన అస్తిత్వమైన స్త్రీని సైతం సుసంపన్నం కావించారు. ఆడపిల్లల కొరకు, మహిళల కొరకు ప్రత్యేకమైన ఆదేశాలను అందజేశారు. ఆడపిల్లలను పెంచి పెద్ద చేసేవారికి, మంచి శిక్షణను వారికి అందజేస్తే స్వర్గలోకపు శుభవార్తను అందజేశారు.

కనుక ఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు మీరు వారి(స్త్రీల)పట్ల సద్భావాంతో మెలగండి.'' [1]

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ముగ్గురు కూతుళ్ళు ఉంటే వారి పట్ల సహనంతో మసులుకొని, తమ శక్తికొద్ది వారికి తినిపించి, త్రాపించి, తొడిగించి (పెంచి పెద్దచేస్తే) ప్రళయం రోజున అతనికై (ఆ మహిళలు) నరకాగ్నికి అడ్డుగా ఉంటారు.''[2]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఎవరికైనా ముగ్గురు కూతుళ్ళు లేదా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉండి, లేక ఇద్దరు కూతుళ్లు, లేదా ఇద్దరు అక్కాచెల్లెళ్ళు ఉండి వారిని చక్కగా పెంచి, పోషించి వారి(హక్కుల)పట్ల అల్లాహ్‌తో భయపడి నడుచుకుంటే అలాంటి వారికి స్వర్గమే నిలయం.'' [3]

హజ్రత్ అబూసయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరికైనా ముగ్గురు కూతుళ్ళు లేదా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉండి, లేక ఇద్దరు కూతుళ్లు, లేదా ఇద్దరు అక్కాచెల్లెళ్ళు ఉండి వారిని చక్కగా పెంచి, వారిని వివాహం చేసి, వారికి మేలు చేస్తే అతనికి స్వర్గం.'' [4]

---

[1] (సూరతున్ నిసా: 19).

[2] (బుఖారీ, ఫిల్ అదబుల్ ముఫ్రద్: 13–14, అహ్మద్: 4/154, సహీహ్ ఇబ్ను మాజా: 3669).

[3] (సహీహ్ తిర్మిజీ: 1916, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1973).

[4] (అబూదావూద్, అద్దుర్రుల్ మన్సూర్, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1973).

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైనా ఇద్దరు కూతుళ్ళను లేదా ముగ్గురు అక్కాచెల్లెళ్ళను, లేక ముగ్గురు కూతుళ్ళను లేదా ఇద్దరు అక్కాచెల్లెళ్ళను వారు చనిపోయే వరకు లేదా అతను చనిపోయే వరకు పోషిస్తే (ప్రళయ దినాన) నేను మరియు అతను ఈ వేళ్ళవలె ఉంటాము అని చూపుడు వేలును మరియు మధ్యవేలును కలిపి చూపిస్తూ అన్నారు.'' [1]

హ|జత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవడైతే ఇద్దరి ఆడ సంతానాన్ని పోషిస్తాడో, అతను మరియు నేను స్వర్గంలో ఇలా ఉంటాము అని, చూపుడు వేలును మరియు మధ్యవేలును కలిపి సైగ చేశారు.''[2]

హ|జత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; 'నా వద్దకు ఒక అభాగ్యురాలు తన ఇద్దరు కూతుళ్ళను ఎత్తుకొని వచ్చింది. నేనామెకు తినడానికి మూడు ఖర్జూరపండ్లు ఇచ్చాను.

ఆమె వాటిలో రెండు ఖర్జూర పండ్లు ఇద్దరు కూతుళ్ళకు తలా ఒకటి ఇచ్చి మిగిలిన ఒక ఖర్జూరపండును తన నోట్లో వేసుకోపోయింది.

అంతలో ఆ ఇద్దరు కూతుళ్ళూ ఆ ఖర్జూరపండు కూడా కావాలని అడిగారు.

వెంటనే ఆమె తాను తినాలనుకున్న ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలు చేసి ఇద్దరు కూతుళ్ళకు పంచివేసింది.

అది చూసి నాకు చాలా సంతోషం కలిగింది. నేనీ విషయాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు తెలియజేసాను.

---

[1] (అహ్మద్:12041, సిల్‌సిలతుస్ సహీహా: 296).

[2] (సహీహ్ తిర్మిజీ: 1914, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1970).

దానిపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా పేర్కొన్నారు: ''అల్లాహ్ ఆమె చర్య కారణంగా ఆమెకొరకు స్వర్గం తప్పనిసరి చేశాడు. లేదా ఆమెకు నరకం నుంచి విముక్తిని ప్రసాదించాడు.''[1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి నలుగురు కూతుర్లు, మరియు ఇద్దరు కుమారులు. కాని ఇద్దరు కుమారులు చిన్న తనంలోనే చనిపోయారు. ఆడ పిల్లలను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అమితంగా ప్రేమించేవారు. చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏదయినా యుద్ధం నుంచి లేదా ప్రయాణం నుంచి తిరిగి వచ్చినప్పుడల్లా అన్నిటికంటే ముందు మస్జిద్‌కు వెళ్ళి ఆ తర్వాత తనకు ఎంతో ప్రాణప్రదమైన కుమార్తె హ|జత్ ఫాతిమా (రజియల్లాహు అన్హ) ఇంటికి వెళ్ళేవారు.

ఈ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విశ్వ ప్రభువైన అల్లాహ్ తర్వాత అన్నిటికంటే ఎక్కువగా తమ కుమార్తె గుర్తుకొచ్చేవారు.

హ|జత్ మిస్వర్ బిన్ మఖ్రమా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా ఫాతిమా (రజియల్లాహు అన్హ) నాలోని ఒక భాగము. మరియు ఆమెను బాధపెట్టటాన్ని నేను సహించను...'' [2]

హ|జత్ ఉమ్మె సల్మా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హ|జత్ **'ఫాతిమా'**ను పిలుపించారు.

---

[1] (ముస్లిం:4764).
[2] (బుఖారీ:3450).

**ఆయన ఆమెతో:** ''గుసగుసలాడగా ఆమె ఏడ్వనారంభించారు. తిరిగి ఆమెను పిలిచి చెవిలో ఏదో చెప్పగా ఆమె నవ్వనారంభించారు.''

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మరణానంతరం మేము ఆమెతో ''ఏడ్వటానికి, నవ్వటానికి కారణమేమీ?'' అని అడిగాము.

**తరువాత ఆమె ఇలా చెప్పారు:** మొదటి సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో గుసగుసలాడి చెప్పింది:

''ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) చనిపోతారనే విషయం.'' కాబట్టి నేను ఏడ్చాను.

**తరువాత నా చెవిలో చెప్పింది:** ''నా కుటుంబంలో అందరికంటే ముందు నీవే నాతో కలుసుకోబోతున్నావు (మరణిస్తావు). మరియు నేను స్వర్గంలో ఉన్న స్త్రీలందరికీ సయ్యిదా(నాయకురాలు)ని, మర్యమ్ బిన్తె ఇమ్రాన్ (అలైహిస్సలామ్) గారికి తప్ప'' అని అనగా నేను నవ్వాను. [1]

కానీ శోచనీయమైన విషయమేమిటంటే అజ్ఞాన కాలపు అరబ్బుల్లో ఉన్న దురాచారమే నేటి తల్లిదండ్రుల్లోనూ ప్రబలి ఉంది అనగా కుమార్తెలు, కుమారుల మధ్య వ్యత్యాసం కనబరచడం, కుమారులకు కుమార్తెలకంటే ఎక్కువగా ప్రాధాన్యతనివ్వడం మొదలయినవి.

కొడుకు పుట్టగానే లడ్డూలు పంచుతూ, కూతురు పుట్టగానే ముఖాన్ని వేలాడేసుకునేవారు, తమ భార్యల మీద అలిగేవారు ఎంతమందో కదా! కేవలం భార్యల మీద అలగడం మాత్రమే కాకుండా కొంతమంది పురుషులయితే కూతురు పుట్టిన కారణంగా తమ భార్యలకు విడాకులు సైతం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి.

---

[1] (సహీహ్ తిర్మిజీ: 3893, మరియు బుఖారీ, ముస్లిం,).

వేలాదిమంది తమ భార్యలు గర్భం ధరించియున్న కాలంలో స్కానింగ్ ద్వారా పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలుసుకోగానే అబార్షన్ (గర్భస్రావం) చేయిస్తున్నారు.

ఇటువంటి ఎన్నో సంఘటనల్లో ఎంతోమంది స్త్రీల విలువయిన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆఖరికి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రభావానికి ముందు అజ్ఞానకాలంలో అరబ్బు జాతిలో ఉండిన మహా అజ్ఞానం వంటిదే ఇది. వారు అమాయకులైన ఆడపిల్లలను సజీవంగా పాతిపెట్టేవారు.

ఈ విషయం గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నాడు: సజీవంగా పాతిపెట్టిన బాలికలను **'నీవు ఏ నేరం కారణంగా హతమార్చబడ్డావు?'** అని ప్రశ్నించడం జరిగినప్పుడు..'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''తాను కోరిన వారికి ఆడపిల్లల్ని ఇస్తాడు, తాను కోరిన వారికి మగపిల్లల్ని ఇస్తాడు. - లేదా వారికి మగ పిల్లలను, ఆడపిల్లలను కలిపి ఇస్తాడు. మరి తాను కోరిన వారిని సంతాన హీనులుగా చేస్తాడు. ఆయన మహాజ్ఞాని, సంపూర్ణ అధికారం కలవాడు.''[2]

కనుక ఆడ, మగా అనే నిర్ణయం అల్లాహ్ నిర్ణయమే తప్ప స్త్రీకి లేక పురుషునికి దానిలో ఎలాంటి ప్రమేయం లేదు. ఇదంతా దైవలీల అని ప్రతి వ్యక్తికీ తెలుసు. అయినప్పటికి స్త్రీలను నిందచడం లేక వారిని తప్పు పట్టడం మనిషి మానవత విలువలు దిగజారడానికి మరియు మూర్ఖత్వానికి చిహ్నం తప్ప మరేమికాదు.

---

[1] (సూరతు తక్‌వీర్:8-9).

[2] (సూరతుష్ షూరా:49-50, ఇస్లాంలో పిల్లల శిక్షణ: 24-29).

# అధ్యాయం-12

245-263

## 12-అల్లాహ్ ప్రియతముల పరలోక ప్రయాణం

- అల్లాహ్‌ను ప్రేమించే దాసులకు మంచి చావు .
- అల్లాహ్ సన్నిధిలో ప్రియమైన ఆత్మలకు లభించే గౌరవం.
- సమాధిలో ప్రశ్నోత్తరాల తరువాత స్వర్గ సుఖాలు.
- పరలోకంలో అల్లాహ్ తన ప్రియమైన దాసుల పాపాలను క్షమిస్తాడు.
- పరలోకంలో విశ్వాసులకు జ్యోతి ప్రసాదించబడుతుంది.
- విచారణ లేకుండానే కొందరు స్వర్గంలోనికి ప్రవేశిస్తారు.
- అందరికంటే ముందు స్వర్గానికి ప్రవేశించే ప్రియమైన దాసులు.
- అందరికంటే చివరిన స్వర్గంలోనికి పోయే దాసులు.

# 11–అల్లాహ్ ప్రియతముల పరలోక ప్రయాణం

## అల్లాహ్‌ను ప్రేమించే దాసులకు మంచి చావు:

అల్లాహ్ ఇష్టానుసారం ఈ లోకంలో జీవితాలను గడిపిన విశ్వాసులు మరియు పుణ్యాత్ములు సుఖసంతోషాలతో మృత్యువు పొందుతారు. వారు మరణ సమయంలో భయానికి దుఃఖానికి గురికావడం అనేది జరగదు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా అల్లాహ్ దూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు: 'భయపడకండీ, బాధపడకండీ! మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి. మేము ఈ ప్రాపంచిక జీవితంలో కూడ మీకు సహచరులుగా ఉంటాము. పరలోకంలో కూడా ఉంటాము. అక్కడ మీరు కోరినదల్లా మీకు లభిస్తుంది. మీరు ఆశించే ప్రతి వస్తువూ మీదవుతుంది. ఇవీ మీకు లభించే ఆతిధ్యపు ఏర్పాట్లు. క్షమాశీలుడు, కరుణామయుడయిన అల్లాహ్ వైపు నుండి.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''వీరమరణం పొందేవారు తనను హతమార్చే సమయంలో చీమ కుట్టినంత బాధ మాత్రమే అనుభవిస్తాడు.'' [2]

---

[1] (41,హామీమ్ అస్సజ్దా: 30–32).

[2] (తిర్మిజీ, నసాయి, హదీస్ హసన్).

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**విశ్వాసుడైన దాసునికి:** ప్రపంచం నుండి అతని (జీవితం) తెగిపోయి పరలోకానికి పోయేటప్పుడు అతని వద్దకు ఆకాశము నుండి అల్లాహ్ దూతలు దిగివస్తారు.

మరియు వారి ముఖాలు తెల్లగా సూర్యకాంతిలా మెరుస్తూ ఉంటాయి. వారి వద్ద కఫన్ (మృతదేహానికి ధరింపజేసే) దుస్తులు మరియు సుగంధాలు ఉంటాయి.

అతను చూడగలిగినంత దూరము వరకు అతని ముందు (అల్లాహ్ దూతలు) కూర్చుంటారు.

తరువాత మలకుల్ మౌత్ (ప్రాణంతీసే దూత) వచ్చి అతని తల దగ్గర కూర్చుంటాడు.

**అప్పుడు అతనితో:** 'ఓ పరిశుద్ధమైన మనసా! (ఓ తృప్తి పొందిన మనసా) అల్లాహ్ నుండి క్షమాపణ పొందుటకై అతని ప్రేమ పొందుటకై పదా'...అని అంటారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: 'అప్పుడు మనిషి ప్రాణము కూజా (సురాయి) మూతి నుండి నీరు ఎంత తేలికగా బయటకు వస్తుందో! అంత తేలికగా అతని ప్రాణము తీసుకోబడును.'

**మరొక ఉల్లేఖనం ప్రకారము:** 'అతని ప్రాణము తీసేవరకు భూమ్యాకాశాల మధ్యలో ఉన్న అల్లాహ్ దూతలు, మరియు ఆకాశంలో ఉన్న అల్లాహ్

దూతలందరూ అతని కొరకు ప్రార్థనలు చేస్తారు. అతని కొరకై ఆకాశము యొక్క ద్వారాలు తెరవబడుతాయి. ఆకాశాలలో ప్రతి దూత మా ద్వారము గుండా ఆ ప్రాణము ఎక్కి రావాలనీ అల్లాహ్‌ను వేడుకుంటారు...'[1]

## అల్లాహ్ సన్నిధిలో ప్రియమైన ఆత్మలకు లభించే గౌరవం:

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''పుణ్యాత్ముని ప్రాణము తీసేవరకు భూమ్యాకాశాల మధ్యలో ఉన్న అల్లాహ్ దూతలు మరియు ఆకాశంలో ఉన్న అల్లాహ్ దూతలందరూ అతని కొరకు ప్రార్థనలు చేస్తారు. అతని కొరకై ఆకాశాల ద్వారాలన్నీ తెరుస్తారు.''

ఆకాశాలలో ఉన్న ప్రతి దూత తమ ద్వారము గుండా ఆ శుభాత్మ రావాలనీ అల్లాహ్‌ను ప్రార్థనలు చేస్తారు.

**అల్లాహ్ దూతలు**: ఆ ఆత్మను తమ చేతిలో తీసుకున్న తరువాత రెప్పపాటుకై కూడా ఆలస్యం చెయ్యకుండా దాన్ని సుగంధ వస్త్రంలో చుట్టుకొని తీసుకెళ్ళతారు.

'ప్రపంచ సుగంధాలన్నిటిలోకి ఆ సుగంధ పరిమళం ఎంతో మధుర మైనదిగా ఉంటుంది.'

తరువాత ఆ ఆత్మను తీసుకొని (ఆకాశాల)పైకి పోతారు.

అప్పుడు ఆ దారిలో కలిసే ప్రతి అల్లాహ్ దూత: **'ఈ శుభకరమైన ఆత్మ ఎవరిదనీ'** ప్రశ్నిస్తారు?

---

[1] (అబూదావూద్, హాకిమ్, అహ్కాముల్ జనాయిజ్ లిల్ అల్‌బాని: 105).

వారు: **'ఇతను ఫలానా వ్యక్తి అని, అతని ప్రపంచపేర్లన్నిటిలో కంటే అతి మంచి పేరును పేర్కుంటారు.'** అలా ప్రపంచపు (మొదటి) ఆకాశమునకు చేరుకుంటారు.

అక్కడున్నవారితో: 'ఆకాశపు ద్వారాలు తెరవమంటారు.'

వారు (అల్లాహ్ దూతలు) ఆ శుభాత్మను స్వాగతిస్తూ (ఆకాశ ద్వారాలను) తెరుస్తారు.

'అలా శుభాత్మను ఏడు ఆకాశాలకు తీసుకువెళ్ళి చివరకు అల్లాహ్ సన్నిధిలో ప్రవేశపెడతారు.

**అప్పుడు అల్లాహ్:** 'అతని పేరు ఇల్లియీన్ (సత్కర్మల చిట్టా)లో వ్రాయండి' అని అంటాడు.

**''ఇల్లియీన్ అంటే ఏమిటో నీకు తెలుసా? అది ఒక లిఖిత గ్రంథం. దాన్ని సన్నిహితులైన అల్లాహ్ దూతలు కాపాడుతున్నారు.''**

తరువాత వారు: 'ఇల్లియీన్‌లో అతని పేరు రాస్తారు.'

ఆ ఆత్మను తిరిగి భూలోకానికి పంపండనీ (అల్లాహ్) ఆదేశిస్తాడు. ఎందుకంటే? అల్లాహ్ సూక్తి ఇలా ఉంది: **''నేనతడ్ని అక్కడి (భూమి) నుండే పుట్టించాను తిరిగి అక్కడికే పంపుతాను. మరోసారి అక్కడి నుండే బ్రతికించి (ప్రళయం రోజు) వెలికితీస్తాను.''**

ఆ విధంగా అతని ఆత్మను భూలోకానికి(సమాధిలోకి) చేర్చుతారు, తరువాత ఆ ఆత్మను అతని శరీరంలోకి ప్రవేశపెడుతారు.

మృతునికి ఖననం చేసి తిరిగి వెళ్ళిపోయేవారి (బంధువుల) **'పాదరక్షల సవ్వడి'** అతను వింటాడు...[1]

---

[1] (అహ్మద్:17872, అహ్‌కాముల్ జనాయిజ్, లిల్ అల్బానీ:67).

## సమాధిలో ప్రశ్నోత్తరాల తరువాత స్వర్గ సుఖాలు:

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: 'నిశ్చయంగా ప్రజలు సమాధిలో ఖననం చేసిన తరువాత పరీక్షించబడుతారు.'

విశ్వాసిని సమాధిలో ఖననంచేసి ప్రజలు తిరిగి వెళ్ళగానే అతని వద్దకు ఇద్దరు కఠినమైన దైవదూతలు వస్తారు. వారిలో ఒకరిపేరు **మున్కర్** మరొకరి పేరు **నకీర్**.....

వారిద్దరు విశ్వాసిని ఇలా ప్రశ్నిస్తారు: 'నీ ప్రభువు ఎవరు? నీ ధర్మం ఏది? నీ ప్రవక్త ఎవరు?'

అప్పుడు ఒక విశ్వాసి: 'ఇదే ఆఖరి పరీక్షగా ఎదుర్కుంటాడు.'

అందుకనే అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''అల్లాహ్ విశ్వాసులను ఒక బలమైన వాక్కు ఆధారంగా ఇహలోకంలోను, పరలోకంలోను స్థిరమైన నిలకడను ప్రసాదిస్తాడు.''** [1]

అప్పుడు అతను: **'నా ప్రభువు అల్లాహ్, నా ధర్మం ఇస్లాం, నా ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)'** అని జవాబిస్తాడు.

తరువాత ఆకాశం నుండి ఇలా ఒక శబ్దం వస్తుంది: 'నా దాసుడు నిజాన్ని చెప్పాడు. అతనికై స్వర్గ పడకను సిద్ధం చేయండి. అతనికి స్వర్గ దుస్తులు తొడగించండి. అతని కొరకు స్వర్గం వైపున్న తలుపును తెరవండి.....' [2]

---

[1] (14,ఇబ్రాహీమ్: 27).

[2] (అబూదావూద్, హాకిమ్, కితాబుల్ జనాయిజ్ లిల్ అల్బాని: 200-201).

**మరొక ఉల్లేఖనం ప్రకారం:**

విశ్వాసి సమాధి చేయబడిన తరువాత అతని పుణ్యాలు సమాధిలో:

**అతని ముందు:** 'అందమైన ఆకారంలో అందమైన దుస్తులు ధరించి, మంచి సువాసనతో (ఒక వ్యక్తిలా మారి) వస్తాడు.'

**అతను ఇలా అంటాడు:** 'నేను నీకు సంతోషించే శుభవార్తను ఇస్తున్నాను. అల్లాహ్ నీతో ఇష్టపడుతున్నాడనే శుభవార్తను తెలుపుతున్నాను.

మరియు నీ కోసం స్వర్గం దాని అనుగ్రహాల నివాసం ఉంది. ఈ రోజు గురించే నీకు వాగ్దానం చేయబడినది.'

**తరువాత (మృత్యువు) అతనితో:** 'అల్లాహ్ నీకు కూడా  శుభాల సువార్తను ప్రసాదించుగాక!  నీవు ఎవరు? నీ ముఖము చాలా మంచి ముఖము. నీవు మంచినే తెస్తావు' అని అంటాడు.

**అప్పుడు ఆ వ్యక్తి:** 'నేను నీ పుణ్యకార్యాలు' అని సమాధానమిస్తాడు.

ఆ వ్యకి: 'అల్లాహ్ సాక్షిగా! నేను నిన్ను గుర్తు పట్టలేదు.'

ఎందుకంటే? 'నేను అల్లాహ్ విధేయత పాటించడం అంటే  (ఆలస్యం చెయ్యకుండ) చాలా తొందరపడేవాణ్ణి. అల్లాహ్ అవిధేయతకు చాలా దూరంగా ఉంటుండేవాణ్ణి. అల్లాహ్ నీకు మంచి ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక'

తరువాత (ఆ సమాధిలో) అతనికై స్వర్గం తలుపును తెరుస్తారు. అలాగే నరకం తలుపునూ తెరుస్తారు.

**తరువాత ఇలా అంటారు:** 'నీవు అల్లాహ్ అవిధేయతకు పాల్పడిఉంటే, ఇక్కడే నీ నివాసం ఉండేది.

**కాని దానికి బదులు:** 'అల్లాహ్ నీకు స్వర్గాన్ని ప్రసాదించాడు.'

ఎప్పుడైతే అతను స్వర్గంలో ఉన్న అనుగ్రహాలను చూసుకుంటాడో! అప్పుడు **అతను:** 'ఓ అల్లాహ్ ప్రళయాన్ని తొందరగా నెరవేర్చు నేను నా కుటుంబీకుల వద్దకు నా అనుగ్రహాల వద్దకు చేరుకోవాలి' అని అంటాడు. తరువాత అతనికి **''నీవు ఇక్కడే ఉండు''** అని చెప్పబడుతుంది...[1]

## పరలోకంలో అల్లాహ్ తన ప్రియమైన దాసుల పాపాలను క్షమిస్తాడు:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్తుండగా నేను ఇలా విన్నాను: ''అల్లాహ్ విశ్వాసిని తన దగ్గరకు చేర్చుకుంటాడు. అతనిని (ఎవరూ చూడకుండా తన దగ్గర) దాచుకుంటాడు. తరువాత:

**అల్లాహ్ అతనితో:** 'నీవు ఈ ఈ పాపాలు చేసావు కదా! నీకు తెలుసా? నీవు ఈ పాపాలు చేసావు కదా! నీకు తెలుసా?' అని అడుగుతాడు.

అతను: 'అవును ప్రభూ!' ఆ పాపాలు నేను చేసినవే' అని అంగీకరిస్తాడు. ఇంకా తనకు చావు తప్పదేమోననీ లోలోనే అనుకుంటూ ఉంటాడు. **అంతలో అల్లాహ్:** 'ఆ పాపాలన్నిటినీ భూలోకంలో (ఇతరులకు తెలియకుండా) నేను దాచాను. ఈ రోజు వాటినన్నిటిని క్షమించాననీ' అంటాడు. తరువాత అతనికి పుణ్యాల పుస్తకాన్ని ప్రసాదిస్తాడు.'

[1] (అబూదావూద్, అహ్మద్, కితాబుల్ జనాయిజ్ లిల్ అల్బాని, పేజి నెంబరు:201–202).

అదే గనుక అవిశ్వాసులు మరియు వంచకులు అయితే అల్లాహ్ వారి గురించి ఇలా అంటాడు: 'తమ ప్రభువుకు అపద్దాన్ని అంటగట్టిన దుర్మార్గుల మీద అల్లాహ్ శాపం విరుచుకుపడుతుంది.'[1]

మరియు అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''ఇటువంటి వారి నుండి మేము వారు చేసిన మంచి కర్మలను స్వీకరిస్తాము. వారు చేసిన చెడుకర్మలను మన్నిస్తాము. వారికి చేస్తూ వచ్చిన సత్యవాగ్దానం ప్రకారం స్వర్గవాసులలో చేరిపోతారు.''[2]

హజ్రత్ అబూ జర్రీన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'నిశ్చయంగా స్వర్గంలో చిట్టచివరిగా పోయే వ్యక్తి గురించి నాకు తెలుసు. అలాగే నరకం నుండి అందరికంటే చివరిగా బయటకు తీయబడే వ్యక్తి గురించి కూడా నాకు తెలుసు' అని అన్నారు.

**ప్రళయ దినాన:** 'ఒక వ్యక్తిని తీసుకొనిరావటం జరుగుతుంది. అప్పుడు అతను చేసిన చిన్నచిన్న పాపాలన్నీ చూపించమని ఆదేశింపబడును.'

**తరువాత అతనితో:** 'నీవు ఆ రోజు ఇవి అవీ (పాపాలు) చేసావు కదా! ఆ రోజు నీవు ఇవి అవీ (పాపాలు) చేసావు కదా!' అని అతని ముందు బహిర్గతం చేయబడును.

**దానికతను:** 'అవునంటాడు' వాటిని తిరస్కరించలేడు. ఎందుకంటే? 'అతను చేసిన ఘోర పాపాలు ఎక్కడ బహిర్గతం చేస్తారోననీ లోలోపల భయపడుతూ' ఉంటాడు.

---

[1] (11,సూరతుల్ హూద్: 18) (బుఖారీ, ముస్లిం).

[2] (46,సూరతుల్ అహ్ఖాఫ్:16).

**అంతలో అతనికి :** '(చూపించబడిన) ప్రతి పాపానికి బదులుగా ఒక్కొక్క పుణ్యం లభిస్తుంది వెళ్ళు' అని చెప్పబడును.

**అప్పుడతను, దాన్ని చూసి** (అల్లాహ్ క్షమించి అతనికి పుణ్య వరాలను ప్రసాదించిన సంగతిని గమనించి): 'ఓ ప్రభూ! నేనింకా కొన్ని (ఘోర పాపాలు) కూడా చేసాను. ఇక్కడ నాకు అవి చూపించబడ లేదే?' అని అంటాడు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు: **'తమ నోటిలోని దవడలు కనిపించినట్లు ఫక్కున నవ్వారనీ'** హదీసు ఉల్లేఖించిన వారు తెలిపారు. [1]

## పరలోకంలో విశ్వాసులకు జ్యోతి ప్రసాదించబడుతుంది:

అల్లాహ్‌ను విశ్వసించే దాసులకు పరలోకంలో జ్యోతి లభిస్తుంది. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆ రోజు అల్లాహ్ తన ప్రవక్తనూ ఆయనతో పాటు విశ్వసించిన వారిని ఎలాంటి అవమానాలకు గురిచేయడు. వారి జ్యోతి వారి ముందు మరియు వారి కుడివైపు పరుగెత్తుతూ ఉంటుంది. అప్పుడు వారు: 'ఓ అల్లాహ్ మా జ్యోతిని మా కోసం పరిపూర్ణం చెయ్యి, మమ్మల్ని క్షమించు' నిస్సందేహంగా నీవు ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నావు'' అని ప్రార్థిస్తారు. [2]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

---

[1] (ముస్లిం:277).

[2] (66,సూరతుత్ తహ్రీమ్: 8).

''.... ప్రళయ దినాన మానవులందరూ సమావేశమవుతారు. అప్పుడు వారిలో కొంత మందికి: **'కొండంత జ్యోతి'** ప్రసాదించబడుతుంది. కొందరికి: **'దానికంటే కొంత తక్కువ జ్యోతి'** ప్రసాదించబడుతుంది.
ఇంకా కొందరికి: **'కుడివైపున ఖర్జూరం వృక్షముకు (సమానమైన) జ్యోతి'** ప్రసాదించబడుతుంది.
మరియు కొందరికి: **'అతని కుడివైపున దానికంటే కొంత తక్కువ జ్యోతి'** ప్రసాదించబడుతుంది.
చివరికి ఒక వ్యక్తి: **'తన కాలి బొటన వ్రేలులో జ్యోతి'** పొందుతాడు. అది ఒకసారి ప్రకాశిస్తే మరొకసారి ప్రకాశించదు.
అతను: **'ఆ జ్యోతి ప్రకాశించినప్పుడెల్లా తన కాలు ముందుకు పెట్టి'** నడుస్తాడు. **'అది ఆరిపోయినప్పుడెల్లా'** నిలబడిపోతాడు.
ఆ తరువాత (ప్రజలు) **'సిరాత్'** పై నడుస్తారు. సిరాత్ (అనే దారి) ఖడ్గపు పదునులా (అతి కూసుగా, సన్నగా, దానిపైనుండి) జారిపడిపోయే దారి ఉంటుంది.
అప్పుడు వారితో: **'మీకు ప్రసాదించిన జ్యోతి ప్రకాశం మేరకు (ముందుకు) పోండి'** అని అంటారు.

తరువాత వారిలో కొంత మంది: (ఆకాశం నుండి) నక్షత్రం తెగి పడేటట్టూ (వేగంగా స్వర్గంలోకి) ప్రవేశిస్తారు. మరియు కొంత మంది గాలిలా, కొంత మంది రెప్పపాటులోనే (స్వర్గానికి) చేరుకుంటారు. ఇంకా కొంత మంది అతి వేగంగా పోతారు. అంటే వారి కర్మల ప్రకారం వారికి ప్రవేశవేగం లభిస్తుంది. చివరికి కొంత మంది కాలి బొటన వ్రేలు (మాత్రం) ప్రకాశిస్తుంటుంది. అతని ఒక చెయ్యి క్రిందికి పడిపోయి, మరొక చెయ్యిని

వ్రేలాడుకుంటూ, ఒక కాలు క్రిందికి పడిపోయి, మరొక కాలిని వ్రేలాడుకుంటూ (పడుతూ లేస్తూ, కుంటుకుంటూ) అగ్ని సెగల మధ్య నుండి (ఏదో అలా కష్టాలు పడి స్వర్గానికి) చేరుకుంటాడు. ఇలా (కొందరు) నరకాగ్ని నుండి రక్షించబడుతారు.

**తరువాత వారు ఇలా అంటారు:** 'నిన్ను (నరకాగ్నిని) చూసిన తరువాత నీ (నరకం) నుండి రక్షించిన అల్లాహ్‌కే సర్వ స్తోత్రాలు. మాకు ప్రసాదించ బడినవి (అనుగ్రహాలు) ఎవరికీ ప్రసాదించబడ లేదు' అని అంటారు... [1]

## విచారణ లేకుండానే కొందరు స్వర్గంలోనికి ప్రవేశిస్తారు:

స్వర్గానికి పోయే మొట్టమొదటి వర్గం పూర్ణచంద్రునిలా ప్రకాశిస్తూ ఉంటారు. వారు అల్లాహ్ పట్ల పూర్తి విశ్వాసంతో భయభీతితో ఉన్నవారు. మంచి పనులు చేస్తూ వాటిపై స్థిరంగా నిలబడిన మహా పుణ్యాత్ములు. వారందరూ అందరికంటే ముందు ఒక్కసారిగా స్వర్గంలోనికి ప్రవేశిస్తారు.

హ్రజత్ అబూ ఉమామ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పుండగా నేను ఇలా విన్నాను:

''నా ప్రభువు! ప్రతి వెయ్యి మంది (ప్రజల)తో డెబ్బైవేల మందినీ, అలాగే నా ప్రభువు పిడికిలి (ముష్టి)తో మూడు పిడికిళ్ళ ప్రజలను ఎలాంటి విచారణకు మరియు శిక్షకు గురి చెయ్యకుండా స్వర్గాన్ని ప్రసాదిస్తాననీ నాకు వాగ్దానం చేశాడు.'' [2]

---

[1] (బైహఖీ, హాకిమ్, సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3591).

[2] (సహీహ్ తిర్మిజీ:2437, సహీహ్ ఇబ్నుమాజ:4286, సహీహ్ అల్ జామి: 7111).

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

'స్వర్గంలో ప్రవేశించే మొట్ట మొదటి సమూహంవారి ముఖాలు పున్నమి రాత్రి చంద్రునిలా (ప్రకాశిస్తూ) ఉంటాయి.'

ఆ తరువాత స్వర్గంలో ప్రవేశించేవారు: **'ఆకాశంలో అందరికంటే ఎక్కువగా ప్రకాశించే నక్షత్రంలా ఉంటారు.'**

'స్వర్గవాసులు మలమూత్రాలు చేయరు. అక్కడ వారు ఉమ్మరు. ముక్కులు చీదరు. వారికై బంగారు దువ్వెనలు ఉంటాయి. వారి చెమటలు కస్తూరి సుగంధాలు. ఇంకా ఊద్ (సుగంధాలు) నింపబడిన గిన్నెలు ఉంటాయి. (వాటిలో ఘుమఘుమా సువాసనలు పరిమళిస్తుంటాయి).'

'వారి భార్యలు నల్లటి పెద్ద కళ్ళుగల స్త్రీలు(హూరుల్ ఐన్) ఉంటారు. అందరూ ఒకే మనిషిలా పితామహుడైన హజ్రత్ ఆదం రూపంలో ఉంటారు. ఎత్తులో కూడా అరవై మూరలు పొడువు ఉంటారు.'[1]

## అందరికంటే ముందు స్వర్గానికి ప్రవేశించే ప్రియమైన దాసులు:

హజ్రత్ అనస్ బిన్ (రజియల్లాహు అన్హు) మాలిక్ కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **'స్వర్గం తలుపును అందరికంటే ముందుగా నేనే(తెరవమనీ) తట్టుతాను'** అని అన్నారు. [2]

---

[1] (బుఖారీ:3080, ముస్లిం:5063).

[2] (ముస్లిం:290).

హ[జత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రళయ దినాన నేను స్వర్గం తలుపు దగ్గరకు వస్తాను. తలుపు తెరవమంటాను.

అక్కడ ఉండే నిర్వాహకుడు: 'నీవు ఎవరనీ?' నన్ను ప్రశ్నిస్తాడు.

నేను: 'ముహమ్మద్' అని అంటాను.

తరువాత అతను: **'మీ కంటే ముందు (స్వర్గం తలుపును) ఎవరికీ తెరవకూడదనీ నాకు ఆజ్ఞాపించబడింది'** అని అంటాడు. [1]

హ[జత్ బురైదా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ఒక రోజు ఉదయం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హ[జత్ బిలాల్ (రజియల్లాహు అన్హు) గారిని పిలిచి;

**యా బిలాల్!** ''దేని కారణంగా మీరు స్వర్గంలో నాకంటే ముందుగానే ప్రవేశించి ఉన్నారు? స్వర్గంలో ప్రవేశించిన ప్రతి సారి మీరు నడిచే చెప్పుల సవ్వడిని నేను విన్నాను, ఈ రోజు రాత్రి కూడా నేను స్వర్గంలో ప్రవేచించగా మీరు నడిచే శబ్దం ముందుగానే అక్కడ వస్తున్నది'' అని విచారణ చేసారు. తరువాత నేను (ముహమ్మద్ (స)) బంగారంతో నిర్మించబడిన ఒక అరుగు మరియు ఎత్తుగా ఉన్న ఒక కోట గుండా పోయాను, ఇది ఎవరి కోసం? అని అడిగాను.

ఇది ఒక 'అరబీ కొరకు' అని అన్నారు.

నేను కూడా 'ఒక అరబీ మనిషినే' అని అన్నాను.

ఇది 'ఖురైష్ వంశానికి చెందిన ఒక మనిషి కొరకు' అని అన్నారు.

నేను కూడా 'ఖురైష్ కు చెందినవాడినే' అని అన్నాను.

---

[1] (ముస్లిం:292).

ఇది 'ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సముదాయానికి చెందిన ఒక వ్యక్తి కొరకు' అని అన్నారు.

నేనే 'ముహమ్మద్‌ను, ఈ కోట ఎవరిది?

ఈ కోట 'ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) గారి కొరకు' అని అనడం జరిగింది.

**తరువాత బిలాల్ (రజియల్లాహు అన్హు) గారు** (చెప్పుల సవ్వడి విషయంలో) ఇలా తెలియజేసారు: **''యా రసూలల్లాహ్!** నేను అజాన్ చెప్పినప్పుడెల్లా రెండు రాతులు చదువుకుంటాను. అలాగే వుజూ భగ్నమైన ప్రతిసారి నేను వుజూ చేసుకొని అల్లాహ్ కొరకై రెండు రకాతులు చేసుకోవడం నాపై అనివార్యం చేసుకున్నాను'' అని అన్నారు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'దాని కొరకే'** అని అన్నారు.[1]

## అందరికంటే చివరిన స్వర్గంలోనికి పోయే దాసులు:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): నరకం నుండి చిట్టచివరిన బయటకు వచ్చి స్వర్గానికి పోయేవాడు (ఎలాంటి మనిషి అనేది) నాకు బాగా తెలుసనీ ఇలా తెలిపారు:

'ఒక వ్యక్తి తన పిరుదల ఆధారంగా భూమిని రాసుకుంటా నరకం నుండి బయటకు వస్తాడు.'

**అతన్ని అల్లాహ్:** 'నీవు స్వర్గానికి వెళ్ళు' అని అంటాడు.

---

[1] (సహీహ్ తిర్మీజీ: 3689).

**అతను:** 'స్వర్గం వద్దకు వస్తే అతనికి ఆ స్వర్గం నిండిపోయినట్లు అనిపిస్తుంది.'

**అప్పుడు అతను** అల్లాహ్ వద్దకు తిరిగి వచ్చి: 'ఓ నా ప్రభూ! ఆ స్వర్గం పూర్తిగా నిండిపోయింది' అని అంటాడు.

**మరలా అతన్ని అల్లాహ్**: 'నీవు స్వర్గానికి వెళ్ళు' అని అంటాడు.

**అతను:** 'స్వర్గం వద్దకు వస్తే అతనికి ఆ స్వర్గం నిండిపోయినట్లు అనిపిస్తుంది.'

**అప్పుడు అతను** అల్లాహ్ వద్దకు తిరిగి వచ్చి: 'ఓ నా ప్రభూ! ఆ స్వర్గం పూర్తిగా నిండిపోయింది' అని అంటాడు.

**మూడవసారి అతన్ని అల్లాహ్**: 'నీవు స్వర్గానికి వెళ్ళు' అని 'నిశ్చయంగా నీకు భూలోకమంతటి (పెద్దది గల స్వర్గం) మరియు దాని పదిరెట్లుగా లేక భూలోకం వంటి పదిరెట్లుగల స్వర్గాన్ని ప్రసాదించాననీ' అంటాడు.

**అతను** (ఆ మాటకు విశ్వాసం కలగక అల్లాహ్‌తో ఇలా అంటాడు): 'నీవు నాతో ఎగతాళి చేస్తున్నావా? లేక నన్ను నవ్వులపాలు చేస్తున్నావా? నీవు సర్వాధిపతివి కదా' అని అంటాడు.

తరువాత హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) ఇలా తెలిపారు: 'ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ దవడలు కనిపించేటట్లు నవ్వుతుండగా నేను చూసాను.'

తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ఇది (ఎంతో విశాలమైన) స్వర్గానికి చెందిన అతి స్వల్ప స్థానం'** అని అన్నారు. [1]

[1] (బుఖారీ:6086, ముస్లిం:272).

హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

'స్వర్గానికి (అందరికంటే) చిట్ట చివరిగా ప్రవేశించువాడు నరకం నుండి (బయటకు) వస్తుండగా ఒక సారి నడవగలుగుతాడు. మరోసారి బొర్లా పడిపోతాడు. ఒకొక్కసారి అగ్ని కూడా కాల్చేస్తుంటుంది. చివరకు నరకం నుండి బయటకు వచ్చి వెనక్కు తిరిగి దానిని (నరకాన్ని) చూస్తాడు.'

తరువాత ఇలా అంటాడు: **'నీ (నరకం) నుండి నన్ను రక్షించినవాడు (అల్లాహ్)ఎంతో శుభకరుడైనవాడు. అల్లాహ్ నాకు ప్రసాదించినటువంటి (అనుగ్రహాన్ని) విషయాన్ని నాకంటే ముందు వారికి, నా తరువాత వారికి ప్రసాదించలేదు'** (అని అనుకుంటాడు). తరువాత: అతనికై ఒక వృక్షం వెలికి తీయబడును.

**అప్పుడు అతను (దాన్నిచూసి)**: 'ఓ అల్లాహ్ నన్ను దాని దగ్గరకు చేర్చు, దాని క్రింద నీడను పొందుతాను, అక్కడ ఉండే నీళ్ళను త్రాగుతాననీ' అంటాడు.

**తరువాత అల్లాహ్ అతన్ని:** 'ఓ ఆదం పుత్రుడా! నేను నీకు దాన్ని ప్రసాదించిన పిమ్మట మరలా ఏమియూ అడగవుకదా?' అని అంటాడు.

**తరువాత అతను:** 'లేదు ప్రభూ! ఇది తప్ప ఏమియు అడగననీ' అల్లాహ్‌తో వాగ్దానం చేస్తాడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: 'ప్రభువు అతని విన్నపాన్ని (తిరిగి) అంగీకరిస్తాడు. ఎందుకంటే అతనికి చూపబడే (అనుగ్రహాలను) చూసి (అతను) ఓపిక పట్టలేడు'

**తరువాత అతన్ని:** 'దాని (వృక్షం) దగ్గరకు చేరనిస్తారు. ఆ తరువాత అతను నీడను పొందుతాడు. అక్కడ ఉండే నీళ్ళను కూడా త్రాగుతాడు.'

**ఆ తరువాత:** 'ముందు వృక్షంకంటే ఇంకా మేలైన వృక్షం వెలికి తీయబడును.'

**అప్పుడతను:** 'ఓ అల్లాహ్! నన్ను దాని దగ్గరకు చేర్చు దాని క్రింద నీడను పొందుతాను. అక్కడ ఉండే నీళ్ళను త్రాగుతాను. ఇది తప్ప నేను నీతో మరేమీ అడగననీ' అంటాడు.

**తరువాత అల్లాహ్ అతన్ని:** 'ఓ ఆదం పుత్రుడా! నీవు నాకు వాగ్దానం చేసావు కదా! దాన్ని తప్ప ఏమి అడగననీ?' అంటాడు.

**ఆ పిమ్మట అల్లాహ్:** 'నేను నిన్ను దాని దగ్గరకు చేర్చిన పిమ్మట మరలా నీవు ఏమైన అడిగేటట్టుగా ఉన్నావే?'' అని అంటాడు.

**అతను:** 'ఇది తప్ప ఏమియు అడగననీ' అల్లాహ్‌తో వాగ్దానం చేస్తాడు.

(ప్రవక్త అన్నారు) ప్రభువు అతని విన్నపాన్ని అంగీకరిస్తాడు. ఎందుకంటే? 'అతనికి చూపబడే (అనుగ్రహాలను) చూసి ఓపిక పట్టలేడు.'

**తరువాత అతనిని:** 'దాని (వృక్షం) దగ్గరకు చేరనిస్తారు. తరువాత అతను నీడను పొందుతాడు, అక్కడ ఉండే నీళ్ళను కూడా త్రాగుతాడు.'

**తరువాత:** 'స్వర్గం తలుపు దగ్గర ఒక వృక్షం వెలికి తీయబడును. అది ముందు రెండు వృక్షాలకంటే ఎంతో మేలైనదిగా ఉంటాది.'

**అప్పుడతను:** 'ఓ అల్లాహ్ నన్ను దాని దగ్గరకు చేర్చు దాని క్రింద నీడను పొందుతాను. అక్కడ ఉండే నీళ్ళను త్రాగుతాను. ఇది తప్ప నేను నీతో మరేదీ అడగనంటే అడగననీ' అంటాడు.

**తరువాత అల్లాహ్ అతన్ని:** 'ఓ ఆదం పుత్రుడా! నీవు నాకు వాగ్దానం చేసావు కదా! దాన్ని తప్ప ఏమి అడగననీ?' అంటాడు.

**అతను:** 'అవును నా ప్రభూ! ఇది తప్ప నేను ఇంకేమీ అడగను' (ప్రవక్త అన్నారు) ప్రభువు అతని విన్నపాన్ని (తిరిగి) అంగీకరిస్తాడు. ఎందుకంటే? 'అతనికి చూపబడే (అనుగ్రహాలను) చూసి ఓపిక పట్టలేడు.'

**తరువాత అతనిని:** 'దాని (వృక్షం) దగ్గరకు కూడా చేరనిస్తారు.' అక్కడకు చేరుకున్న తరువాత అక్కడ (ఆ స్వర్గంలో) నుండి స్వర్గ నివాసుల శబ్దాలను వింటాడు.

**తరువాత అతను:** 'ఓ ప్రభూ! దానిలోకి (స్వర్గంలోకి) నన్ను ప్రవేశింపజేయి' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** 'ఓ ఆదం పుత్రుడా! నీకేమిస్తే నీవు తృప్తి చెందుతావు!, నీకు (స్వర్గం) భూలోకమంతా, ఇంకా అటువంటిది మరొకటి ఇస్తే నీకిష్టమేనా? అని అడుగుతాడు.

**అతను:** 'ఓ ప్రభూ! నీవు సర్వలోకాలకూ ప్రభువు నాతో ఎగతాళి చేస్తున్నావా? అని అంటాడు.

ఈ విషయాన్ని (హదీసును) చెప్పిన తరువాత ఇబ్ను మస్ఊద్ (రజియల్లాహు అన్హు) నవ్వినారు. (అక్కడ ఉన్నవారితో) 'నేను ఎందుకు నవ్వుతున్నాననీ' మీరు నన్ను ప్రశ్నించరా? అని అడిగారు.

**అప్పుడు వారు:** 'మీరు ఎందుకు నవ్వారనీ' కొందరు ప్రశ్నించారు?

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఇలాగే అప్పుడు నవ్వినారనీ' ఆయన సమాధానమిచ్చారు.

**తరువాత వారు (ప్రజలు):** ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఎందుకు నవ్వారనీ?' ప్రశ్నించారు.

**ఆయన:** 'అల్లాహ్ నవ్వినందుకు' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు.

ఎప్పుడైతే ఆ వ్యక్తి (ఆశ్చర్యంతో) ఇలా అన్నాడో: **'ఓ ప్రభూ! నీవు సర్వలోకాలకు ప్రభువు నాతో ఎగతాళి చేస్తున్నావా?!'**

**తరువాత అల్లాహ్:** 'నేను నీతో ఎగతాళి చేయడం లేదు. కాని నేను అనుకున్నదంతా చేసే శక్తివంతుడినీ' అంటాడు. [1]

---

[1] (ముస్లిం:274, అహ్మద్).

# అధ్యాయం-13

## 265-284

## 13- ప్రియమైన దాసులకు అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు

- స్వర్గం అతి సౌందర్యమైనది
- స్వర్గంలో అందమైన మేడలు మరియు గుడారాలు
- స్వర్గం వృక్షాలు మరియు పండ్లూ ఫలాలు
- స్వర్గవాసులు తినే, త్రాగే పాత్రలు
- స్వర్గవాసులకు పుణ్యవతులైన భార్యలు
- స్వర్గ స్త్రీలకు పుణ్యభర్త మరియు గొప్ప సౌందర్యం అనుగ్రహించబడును
- స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే శక్తి
- స్వర్గవాసుల కొరకు సేవకులు
- స్వర్గవాసులు అల్లాహ్‌ను దర్శించుకునే మహా భాగ్యం పొందుతారు
- తస్‌బీహ్, తక్బీర్ స్వర్గం అనుగ్రహాలు

# 13– ప్రియమైన దాసులకు అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు

స్వర్గం అంటే అల్లాహ్ తయారు చేసిన సర్వసుఖాలుగల శాశ్వత స్థానం. అది సుఖ సంతోషాలకు అంతు లేని ఒక నిలయం. దానిలో ఉన్న అనుగ్రహాలకు అంతు లేదు. అవన్ని స్వర్గనివాసుల కోసమే ప్రత్యేకించబడి ఉన్నాయి. దానిలో పోయే అదృష్టవంతులు అల్లాహ్ యొక్క ప్రవక్తలు. మరియు ఆ ప్రవక్తలను ఆయా కాలాలలో విశ్వసించి విధేయతను పాటించిన ప్రజలు. ఇంకా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వచ్చిన తరువాత ప్రపంచమంతటిలో ఉన్న ఏ జాతివారైనా, ఏ రంగులో ఉన్నవారైనా, స్త్రీలైనా, పురుషులైనా, అంటే ప్రళయం వరకు పుట్టబోయే మానవులంతా అల్లాహ్‌ను మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించి, వారి ఆదేశాలకు అనుగుణంగా విధేయతను పాటించిన విశ్వాసులందరూ స్వర్గానికి ప్రవేశిస్తారనీ ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనాల ద్వారా మనం స్పష్టంగా తెలుసుకున్నాము.

అల్లాహ్‌ను విశ్వసించిన సత్యమూర్తులు, అల్లాహ్ ప్రసన్నత కోసం పోరాడిన షహీదులు (అమరులు) మరియు పుణ్యకార్యాలు చేస్తూ చనిపోయిన విశ్వాసులందరూ అల్లాహ్ చిత్తంతో ఆయన కరుణ కటాక్షాలతో స్వర్గంలోనికి ప్రవేశిస్తారు.

ఇక్కడ మేము స్వర్గం యొక్క అందం మరియు దానిలో ఉన్న అనుగ్రహాల గురించి, అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో మరియు ప్రవక్త

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా స్వర్గం గురించి ప్రచురించబడిన హదీసుల వెలుగులో సంక్షిప్తంగా మీకు తెలియజేస్తాము. అయినా ఆ స్వర్గం ప్రత్యేకతల గురించి, దానిలో ఉన్న అనుగ్రహాల గురించి, ఎన్ని పుస్తకాలు రాసినా పూర్తి వాస్తవాలను మనం గ్రహించలేము. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రచురించిన ఒక హదీసే ఖుదిసి ఉంది. అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**'దాన్ని (స్వర్గం) నా పుణ్య దాసుల కొరకు తయారు చేసాను. వాటిని ఏ కన్నూ కనలేదు. ఏ చెవీ వినలేదు. ఏ మానవుని మనస్సులో దాని ఊహ కూడా పుట్టలేదు.'**

ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): కావాలంటే మీరు అల్లాహ్ యొక్క ఈ ఆయతును చదవండని ఇలా వినిపించారు: **''వారి కర్మలకు ప్రతి ఫలంగా కళ్ళకు చల్లబరిచే ఎటువంటి సామగ్రి (అనుగ్రహాలను) వారి కొరకు దాచి పెట్టబడిందో (ఆ సామగ్రి గురించి) ఏ ప్రాణికీ తెలియదు.''**[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గం (గోడలను) యొక్క ఒక ఇటుక బంగారం, మరొకటి వెండిది. దాని పూతలు సువాసన గల కస్తూరి, దాని కప్పు ముత్యాలు, మాణిక్యాలు. మరియు దాని మన్ను కుంకుమ పువ్వులతో తయారు చేయబడింది. ఎవరైతే దానిలో ప్రవేశిస్తారో శాశ్వతంగా ఉంటారు. వారికి మరణం లేదు. వారు సుఖసంతోషాలతో

---

[1] (32,సూరతు సజ్దా:17, బుఖారీ:4406, ముస్లిం:5050).

ఉంటారు. నిరాశ చెందరు. వారి యవ్వనం తరగదు. దుస్తులు మాసిపోవు.'' [1]

హజ్రత్ సహల్ ఇబ్ను సఅద్ అస్సాయిదీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''స్వర్గంలో కొరడా పెట్టుకునే స్థలం ఈ ప్రపంచం కంటే దీనిలో ఉన్నవాటన్నిటి (అనుగ్రహాలన్నిటి) కంటే ఎంతో మేలైనది.''** [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''స్త్రీలూ, సంతానమూ, వెండి, బంగారం రాశులూ, మేలు జాతి గుర్రాలూ, పశువులూ సేద్యభూములూ, వ్యామోహ వస్తువులూ (వగైరా) మానవులకు మనోహరమైనవిగా చేయబడ్డాయి. ఇదంతా ఇహలోకంలో ఇవ్వబడిన జీవన సంపదలు మాత్రమే. కాని శ్రేష్ఠమైన నివాసం అల్లాహ్ దగ్గరే లభిస్తుంది.

(ముహమ్మద్) వారికి ఇలా చెప్పు: ''వీటికంటే ఎంతో శ్రేష్ఠమైన వస్తువు లేమిటో చెప్పనా? భయభక్తులు కలవారికోసం సెలయేరులు, వాటి క్రిందుగా ప్రవహించే కాలువలు ఉంటాయి. దానిలో వారు శాశ్వతంగా (జీవించి) ఉంటారు. పరిశుద్ధ సతీమణులు లభిస్తారు. అల్లాహ్ ప్రసన్నత ప్రాప్తమవుతుంది. అల్లాహ్ తన దాసుల (నడవడికను) చూస్తూనే ఉన్నాడు.'' [3]

---

[1] (సహీహ్ తిర్మిజి:5226, అహ్మద్:7700).

[2] (బుఖారీ:3011).

[3] (3,ఆలి ఇమ్రాన్: 14–15).

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''స్వర్గంలో ఉన్న స్త్రీలలో నుండి ఒక స్త్రీ భూలోకానికి వచ్చిందంటే భూమ్యాకాశాల మధ్య ఉన్నవన్నీ ప్రకాశిస్తాయి. మరియు భూమ్యాకాశాల మధ్య ఉన్నవన్నీ సుగంధమైపోతాయి. ఆమె తన తలపై కప్పుకున్న ఒక పైట విలువ ఈ భూమ్యాకాశాలలో ఉన్నవాటన్నిటికంటే ఎంతో విలువైనది.''[1]

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ప్రవేశించేవారి శరీరాలలో వెంట్రుకలు ఉండవు. గడ్డము, మీసాలు ఉండవు. వారు (కళ్ళలో) సుర్మా పెట్టుకున్నట్టుగా ఉంటారు. స్వర్గవాసులు ముప్పైమూడు సంవత్సరాలు గల యుక్త వయస్సులో ఉంటారు.'' [2]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిద్ర మృత్యువుకు సోదరి వంటిది. కనుక స్వర్గవాసులు అక్కడ నిద్రపోరు.'' [3]

ప్రపంచ హోదాలకంటే పరలోకంలో మరింత ఎక్కువగా హోదాలు, అంతస్తులు ఉంటాయి. విశ్వాసులుగా ఉన్న ప్రజలమధ్య అనేక అంతస్తులు ఉన్నట్లూ, ప్రవక్తల మధ్యలో కూడా అనేక అంతస్తులు ఉంటాయి.

---

[1] (బుఖారీ: 6083).

[2] (సహీహ్ తిర్మిజీ: 2545, సహీహ్ అల్‌జామి: 8072).

[3] (స్వర్గంలో మృత్యువు లేదు. అందుకనీ నిద్ర కూడా రాదు.) ( అత్తబ్రానీ:9061, సిల్‌సిలతుస్ సహీహ్: 1087).

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మేము ప్రవక్తలలో కొందరికి, ఇంకా కొందరి ప్రవక్తలకంటే ఉన్నత స్థానాలు ప్రసాదించాము. వారిలో కొంత మందికి (ప్రవక్తలతో) అల్లాహ్ స్వయంగా మాట్లాడాడు. ఇంకా కొంత మంది (ప్రవక్తల్ని) ఔన్నత్యాన్ని ఇచ్చి ఆదరించాడు. అలాగే మర్యం కుమారుడు ఈసాకు మేము స్పష్టమైన మహిమలు ప్రసాదించాము. పరిశుద్ధాత్మ (జిబ్రయీల్)ను పంపి అతనికి సహాయం చేసాము.'' [1]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

'నిశ్చయంగా స్వర్గవాసులు తమపై నుండే మేడలలో ఉన్నవారిని మీరు ప్రాకృశ్చిమ దిగ్మండలాలపై దేదీప్యమానంగా మెరిసే నక్షత్రాలను చూస్తున్నట్లు చూస్తారు. దీనికి కారణం స్వర్గవాసుల్లో కూడా అంతస్తులు ఉంటాయి' అని అన్నారు.

ఈ విషయం విన్న అనుచరులు: 'ఓ అల్లాహ్ ప్రవక్తా! ఈ మేడలు ప్రవక్తల గృహాలయి ఉంటాయా? వారు తప్ప అక్కడకు మరెవరూ పోలేరా?' అని ప్రశ్నించారు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఎందుకు చేరుకోలేరు! నా ప్రాణం ఎవరిచేతిలో ఉందో అతని సాక్షిగా! వీరసలు అల్లాహ్‌ను విశ్వసించి ఆయన ప్రవక్తలను సమర్థించినవారయి ఉంటారు' అని అన్నారు. [2]

---

[1] (2,సూరతుల్ బఖరా: 253).

[2] (బుఖారీ:3016, ముస్లిం:5059).

హ|జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''స్వర్గంలో వంద అంతస్తులు ఉన్నాయి. వాటిని అల్లాహ్ మార్గంలో పోరాడే వీరుల కొరకు సిద్ధం చేశాడు. ప్రతి అంతస్తుకు మధ్య వ్యత్యాసం, ఆకాశానికి భూమికి మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంది. మీరు అల్లాహ్‌ను వేడుకున్నప్పుడు ఫిర్‌దౌస్(అనే స్వర్గ అంతస్తును)ను వేడుకోండి. ఎందుకంటే అది స్వర్గంలో మధ్యస్థ (శ్రేష్ఠమైన) అంతస్తు మరియు అన్నిటికంటే పైఅంతస్తు కూడా ఇదే. దానిపైనే అల్లాహ్ సింహాసనం ఉంది. అక్కడి నుండే స్వర్గం నదులు పారుతాయి.'' [1]

హ|జత్ ముగైర బిన్ షుఅబా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

హ|జత్ మూసా (అలైహిస్సలామ్) ప్రభువుతో: 'స్వర్గం యొక్క అతిచిన్న స్థానం ఎలా ఉంటుంది?' అని అడిగారు.

**అప్పుడు అల్లాహ్:** ''స్వర్గవాసులకు స్వర్గం ప్రసాదించిన తరువాత ఒక వ్యక్తి నా వద్దకు వస్తాడు. అప్పుడు అతనికి స్వర్గానికి వెళ్ళు అని చెప్పబడుతుంది.

**అతను:** ఓ నా ప్రభూ! 'నేను ఎలా పోయేది?' అక్కడ ప్రజలు తమతమ స్థానాలకు చేరుకొని తీసుకోవలసినదంతా వారు తీసేసుకున్నారు. (ఇప్పుడు నాకేంముందనీ)? అంటాడు.

**తరువాత అల్లాహ్ అతనితో:** 'ప్రపంచ రాజులకు ప్రసాదించినంత లోకాన్ని ప్రసాదిస్తే నీకు సంతోషమేనా'? అని అడుగుతాడు.

---

[1] (బుఖారీ:2581, తిర్మిజీ, అహ్మద్).

**అప్పుడు అతను:** 'నాకు సంతోషమే ప్రభూ!' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** 'నీకు అది (ప్రపంచమంతటి స్వర్గం) మరియు అలాంటిదే, మరియు అలాంటిదే, మరియు అలాంటిదే, మరియు అలాంటిదే, (ప్రపంచంవంటి ఐదు రెట్లు) ప్రసాదించాను' అని అనగా, **ఐదవసారి అతను:** 'ఓ ప్రభూ! నేను సంతోషించాననీ' అంటాడు.

**మరలా అల్లాహ్ అతన్ని:** 'నీకు అలాంటిదే పదిరెట్లు ప్రసాదించాను. మరియు నీ మనస్సుకు తోచినటువంటిదంతా, నీ కళ్ళకు రుచిగా ఉన్నటువంటిదంతా ప్రసాదించాను' అని అల్లాహ్ అంటాడు.

**ఆ తరువాత అతను:** 'ఓ ప్రభూ! నేను సంతోషించాను' అని అంటాడు...[1]

## స్వర్గం అతి సౌందర్యమైనది:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరైతే సత్యాన్ని విశ్వసించి, మంచి కర్మలు చేస్తారో, వారి కొరకు ప్రవహించే నదులు స్వర్గవనాలు ఉన్నాయనీ శుభవార్తను వినిపించండి.'' [2]

హ॥జత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ........... **''నేను స్వర్గానికి పోయాను. అక్కడ ముత్యాల హారాలు ఉన్నాయి. మరియు అక్కడ ఉండే మన్ను మిస్క్''** (సుగంధాలు) అని తెలిపారు. [3]

---

[1] (ముస్లిం:276).

[2] (2,సూరతుల్ బఖర: 25).

[3] (బుఖారీ:336).

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించారు:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''హిన్నా (అనే సుగంధం) స్వర్గంలో అతి గొప్పది.''[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''సైహాన్, జీహాన్, ఫురాత్** మరియు **నీల్** అనే నదులన్నీ స్వర్గం నదులు.''[2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సిద్‌రతుల్ మున్‌తహా (రేగి చెట్టు) వద్దకు నన్ను తీసుకు పోయారు. అక్కడ నేను నాలుగు నదులను చూసాను. రెండు నదులేమో బహిర్గతమై ఉన్నాయి. రెండు నదులేమో దాగి ఉన్నాయి. బహిర్గతమై ఉండే నదులు నైలు, ఫురాత్. దాగి ఉన్న మరో రెండు నదులేమో స్వర్గంలో ఉన్నాయి...''[3]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''(ముహమ్మద్) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము.''[4]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు. ఇది

---

[1] (సిల్‌సిలతుస్ సహీహ్: 1420).

[2] (ముస్లిం:5073).

[3] (బుఖారీ:5179).

[4] (108,సూరతుల్ కౌసర్:1).

ప్రవహించే ఒక సెలయేరు. అల్లాహ్ దాసులు దాని నీటితో పాటు మద్యం సేవిస్తారు. వారు దాని పాయలను (ఆ సెలయేర్లను తమ అనుకూలంగా కావలసిన చోటుకు) శాఖలుగా తీసుకుంటారు.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు:''భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం ఎలా ఉంటుందంటే? దానిలో ఎన్నటికి కలుషితంకాని నీటి సెలయేరులు ఉంటాయి. మరియు ఎన్నటికి రుచి మారని పాల నదులు ఉంటాయి. మరియు త్రాగుటకై అమిత రుచిగల మద్యం నదులు ఉంటాయి. స్వచ్ఛమైన తేనె నదులు ఉంటాయి.''[2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''నేను స్వర్గంలో నడుస్తూ పోతుండగా ఒక చోట నదిని చూసాను. దాని ఇరుప్రక్కల గోపురాలుగా ఉన్న ముత్యాల గుడారాలున్నాయి. (వాటిని చూసి) ఇదేమిటీ? ఓ జిబ్రయాల్! అని అడిగాను. ఆయన (జిబ్రయీల్): ''ఇది కౌసర్ నీరు మీ ప్రభువు మీకు ప్రసాదించాడు.దాని(హౌజే కౌసర్) మట్టి లేక దాని సుగంధం కస్తూరి.(వంటిది)'' అని తెలిపారు. [3]

స్వర్గం మట్టి కస్తూరి సువాసనకన్నా ఎంతో మేలైనదిగా ఉంటుంది. అందులో ఉన్న నీరు పాలు తెల్లదనముకన్నా అతి తెల్లగా ఉంటుంది. ఆ పాలు తేనెకంటే ఎంతో తియ్యగా ఉంటుంది. ఆ స్వర్గంలో కంకరాళ్ళకు బదులు వజ్రాలు మాణి క్యాలు ఉంటాయి. అలా పలు విధాలుగా వీటి ఔనత్యం గురించి నిజమైన హదీసులున్నాయి.

---

[1] (76,సూరతుత్ దహర్: 5-6).
[2] (47,సూరతు ముహమ్మద్: 15).
[3] (బుఖారీ:4582).

## స్వర్గంలో అందమైన మేడలు మరియు గుడారాలు:

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను ఖైస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసి కొరకై స్వర్గంలో ఒక గోపురంలా ఉన్న ముత్యం గుడారము ఉన్నది. అది అరవై మైళ్ల పొడువు ఉంటుంది. విశ్వాసుని కొరకు దానిలో భార్యలు ఉంటారు. వారు ప్రతి భార్య దగ్గరకు పోతూ వస్తూ ఉంటారు. కాని ఒకరి (స్త్రీ) వద్దకు పోతే మరొకరు (స్త్రీ) చూడజాలరు.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''జిబ్రయీల్ అలైహిస్సలామ్ ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వచ్చి:

''ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇదిగో ఖదీజా వస్తున్నారు. ఆమె చేతిలో ఒక గిన్నె ఉంది, దానిలో కూర మురియు అన్నం ఉంది. ఆమె మీ వద్దకు వచ్చిన తరువాత అల్లాహ్ మరియు నేను సలామ్ చెపుతున్నామనీ తెలుపండి.

మరియు **'ఆమె కొరకై స్వర్గంలో ముత్యం కుటీరం ఉందనీ సువార్తనివ్వండి'** అక్కడ ఎలాంటి అరుపులు కేకలు ఉండవు. మరియు వారికి ఎలాంటి అలసట కలగదు.'' [2]

## స్వర్గం వృక్షాలు మరియు పండ్లూ ఫలాలు:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఒక మహా వృక్షం

---

[1] (బుఖారీ:4501, ముస్లిం:5070).

[2] (బుఖారీ:1666, ముస్లిం:4460).

ఉంది. దాని నీడలో ఒక రౌతు వందేళ్ళు నడిచినా! దాని చివరి నీడ వరకు చేరుకో లేడు.'' [1]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''**తూబా అనే వృక్షం** స్వర్గంలో ఉంది. ఆ వృక్షం వందేళ్ళు నడిచినంత (పెద్దదిగా) ఉంది. ఆ వృక్షం కొమ్మల నుండి స్వర్గవాసుల కొరకు దుస్తులు వెలువడుతాయి.''[2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ప్రతి వృక్ష మూలము (మొదలు) బంగారపు ఉంటాయి'' [3]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) (ఓ విశిష్ఠ) రేగి చెట్టు సమీపానికి చేరి ఆగిపోయారు. ఆ రేగి పండ్లు హజర్ అనే పట్టాణానికి చెందిన కడవల్లా (పెద్దవిగా) ఉన్నాయి. దాని ఆకులు ఏనుగు చెవుల్లా (పెద్దవిగా) ఉన్నాయి. ఆ ఆకు (విశాలం) ఈ ఉమ్మత్‌ను (పూర్తిగా) కప్పుకునేటట్టు ఉంది. ఆ చెట్టు అనేక (అద్భుతమైన) రంగులతో చుట్టు ముట్టి ఉంది. అవి ఎలాంటి రంగులో నాకు (సరిగ్గా) తెలియవు. తరువాత నన్ను స్వర్గానికి తీసుకుపోయారు. అక్కడ నేను ముత్యాల గుడారాలను చూసాను. ఆ గుడారం మన్ను **'మిస్క్'** (అనే విశిష్ఠ సుగంధం).'' [4]

---

[1] (బుఖారీ:3012, ముస్లిం:5054).

[2] (సిల్‌సిలతుస్ సహీహ్: 1985).

[3] (సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3732).

[4] (అల్ జామి సగీర్ వజియాదహ్: 7648, సహీహ్ అల్ జామి: 4199).

పండ్లు ఫలహారాల గురించి ఖుర్ఆన్ గ్రంథంలో అనేక చోట్ల అల్లాహ్ తెలియజేశాడు: ''ఆ ఉద్యానవనాలలో పండ్లూ ఫలాలు, ఖర్జూరాలు మరియు దానిమ్మపండ్లు (పుష్కలంగా) ఉంటాయి.'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారు ముళ్ళు లేని రేగి చెట్లు, అరటి పండ్ల గెలలు విశాలంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడు ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతంకాని, నిరాటకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు వాటి మధ్య ఉంటాయి.'' [2]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారు కోరిన పండ్లు ఫలాలు ఉన్నాయి. అలాగే వారు అతి ఇష్టంగా తినే పక్షుల మాంసమూ ఉన్నది.''[3]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆ వనాలలోని ఉండే పండ్లను తినుటకై ఇవ్వబడినప్పుడెల్లా వారు ఇలా అంటారు: **'అరే ఇలాంటి పండ్లే కదా పూర్వం తిన్నది!.** వారికి (వివిధ రుచి గల) అలాంటి పండ్లే ప్రసాదించబడుతాయి. అవి ఒకదానికి ఒకటి పోలి ఉంటాయి.'' [4]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''హాయిగా తినండి, త్రాగండి గత జీవితంలో మీరు చేసుకున్న (సత్కర్మల)కు ప్రతిఫలంగా అనుభవించండి.'' [5]

## స్వర్గవాసులు తినే, త్రాగే పాత్రలు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: వారి ముందు బంగారు పళ్లాలూ, గిన్నెలూ త్రిప్పబడుతాయి. వారి మనస్సు ఇష్టపడే, కళ్లకు ఇంపుగా ఉండే

---

[1] (55,సూరతుర్ రహ్మాన్: 68).
[2] (56,సూరతుల్ వాఖియ: 28-33).
[3] (56,సూరతుల్ వాఖియ: 20-21).
[4] (2,సూరతుల్ బఖర: 25).
[5] (69,సూరతుల్ హాఖ్ఖ: 24).

ప్రతి వస్తువూ అక్కడ ఉంటుంది. (వారితో ఇలా అనబడుతుంది) ''ఇక మీరు ఇక్కడే శాశ్వతంగా ఉంటారు.'' [1]

మరియు అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''వారి ముందు వెండి పాత్రలు గాజు గ్లాసులు త్రిప్పబడుతాయి. ఆ గాజు గ్లాసులు కూడా వెండిలా ఉంటాయి. అవన్ని సరైన లెక్క ప్రకారం నింపబడి ఉంటాయి. అక్కడ వారికి సొంటి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడుతాయి.'' [2]

మరొకచోట అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''వారి సమావేశాలలో నిత్యం బాల్యంకల బాలురు, మధువు ప్రవహించే చెలమనుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజు పాత్రలు, కూజాలు తీసుకొని అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏ మాత్రం మైకం కమ్మడం గాని, బుద్ధి మందగించడం గాని జరగదు.'' [3]

## స్వర్గవాసులకు పుణ్యవతులైన భార్యలు:

ఒక ముస్లిం స్వర్గంలో చేరుకున్న తరువాత అతని భార్య పుణ్యస్త్రీగా ఉన్నట్లయితే స్వర్గంలో అతనికి కూడా భార్యగా ఉంటుంది. కనుక అల్లాహ్‌ ఇలా ప్రకటించాడు: ''సజ్జనులైన తాత ముత్తాతలు, వారి తల్లిదండ్రులు, భార్యా పిల్లలు శాశ్వత స్వర్గవనాలలోకి పోతారు.'' [4]

మరియు అల్లాహ్‌ ఇలా ప్రకటించాడు: ''వారు వారి భార్యలు దట్టమైన నీడల క్రింద ఆసనాలపై దిండ్లకు ఆనుకొని కూర్చుని ఉంటారు.'' [5]

---

[1] (43,సూరతు జుఖ్రుఫ్‌: 70–71).
[2] (76,సూరతుత్‌ దహర్‌: 15–16).
[3] (56,అల్‌ వాఖిఅ: 17–19).
[4] (13,సూరతు రఅద్‌: 23).
[5] (36,సూరతు యాసీన్‌: 56).

ఒక స్త్రీకి తన చివరి జీవితంలో ఎవరైతే భర్తగా ఉంటారో! ఆ వ్యక్తికే ఆమె భార్యగా స్వర్గంలో ప్రసాదించబడుతుంది. అంటే విడాకుల వలనో లేక భర్త చనిపోయిన కారణంగానో ఆ స్త్రీ మరో వివాహం చేసుకోవడం వలన మొదటి భర్తకు భార్యగా ఉండదు. అందరికంటే చివరిగా ఉన్న భర్తకు మాత్రమే ఆ పుణ్య స్త్రీ భార్యగా లభిస్తుంది.

హజ్రత్ హుజైఫా (రజియల్లాహు అన్హు) తన సతీమణితో ఇలా తెలియజేశారు: ''నీవు నాతో స్వర్గంలో కూడా భార్యగా ఉండాలనుకుంటే నేను చనిపోయిన తరువాత వివాహం చేసుకోకూ. ఎందుకంటే ఒక స్త్రీ స్వర్గంలో తన చివరి భర్తకు మాత్రమే లభిస్తుంది.... [1]

## స్వర్గ స్త్రీలకు పుణ్యభర్తలు మరియు గొప్ప సౌందర్యం అనుగ్రహించబడును:

ప్రతి స్త్రీ అందంగా ఉండాలనీ, వృధ్యాప్యానికి దగ్గర కాకూడదనీ, యుక్త స్త్రీలుగానే ఉండాలనీ ఆశిస్తారు. వారి ఈ ఆశలన్నీ స్వర్గంలో నెరవేర బోతాయి. వారి గుణాలు ధర్మపరంగా ఉంటే కన్యలుగా స్వర్గానికి ప్రవేశిస్తారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారిని (స్త్రీలను) మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్య నూతన కన్యలుగా రూపొందిస్తాము.'' [2]

హజ్రత్ హసన్ బస్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక వృద్ధురాలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి:

**ఓ ప్రవక్తా!** 'నేను స్వర్గానికి ప్రవేశించాలనీ మీరు అల్లాహ్‌ను వేడుకోండి' అని అన్నది.

---

[1] (బైహఖి, సిల్‌సిలతుస్ సహీహ: 1281).

[2] (56,సూరతుల్ వాఖిఆ: 35–37).

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'నిశ్చయంగా వృద్ధులు స్వర్గానికి పోరు' అని సమాధానమిచ్చారు.

తరువాత ఆమె: 'ఏడ్చుకుంటూ తిరిగి వెళ్లిపోయింది.'

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'వృద్ధురాలిగా ఆమె స్వర్గంలోకి పోదు. అంటూ అల్లాహ్ ఈ ఆయతు: ''వారిని (స్త్రీలను) మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్య నూతన కన్యలుగా రూపొందిస్తాము'' అనే శుభవార్తను ఆమెకూ ఇవ్వండనీ అనుచరులకు ఆదేశించారు.[1]

ఇహలోక స్త్రీలు స్వర్గంలో ప్రవేశిస్తే 'హూరున్ ఐన్' (అప్సరసల) కంటే ఎక్కువ అందంగా ఉంటారు. తమ తమ భర్తలతో మహారాణులుగా ఉంటారు. పెళ్ళిళ్ళు చేసుకోకుండా ఉండిపోయినవారు లేక పెళ్ళిళ్ళు చేసుకోక ముందే చనిపోయినవారు , లేక విడాకులకు గురికాబడి భర్తలు లేని స్త్రీలందరికీ స్వర్గంలో వివాహం చేయబడును. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఎవ్వరు కూడా ఒంటరిగా (పెళ్ళికాకుండా) ఉండరు.''[2]

స్వర్గవాసులకై అందమైన (అప్సరసలు) కన్యలు భార్యలుగా ప్రసాదించబడుతారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అలాగే మేము పెద్ద కళ్ళుగల హూర్లను వివాహం చేస్తాము.''[3]

---

[1] (షమాయిల్ తిర్మిజీ, లిల్ అల్‌బానీ: 205).
[2] (ముస్లిం:5062).
[3] (44,సూరతు దుఖ్ఖాన్: 54).

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు (స్వర్గంలో) సమవయస్కులైన సుకన్యలు ఉన్నారు.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి కోసం అక్కడ అందమైన కళ్ళుగల హూర్‌లు ఉంటారు. వారు దాచిపెట్టిన ఆణిముత్యాల మాదిరిగా (ఎంతో అందంగా) ఉంటారు.'' [2]

''దానిలో సిగ్గు లొలికించే స్వర్గ కన్యలు ఉంటారు. వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని జిన్‌గాని తాకనైన తాకి ఉండడు.'' [3]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఉన్న సతీమణులు (హూర్లు) వారి భర్తల కొరకై పాటలు పాడుతారు. ఎవ్వరు కూడా అలాంటి (అద్భుతమైన సంగీతం) రాగం ఇంతవరకు విని ఉండరు.

**అక్కడ వారు పాడే కొన్ని పదాలు ఇలా ఉంటాయి:**

''మేము సద్గుణ సంపత్తితో కూడిన సౌందర్యవంతులైన సతీమణులం. మర్యాదలు గల ప్రజలకు మేము భార్యలం. వారు చల్లటి కళ్ళతో చూస్తుంటారు.''

**ఇంకా ఇలా పాడుతారు.** ''మేము కలకాలం ఉంటాం మాకు మృత్యువు లేదు. మేము శాంతితో ఉన్నాము. మాకు ఎలాంటి భయం లేదు. మేము (ఇక్కడ) కలకాలం ఉంటాము. తిరిగి వెళ్ళిపోయే వారం కాము.'' [4]

---

[1] (78,సూరతున్ నబా: 33).

[2] (56,సూరతుల్ వాఖిఆ: 22–23).

[3] (55,సూరతుర్ రహ్మాన్: 56).

[4] (తబ్రానీ:489, సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3749).

హ॥జత్ ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఇహలోకంలో భర్తను వేధించే స్త్రీలకు స్వర్గంలో ఉన్న హూరుల్ ఐన్: ''అల్లాహ్ నిన్ను నాశనము చేయుగాక! అతన్ని వేధించకే. అతను నీ వద్ద ఒక పరిమిత కాలం వరకే ఉండేది. అతిత్వరలోనే అతను నీ నుండి దూరమై మా వద్దకు వచ్చేస్తాడు'' అని అంటుంటారు. [1]

## స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే శక్తి :

హ॥జత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా! (స్వర్గంలో) ఉన్న ప్రతి ఒక్కరికి తినుటకై, త్రాగుటకై, కోరికలు తీర్చుకొనుటకై, సంభోగించుటకై వంద మందికి (సమానమైన) శక్తి ప్రసాదించబడుతుంది.... [2]

## స్వర్గవాసుల కొరకు సేవకులు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి సమావేశాలలో నిత్యం బాల్యంకల బాలురు, మధువు ప్రవహించే చెలమనుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజు పాత్రలు, కూజాలు తీసుకొని అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏ మాత్రం మైకం కమ్మడం గాని, బుద్ధి మందగించడం గాని జరగదు.'' [3]

---

[1] (సహీహ్ ఇబ్ను మాజ: 2014, సహీహ్ తిర్మిజీ: 1174).

[2] (అహ్మద్:18469, సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3739).

[3] (56అల్ వాఖిఅ: 17–19).

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి (స్వర్గవాసుల) సేవకోసం నిత్యబాలురు అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. మీరు వారిని (పిల్లల్ని) చూస్తే వెదజల్లబడిన ఆణిముత్యాల్లా కనిపిస్తారు.'' [1]

## స్వర్గవాసులు అల్లాహ్‌ను దర్శించుకునే మహా భాగ్యం పొందుతారు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''భయభక్తులు కలవారికోసం సెలయేరులు, వాటి క్రిందుగా ప్రవహించే కాలువలు ఉంటాయి. దానిలో వారు శాశ్వతంగా (జీవించి) ఉంటారు. పరిశుద్ధ సతీమణులు లభిస్తారు. అల్లాహ్ ప్రసన్నత ప్రాప్తమవుతుంది. అల్లాహ్ తన దాసుల (నడవడికను) చూస్తూనే ఉన్నాడు.'' [2]

హ్రజత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**అల్లాహ్ స్వర్గవాసుల్ని:** 'స్వర్గవాసులారా!' అని పిలుస్తాడు.

**దానికి స్వర్గవాసులు:** 'మేము నీ సమక్షంలో హాజరయ్యాము ప్రభూ!' అనంటారు.

**అల్లాహ్:** 'మీరు సంతోషంగా ఉన్నారా?' అని అడుగుతాడు.

**దానికి స్వర్గవాసులు:** 'మేమిక సంతోషంగా ఎందుకు ఉండము? నీవు నీ సృష్టిరాసుల్లో ఎవరికీ ప్రసాదించని మహాభాగ్యాలు మాకు ప్రసాదించావనీ' అంటారు.

---

[1] (76,సూరతుత్ దహర్: 19).

[2] (3,ఆల ఇమ్రాన్: 15).

**అల్లాహ్:** 'నేను మీకు ఇంతకన్నా శ్రేష్ఠమైన మహాభాగ్యం ప్రసాదిస్తాన' నీ అంటాడు.

**స్వర్గవాసులు:**'ప్రభూ! ఇంతకన్నా శ్రేష్ఠమైన మహాభాగ్యం ఇంకేముంటుందనీ?' అంటారు.

**అప్పుడు అల్లాహ్:** 'నేను మీకు నా ప్రసన్నతా మహాభాగ్యం ప్రసాదిస్తాను. ఇక నుండి నేను ఎన్నడూ మీ మీద ఆగ్రహించను' అని అంటాడు. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆ రోజు కొందరి ముఖాలు కళకళలాడుతూ మెరసిపోతుంటాయి. వారు తమ ప్రభువును ప్రత్యక్షంగా చూస్తుంటారు.'' [2]

హజ్రత్ సుహైబ్ రూమి (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత వారిని:

**అల్లాహ్ అడుగుతాడు:** 'మీరు ఏమైన కోరుకుంటారా!' మరింత ఎక్కువ ప్రసాదిస్తాను.

**స్వర్గవాసులు:** 'ఓ అల్లాహ్! నీవు మా ముఖాలను ప్రకాశింపజేయలేదా! మమ్మల్నీ స్వర్గంలో ప్రవేశింపజేయలేదా! మమ్మల్నీ నరకాగ్ని నుండి రక్షించలేదా! (సర్వసుఖాలను ప్రసాదించావనీ)' అని అంటారు.

తరువాత (అల్లాహ్‌కు స్వర్గవాసులకు మధ్య ఉన్న) అడ్డు తొలగించబడును. అప్పుడు **వారి కళ్ళకు; 'అల్లాహ్ దర్శనంకంటే అతి ప్రియమైన అనుగ్రహం ఏది ఉండదు.''** [3]

---

[1] (బుఖారీ:6067, ముస్లిం:5057).

[2] (75,సూరతుల్ ఖియామా: 22–23).

[3] (ముస్లిం:226).

## తస్‌బీహ్, తక్బీర్ స్వర్గం అనుగ్రహాలు:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ప్రతి (స్వర్గవాసి మనసులో) తస్‌బీహ్ మరియు తక్బీర్ పదాలు పలికేటట్టూ నింపేయబడును. ఎలాగైతే శ్వాసను (మనసులో) నింపేయబడిందో.''[1]

స్వర్గంలో ఎలాంటి ఆరాధనలు చేయుటకై నిబంధన లేనప్పటికీ తస్‌బీహ్ మరియు తక్బీర్ పదాలు స్మరిస్తూనే ఉంటారు. అక్కడ వారు తీసుకొనే శ్వాసయే తస్‌బీహ్ మరియు తక్బీర్ పదాలుగా ఉంటాయి. ఎందుకంటే వారు అల్లాహ్‌ను చూసిన తరువాత వారి మనసులు కాంతితో మరియు ప్రేమతో నిండిపోతాయి. ఏ వ్యక్తినైతే ఎంత ఎక్కువగా ప్రేమిస్తారో, వారిని అంత ఎక్కువగా తలుచుకుంటూ ఉంటారు. ఒక స్వర్గవాసి అల్లాహ్ కంటే ఎక్కువగా మరెవరిని తలుచుకుంటాడు?

అందుకనీ: **'లా ఇలాహ్ ఇల్లల్లాహ్, సుబ్‌హానల్లాహ్, అల్లాహు అక్బర్'** అనే పదాలు నిరంతరాయంగా, అనుక్షణం పలుకుతూనే ఉండాలి.

**"وآخر دعوانا عن الحمد لله رب العالمين"**

మేము మా: **''సర్వస్తోత్రాలకు అర్హుడు, సమస్తలోకాల పోషకుడైన అల్లాహ్ మాత్రమే!''** అన్న అంగీకారంతో ముగించుకుంటున్నాము.

[1] (ముస్లిం:5066).

# లోపలి పేజీల్లో...

అంకితం 5

తొలి పలుకులు 9

నిష్కల్మషమైన హృదయం 13

మానవ హృదయాలు 17

అల్లాహ్ అద్వితీయుడైన దయాసాగరుడు 25

**1–అల్లాహ్ ప్రేమ పొందుటకు మౌలిక అంశాలు 30**

1) అల్లాహ్ ప్రీతి పొందుటకై తొలి అంశం 31

2) అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే మౌలిక విశ్వాసాలు 34

3) ఇస్లాం ధర్మాన్నే ప్రేమించాలి 38

4) ఇస్లాం ధర్మానికి చెందిన ముఖ్యమైన అంశాలు 41

5) సర్వజనులకన్నా అల్లాహ్‌ను మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ప్రేమించాలి 42

6) ధృఢమయిన విశ్వాసంతో అల్లాహ్‌ను ప్రేమించండి 44

7) విశ్వాసం మరియు ఏకదైవారాధన అల్లాహ్ ప్రేమకు ప్రతిరూపం 48

8) అల్లాహ్‌మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతే ప్రేమకు పునాది 52

9) దృఢమైన నమ్మకం (తవక్కుల్ ) కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 57

10) ఈమాన్ స్థిరత్వం(ఇస్తేఖామత్) కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 59

**2–భయభక్తులతో అల్లాహ్ వైపుకు మరలండి 63**

1) క్షమాపణ వేడుకొనేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 63

2) పశ్చాత్తాపం చెందేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 68

3) మన్నింపు మరియు పశ్చాత్తాపం వలన ప్రజలు అనుగ్రహింపబడతారు 71

4) మన్నింపు మరియు పశ్చాత్తాపం అంగీకరింపబడిన కొందరి మహాత్ముల గాథలు 74

**3-ఇస్లామీయ విధులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 82**

1) అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే విధులు 83

2) అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం వేళకు నమాజు చేయడం 86

3) తల్లిదండ్రుల సేవలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 89

4) అల్లాహ్ మార్గంలో (షహీద్) అమరులైన వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 96

5) ఉపవాసాలు పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 101

6) జకాత్ విధిగా చెల్లించేవారిపై అల్లాహ్ కారుణ్యం ఉంటుంది 103

7) హజ్జ్ చేసినవారి సర్వ పాపాలు క్షమించబడతాయి 105

**4-నఫిల్ ఆరాధనలు పాటించువారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 109**

1) అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే అదనపు ఆరాధనలు 110

2) అల్లాహ్ తన దాసుల పుణ్యాలను రెట్టింపు చేస్తాడు 112

3) సున్నత్, నఫిల్ నమాజులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 115

4) క్రమం తప్పకుండా చేసే పుణ్యాలు అల్లాహ్‌కు ప్రీతికరమైనవి 118

5) తహజ్జుద్ నమాజ్ 120

6) విత్ర్ నమాజు 122

7) చాష్త్ నమాజు (జుహా లేక అవ్వాబీన్ల నమాజు) 122

8) తస్‌బీహ్ నమాజు 123

9) పశ్చాత్తాపం నమాజు 124

10) వుజూ చేసిన తరువాత రెండు రకాతుల నమాజు 125

11) నఫిల్ ఉపవాసాలు 126

**5-అల్లాహ్ ప్రేమ పొందుటకై ముఖ్యమైన మార్గాలు 128**

1) దానధర్మం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు మరియు అనుగ్రహిస్తాడు 129

2) కృతజ్ఞతలు చెల్లించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 132

3) అల్లాహ్‌ను ఎప్పుడు మొరపెట్టుకున్నా ఆలకిస్తాడు 137

4) ఖుర్‌ఆన్ పారాయణం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 139
5) అల్లాహ్ నామస్మరణ కారణంగా ప్రేమించబడతారు 145

**6– అల్లాహ్ ప్రీతిని పొందుటకు అతి గొప్ప సమయాలు 149**

1) ఇస్లాం ధర్మంలో సమయాల వాస్తవికత 150
2) ముహర్రం నెల విశిష్ఠత 152
3) రజబ్ నెలవిశిష్ఠత 153
4) షాబాన్ నెల విశిష్ఠత 154
5) రమజాన్ నెల విశిష్ఠత 155
6) జుల్ హజ్జ్ (బక్రీద్) నెల విశిష్ఠత 156
7) రమజాన్ మరియు జుల్‌హజ్జ్ పది రోజుల విశిష్ఠత 157
8) ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) విశిష్ఠత 158
9) జుల్ హజ్జ్ పది రోజులు అల్లాహ్‌కు అతి ప్రియమైనవి 159
10) ముహర్రం పదొవరోజు విశిష్ఠత 161
11) షాబాన్ 15వ రాత్రి విశిష్ఠత 161
12) జుల్‌హజ్జ్ తొమ్మిదవ (అరఫా)రోజు అల్లాహ్ తన దాసులను మెచ్చుకుంటాడు 162
13) అరఫా రోజు ఉపవాసం విశిష్ఠత 163
14) శుక్రవారం రోజు విశిష్ఠత 164
15) సోమ, గురువారాల విశిష్ఠత 167

**7–ప్రత్యేకమైన సందర్భాల్లో చేసే ప్రార్థనలను అల్లాహ్ తప్పక ఆలకిస్తాడు 169**

1) అజాన్ మరియు ఇఖామత్ సమయం 170
2) అల్లాహ్ మార్గంలో యుద్ధం చేసే సమయం 170
3) వర్షం కురుస్తున్నప్పుడు అల్లాహ్ కారుణ్యం అవతరిస్తుంది 171

4) శుక్రవారం రోజు 172
5) అర్థ రాత్రి సమయం 172

**8- అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన స్థలాలు 174**

1) ప్రపంచంలోనే అతి విశిష్టమైన మసీదులు 175

**9- ధర్మాన్ని నేర్చుకోవటం మరియు దాన్ని విస్తరింపజేయటం 179**

1) అల్లాహ్ తన ప్రియమైన దాసులకు ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు 180
2) ధర్మ జ్ఞానం బోధించేవారిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని కురిపిస్తాడు 182
3) పరస్పరం ఉపన్యాసం చేసుకునే విశిష్టత 182
4) అల్లాహ్‌కు ప్రియమైన సభ,సమావేశం 187

**10-సుగుణవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు 190**

1) కోపాన్ని దిగమింగేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 193
2) సహనమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు 196
3) పేదవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 201
4) సత్యవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు 207
5) న్యాయమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు 209
6) భయభక్తిగా జీవించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 211
7) పరిశుద్ధులను అల్లాహ్ ప్రేమిస్తాడు 213
8) తుమ్ముల కారణంగా ప్రేమింపబడతారు 215
9) బిడియం స్వర్గానికి మార్గం 216

**11-తోటి మనిషిని ప్రేమిస్తే అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు**

1) పరస్పరం ప్రేమానుబంధాలను పెంచుకోవాలి 220
2) ఒండొకరిని సందర్శించుకునే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 225
3) వ్యాధిగ్రస్తులను పరామర్శించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 226
4) ఉపకారం (ఇహ్సాన్)చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు 230

5) తోటి సహోదరులకు సహాయపడితే అల్లాహ్ ప్రేమిస్తాడు 233
6) అనాథులను ఆదరిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు 236
7) ఆడ పిల్లలను పెంచి పోషిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు 237

**12-అల్లాహ్ ప్రియతముల పరలోక ప్రయాణం 244**

1) అల్లాహ్‌ను ప్రేమించే దాసులకు మరణ స్వాగతం 245
2) అల్లాహ్ సన్నిధిలో ప్రియమైన ఆత్మలకు లభించే గౌరవం 247
3) సమాధిలో ప్రశ్నోత్తరాల తరువాత స్వర్గ సుఖాలు 249
4) పరలోకంలో అల్లాహ్ తన ప్రియమైన దాసుల పాపాలను క్షమిస్తాడు 251
5) పరలోకంలో విశ్వాసులకు జ్యోతి ప్రసాదించబడుతుంది 253
6) విచారణ లేకుండానే కొందరు స్వర్గంలోనికి ప్రవేశిస్తారు 255
7) అందరికంటే ముందు స్వర్గానికి ప్రవేశించే ప్రియమైన దాసులు 256
8) అందరికంటే చివరిన స్వర్గంలోనికి పోయే దాసులు 258

**13- ప్రియమైన దాసులకు అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు 265**

1) స్వర్గం అతి సౌందర్యమైనది 271
2) స్వర్గంలో అందమైన మేడలు మరియు గుడారాలు 274
3) స్వర్గం వృక్షాలు మరియు పండ్లూ ఫలాలు 274
4) స్వర్గవాసులు తినే, త్రాగే పాత్రలు 276
5) స్వర్గవాసులకు పుణ్యవతులైన భార్యలు 277
6) స్వర్గ స్త్రీలకు పుణ్యభర్త మరియు గొప్ప సౌందర్యం అనుగ్రహించబడును 271
7) స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే శక్తి 281
8) స్వర్గవాసుల కొరకు సేవకులు 281
9) స్వర్గవాసులు అల్లాహ్‌ను దర్శించుకునే మహా భాగ్యం పొందుతారు 282
10) తస్‌బీహ్, తక్బీర్ స్వర్గం అనుగ్రహాలు 284
లోపలి పేజీల్లో... 286

# مرضاة الله تعالى

## والأسباب الجالبة لها

في ضوء الكتاب والسنة الصحيحة – بلغة تلغو

## గ్రంథకర్త కూర్పు చేసిన ఇతర పుస్తకాలు




Contact Details

**A.W** Trust Tirupati A.P. **INDIA**

**Mob:**9966 914 137- 9290 962 190